# యర్రంశెట్టి శాయి

# లవ్ ఎట్ సెకండ్ సైట్

-: ప్రచురణ :-
**ఇంద్రధనుస్సు పబ్లికేషన్స్**
3-2-57, శాతవాహన నగర్,
యల్.బి.నగర్, హైదరాబాద్-500 074.
సెల్ : 9848 264 364

**LOVE AT SECOND SIGHT**
*by* ***Yerramsetti Sai***

© *with author*
*No part of this book may be utilized in any form or by any means including electronic recording or retrieval system without permission in writing from the publishers.*

---

First Edition : 2012

Price : 150/-

***Cover Illustration:***
**BALI**

***Published by:***
***INDRADHANUSSU PUBLICATIONS,***
3-2-57, Satavahana Nagar,
L.B.Nagar, Hyderabad-500 074.

***Books Available at:***
Vishalandra Book House, Ph : 24744580
Navodaya Book House, Ph : 24652387
Navayuga Book House, Ph : 24754688
Indradhanussu Publications, Cell : 9848 264 364
Telugu Book House, Cell : 9247446497
Ganesh Book stall, Dilsukhnagar, Cell: 9393804466

***DTP & Layout***
**Hari : 9393 5254 61**.

***Printed at :***
S.P. Graphics
Bagh Lingampally,
Hyderabad,
Cell : 93968 00098

జర్నలిజం డిగ్రీ చేత్తో పట్టుకుని హైదరాబాద్ రోడ్‌నపడ్డ
భవానీశంకర్‌కి ఒకప్పటి బిలియనీర్ క్లాస్‌మేట్ రాకేష్ ఆటో నడుపుతూ
కనబడ్డాడు- సంగతేంటో కనుక్కుందామని స్లమ్‌లో ఉన్న
అతని రూమ్‌కెళ్ళేసరికి - చిత్రవిచిత్రమయిన పరిస్థితులు సడెన్‌గా అతనిని
చుట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి జేశాయ్.
పర్యవసానంగా అతను తన ఫ్రెండ్ రాకేష్ పేరుతో
జైరాజ్ అనే రిచ్‌మాన్ ఇంట్లో సెటిలయి అతని బృందావనం చానెల్‌ని
మూడు నెలల్లో నెంబర్‌వన్ చానెల్ చేసే ఛాలెంజ్‌ని యాక్సెప్ట్ చేయాల్సి వచ్చింది.
అప్పుడు స్టార్టయినయ్ హిలేరియస్ సీక్వెన్సెస్ -
ఈ రోజున సమాజాని బ్లాక్‌మెయిల్ చేస్తోన్న
టీవీ చానెల్స్ మీద తిరుగులేని మరో హ్యూమరస్ సెటైరికల్ వార్

## లవ్ ఎట్ సెకండ్ సైట్

మళ్ళీ భవానీ శంకర్ హిలేరియస్ ఎక్సెంట్రిక్స్‌ని
మరోసారి వెరైటీగా ఎంజాయ్ చేయండి -

ఎన్నో ప్రాంతాలనుంచి ఎంతోమంది తరచుగా ఫోన్లు చేస్తూంటారు.

"ఫలానా మీ నవల కావాలి మార్కెట్‌లో లేవు. ఎక్కడ దొరుకుతాయో చెప్పగలరా?" అంటూ -

మరికొంతమంది విదేశాల్లో ఉన్న అభిమానులు వారికి నచ్చిన రచనలు ఏ పబ్లిషర్ దగ్గర దొరుకుతాయ్ అని అడుగుతూంటారు.

నా రచనలను ఇష్టపడే అభిమానులందరి కోసం -

**www.yerramsettisai.com**

**or**

**www.indradhanussu.com**

వెబ్‌సైట్లను ప్రారంభించాము. ఇందులో ఇప్పటికే కొన్ని నవలలు చేర్చటం జరిగింది. త్వరలో మిగతా కూడా లభిస్తాయ్.

ఇవన్నీ మీరు ఉచితంగా చదువుకోవచ్చు. డౌన్‌లోడ్ చేసుకోవచ్చు!

ఇవేకాక నేను రాసిన ఫీచర్స్, కథలు, నాటికలు, పొలిటికల్ సెటైర్ అవన్నీ మీరు ఎంజాయ్ చేయవచ్చు. రాబోయే నవలల గురించి ఇన్‌ఫర్మేషన్ ఉంటుంది. ముఖ్యంగా లేటెస్ట్ పొలిటికల్ డెవలప్‌మెంట్స్ మీద సెటైరికల్ ఆర్టికల్స్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం జరుగుతుంది.

# లవ్ ఎట్ సెకండ్ సైట్

సూర్యుడు కొంచెం లేటుగా నిద్రలేచి రాత్రి దేవలోకంలోని బార్‌లో తాగిన అమృతం తాలూకూ హాంగోవర్ నుంచి బయటపడ్డానికి ఎండను కొంచెం ఓవర్‌గా, ఎర్లీగా ప్రసారం చేస్తున్నాడు.

అదేం పట్టించుకోకుండా ఆంధ్రప్రదేశ్ తెల్లారుజాము నుంచే బిజీ అయిపోయింది.

పోలీస్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు రాత్రంతా జరిగిన దొంగతనాలు, మర్డర్లు, రేప్‌లు అన్నీ 'రొటీన్ అండ్ నార్మల్ క్రైమ్" అన్న కంప్యూటర్ ఫైల్లో కెక్కిస్తున్నారు.

ఆర్టీసీ వాళ్ళు రాత్రంతా ఎన్ని బస్సులు ప్రయాణీకుల్తో సహా బోల్తాలు కొట్టిందీ, ఎన్ని నదుల్లో పడిందీ, ఎన్ని లారీలకు ఢీ కొట్టిందీ, ఎంతమంది ప్రయాణీకుల్ని పైకి పంపించగలిగిందీ అన్నీ న్యూస్ పేపర్స్‌కి ఫాక్స్‌లో పంపుతున్నారు.

రైల్వేవాళ్ళు రాత్రంతా ఎన్ని రైళ్ళల్లో ఎన్ని దొపిడీలు జరిగిందీ, ఎన్ని రైళ్ళు పట్టాలు తప్పింది, ఎన్ని రైళ్ళు పడిపోవటం వల్ల ఎంతమంది ప్రయాణీకులు కాళ్ళూ చేతులూ, తలా లాంటివి పోగొట్టుకుందీ– కొన్ని కోట్లు ఖర్చుపెట్టి హిందీభాషను విరివిరిగా ఉపయోగించటం కోసం తర్జుమా చేస్తున్నారు.

ఇన్‌కమ్‌టాక్స్‌వాళ్ళు చీకట్లో నల్లధనం ఎక్కడుందో వెతికి వెతికి తెల్లారేసరికి నిద్రపోయారు.

వ్యాపారస్తులంతా టెలీకాన్ఫరెన్స్‌లో తాము ఇన్‌కమ్ టాక్స్‌వాళ్ళను ఎలా బోల్తా కొట్టించిందీ, అందుకు మినిష్టర్లు ఎంతగా సాయం చేసిందీ జోక్స్‌లాగా చెప్పుకుని తెగనవ్వుకుంటున్నారు.

అమీర్‌పేట– బస్‌స్టాప్‌లో నిలబడ్డ వేలమంది జనం ఉండుండి టైమ్ చూసుకుంటూ "నీయవ్వ బస్సు…" అని లోపల్లోపలే బూతులు తిట్టుకుంటున్నారు.

వాళ్ళమధ్యలో నిలబడ్డ భవానీశంకర్ పక్కన నిలబడ్డ గడ్డమతనిని "తొమ్మిదన్నరకు రావాల్సిన బస్ ఎన్ని గంటలకొస్తుంది బ్రదర్?" అనడిగాడు. గడ్డమతను చిరాగ్గా చూశాడు.

"ఆ మాత్రం తెలీదంటయ్యా? తొమ్మిదిన్నర బస్ ఎప్పుడూ పదింబావుకొస్తుంది. అంటే తొమ్మిదీ నలభై అయిదుకి రావాల్సిన బస్ తొమ్మిదీ ఇరవై అయిదుకొస్తుంది కదా! కానీ తొమ్మిదీ ఇరవై అయిదుకి రావాల్సిన బస్ జనరల్‌గా తొమ్మిదీ నలభై కొస్తుందన్నమాట. అంటే తొమ్మిదీ యాభైకి రావాల్సిన బస్…"

"ఓవరయింది రా నాయినా! ఇంక ఆపెయ్" అంటూ అడ్డుపడ్డాక గానీ అతను మాట్లాడటం ఆపలేదు. బస్‌స్టాప్‌కి దగ్గర్లోనే ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ సడెన్‌గా గ్రీన్‌లోకి మారటంతో అంతవరకూ కాచుక్కూర్చున్న ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ముందుకి దూకింది. ఆ ట్రాఫిక్‌ని చీల్చుకుంటూ శరవేగంతో ముందుకి దూసుకొస్తోన్న ఓ అందమయిన స్కూటర్ రాణీని చూసేసరికి భవానీ శంకర్‌లో ఒక్కసారిగా హుషారు పుట్టుకొచ్చింది.

హుషారు పుట్టుకొచ్చినప్పుడల్లా 'వెన్నెల్లో హాయ్ హాయ్' అంటూ పాడెయ్యటం మామూలే కనుక ఆ ట్యూన్ వెంటనే అందుకున్నాడు. కాపోతే వాల్యూమ్ కంట్రోల్ తప్పి బాగా హైపిచ్‌లో పాట పాడేసరికి భవానీశంకర్ పక్కనే నిలబడ్డ శామ్యూల్ అనే పెద్దమనిషి అదిరిపడి– ఎవరిదో ఏదో కొంపమునిగిందనుకుని ఒక్క గెంతుగెంతి దూరంగా పరుగెత్తాడు.

శాస్త్రి అనే శాస్త్రిగారు హైదరాబాద్‌లో బాంబ్ బ్లాస్ట్‌లు చాలా మామూలు విషయం గనుక ఇప్పుడూ అలాంటిదేదో జరుగబోతోందనుకుని ధభేల్‌మని నేలమీద పడుకుండిపోయాడు. అప్పల్రాజు అనే మీసాలతను వెంటనే ఒక రూపాయ కాయిన్ తీసి భవానీశంకర్ మీదకు విసిరాడు. ఆ అరుపుకి 'జాకీ' అనే వీధికుక్కొకటి బెదిరిపోయి రోడ్‌కి అడ్డంగా ట్రాఫిక్‌ని చేధించుకుంటూ పరుగెత్తింది. అయితే రోడ్‌కి అవతలి వేపున్న 'మోతీ' అనే స్ట్రీట్‌డాగ్– జాకీ తననే ఎటాక్ చేయబోతోందని అపార్థం చేసుకుని– అది ఎటాక్ చేసేలోగానే తను జాకీమీదపడి భీకరమయిన ఫైటింగ్ మొదలుపెట్టింది.

దాంతో ఆ స్లమ్‌డాగ్స్ రియాల్టీ షోలో ఆ స్కూటర్ రాణీ తాలూకూ స్కూటర్ స్కిడ్ అయిపోవటం, స్కూటర్ రాణి కింద కూలబడిపోవటం క్షణాల్లో జరిగిపోయాయ్.

కూలింగ్ గ్లాసెస్‌తో ఉన్న ఓ అందాల స్కూటర్‌గాళ్ స్కిడ్ అయిపడితే క్షణాల్లో సహాయానికి ఎగబడే హీరోలకు మనదేశం పెట్టింది పేరు గనుక ఓ పాతికమంది హీరోలు రంగంలోకి దూకారు.

అయితే ఇదంతా కొంచెం ముందుగానే పసిగట్టిన భవానీశంకర్ మాత్రం– వారందరినీ విజయవంతంగా చెల్లాచెదురు చేసేసి తనే ఆ స్కూటర్ రాణీకి సాయంచేసి లేచినుంచోగానే, స్కూటర్‌ని కూడా లేపిరోడ్ పక్కకు లాగి స్టాండ్ వేశాడు.

"ఈ స్లమ్ డాగ్స్‌తో పెద్ద న్యూసెన్సయిపోయింది. మున్సిపల్ కార్పొరేషన్ ఏం చేస్తోందో తెలీదు– ఇడియెట్స్!" అంది స్కూటర్ రాణీ కోపంగా డ్రస్ దులుపుకుంటూ.

అలాంటి లింక్ డైలాగ్ కోసమే చాలా ఆత్రుతగా ఎదుర్చూస్తున్న భవానీశంకర్ ఛప్పున అందుకున్నాడు.



"అదే మన ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత! క్షణాల్లో వీధి కుక్కల్ని శూన్యంలో నుంచి వందల సంఖ్యలో ప్రొడ్యూస్ చేయటం మన కార్పోరేషన్‌కి కొట్టినపిండి! వాళ్ళు నగరమంతా అన్ని రకాల బోర్డ్‌లూ రాసి తగిలిస్తారుగానీ "అందమయిన నగరం మనది– కుక్కలులేని నగరం మనది" అనే స్లోగన్ మాత్రం గాలికొదిలేశారు దొంగనాయాళ్ళు–"

భవానీశంకర్ అభిప్రాయంతో తనూ ఏకీభవించింది స్కూటర్ రాణి.

"ఇదంతా అక్కినేని అమల ఇంకా అలాంటి గాంగ్ చేస్తున్న న్యూసెన్స్" అంది స్కూటర్ రాణి ఇంకా కోపంగా.

"మీరు కాబట్టి కొంచెం లాంగ్వేజ్ వాడారు. ఒకవేళ నాకే ఇలా జరిగితే కార్పోరేషన్ మీదా, ఆ కుక్కల సంరక్షణ సమితి మీదా మర్డర్ కేస్ ఫైల్ చేసేవాడిని–"

స్కూటర్ రాణీ షాకయింది.

"కేసా?"

"అవును– డియర్! మీలాంటి మోస్ట్ బ్యూటిఫుల్ యంగ్‌గాళ్స్‌నిలా కుక్కలతో ఎటాక్ చేయించే హక్కు ఎవడికి లేదు– అది ఇంచుమించుగా ఎటెంప్ట్ టు మర్డర్ ఎ సిటిజెన్' కింద కేస్ బుక్కవుతుంది–"

"యా– యా– యూ మే బి రైట్–" అందామె కొంచెం డౌటుగా.

"ఎనీవే! థాంక్స్ ఎలాట్– పర్ యువర్ హెల్ప్–"

"నో నో– ఇలాంటివి చేయటం నా డ్యూటీ– కింది పీలవుతా– అన్నట్లు–" అంటూ పేరూ వగైరాలు అడగబోతూండగానే ఆమె సడెన్‌గా స్కూటర్ స్టార్ట్ చేసుకుని మళ్ళీ రాకెట్‌లాగా దూసుకుపోయింది.

"హలో మిస్– హలో హలో–" అని భవానీశంకర్ పిలుస్తూంటే పక్కనున్నతను అతని భుజం తట్టాడు.

"హలో– ఇదేం సినిమా కాదు– పేరూ ఫోన్ నెంబరూ అడిగి తీసుకుని లవ్ స్టోరీ రన్ చేయడానికి–" అన్నాడు సీరియస్‌గా.

"అరేయ్– చెక్కమొఖం! నేనెప్పుడూ అమ్మాయిలకు నా పేరు, సెల్‌నెంబరూ ఇస్తాను గానీ వాళ్ళది తీసుకోను– అదీ నా లెవల్– ఇంక ఆ సైడ్‌కి తిరిగి ఇంకోడి భుజం చూసుకో–" అంటూ అప్పుడే ఆగిన బస్‌మీదకు దూకాడు.

కానీ అప్పటికే వందల జనం ఒకేసారి బస్‌లోకి జొరపడ్డానికి ప్రయత్నించడంతో భవానీశంకర్ గావుకేక పెట్టాడు.

"అమ్మో! పర్స్ కొట్టేశారు– పిక్ పాకెట్– పిక్ పాకెట్––"

ఆ కేకతో బస్ మీద కెగబడుతోన్న వాళ్ళంతా వెనక్కు తగ్గి, ఎవడి జేబులో వాడు చెక్ చేసుకుంటూంటే భవానీశంకర్ హాపీగా బస్ ఎక్కేశాడు. బస్ స్టార్టయాక మళ్ళీ బస్‌స్టాప్‌లో కాండేటే అతని భుజం తట్టాడు.

"పర్సులు జేబులో పెట్టుకుని అమ్మాయిలకు లైట్ కొడుతూ బస్ లెక్కటానికి ట్రై చేస్తే ఇలాగే అవుద్ది మరి!" హేళనగా ఇకిలించాడు.

భవానీశంకర్ జాలిగా అతని భుజం తట్టాడు.

"నీయవ్వ! మళ్ళీ రెండోసారి కూడా ఛావు దెబ్బ తిన్నావ్ కదురా! నా దగ్గర పర్సే లేదసలు–" ఆ శాల్తీ మొఖం మాడింది గానీ పక్కనున్నోడు విరగబడి నవ్వుతున్నాడు.

* * *

"తెలుగూ ఎక్స్‌ప్రెస్" టీవీ అన్న బోర్డ్ వంక ఆనందంగా చూశాడు భవానీశంకర్. క్రాఫ్ మరోసారి దువ్వుకుని రిసిప్షనిస్ట్ దగ్గరకు నడిచాడు.

"వాట్ కెనయ్ డూ ఫర్ యూ?" రిసిప్షనిస్ట్ గ్లామర్ ఒలకబోస్తూ పలుకరించింది.

"మీ గ్లామర్ గాళ్స్ తల్చుకుంటే చాలా చేయగలరు– మీ సిఈఓతో నాకు ఇంటర్‌వ్యూ ఏర్పాటు చేయగలరు. నాకు మీ ఛానెల్లో జాబ్ ఇవ్వాలని మీ ఎండీ గారికి రికమెండ్ చేయగలరు–"

"ఓ– టీవీ జర్నలిస్ట్ ఇంటర్‌వ్యూ కొచ్చారా?"

"ఇంటర్‌వ్యూ జస్ట్ ఫార్మాలిటీ అనుకోండి! మీలాంటి బ్యూటిఫుల్ అండ్ సెక్సీ గాళ్ రికమెండ్ చేశాక కాదనే కెపాసిటీ ఎవడికుంటుంది? అవునా, కాదా? అమె కన్‌ఫ్యూజ్ అయిపోతోంది"

"మీ కాల్ లెటర్ ఇస్తారా?"

"హలో! ఇవి లెటర్స్ రాసుకునే రోజులు కాదు అంతా ఎస్ఎమ్ఎస్! ఇదిగో– మీకో న్యూస్ తెలుసా? మనం మాస్ కమ్యూనికేషన్స్ ఫ్లయింగ్ కలర్స్‌తో స్వీప్ చేశాం! స్టార్ బాగోక ఇక్కడికొచ్చాగానీ స్టార్ చానెల్లో ఉండాల్సిన స్టార్ మనది డియర్!"

ఆమె ఇబ్బందిగా చూసింది.

"ప్లీజ్– డియర్ అనకండి–"

"అనకూడదా! స్ట్రేంజ్‌గా ఉందే! మీ ఊరు ఖచ్చితంగా ఏ ఇంటీరియర్ విలేజో



అయుంటుంది. ముక్కూ మొఖం తెలీని వాళ్ళు స్టేజ్‌మీద ముద్దులతో గ్రీట్ చేసుకుంటున్నారు టీవీ చానెల్లో చూళ్ళేదా? చాలా కాంతి సంవత్సరాలు వెనకబడినట్లున్నారు. ముందుకి రా ఫ్రెండ్! రా! కదలిరా! స్టార్ టీవీ పిలుస్తోంది–"

ఆమె మొఖంలో కొంచెం భయం కనిపించింది.

వెంటనే కొంచెం రన్నింగ్ టైప్‌లో సి.ఈ.ఓ. రూమ్‌లోకి పరుగెత్తింది. అప్పుడే ఆ డస్క్ మీదున్న ఫోన్– కొంపలు మునిగినట్లు– మోగటం మొదలుపెట్టేసరికి– ఠక్కున ఫోన్ అందుకున్నాడు భవానీశంకర్.

"హలో! ఎవరు బ్రదర్ మాట్లాడేది? కేకే రాజా? హాయ్ రాజా– వాట్ కెన్ అయ్ డూ ఫర్ యూ? వ్వాట్? నేనెవరా? ది గ్రేట్ భవానీశంకర్– కాబోయే– కాబోయే ఏంట్లే– ఆల్‌మోస్టాల్ కన్‌ఫర్మ్‌డ్ అనుకో– ఛానెల్ న్యూస్ డెస్క్ ఇన్‌ఛార్జీని! ఏంటి? నాపేరెప్పుడూ వినలేదు, కనలేదా? ఇంకో గంట తర్వాత కేవలం నా పేరు తప్ప నీకింకేమీ కనిపించదు, వినిపించదు. అదీ మన లెవల్! ఏంటీ? ఏమీ అర్థం కావటం లేదా? హలో– నేను మాస్ కమ్యూనికేషన్స్ జర్నలిజంలో– విజువల్ మీడియాలో– ఒకటేంటి? అన్నిట్లోనూ టాప్ స్కోరర్‌ని! నన్ను సెలక్ట్ చేసుకోకపోతే తెలుగూ ఎక్స్‌ప్రెస్ ఓనర్ని తెలుగు ప్రజలంతా ముక్తకంఠంతో బండబూతులు తిడతారు కామ్రేడ్– ఇంతకూ నీకెవరు కావాలో చెప్పరా ఈ సోదంతా ఎందుకు–––"

"అయ్ వాన్ట్ సి.ఈ.ఓ.!–" కోపంతో రగిలిపోతూ అరచిందాగొంతు–

"వ్వాట్? సి.ఈ.ఓ. కావాలా? ఎందుకు రాజూ! మీ సి.ఈ.ఓ. అయితే పీకుతాడు– నేను పీకలేవని డౌటా? చూడు రాజూ! నా సంగతి నీకింకా తెల్సినట్లు లేదు– ట్రాక్టర్‌తో దున్నినట్లు దున్నుతా! తెల్సా? ఎవర్నయినా సరే! ఛాలెంజ్–

"ఇడియెట్! ముందు మా సి.ఈ.ఓ.ని లైన్‌లో పెడతావా లేదా?" ఇంకా ఆవేశంతో రెచ్చిఓతూ అందా గొంతు.

"ఏంటి? ఇడియట్టా? నీ లాంగ్వేజ్ కొంచెం చిల్లర్ లెవల్లో ఉంది కామ్రేడ్! స్కౌండ్రల్స్ అండ్ గూండాస్ కాలేజ్‌లో చదివిన బాపతా? అయినాగానీ నిన్ను నువ్ రెక్టిఫై చేసుకోడానికి సమయం మించిపోలేదు– రోజూ ఈవెనింగ్ టెన్‌టూ టెన్‌థర్టీ నేనే నీకు ఇంటర్నేషనల్ కోచింగ్ ఇస్తా! నారూమ్‌కిరా!" హౌటు కంట్రోల్‌యాంగర్" అన్న సబ్జెక్ట్‌లో నేను ఎక్స్‌పర్ట్‌ని–"

"బ్లడీ హెల్! ముందు మా సి.ఈ.ఓ.కి కనెక్షనిస్తావా లేదా?"

''చూశావా! లాంగ్వేజ్ ఎంత వరస్ట్‌గా వస్తోందో? అలా చిల్లరగా

మాట్లాడాలనిపింటం– ఒక మెంటల్ డిజార్డర్! ఆ కోర్కెతో ఫైట్ చేయ్ బ్రదర్! ఖచ్చితంగా విజయం సాధిస్తావ్– ఇంతకూ నీ పేరేంటి?"

"యూ బ్లడీ రాటెన్ ఎగ్! అయామ్ యశ్వంత్ రాజ్, తెలుగూ ఎక్స్‌ప్రెస్ టీవీ ప్రొప్రయిటర్‌ని! అండర్‌స్టాండ్?"

భవానీశంకర్ హాపీగా ఫీలయ్యాడు.

"ఓ! సో– యూ ఆర్ ది ప్రొప్రయిటర్? గ్లాడ్ టు మీట్ యూ జెంటిల్మన్! కానీ ఆ సంగతి– ముందే చెప్తే కొంచెం రెస్‌పెక్ట్ ఇచ్చే వాడినిగా! అదీగాక ఇంకెన్నో విషయాలు మాట్లాడుకునేవాళ్ళం! ఖుల్లమ్ ఖుల్లా!"

"రాస్కెల్– ముందా ఫోన్ వదుల్తావా లేదా?"

"ఛ! నీ లాంగ్వేజ్ బి యాండ్ రిపేర్ బ్రదర్! కుక్కల ట్రెయినింగ్ సెంటర్ వాడొక్కడే నిన్ను సెట్‌రైట్ చేయగలడు– అందులో చేరిపో–"

"య్యూ య్యూ–..." అంటూ పెద్దకేక, దానివెనుకే ఫోన్ రెండు మూడు వేల ముక్కలయిన శబ్దం వినిపించింది.

అప్పుడే రిసెప్షనిస్ట్ హడావుడిగా వచ్చింది.

"సి.ఈ.ఓ." గారు రమ్మంటున్నారు–"

"నేను చెప్పలేదూ? టాలెంట్‌ని ఎవరయినా సరే కౌగలించుకుని గుండెలకు హత్తుకుంటారు డియర్–"

ఆమె చిరాగ్గా చూసిందిగానీ అప్పటికే భవానీ ఛీఫ్ ఎడిటర్ రూమ్‌లో కొచ్చేశాడు.

"హాయ్ కామ్రేడ్! నేనే భవానీ శంకర్‌ని! భవానీశంకర్ అనే జీనియస్ ఎవరు? ఎలా ఉంటాడు? నాతో మనసు విప్పి మాట్లాడతాడా లేదా? ఇలా ఎన్నో ఇమేజినేషన్స్‌తో మీరు తలక్రిందులయిపోతూండి ఉంటారని నాకు తెలుసు"

అంటూ బలవంతంగా అతని చేయి అంద బుచ్చుకుని ఇంకా బాగా బలవంతంగా కరచాలనం చేశాడు భవానీశంకర్.

"చూడు మిస్టర్..." కోపంగా ఏదో చెప్పబోయాడతను.

"యస్ కామ్రేడ్! మీ పిలుపులో అర్థం తెలిసిపోయింది– ఈ క్షణం నుంచే నువ్ మా న్యూస్ ఇన్‌ఛార్జ్‌వి! నిజానికి నీకున్న టాలెంట్‌కి నీకు ఎకాఎకిన సి.ఈ.ఓ. జాబే ఇవ్వవచ్చు– కానీ ఈ జూనియర్ గాళ్ళు ఏడుస్తారు– కాబట్టి ఒకవారం డెస్క్‌గా పనిచేసెయ్– తర్వాత మళ్ళీ రివ్యూ చేద్దాం–" అని నాతో చెప్పాలని తెగ ప్రయత్నిస్తున్నారు– కదూ?"



అంతవరకూ ఆవేశంతో ఊగిపోతున్న సి.ఈ.ఓ. సడెన్‌గా "గెటౌట్" అంటూ గావుకేక పెట్టాడు.

భవానీశంకర్ ఆశ్చర్యపోయాడు.

"అరెరె– అలా రైలింజన్ లాగా అరచారేమిటి? ఇలా గావుకేకలు పెడుతూ దేశమంతా తిరగటం ఆరోగ్యానికి హానికరం! తెలుసా? డూ యూ నో జి.కే. జిలానీ? గ్రేట్ ఫెలో! ఒక మల్టీనేషనల్ కంపెనీకి వైస్ ప్రెసిడెంట్! కానీ ఏమయింది? ఇలాగే గావుకేక లేశాడు! అంతే! అవుట్! స్పాట్ డెడ్! నేనే డెడ్ బాడీని ఇంటికి చేర్చాను–"

అతను ఆవేశంతో వణికిపోతున్నాడు.

"నీకు ఏ పరిస్థితిలోనూ జాబ్ ఇవ్వబోటం లేదు. అండర్‌స్టాండ్? మా బాసే స్వయంగా చెప్పాడు– నీకు జాబ్‌ఇస్తే నా జాబ్ పోతుందని–"

"అఫ్‌కోర్స్! నాటాలెంట్ చూసి నేను నిన్ను రిప్లేస్ చేయగలనని కరెక్ట్‌గా ఊహించి ఉంటాడుగానీ నాకూ కొన్ని ఎథిక్స్ ఉన్నాయ్ బ్రదర్! మీరు పీస్‌ఫుల్‌గా రిటైర్ అయేంతవరకూ మీ జాబ్‌కి ధోకా రానీను– ఓకే?"

అతను రకరకాల హావభావాలు ప్రదర్శించడానికి ప్రయత్నించి, అవేమీ కుదరక చివరకు రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టాడు.

"నన్ను చిత్రవధ చేయకయ్యా! నీకు దణ్ణం పెడతా! వెళ్లిపో– వెళ్ళిపోరా దేవుడా! త్వరగా పో–"

"ఓకే కామ్రేడ్! నీ పరిస్థితి ఇంత దయనీయంగా ఉన్నప్పుడు– నీ మీద జాలి పడటం తప్ప– నో ఆల్టర్ నేటివ్ ఫర్ మీ! సీ యూ గయ్–" అనేసి బయటకు వచ్చేశాడు భవానీ–

మధ్యాహ్నం ఒంటిగంటవరకూ టీవీ ఆఫీస్‌ల చుట్టూ తిరిగాడు ఎక్కడా ఒక్క వేకెన్సీ కూడా లేదు.

ఉదయం రోడ్‌పక్కన బండీలో తిన్న రెండు ఇడ్లీలూ కొంచెం ఓవర్‌గా అరిగిపోవటం చేత– ఆకలి సర్రుమంటూ వళ్ళంతా పాకుతోంది.

హొటల్లో ఏదయినా తిందామా అంటే జేబులో చిల్లర తప్ప ఏమీలేదు.

తనతల్లీ, తండ్రీ– పదేళ్ళ క్రితం హైదరాబాద్, సోమాజిగూడాలో ఒక వర్షం కురిసిన రాత్రి స్కూటర్ మీద వెళ్తూ కవర్ లేని డ్రైనేజ్ గోతిలో పడి కొట్టుకుపోయిన దగ్గర్నుంచీ తనను దూరపు బంధువు బాబూరావ్ తిండిపెట్టి ఇంతవరకూ చదివించాడు.

అయితే బాబూరావ్‌కి భవానీశంకర్ అంటే ప్రేమ ఉండికాదు.

అప్పట్లో ఉన్న ముఖ్యమంత్రి అసెంబ్లీలో స్టేట్‌మెంటిచ్చాడు–

తల్లిదండ్రులను డ్రైనేజ్ గోతిలో పోగొట్టుకున్న భవానీశంకర్‌కి ప్రభుత్వం పాతిక లక్షల రూపాయలు ఇవ్వటమే కాకుండా అతని చదువుకయే ఖర్చంతా గవర్నమెంటే భరిస్తుందని–

ఆ స్టేట్‌మెంట్ చూసి బాబూరావ్‌లో ఆశపుట్టింది–

భవానీశంకర్‌ని దగ్గరకు తీస్తే పాతిక లక్షలూ తనే కాజేయ వచ్చనీ– ఆ డబ్బు కాజేశాక భవానీని ఇంటి నుంచి గెంటేయవచ్చనీనీ! అయితే ఆ ముఖ్యమంత్రి తర్వాత మరో ముగ్గురు ముఖ్యమంత్రులు మారారుగానీ ఇంతవరకూ పాతిక లక్షలు ప్రభుత్వం ఇవ్వలేదు– దాంతో బాబూరావ్ ఇరుక్కుపోయాడు– అయితే బాబూరావ్‌లో ఇంకా ఆశ చావలేదు. ఇంకా ముఖ్యమంత్రుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. "నెక్స్ట్ ఎలక్షన్ తరువాత ఇచ్చేస్తాం" అని వాళ్ళంటూనే ఉన్నారు.

"ఎప్పటికయినా పాతిక లక్షలు గవర్నమెంట్ నుంచి వసూలు చేసిచ్చే బాధ్యత నాదంకుల్" అంటూ అతనికి భరోసా ఇచ్చాడు భవానీశంకర్.

"ఒకవేళ గవర్నమెంట్ అలవాటు ప్రకారం చెయ్యిచ్చినా– నేను ఉద్యోగం చేసి డబ్బు సంపాదించి బాకీ తీరుస్తాలే! డోంట్‌వర్రీ!" అన్నాడతను. ఇది భవానీశంకర్ ఫ్లాష్ బాక్–

"పోనీ ఆ పాతిక లక్షలకు ఇంకో పాతిక వేలిచ్చావనుకో! నేను దేశమంతా ఇంటర్వ్యూలకు తిరగటానికి పనికొస్తుందంకుల్–" అన్నాడు భవానీశంకర్ ఇంట్లో నుంచి వచ్చేసే రోజున.

కానీ బాబూరావ్ వప్పుకోలేదు.

"ఒరే భవానీ! ఇంక ఒక్కపైస కూడా ఇవ్వను– అమెరికాలో హైస్కూల్ చదువు దాటితే చాలు– పిల్లల్ని బయటకు గెంటేస్తారు. నా ఖర్మకాలి, ఆ పాతిక లక్షలకు ఆశపడి ఇంతకాలం నిన్ను పోషించా–" అంటూ చేతులెత్తేశాడు.

ఎండ శరీరానికి నిప్పంటిస్తోంది.

"వాట్ టు డునౌ?" అనుకున్నాడు భవానీ చకచక ఆలోచిస్తూ. సడెన్ బ్రేక్స్‌తో ఆటో వచ్చి అతని ముందాగింది.

"కమాన్– ఆటో ఎక్కు" అన్నాడు ఆటోడ్రైవర్.



భవానీ నవ్వాడు.

"రాంగ్ కారెక్టర్ని పట్టుకున్నావ్ బ్రదర్! ఆటోదిగాక ఛార్జ్ ఇమ్మని నన్ను అడిగావనుకో! ముందు ఓ తౌజెండ్ అప్పిమ్మని నేనే అడుగుతా–"

"ముందు ఆటో ఎక్కరా బాడుకవ్" అన్నాడు ఆటోవాడు అతని మాటలే మీ పట్టించుకోకుండా!

భవానీశంకర్ ఉలిక్కిపడి ఆటోవాడి మొఖం చూశాడు.

"ఈ డైలాగ్ ఇంతకుముందు విన్నదే బ్రదర్– యా! యూ ఆర్ రాకేష్ రెడ్డి–" అన్నాడు హాపీగా–

రాకేష్ రెడ్డి చిరాకుద్దాడు.

"అరె– ముందు ఆటో ఎక్కు బే– నీకేం దమాకుందా లేదా?"

"ఓ గాడ్! నువ్ ఆటో నడపటమేమిటి మిత్రమా! టాటాలూ, బిర్లాలూ ఎక్కడయినా ఆటోనడుపుతారా?" అంటూ ఆటో ఎక్కేశాడు.

ఆటో ఒక మోటార్ సైకిల్లా దూసుకుపోతోంది–

చివరకు ఒక స్లమ్‌లో కెళ్ళి ఓ పెంకుటింటి ముందాగింది.

"రా" అన్నాడు రాకేష్.

ఇద్దరూ పాడుబడినట్లున్న ఆ ఇంట్లో కెళ్ళారు.

"ఇదే మనిల్లు" అన్నాడు రాకేష్. భవానీశంకర్‌కి మతిపోయింది–

"ఇదంతా ఒక క్రైమ్ పిక్చర్ చూస్తున్నట్లుంది బ్రదర్! వెంటనే నువ్ అన్ని వివరాలూ సప్లయ్ చేయకపోతే ఆడియెన్స్ షాక్‌తో పైకెళ్ళి పోయే ప్రమాదం స్పష్టంగా కనబడుతోంది–"

రాకేష్‌రెడ్డి అదేం పట్టించుకోకుండా డ్రస్ మార్చుకుంటున్నాడు.

"ఆల్ ఈజ్ వెల్! డోంట్‌వర్రీ–" అన్నాడు మధ్యలో

భవానీశంకర్ ఆ ఇల్లంతా పరీక్షగా చూశాడు.

బయటకు భయంకరంగా ఉన్నా లోపల కొంతవరకూ బాగానే ఉంది.

అయితే తౌజెండ్ డాలర్ కొశ్చెన్ ఆన్సర్ లేకుండా అలాగే ఉండిపోయింది.

కోట్ల ఆస్తికి వారసుడయిన రాకేష్‌రెడ్డి ఆటో డ్రైవర్‌గా ఎందుకు అవతార మెత్తాడు? ఎత్తినా మహల్స్‌లో ఉండాల్సి నోడు ఇలా స్లమ్స్‌లో ఎందుకుంటున్నాడు?

క్షణాల్లో రాకేష్ రెడ్డి గెటప్ మారిపోయింది.

జీన్, కాస్ట్లీ టీషర్ట్, వాచీ, షూస్– ప్రిన్స్‌లాగా తయారయాడు.

"కమాన్– లెటజ్ గో–"

తలుపు తాళం వేశాడు.

"ఈ డ్రస్‌లో ఆటో తోల్తావా బ్రదర్?" అడిగాడు భవానీ అనుమానంగా. జవాబివ్వకుండా, ఆటో ఎక్కకుండా మెయిన్‌రోడ్ వేపు నడిచాడతను." జస్ట్ ఫాలో మీ– నీకు ఆన్సరిచ్చేంత టైమ్ లేదు బే–"

అయిదు నిమిషాల్లో ఇద్దరూ మెయిన్ రోడ్‌మీద కొచ్చారు.

"అప్పటికే అక్కడ రోడ్ పక్కన ఆగి ఉన్న రేడియో టాక్సీ డ్రైవర్ సెల్యూట్ కొట్టి డోర్ తెరచాడు.

ఇద్దరూ బాక్ సీట్లో కూర్చోగానే టాక్సీ స్టార్టయింది. భవానీశంకర్‌కి ఒక షాక్‌లో నుంచి ఇంకో షాక్‌లో కెళ్ళిపోతున్న ఫీలింగ్ కలిగింది–

"ఇప్పుడు నీ డౌట్స్ క్లారిఫై చేయాలి కదూ?" కాసేపయ్యాక అడిగాడతను.

"యస్ బ్రదర్– చాలా పెద్ద ఎక్స్‌ప్లనేషన్ ఇవ్వాలి నువ్వు–"

"రోజులన్నీ ఒకటిగా ఉండవ్‌రా! తేడాలొస్తయ్–"

"నీకున్నంత డబ్బుంటే ఇంతకూడా తేడా రాదు. ఒకవేళ కొంచెం తేడా వచ్చినా డబ్బుతో వాటికొచ్చిన వంకర్లు సరిచేయించి ఒకటిగా ఉండేట్లు చేయవచ్చు–"

"అవునా? నేనూ అలాగే అనుకున్నా బ్రదర్– కానీ మనీ అన్నీ కొనలేదు–' అనే విషయం కొంచెం లేటుగా తెలిసింది–"

టాక్సీ ఓ ఖరీదయిన హోటల్ అవరణలో ఆగింది.

"కమాన్" అంటూ లోపలకు నడిచాడు.

"మనిద్దరం ఇక్కడ లంచ్ కొచ్చామా?" హాపీగా అడిగాడు భవానీశంకర్.

"మనిద్దరమే కాదు– నా గాళ్ ఫ్రెండ్‌ని కూడా లంచ్‌కి ఇన్‌వైట్ చేశా– అన్నట్లు నువ్ నా గాళ్‌ఫ్రెండ్‌ని చూళ్ళేదు కదూ?"

"కేవలం ఒకటి రెండుసార్లు ఆ అమ్మాయి గురించి నీఆడియో విన్నాను–"

"నో వీడియో–"

"నో వీడియో–"

"వెరీ బాడ్! ఇన్ని రోజులు చూపించకుండా ఎలావున్నాను?"

"వెరీ సింపుల్ బ్రదర్– నేను చెన్నయ్‌లో నువ్ హైదరాబాద్‌లో– కుదరదు కదా!"

"యా యా – వీడియో కాన్ఫరెన్స్ ఉంటే తప్ప–"



"ఎనీవే– ఇప్పుడు ముగ్గురం కలసి లంచ్ చేస్తాం కాబట్టి పరిచయం చేస్తాను–"

రెస్టారెంట్‌లో లైటింగ్ డిమ్‌గా ఉంది.

సూపర్‌వైజర్– రొటీన్‌గా మెనూ కార్డ్ ఇచ్చాడు.

హోటల్ అంతా కలియజూస్తున్న భవానీశంకర్ చూపులు సడెన్‌గా – తమకు అతి సమీపంగా ఉన్న టేబుల్ దగ్గర నిలచిపోయినయ్. షాకయి కళ్ళు నులుముకుని మళ్ళీ చూశాడు.

"మోస్ట్ బ్యూటిఫుల్ గాళ్ ఆన్ ది ఎర్త్" అన్నాడు రాకేష్–

"నథింగ్ లెస్ దేన్ మిస్ యూనివర్స్" వప్పుకున్నాడు భవానీశంకర్ ఆ గాళ్ వంకే చూస్తూ.

"నవ్వుతూన్నప్పుడు– నిజంగా ప్రపంచం ఆమె కాళ్ళ దగ్గర పడాల్సిందే" అన్నాడు రాకేష్ మళ్ళీ.

"క్లియోపాత్రా కూడా ఆమె సర్వెంట్‌గా ఉండాల్సిందే–"

"సర్వెంట్‌గా ఉంటానికూడానే నొప్పుకోను–" అన్నాడు భవానీ.

"యూ మేబి రైట్ యార్– అయినా ఇంకో ఫైవ్ మినిట్స్‌లో వస్తుంది కదా! చూస్తే నువ్వే వప్పుకుంటావ్–"

భవానీ కన్‌ఫ్యూజయాడు.

"వాట్– ఫైవ్ మినిట్స్‌లో వస్తుందా?"

"యా–"

"నువ్ ఇంతసేపూ మాట్లాడింది ఎవరిగురించి కామ్రేడ్?"

"ఇంకెవరు– వన్ అండ్ ఓన్లీ డ్రీమ్ గాళ్– నా డ్రీమ్ గాళ్–"

భవానీశంకర్ చిరాకుపడ్డాడు.

"క్లారిటీ బ్రదర్– మనం ఏమాట్లాడినా క్లారిటటీ అవసరం– ఆ టేబుల్ దగ్గర కూర్చున్న బ్యూటీ గురించి కామెంట్ చేస్తున్నా వసుకున్నాను–"

రాకేష్ ఆ అమ్మాయివేపు చూశాడు.

"ఆ అమ్మాయా? ఇంపాజిబుల్– వెయ్యి జన్మలెత్తినా నా గాళ్‌ఫ్రెండ్‌తో పోటీ పడలేదు–" ఆవేశంగా అన్నాడు రాకేష్–

"ఎందుకని పడలేదు?"

"బికాజ్– షి కాన్ట్– ఏం? నీకలా అనిపించటం లేదా?"

"ఏమాత్రం లేదు–"

"నా డ్రీమ్ గాళ్‌ని చూళ్ళేదు గనుక అలా అనిపిస్తోంది నీకు–"

"నో! చూసినాగానీ నా అభిప్రాయం మార్చుకోలేను–"

సరిగ్గా అప్పుడే ఓ అమ్మాయి రెస్టారెంట్‌లో అడుగుపెట్టింది.

"యా! దేర్ షి ఈజ్! మోనికా! తీసుకొస్తానుండు" అంటూ హడావుడిగా ఎంట్రెన్స్ వేపు వెళ్ళాడు రాకేష్.

భవానీ మరోసారి పక్క బేటుల్ బ్యూటీని ప్రొఫైల్లో చూశాడు. చూస్తూనే ఉలిక్కిపడ్డాడు.

ఆ బ్యూటీని ఇంతకు ముందెప్పుడో చూశాడు– అవును! ఖచ్చితంగా చూశాడు! ఎక్కడ? ఎక్కడ? ఎక్కడ?

చకచక ఫ్లాష్ బాక్‌లన్నీ వెతికాడు.

ఆఖర్లో క్లూ దొరికింది.

"యా! మాణింగ్ బస్‌స్టాప్ దగ్గర విన్యాసాలు జరిపిన స్కూటర్ రాణీయే!" కానీ మరి ఈ గాళ్‌లో ఇంత బ్యూటీ ఉందని మాణింగ్ ఎందుకు గుర్తించలేకపోయాడు.

మొదటి చూపులోనే ఎందుకు ప్రేమలో పడలేకపోయాడు? కూలింగ్‌గాస్‌లు అడుపడ్డాయా? మేబి! ఆర్– లవ్‌లో పడేంత టైమ్‌లేకా? మేబి! ఏదేమయినా కానీ నౌ ఇటీజ్ లవ్ ఎట్ సెకండ్ సైట్– అనుమానం లేదు–

స్కూటర్ రాణి ఆమె కెదురుగ్గా కూర్చున్న ఫ్రెండ్‌తో నాన్‌స్టాప్‌గా మాట్లాడు తోంది.

భవానీ వీపు మోతెక్కింది.

"మోనికా! హి ఈజ్ భవానీశంకర్– మై బెస్ట్ అండ్ వరస్ట్ ఫ్రెండ్–" తన గాళ్ ఫ్రెండ్‌కి పరిచయం చేశాడు రాకేష్–

"హాయ్–" అందా అమ్మాయ్–

"హాయ్– రాకేష్ చెప్పింది నిజమే మోనికాజీ– యూ ఆర్ రియల్లీ ఏ డ్రీమ్‌గాళ్–" చిరునవ్వుతో అన్నాడు భవానీశంకర్.

"థాంక్‌యూ–" అంటూ కూర్చుంది మోనికా!

"ఈ చంద్రబింబం ఇంతకుముందెక్కడో చూసినట్లుంది" అన్నాడు భవానీ రాకేష్ చెవిలో–

"ఇడియెట్! ఎక్కడో ఏంటి? టీవీలో చూసి ఉంటావ్–"



"టీవీయా! ఓ గాడ్! గుర్తుకొచ్చేసింది. వర్షంలో తడుస్తూ కూల్‌డ్రింక్ యాడ్‌లో కనిపించింది మోనికాయే కదూ?"

"కాదు– వీళ గ్రాండ్ మదర్–"

"కమాన్ రాకేష్– త్వరగా లంచ్ ఆర్డర్ చేసెయ్! నేను గంటలో షూటింగ్ కెళ్ళాలి!" అంది మోనికా వాచ్ చూసుకుంటూ–

"ఓ షూర్" అంటూ బేరర్ని పిలచి అతనితో బెస్ట్ లంచ్ గురించి డిస్కషన్ ప్రారంభించాడు రాకేష్–

"యూ యూనో శిరీషా! నా లైఫ్‌లో ఒకే ఒక్కతనికి నేను హేట్ చేశాను–"

పక్కటేబుల్ స్కూటర్ రాణీ ఫ్రెండ్‌తో అంటోంది. భవానీశంకర్ చెవులు రిక్కించి ఆమె మాటలు వింటున్నాడు–

"రియల్లీ? ఎవరతను" పక్కనున్నమ్మాయ్ అడుగుతోంది–

"భవానీశంకర్ అనే ఇడియెట్– రోగ్– క్రూక్–" స్కూటర్ రాణీ ఆవేశంగా తిడుతూంటే భవానీశంకర్ సీట్లో నుంచి త్రీ ఇంచెస్ ఎగిరిపడ్డాడు.

అంటే ఇంకో భవానీ శంకరా? అనుమానంలేదు –ఖచ్చితంగా ఇంకోడెవడో అయుండాలి!

అయినా తనసలు ఈ స్కూటర్ రాణీని చూసింది వాళే కదా! ఇంతకూ ఆ భవానీ శంకర్ అనే వాడు ఈ దేవత అంతాగా హేట్ చేసే వెదవ పని ఏం చేసి ఉంటాడు?"

"వాడేం చేశాడు?" అడిగింది శిరీష.

భవానీశంకర్ రిప్లయ్ వినడానికి మెడ వీలయినంత లెంగ్త్‌కి సాగదీశాడు.

"ఏం చేశాడా? సంవత్సరం క్రితం నేను మయూరి టీవీ చానెల్‌వాళ్ళు కండక్ట్ చేసిన "ఆడవే మయూరీ" అనే డాన్స్ పోటీలో పార్టిసిపేట్ చేశా! లాస్ట్ రౌండ్‌వరకూ అందర్నీ ఎలిమినేట్ చేసుకుంటూ, వెళ్ళిపోయా! ఫైనల్ రౌండ్‌లో కొచ్చేసరికి 'క్లౌడ్ నైన్' అనే గ్రూప్‌ని జడ్జీలుగా పెట్టారు. ఆ గ్రూప్ లీడర్ భవానీశంకర్– అన్న వాడే నన్ను ఎలిమినేట్ చేసేశాడు. ఇడియట్– రోగ్– వాడసలు పెద్ద ఫ్రాడ్ అని తర్వాత తెలిసింది నాకు– నాతో పోటీ పడ్డ సుప్రియ దగ్గర యాభైవేలు లంచం తీసుకుని ఆమెని విన్నర్‌గా డిక్లేర్ చేశాడు. ఆరోజు నుంచీ నేను మళ్ళీ డాన్స్‌ల జోలికెళ్తే వట్టు–" భవానీశంకర్ ఉలిక్కిపడ్డాడు– అనుమానం లేదు– ఆ భవానీ శంకర్ ఇంకెవడోకాదు– తనే– అతని

కళ్ళముందు వెంటనే జరిగిన ఫ్లాష్ బాకంతా స్పీడ్‌గా పరుగెత్తింది–

కాలేజ్ నుంచి బయటపడగానే– తనూ, రాకేష్, సిద్ధార్థ్ ముగ్గురూ కలసి 'క్లౌడ్‌నైన్' అనే పేరుతో రెండు మ్యూజిక్ ఆల్బమ్స్‌ల రిలీజ్ చేశారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ కంపెనీ నడుపుతున్న రాకేష్ వాళ్ళడాడీ బాగా డబ్బు ఖర్చుపెట్టి– టీవీ ఛానెల్ వాళ్ళనీ, న్యూస్‌పేపర్ వాళ్ళనీ కొనేసి– తమ ఆల్బమ్స్‌కి విపరీతంగా పబ్లిసిటీ చేయించాడు. దాంతో ఆల్బమ్స్ చెత్తగా ఉన్నాయని అందరూ ఏకగ్రీవంగా వప్పుకున్నా, ఆ పబ్లిసిటీ చూసి ఆ ఆల్బమ్స్ సూపర్‌హిట్ అయాయని జనమంతా అనుకున్నారు. ఆ హైప్ ఎక్కువగా ఉన్న సమయంలోనే మయూరీ టీవీ చానెల్ వాళ్ళకు డబ్బిచ్చి తమ 'క్లౌడ్‌నైన్' మ్యూజిక్ గ్రూప్‌ని డాన్స్ పోటీలకు జడ్జీలుగా పెట్టించాడు– రాకేష్ వాళ్ళడాడీ! మ్యూజిక్ పోటీల్లో– నిజానికి తను ఆ స్కూటర్ రాణీనే విన్నర్‌గా రికమెండ్ చేశాడు గానీ– చానెల్ హెడ్ ఇంకెవరి దగ్గరో డబ్బు తీసుకుని రెండో అమ్మాయిని విన్నర్‌గా ఎనౌన్స్ చేశాడు.

దాంతో వళ్ళుమండి తనూ, కార్తీక్, సిద్ధార్థ్‌లు మందుకొట్టి అర్ధరాత్రి ఆ చానెల్ ఓనర్ ఇంటికెళ్ళి ఎటాక్ చేశారు. ఆఫ్‌కోర్స్ వాడు తమ గ్రూప్‌ని జైల్లో పెట్టించటం రాకేష్ తండ్రి విడిపించటం– అది వేరేస్టోరీ– అయితే ఆ ఫైనలిస్ట్ అమ్మాయే స్కూటర్ రాణీయా? ఎంతమార్పు? తనే గుర్తుపట్టలేక పోయాడు.

ఆ ఇన్సిడెంట్స్ అన్నీ తనెప్పుడో మర్చిపోయాడు గానీ ఆ స్కూటర్ రాణీ మాత్రం గుర్తు పెట్టుకుందన్నమాట!

అయితే తనకా అమ్మాయి పేరు కూడా గుర్తుంది– ఆ అమ్మాయి పేరు ఆ స్కూటర్ రాణీ పేరు .... మల్లిక– యా మల్లిక–!

మల్లిక ఇంకా ఆవేశంగా మాట్లాడుతూనే ఉంది.

'క్లౌడ్‌నైన్' అని పేరు పెట్టుకుని డబ్బుంది గదాని చెత్త ఆల్బమ్స్ తయారు చేసిన ఆ చిల్లర వెధవకి నన్ను జడ్జ్ చేసేంత సీనుందా? వాడిని కలుసుకుని చెంప పగలగొట్టాలని నెల రోజులు సీరియస్‌గా ట్రై చేశానుగానీ– వాడి కసలు అడ్రసేలేదనీ, కేరాఫ్ ఉస్మానియా యూనివర్శిటీ మెస్ అనీ తెలిసి వదిలేశాను–"

శిరీష నవ్వింది.

"ఇటీజ్ ఆల్ ఇన్ ది గేమ్ యార్– అలాంటివి మనం సీరియస్‌గా తీసుకోకూడదు–" అంది ఓదారుస్తూ–

భవానీశంకర్‌కి శిరీషను ఒక్కసారి అభినందించాలని పించింది.



"మోస్ట్ రీజనబుల్ గాళ్" అనుకున్నాడు.

"నీకు తెలీదు శిరీషా! ఒకసారి నన్నెవరయినా ఏమైనా అంటే జీవితాంతం గుర్తుంచుకుంటా! రివెంజ్ తీసుకుని తీర్తా–"

"చూడు మల్లికా– ఏనుగు వెళ్తాంటే కుక్కలనేకం మొరుగుతాయ్– అంత మాత్రాన ఆ కుక్కల్ని ఏనుగు ఏమయినా అంటుందా?"

ఆ డైలాగ్ భవానీశంకర్ మొఖం మీద కొట్టినట్లు తగిలింది–

"ఆ ఫీలాసఫీ వేరు– నా ఫిలాసఫీవేరు– ఆ వెధవ వల్ల నా మెంటాలిటీని మార్చుకోలేను కదా! అసలు ఆ పేరుగలాడెవడు కనిపించినా నా మూడ్‌పాడయి పోతుంది. ఓకే– ఆ చిల్లర మేటర్ ఇప్పుడెందుగ్గానీ– ఇంతకూ నీ మార్కెటింగ్ కెరియల్ ఎలా వుంది?"

"ఇప్పుడు టెలిమార్కెటింగ్‌లో ఉన్నా! ముక్కూ మొఖం తెలీనోళ్ళకు ఫోన్ చేయటం, వాళ్ళతో సెకండ్ సెటప్ మాట్లాడినంత క్లోజ్‌గా మాట్లాడి బిజినెస్ చేసుకోవటం– లేదా సాయంత్రం నా రూమ్‌కొస్తావా? బిజినెస్ మాట్లాడదాం అనే వాళ్ళుంటే ఫోన్లోనే కడుపు నిండా పెట్టటం– కొంచెం డీసెంట్– కొంచెం న్యూసెన్స్ అనుకో–"

"నీ మొఖానికి మార్కెటింగ్ ఒకటే తక్కువయింది–" అనుకున్నాడు భవానీ చిరాకుగా.

భవానీశంకర్ వీపు మళ్ళీ విమానం మోతమోగింది.

"అమ్మో"

"లేకపోతే ఏంట్రా ఆ పరధ్యానం? లంచ్ వచ్చేసింది– కమాన్– ఎటాక్–" అరచాడు రాకేష్.

సడెన్‌గా సైడ్‌కున్న ఆకలి విజృంభించింది భవానీశంకర్‌లో–

"సారీ బ్రదర్! ఒక మేటర్ గురించి ఇంకేదో విషయం ఆలోచిస్తూంటే అసలు మేటర్ మర్చిపోయి ఇంకో విషయంలోకి డైవర్ట్ అయి ఈలోగా అసలు మేటర్ గుర్తుకొచ్చి విషయం తాలూకూ మరో మేటర్ ఆలోచిస్తూ–...."

ఆ తరువాత తనేం మాట్లాడుతున్నాడో, మర్చిపోయి అప్పటికే ఆకలి వేగం పెరిగిపోవటం వల్ల ఎదురుగ్గా పొగలు కక్కుతున్న వంటకాల మీద పెద్ద ఎత్తున్న ఎటాక్ చేశాడు. అయిదు నిమిషాల్లో ప్లేట్లన్నీ ఖాళీ అయిపోయినయ్–

మల్లికా, శిరీషా కూడా భోజనం చేయటం ముగించారు.

భవానీశంకర్ మనసు కొంచెం చిరాగ్గా ఉంది.

జీవితంలో మొదటిసారిగా లవ్ ఎట్ థర్డ్ సైట్ కలిగింది! తీరా పద్దాక తెలిసింది– ఆ అమ్మాయికి తన మీద భయంకరమయిన 'హేట్రెడ్ నెస్' పేరుకుపోయి ఉందని–

ఇప్పుడేమిటి చేయటం?

"హలో! వాట్ హాపెన్డ్ బ్రదర్! నీ లెవల్‌కి ఫుడ్ ఇంకా చాలా లాగించాలి కదా?" అడిగాడు – రాకేష్ అనుమానంగా!

"పరిస్థితులు సడెన్‌గా రివర్స్ కొట్టినయ్ మిత్రమా! దేరార్– ప్రాబ్లెమ్స్ వితిన్ ప్రాబ్లెమ్స్–"

"షటప్– ప్రస్తుతం నాకున్న ప్రాబ్లెమ్స్ ప్రపంచంలో ఎవడికీ ఉండవ్!" చిరాగ్గా అన్నాడతను–

"వ్వాట్? నీకు ప్రాబ్లెమ్సా?"

"యస్–"

"నేనమ్మను! మల్టీ మిలియనీర్' దినేష్ రెడ్డి అనే లాడ్‌లా బేటా రాకేష్‌కి ప్రాబ్లెమ్స్ అంటే నేనేకాదు. ఎవడూ నమ్మడు–"

"కానీ డబ్బు సాల్వ్ చేసే ప్రాబ్లెమ్స్ కంటే సాల్వ్ చేయలేనివే ఎక్కువ బ్రదర్!"

"ఫరెగ్జాంపుల్?"

రాకేష్ దిగులుగా మోనికా వేపు చూశాడు.

"ఫరెగ్జాంపుల్– డబ్బుతో తండ్రిని కొనగలమా?" అడిగాడు రాకేష్–

"ఇంకా అనుమానమా? ఎంతమంది తండ్రులు కావాలో చెప్పు! హెూల్‌సేల్ రేట్లో కొనుక్కొస్తా–"

"తండ్రంటే– నా ఉద్దేశ్యం– ఫిజికల్ కాదు బే– మనసు– తండ్రి మనసు– కెన్ యూ బై ఫాదర్స్ మైండ్? పోనీ కొశ్చెన్ ఇంకో రకంగా వేస్తాను– డబ్బుతో తండ్రి విల్లింగ్‌నెస్ ని కొనగలమా?"

"అంటే మీ డాడీ నీకు ప్రాబ్లెమా?" ఆశ్చర్యంగా అడిగాడు భవానీ–

"యస్–"

"యువరోన్ డాడీ?"

"డాడీ ఓన్ కాకపోతే అద్దె డాడీలుంటారా? నీయవ్వ బ్రెయిన్ లెస్ ఫెలో!"

"ఈ రోజుల్లో ఉంటారు గానీ– నీ విషయంలో ఉండరు– ఇంతకూ మీ డాడీతో ఏమిటి ప్రాబ్లెమ్?"



"నేను మోనికాను లవ్ చేయటం మా డాడీ కిష్టం లేదు–"

"ఎందుకిష్టం లేదు?"

"అది ఒక బిగ్ బిగ్ స్టోరీ–"

"ఫ్లాష్ బాక్ స్టోరీయా–"

"అవును! కాలేజ్ డేస్‌లో మాడాడీ ఒక మోడలింగ్ చేసే అమ్మాయిని లవ్ చేశారు–"

"వావ్– మీ డాడీకూడా ఆ రోజుల్లో చాలా ఫాస్ట్ టైప్ అన్నమాట!"

"వెరీ ఫాస్ట్–"

"తర్వాతేమయింది?"

"ఆ మోడల్ కూడా మా డాడీని ప్రేమించింది. మా డాడీని వెంటేసుకుని తిరుగుతూ బోలెడు నగలు కొనిపించింది! ఆ తరువాత ఆ నగలన్నీ తీసుకుని తన బాయ్‌ఫ్రెండ్ నెంబర్ సిక్స్‌తో పారిపోయింది–"

"బాయ్‌ఫ్రెండ్ నెంబర్ సిక్సా! అంటే అసలెందమంది బాయ్‌ఫ్రెండ్సుండే వాళ్ళు?"

"ఆ మేటర్ ఇప్పుడు మనకవసరం అంటావా?"

"ఆవిడ లెవల్ తెలుసుకుందామని అడిగాన్లే–"

"అందుకని ఈ గ్లామర్ ఫీల్డ్‌ని సంబంధించిన గాళ్స్‌ని లవ్ చేయడానికి వీల్లేదని రూలింగిచ్చారు మా డాడీ!"

"అయితే అక్కడ లూప్ పడిందన్నమాట!"

"అవును"

భవానీశంకర్ చకచక ఆలోచించాడు.

"అవునూ! నువ్వూ, మోనికా లేచిపోవచ్చు కదా కామ్రేడ్– పైగా మీలాంటి లేచిపోయే లవ్ బర్డ్స్‌కి ఈ మధ్య ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఫుల్ ప్రొటెక్షన్ ఇస్తోంది– మిగతా డ్యూటీలన్నీ గంగలో కలిపేసి–"

"నోవే యార్! అలాంటి చిల్లర లవ్‌కీ, అల్లరి మారేజ్‌కీ మోనికా వప్పుకునే టైప్‌కాదు– అదీగాకుండా అసలు లవ్ విషయం పెళ్ళి విషయం ఇవన్నీ నేనింకా మోనికాతో మాట్లాడలేదు–"

"ఇంత లేటా? టూమచ్ బ్రదర్! బయట ప్రపంచాన్ని ఒక్కసారి చూడు– త్రీడేస్‌లో లవ్– త్రీనైట్స్‌లో చిల్డ్రన్– స్కీమ్ నడుస్తోంది మిత్రమా!"

"మాకు అవన్నీ మాట్లాడ్డానికి ఇప్పుడున్న ఇంటిమసీ చాలదు– ఇంకొన్ని రోజులు మోనికా నా గురించి అన్నీ స్టడీ చేశాక అప్పుడు ప్రపోజ్ చేస్తే హాపీ ఎండింగ్ అవుతుందని నా ప్లాన్–"

సరిగ్గా అప్పుడే మోనికా సెల్‌ఫోన్లో అలారం పెద్ద సౌండ్‌తో మోగటం మొదలు పెట్టేసరికి– ఏదో బాంబ్ పేలబోతోందని– హొటల్లో చాలామంది టేబుల్స్ కిందదూరారు.

భవానీ, రాకేష్‌లు కూడా నేలమీద పడుకున్నాక రాకేష్‌కి డౌటొచ్చింది.

"ఏమిటా అలారం?" మోనికా నడిగాడు.

"అలారం– నా అపాయింట్‌మెంట్స్‌ని గుర్తు చేయడానికి ఈ సెల్లో కొత్త ప్రొవిజన్ ఇచ్చార్లే– ఓకే రాకేష్! టైమ్ ఈజ్ అప్– మళ్ళీ కలుసుకుందాం– బై–" అంటూ హడావుడిగా వెళ్ళిపోయింది.

"హలో డియర్– వన్ సెకండ్" అంటూ ఆమె వెంటపడ్డాడు రాకేష్– భవానీశంకర్ వెంటనే స్కూటర్ రాణి మల్లిక దగ్గరకు పరుగెత్తాడు.

"హల్లో మిస్" అన్నాడు అప్పుడే ఆమెను కనుక్కున్న ఎఫెక్ట్ ఇస్తూ– మల్లిక భవానీ వేపు ప్రశ్నార్థకంగా చూసింది.

"మీరు..."

"ఇందులో మీ తప్పేంలేదు ఫ్రెండ్! మాణింగ్ మనం చాలా చిన్న మీటింగ్‌లో కలుసుకున్నాం– వీధికుక్కల పోరాటం మధ్యలో మీరు ఇరుక్కుపోయిన సందర్భంలో నేనే మీకు హెల్ప్ చేశాను–"

"యా– యా– అయ్ రిమెంబర్ నౌ"

"వెంటవెంటనే ఇలా కలుసుకోవటం చాలా ప్లెజెంట్‌గా ఉంది డియర్– ఇటీజే స్మాల్ అండ్ కంజెస్టెడ్ వరల్డ్– వాడ్డూ యూ సే? బై దివే– మాణింగ్ మీ పేరడగటం మర్చిపోయాను–"

"మల్లిక–"

"ఓ! బ్యూటిఫుల్ నేమ్– చిన్నప్పటి నుంచీ–ఆ పేరంటే నాకు ఆరాధన! కారణం తెలీదు– బహుశా! ఓల్డ్ జన్మ– అంటే పునర్జన్మ ఎఫెక్టేమోనని నా అనుమానం! వాడ్డూ యూ సే!"

"అయ్ డోన్ట్ నో–"

"అన్నట్లు మిమ్మల్ని ఇంతకుముందు– కూడా ఎక్కడో చూసినట్లు అనిపిస్తోంది



మల్లికా జీ! మీరే ఏరియాలో ఉంటారు?"

"మోతీనగర్–"

"నేనుండేది రామ్‌నగర్– గనుక మనం ఆ విధంగా కలుసుకోవటం ఇంపాజిబుల్– ఒకవేళ మీరు టీవీ యాంకర్‌గా వర్క్ చేశారా?"

"నాట్ ఎగ్జాక్ట్‌లీ! అయామే జర్నలిస్ట్–"

"సేసో! నాకిప్పుడిప్పుడే గుర్తుకొస్తోంది యా! మయూరీ చానెల్ వాళ్ళు కండక్ట్ చేసిన 'ఆడవే మయూరీ' డాన్స్ పోటీల్లో మీరు సూపర్‌గా డాన్స్ చేశారు– యామ్ ఐ రైట్?"

మల్లిక స్టన్నయింది.

"ఓగాడ్! సూపర్ రిమెంబరెన్స్ పవరుంది మీకు!" హాపీగా అంది.

"అది నా వీక్‌నెస్ డియర్! ఏ విషయమయినా సరే– మర్చిపోవటం నా వల్లకాదు– ఆ పోటీల్లో మీరే విన్నర్ అని నేను ఎక్స్ పెక్ట్ చేశాను– కానీ సమ్‌హౌ ఇంకెవరికో ఆ క్రెడిట్ దక్కింది–"

మల్లికలో ఎగ్జయిట్‌మెంట్ కనిపించింది.

"అదంతా ఆ ఇడియట్ జడ్జీలు చేసిన మిస్చీఫ్! అవతలి కాండేట్‌దగ్గర డబ్బులు తీనేసి అలాంటి జడ్జ్‌మెంట్ ఇచ్చారు–"

"ఓ! దిసీజ్ న్యూస్ టు మీ! అయితే ఈ గేమ్ షోస్‌లో అలాంటివి కూడా జరుగుతూంటాయా మిస్?"

"నా ప్రొగ్రామే ఒక ఎగ్జాంపుల్ అనుకోండి–"

వెంటనే శిరీష అందుకుంది.

"నేను చెప్పాను కదా! ఆ జడ్జీలూ, చానెల్‌వాళ్ళూ చేసిన ఫ్రాడ్‌కి అనవసరంగా నువ్ నీ టాలెంట్‌ని వృథా చేసుకుంటున్నావ్– నిజంగా నీ పెర్ఫారమెన్స్ సూపర్బ్‌గా ఉండబట్టే ఇతను ఇంతకాలమయినా నిన్ను గుర్తుపెట్టుకున్నాడు–"

"ఇంతకూ ఆ జడ్జీ ఎవరు మిస్?"

"క్లౌడ్ నైన్' అనీ ఒక మ్యూజిక్ గ్రూప్ ఉండేది– ఆ గ్రూప్‌లో మెయిన్ సింగర్ కమ్ డాన్సర్ భవానీశంకర్–"

భవానీశంకర్ షాకయినట్లు నటించాడు.

"వాడా? వాడో ఇడియట్! రోగ్– హాఫ్ నాలెడ్జ్ ఫెలో–"

"అంటే ఆ గ్రూప్ మీకు తెలుసా?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఎందుకు తెలీదు? వాడూ నేనూ సేమ్ కాలేజ్- సేమ్ రూమ్ సేమ్ బెడ్-" ఆమె మొఖంలో చిరాకు కనిపించింది.

"ఓ! ఇప్పుడెక్కడున్నాడో అయిడియా ఉందా మీకు-" అనుమానంగా అడిగింది.

"సారీ! తెలీదు! అసలు వాడి మొఖం చూడాలంటేనే నాకు ఎలర్జీ! నిజానికి వాడు నాకు చేసిన ద్రోహానికి వాడిని వెతికి మర్డర్ చేయాలని ఉంది నాకు-"

మల్లిక షాకయింది.

"మర్డర్ చేయాలనుందా?"

"ఎగ్జాక్ట్‌లీ-"

"ఒండర్‌ఫుల్ నాకు ఆ సీన్ కళ్ళారా చూడాలని ఉంది-" ఉత్సాహంగా అందామె.

"ఇంతకాలం వాడిని మర్డర్ చేస్తే- నేను జైలు కెళ్ళటం- మళ్ళీ అడ్డమయిన పొలిటీషియన్స్ నీ పట్టుకుని - క్షమాభిక్ష స్కీమ్‌లో బయటకు రావటం- ఈ గొడవంతా ఎందుకని చేయకుండా వదిలేశాను- కానీ ఇప్పుడు మీ హాపీనెస్ కోసమయినా సరే- వాడిని వెతికి ఉరివేసేయాలనిపిస్తోంది నాకు-"

మల్లిక మొఖంలో హాపీనెస్ స్పష్టంగా కనబడుతోంది.

"మరీ మర్డర్ వరకూ ఎందుగ్గానీ- ఏకాలో చెయ్యో విరిచేయండి చాలు! నాకసి కొంతవరకయినా తీర్తుంది-" అంది కొంతవరకూ రాజీపడుతూ-

"సరే- మీరు వద్దంటున్నారు కాబట్టి రాజీపడతున్నా! లేకపోతే నేనస్సలు రాజీపడే టైప్ కాదు-"

"ఇంతకూ అతనిని లేపేసేయాలన్న కోరిక ఎందుకు కలిగింది మీకు? వాడు ఏం ద్రోహం చేశాడు?" అడిగింది ఆసక్తిగా.

"అదే డియర్- కాలేజ్ డేస్‌లో-"

"హలో నన్ను డియర్ అనకండి! ఐ డోంట్ లైకిట్-" చిరుకోపంతో అందామె.

"అలాగా! వెరీ స్ట్రేంజ్ డియర్- డియర్ అనేది ఈ రోజుల్లో చాలా కామన్-"

"నేను కామన్ టైప్ కాదు-"

"ఓకే ఓకే- ఎబ్‌నార్మల్ అన్నమాట! నాకుముందే డౌటొచ్చిందిలే!"

మల్లిక తన బాగ్‌లోనుంచి ఓ కార్డ్ తీసి అతనికిచ్చింది.

కార్డ్ చూస్తూనే ఉలిక్కిపడ్డాడు భవీనాశంకర్-



"వ్వావ్? మీరు ఆల్ రెడీ క్రియేటివ్ హెడ్‌గా వర్క్ చేస్తున్నారా? అయితే మనిద్దరం ఒకేజాతి ఒకే ప్రజ స్కీమ్‌లో కొచ్చేస్తాం-"

"అంటే?"

"నేను మాస్ కమ్యూనికేషన్స్ గ్రాడ్యుయేట్‌ని డియర్-"

"ఓ! గుడ్- ఇంతకూ మీ పేరు చెప్పలేదు?""

"భవానీశంకర్ డియర్-"

"వాట్ భవానీశంకరా?"

భవానీ శంకర్ కంగారు పడ్డాడు-

"అయ్‌మీన్ మనిద్దరికీ కామన్ ఎనిమా భవానీ శంకర్! నాపేరు అడిగారు కదా- రాకేష్- అయామ్ రాకేష్-"

అప్పుడే వచ్చిన రాకేష్ ఆ మాట షాకయ్యాడు.

"వ్వాట్? నీ పేరు రాకేషా?" అడిగాడు రాకేష్ అతని వంకా ఎదురుగ్గా ఉన్న ఇద్దరమ్మాయిల వంకా ఆశ్చర్యంగా చూస్తూ-

"అవును బ్రదర్- డిటెయిల్స్ తర్వాత సప్లయ్ చేస్తా-" రహస్యంగా అతనితో చెప్పి మల్లిక వేపు తిరిగి చిరునవ్వు నవ్వాడు భవానీశంకర్-

"సో సీ యూ ఫ్రెండ్! వుయ్ విల్ మీట్ ఎగైన్, అండ్ ఎగైన్ అండ్ ఎగైన్- అండ్ ఎగైన్-" అంటూంటూ రాకేష్ అతనిని బలవంతంగా ఈడ్చుకెళ్ళి కార్లో పడేశాడు.

"ఒరేయ్ భవానీ! ఇప్పుడు ఎంత అద్భుతం జరిగిందో తెలుసా?"

"అద్భుతమా?"

"యస్!"

"ఏంటది?"

"మోనికాకి కారు దగ్గర బై చెప్తున్నప్పుడు అనుకోకుండా" అయ్ లవ్ యూ" చెప్పేశాను.

"మైగాడ్- అంత కూల్ గానా?"

"డెడ్ కూల్ అనుకో-"

"మోనికా ఏమంది మరి?"

"సర్‌ప్రైజ్ అయింది. కొంచెం సిగ్గుపడింది. ఆ తర్వాత "ఓ- నాకేం మాట్లాడాలో తెలీటం లేదు- నేను కొంచెం ఆలోచించుకోవాలి- అంది-"

"ఒండర్‌ఫుల్! అయితే నీ లవ్ సక్సెస్‌ఫుల్ అయినట్లే- డౌటేలేదు-"

"డౌట్ లేదంటావా?" అనుమానంగా అడిగాడు రాకేష్-

"కొంచెం కూడా లేదు- రేపు కలుసుకున్నప్పుడు ఖచ్చితంగా ఓకే అంటుంది-"

"నీకెలా తెలుసు?"

"మొన్నే లవర్స్ సైకాలజీ అనే బుక్ సెకండ్ హాండ్ బుక్‌స్టాల్లో కొని చదివాను-"

"అందుకే బ్రదర్- అందుకే నేను నిన్ను లైక్ చేసేది- యూ ఆరే గ్రేట్ సోర్స్ ఆఫ్ ఇన్‌స్పిరేషన్-"

"థాంక్ యూ రాకేష్- అయ్ లవ్ సచ్ కాంప్లిమెంట్స్-"

"అది సరేగానీ- ఇంత క్విక్‌గా ఆ పక్కటేబుల్ అమ్మాయినెలా ఫ్రెండ్‌షిప్ చేసుకున్నావ్?"

"డెస్టినీ బ్రదర్- దాన్నే లవ్ ఎట్ సెకండ్ సైట్ అంటారు-"

"లవ్ ఎట్ సెకండ్ సైటా?"

"యస్-"

"ఫస్ట్ సైట్‌లో ఏం చేశావ్ మరి?"

"ఆ అమ్మాయి అందాన్ని ఓవర్ లుక్ చేశాను- పైగా అప్పుడే ఓ పదిమందిగాళ్ళ్ వచ్చేసరికి ఎవర్తో లవ్ ఎట్ ఫస్ట్ సైట్ ఏర్పడుతుందో తెలీక కన్‌ఫ్యూజ్ అయాను- అది ఓకేగానీ బ్రదర్- ఓ ఫ్లాష్‌బాక్‌లో ఇంకా నాకు తెలీని ఇన్‌ఫర్మేషన్ చాలావుండిపోయింది- అది కొంచెం సప్లయ్ చేస్తే నాబ్రెయిన్‌కి విశ్రాంతి దొరుకుతుంది-"

"యా! అయ్ థింక్ సో! మా డాడీ నా లవ్ ఎఫైర్‌ని బాన్ చేశాడని చెప్పాను కదా! దాంతో నేను ఇంట్లోనుంచి ఎవరికీ చెప్పకుండా వచ్చేశాను. నేనెక్కడుందీ తెలుస్తే మా డాడీ సైన్యం నన్ను బైఫోర్స్ ఇంటికి తీసుకెళ్ళిపోతారు. అందుకే ఈ స్లమ్‌లో, ఈ ఆటోవాడి గెటప్‌లో సీక్రెట్ లైఫ్ ఎంజాయ్ చేస్తున్నా! పాపం మా డాడీ సైన్యం మాత్రం నాకోసం ఫైవ్‌స్టార్ హొటల్స్‌లో, గెస్ట్‌హౌసుల్లో వెతుకుతోంది. రెండు మూడుసార్లు వాళ్ళకు దొరక్కుండా చాలా నారోగా ఎస్కేప్ అయాననుకో-"

"మరి నీక్కావలసిన మనీ సప్లయ్ సంగతేంటి? ఎవరైన సప్లయ్ చేస్తున్నారా లేక బంగ్లాదేశ్ నుంచి ఓడలతో మనదేవానికి సప్లయ్ అవుతోన్న దొంగనోట్లతో మానేజ్ చేస్తున్నావా బ్రదర్?"

"నకిలీ నోట్ల డీలర్స్ నుంచి మంచి ఆఫర్స్ వస్తున్నయ్‌గానీ, సమ్ హౌ కాంషస్



ఒప్పుకోవటం లేదు భవానీ! ఎందుకంటే ఒకప్పుడు రమణమూర్తి 'జై భారత్' లో యాక్టివ్‌గా వర్క్ చేశాం కదా!"

"యా యా పోలీసుల్తో తార్నాకాలో యుద్ధం కూడా చేశాం- నాకు బాగా గుర్తుంది-"

"రియల్లీ ఒండర్‌ఫుల్ డేస్ ఆరోజులు-"

"సూపర్బ్ అనుకో"

"జస్ట్ తల్చుకుంటేనే చాలా హాపీగా ఉంటుంది-"

"ఒక మంచి కాజ్‌కోసం ఫైట్‌చేయటం చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుందని అప్పుడే మనకు తెల్సింది- బ్రదర్- ఏకాజ్ లేకుండా కూడా చాలాసార్లు ఫైటింగ్‌లు చేశామనుకో- దటీజ్ డిఫరెంట్-"

"యా- టోటల్లీ డిఫరెంట్-"

సరిగ్గా అప్పుడే ఓ ముసుగు వ్యక్తిలోపలికొచ్చాడు.

"మీ ఇద్దరిలో రాకేష్ ఎవడు?" అడిగాడతను.

"నువ్వెవరు?" అడిగాడు రాకేష్-

"ప్రశ్నకు ప్రశ్న సమాధానం కాదు" అన్నాడు ముసుగు.

"నీమొఖానికి అది కూడా ఎక్కువ" చెప్పాడు భవానీ.

అతను సడెన్‌గా గన్‌తీశాడు.

"కమాన్ టెల్‌మీ! రాకేష్ ఎవరు?"

"కనబట్టంలా! కళ్ళు దొబ్బాయా? వాడే-" అంటూ భవానీశంకర్‌ని చూబించాడు రాకేష్- భవానీశంకర్‌కి కన్నుగీటుతూ-

వెంటనే గన్ భవానీవేపు తిప్పాడువాడు.

"మర్యాదగా నాతోవచ్చి కారెక్కు- లేకపోతే ఛస్తావ్-"

"నువ్ డైరక్ట్‌గా మెంటల్ హాస్పిటల్ నుంచి వచ్చినట్లున్నావ్ మిత్రమా! నీలాంటి టుమ్రీస్ ఎంత ట్రై చేసినా నన్నేం చేయలేరని స్వామి మద్యానందం చెప్పారు- ఎనభయ్ ఏళ్ళు మినిమమ్ గారంటీ ఇచ్చారు నాకు-"

"షటప్- మర్యాదగా బయటికొచ్చి కారెక్కు తావాలేదా?"

"ఓకే- బ్రదర్! కారెక్కడానికి నాకేం అబ్జెక్షన్ లేదు- కార్ రైడింగ్ అంటే చిన్నప్పటి నుంచీ చాలా ఇష్టం!"

అతని వెంటే బయటకు నడుస్తూ రాకేష్‌కి సైగ చేసి వెళ్ళిపోయాడు భవానీ!

* * *

కారు వేగంగా పాతోంది. ముసుగు వ్యక్తి డ్రైవ్ చేస్తూంటే భవానీ శంకర్‌కి అటూ ఇటూ గన్స్‌తో కూర్చుని ఉన్నారు ఇంకో ఇద్దరు గూండాలు.

"మనం ఎక్కడికెళ్తున్నాం కామ్రేడ్స్?" అడిగాడు భవానీ.

"షటప్– ఆ సంగతి నీకవనసరం–"

"నీ జీకే– మరీ జీరో లెవల్లో ఉంది కామ్రేడ్! నాకు ఆన్సరివ్వటం చాలా అవసరం! నన్ను మరీ ఎక్కువ దూరం తీసుకెళ్ళ దల్చుకుంటే. మీకో షాకింగ్ న్యూస్ చెప్పాలి–"

వాళ్ళిద్దరూ అనుమానంగా చూశారు.

"ఏంటది?"

"మేనర్స్ బ్రదర్– మేనర్స్ నేర్చుకోండి! ముందు నేనడిగిన ప్రశ్నకి సమాధానం చెప్తే– తర్వాత నీ ప్రశ్నకి ఆన్సర్ దొరుకుతుంది–"

వాళ్ళు మొఖాలు చూసుకున్నారు.

"ఓకే మనం జూబిలీహిల్స్‌కి వెళ్తున్నాం–" అన్నాడొకడు.

"ఒండర్‌ఫుల్! చాలా చక్కని సమాధానం! మెంటర్ ప్రాబ్లెమ్స్ ఉన్నవాళ్ళు అచ్చం ఇదే స్టైల్లో చెప్తారు–"

ఇద్దరూ కోపంగా చూశారు.

"దిల్లగీనా?"

"మీతో దిల్లగీ చేయటానికి నేను మీ టైపు కాదు కదా–"

"అంటే?"

"సమాధానంలో ఇంకా క్లారిటీ కావాలి బ్రదర్! జూబిలీ హిల్స్‌లో ఎవరింటి కెళ్తున్నాం? లేక ఏ ఆఫీస్ కెళ్తున్నాం?"

"ఇండస్ట్రియలిస్ట్ జైరాజ్ గారింటికి!"

"జైరాజా?"

"అవును–"

"ఆయనకు నాతో ఏంటి అవసరం?"

"నోమోర్ కొశ్చెన్స్" అన్నాడు ముసుగు మనిషి.

"మరి మాకు షాకింగ్ న్యూస్ చెప్తానన్నా వేంటది?" ఇంకోతనడిగాడు.



"మెహిదీపట్నంలో శిరీష అనే అమ్మాయ్ తనను ప్రేమించే బాయ్‌ఫ్రెండ్ ఫాదర్‌తో లేచిపోయింది.

ఇద్దరూ మతిపోయినట్లు చూశారు.

"ఇది షాకింగ్ న్యూసా?"

"షాకింగ్ న్యూస్ అనే హెడింగ్ తోనే ఆ న్యూస్ 24 గంటల నుంచీ ఏకథాటిన స్క్రోలింగ్ వేస్తోందో చానెల్–"

"మహా తుగ్లక్ లాగున్నాడెవడోగానీ– ఆ చానెల్ పేరేంటి?"

"తుగ్లక్ చానెల్–"

కారు జూబిలీహిల్స్‌లో ఓ పేద్ద బంగళాముందాగింది. వాచ్‌మెన్ వచ్చి ముసుగు మనిషితో మాట్లాడి– తర్వాత ఫోన్‌లో ఇంకెవరితోనో మాట్లాడి గేటు ఓపెన్‌చేశాడు.

కారు విశాలమయిన గార్డెన్ మధ్య నుంచి బంగళా పోర్టికోలోకెళ్ళి ఆగింది.

"దిగు" అన్నాడొకడు భవానీశంకర్‌ని.

భవానీ దిగి ఆ బిల్డింగంతా చూశాడు.

"అడ్రస్ చెప్తే నేనే వచ్చేవాడిని కదా! అనవసరంగా ఇంతమంది మనుషులు, గన్‌లు, కారు, ఆ ముసుగులు– క్రిమినల్ వేస్ట్ బ్రదర్! దేశం అసలే ఆర్థికమాంద్యంతో మట్టికొట్టుకుపోతోంది–"

భవానీ మాటలు వినిపించుకోకుండా "కమాన్" అన్నాడు ముసుగు వీరుడు.

భవానీ అతని వెనుకే లోపలకు నడిచాడు.

విజిటర్స్ రూమ్ చాలా పెద్దదిగా ఉంది.

కాసేపు వెయిట్ చేశాక లోపల్నుంచి ఓ సూట్‌వాలా వచ్చాడు.

ముగ్గురూ లేచి నిలబడ్డారు.

"ఇతనే రాకేష్ సార్– చాలా శ్రమపడి ట్రేస్ చేశాం!" చెప్పాడు ముసుగు వ్యక్తి ముసుగు తీసేస్తూ.

"హాయ్ రాకేష్" అంటూ భవానీశంకర్‌తో కరచాలనం చేశాడు సూట్‌వాలా!"

"అయామ్ జైరాజ్! నేనూ మీ నాయనా జిగిరీ– కాలేజ్ డేస్‌లో కెళ్ళి దోస్తానా అనుకోరాదు? ఇక ఈ బిజినెస్ లోపడ్డాక అదివరకు లెక్క కల్సుకోనికేడవుతది! అయినాగానీ మీ నాయన సంవత్సరానికి ఒక్క దినమయినా అమెరికాకెళ్ళి ఈడ కొచ్చి నాతో ఖుషామత్ జేయాలె! గంత జిగిరీ అనుకో–"

"సమజ్ గయా బాస్! స్నేహమేరా జీవితం- స్నేహమేరా శాశ్వతం టైపన్నమాట!"

"మంచిగ జెప్పినావ్- ఒక్క నిమిషం! నేను ఈ బాచ్‌ని పంపించేసి వస్తా! అప్పుడు ఖుల్లమ్ ఖుల్లా మాట్లాడుతోవచ్చు- ఏమంటున్నా?"

"ఓకేసార్! కారీయాన్-"

సూట్‌వాలా ఆ ముగ్గురు వ్యక్తులూ బయటికెళ్ళారు. భవానీ తలుపు దగ్గరకెళ్ళి వాళ్ళ మాటలు చెవులు రిక్కించి విన్నాడు. ఆ ముసుగు వీరులు డిటెక్టివ్ ఏజెన్సీ వాళ్ళనీ, రాకేష్‌ని వెతికి పట్టుకుని తన ఫ్రెండ్ జైరాజ్‌కి అప్పగించడానికి పదిలక్షలు ఇచ్చాడనీ అర్థమయిందతనికి!

సూట్‌వాలా వాళ్ళను పంపించి లోపలికొచ్చాడు.

"సో- హౌ ఈజ్ లైఫ్ మై డియర్ యంగ్‌మేన్?" అడిగాడు జైరాజ్.

"ఓవర్ ఫ్లోయింగ్ విత్ హాపీనెస్ సర్-"

"ఓ- ఒండర్‌ఫుల్! అన్నట్లు- వాళ్ళు నిన్ను గన్ పాయింట్‌తోటి ఈడికి తీసుకొచ్చినందుకు- అయామ్ ఎక్స్‌ట్రీమ్లీ సారీ-" నొచ్చుకుంటూ అన్నాడతను.

"ఏం ఫర్లేదు సార్- నేను వాళ్ళ ఫూలిష్‌నెస్‌ని చాలా ఎంజాయ్ చేశాను-"

అతను షాకయ్యాడు.

"వ్వాట్? ఎంజాయ్ చేసినావా?"

"అవున్సార్-"

"వాళ్ళలా గన్‌పెడితే మళ్ళా పరేషానవలేదా?"

"జర్రంత కూడా అవలేద్సార్-"

"అరే- చానా డేర్ డెవిలున్నావ్ నువ్వు-"

"ఏం జేయ్యాలి సార్! ఆదత్ సే మజ్‌బూర్"

జైరాజ్ పగలబడి నవ్వాడు.

"వావ్! సూపర్ డైలాగులు ఇడుస్తున్నావ్‌రా భయ్ నువ్వు. ఈ ఉర్దూ ఏడకెళ్ళి నేర్చినావ్?"

"ఓల్డ్ సిటీ లింక్స్‌అంకుల్-"

"హాయ్‌రే- నేను భీ గంతే! జిందగీ మొత్తం ఓల్డ్ సిటీలో గుజరాయించినా నన్నట్లు- ఖానా, పీనా- అంతా గాడ దోస్తల తోనే- ఇగో అదట్లుండనీ గాని- రా! ఈడకూసో- గిప్పుడు మనం దిల్ ఖులాయించి ఖుల్లమ్ ఖుల్లా మాట్లాడుకోవాలె! ఏమంటున్న?"



"అయ్ లవిట్ అంకుల్!"

"సంగతేందంటే- నువ్ ఇల్లొదిలి పోయినావని మీ నాయన నాకు అమెరికా కెళ్ళి ఫోన్ జేసిండు. ఇక నీతాన దాచెడిదేమున్నది- నీ లవ్‌స్టోరీ గురించి గూడా జెప్పిండు! ఇగో- చూడు రాకేష్! నీగ్గిట్టా హైదరాబాద్‌లోనే ఉండాల్ననుంటే- నా ఇంట్లో ఉండు! గంతనే గానీ స్లమ్స్‌లోనూ, లేబర్ కాలనీల్లో ఉండొద్దు- ఏమంటున్న?"

"మీరు జెప్పినాక కాదనెట్లా అంటానంకుల్-"

"గుడ్! ఇగో- మీ నాయనకు ఒక్కడే కొడుకువ్ రా నువ్వు! అమెరికాలో కోట్లు కమాయించిండు మీ నాయన! దేన్ని గరించి? మీ ఫామిలీ మొత్తం హాపీ గుండాల్ననే కదా- సమజయిందా?"

"సూపర్‌గా అయింది-"

"అయితే ఇయాళ్టి కెళ్ళి నా ఇంట్లోనే ఉంటావా?"

"నువ్ గెంటినా పోనంకుల్-"

"చానా హుషారున్నావ్ రా భయ్ నువ్వు- గింతమంచిగ రెస్పాన్స్ ఇస్తున్నావ్- మరి మీ నాయన నీ గురించి గట్ల పరేషానవుతాడేంది?"

"నాకూ అదే సమజ్ కావటం లేదంకుల్--"

"ఏంది? రివర్సొస్తున్నావా? ఇలారా సబిత ఆంటీని ఇంట్రడ్యూస్ జేస్త-" అంటూ అతని భుజం మీద చెయ్యేసి లోపలి హాల్లోకి తీసుకెళ్ళాడు. క్రోటన్స్ మొక్కలు ట్రిమ్ చేస్తోన్న ఆంటీ వాళ్ళను చూసి పలుకరింపుగా నవ్వింది.

"అయితే- కొనాకు మీ దోస్త్ కొడుకుని పట్టి తెచ్చినా వన్నమాట-" అంది హాపీగా.

"అవునాంటీ! జబర్దస్త్‌గా పట్టితెచ్చాడంకుల్-"

"మీ అంకులేంజేసినా అంతే- నా మారేజ్ అయినప్పటికెళ్ళి చూస్తున్నా కదా!"

"అంటే అంకుల్ మిమ్మల్ని జబర్దస్త్ మ్యారేజ్ చేస్తుకున్నాడా ఆంటీ?" ఇద్దరూ నవ్వారు.

జబర్దస్త్ మారేజేగానీ నేను జబర్దస్త్ జేస్తేనే అంకుల్ నాకు తాళి కట్టిండనుకో! లేకుంటే అంజలీ అనే పోరితో నడిపిస్తుండె..."

జైరాజ్ హాపీగా నవ్వాడు.

"థాంక్‌గాడ్- మేడమ్‌కి రజని అనే పోరితో నేను నడిపించిన కతలు సంగతి ఎరుకలేదు." నెమ్మదిగా భవానీ చెవిలో చెప్పాడు.

"ఇటున్నా- ఇంటున్నా" అంది ఆంటీ నవ్వుతూ "అవ్- నీపేరేంటి?" భవానీనడిగింది.

"భవానీ... అహహ- రాకేష్- రాకేష్-"

ఆమె ఆశ్చర్యంగా చూసింది.

"భవానీ రాకేషా?"'

"కాదాంటీ- మా ఇష్ట దైవం భవానీ తల్చుకుని పేరు చెప్పానన్నట్లు- నా పేరు ఓన్లీ రాకేష్-"

"ఇగో చూడు ఓన్లీ రాకేష్-"

"అహహ- ఓన్లీ ఇంటిపేరు కాదాంటీ- రాకేష్ - రాకేష్"

"చూడు రాకేష్! ఇయాల్టి కెళ్ళి ఈ ఇల్లు నీదనుకో! మిద్దెమీద నీకు సపరేట్ రూమున్నది. భోజనానికి వంటమనిషి భజన్రావున్నాడు. ఒక ముచ్చట్లు పెట్టుకోనికి రోజా ఉన్నది- రోజానీ కెరుకే గదా?"

భవానీ ఇబ్బందిగా నవ్వాడు "యా! యా! రోజా! రోజా! - నాకు తెలుసు- మోస్ట్ ప్లెజెంట్ గాళ్-" అన్నాడు తెలివిగా- ఎక్కువ వివరాల్లోకెళ్ళ కుండా తప్పించుకుంటూ-

"ఎప్పుడో చిన్నప్పుడు మీ ఇద్దరూ ఊటీ పబ్లిక్ స్కూల్లో జదివిన్రు! ఇప్పుడేం గుర్తుంటది?"

"ఆ! యాద్ కొచ్చిందాంటీ! ఊటీ పబ్లిక్ స్కూల్- ఎప్పుడూ నా జుట్టు పీకుతూండేది-"

"అహ్హహ్హ- ఇప్పటికీ అంతే! సేమ్ టు సేమ్- ఎవడైనా సరే నకరాల్జేస్తే జుట్టు పడతది-"

"చాలామంచి హాబీ- సూపర్ హాబీ! రాజకీయాలకు మంచిగా సూటవుతది-"

"యా! యా-"

"రోజా ఇప్పుడింట్లో లేదా ఆంటీ?"

"ఈ టైమ్‌లో ఏడుంటది? మాణింగ్ నైన్‌కెళ్ళి నైట్ నైన్ వరకూ టీవీ చానెల్‌లోనే ఉంటుంది."

"ఓ చానెల్లో జాబ్ చేస్తుందా?"

"జాబా! రోజాకేం ఖర్మ జాబ్ చెయ్యనికి! మా టీవీ చానెల్లోనే క్రియేటివ్ హెడ్‌గా వర్క్ చేస్తోంది..." అన్నాడు జైరాజ్.



భవానీశంకర్ ఛప్పున అండర్‌స్టాండ్ చేసుకున్నాడు.

"ఓ! అలాగా! వెరీనైస్ - మన చానెల్! పేరు- జస్ట్ ఫర్‌గాట్ - ఏంటబ్బా అది-"

"బృందావనం-"

"అవును! బృందావనం! నెంబర్‌వన్ తెలుగూ ఎంటర్‌టెయిన్‌మెంట్ చానెల్-"

"యా! అదే మన చానెల్ స్లోగన్ అనుకో! అంటే నువ్ మన చానెల్‌ని మంచిగా ఫాలో అవుతున్నావన్నట్లు-"

"నేనే కాదంకుల్- మెంటల్‌గా పూర్తి ఆరోగ్యంగా ఉన్న వాళ్ళెవరయినా సరే- బృందావనం చూడాల్సిందే-"

జైరాజ్ హాపీగా ఫీలయ్యాడు.

"యా! రోజా కోషిష్ గూడా అదే రాకేష్! డే అండ్ నైట్ కష్టపడుతున్నది గానీ వ్యూయర్ షిప్ పికప్ గావటంలే- యూనో- రోజా అమెరికాలో మాస్ కమ్యూనికేషన్స్ చేసింది-"

"వావ్! సేమ్ టు సేమ్- నేనూ అదే చేశా-"

"కానీ నువ్ చేసింది ఇండియాలో కదా-"

"యా! అక్కడ తేడా వస్తుంది-"

"బాగా తేడా వస్తుందిరా భయ్! కాస్తా, కూస్తాగాదు-"

"ఇక్కడి డిగ్రీ నాలిగ్గీసుకోనిక్కూడా పనికిరాదు-" అంది ఆంటీ-

"అవునాంటీ- అమెరికాది అందుకు బాగా పనికొస్తుంది-"

"యా- అక్కడికీ చాలా ఇంటిలిజెంట్ గాళ్ గనుక మొత్తం న్యూ అయిడియాస్‌తో- సూపర్ ప్రోగ్రామ్స్ క్రియేట్ జేస్తున్నది-"

"ఈ క్రియేటివ్ హెడ్‌లంతా అంతే ఆంటీ! దుమ్ము లేపుతుంటారు-"

"దుమ్మా?" అనుమానంగా అడిగాడు జైరాజ్.

"అదే అంకుల్! దుమ్మంటే రియల్‌గా రోడ్‌మీదుండే దుమ్ముకాదు- చానెల్ దుమ్మన్నమాట!"

"ఓకే మై బాయ్- నువ్వింక మిద్దెమీదకు పోయి నీ రూమ్‌లో రిలాక్సవ్వు- డిన్నర్ టైమ్‌కి కలుద్దాం- ఓకే-?"

"మోర్ దేన్ ఓకే అంకుల్-" తన కోసం ఎదురుచూస్తున్న నౌఖర్‌తో పాటు ఫస్ట్ ఫ్లోర్ మీద కెళ్ళాడు భవానీ-

* * *

అది బృందావనం టీవీ ఛానెల్ భవనం!

రోజా ఎండీ రూమ్‌లో కూర్చుని జనరల్ మేనేజర్ కే.కే బాకా తీసుకొచ్చిన చానెల్ రేటింగ్ చార్ట్ చూస్తోంది. మిగతా ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్స్ అంతా సెమీ సర్కిల్‌గా కూర్చుని ఉన్నారు.

ఒక్కొక్క అయిటమే చూస్తుంటే రోజా మొఖంలో కలర్స్ మారిపోతున్నయ్.

భక్తి కార్యక్రమాలు అంతవరకూ ఉన్న మూడోస్థానం నుంచి ఒక్కసారి అయిదోస్థానం లోకి జారిపోయింది.

"ఓగాడ్" అంది రోజా షాకయిపోతూ.

ఆ డైలాగ్‌తో అందరిలోనూ ఉత్కంఠ పెరిగిపోయింది.

ఏం దారుణం జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు.

"వైకుంఠం కార్యక్రమం ఒక్కసారిగా అయిదో ప్లేస్‌కి పడిపోయింది" అంది రోజా వినోదిని వేపు చూస్తూ.

వినోదిని మొఖం పాలిపోయింది.

"అంటే నా ఉద్యోగం ఊడిపోయే రోజు దగ్గరపడిందన్నమాట" అనుకుందామె.

"అయిదో ప్లేస్ అంటే తెలుసుగా? అందరి మొఖాలవేపూ చూస్తూ అడిగింది.

"తెలుసు మేడమ్ ఉన్నవే ఆరు ఎంటర్‌టెయిన్‌మెంట్ చానెల్స్! వాటిల్లో- అయిదో ప్లేసంటే- లాస్ట్ బట్ వన్" అన్నాడు జె.కే.! జే.కే. ఓవరాల్ ఇన్‌ఛార్జ్.

'ఇక సీరియల్స్ పొజిషన్' అంటూ మళ్ళీ చార్ట్ చూసింది రోజా. ఆమెకు కళ్ళు బైర్లు కమ్మినట్లనిపించినయ్.

నాలుగోస్థానం నుంచీ ఆరోస్థానానికి పడిపోయింది.

కోపం అణచుకోలేక ఆ చార్ట్‌ని కేకే బాకా మీదకు విసరేసింది.

కేకే బాకా గాల్లో ఎగుర్తూ వచ్చిన చార్ట్‌ని అతిలాఘవంగా పట్టుకున్నాడు.

"సీరియల్స్ పొజిషనేంటో నువ్వే చెప్పు వాళ్ళకు-"

కేకే బాకా వాళ్ళందరి వేపూ పాలిపోయిన మొఖంతో చూశాడు.

"మన చానెల్ లాస్ట్ పోజిషన్‌కి పడిపోయింది" అన్నాడు విషాదంగా.

అందరిలోనూ కలకలం చెలరేగింది.



"ఓగాడ్- సో బాడ్" అంది ఒకామె.

"అయ్ డోన్ట్ నో వాట్ వెంట్ రాంగ్" అన్నాడు జే.కే.!

"దీసీజ్ డిసాస్ట్రస్!" అన్నాడు మూర్తి.

మిగతా ప్రోగ్రామ్స్ అన్నీ కూడా అడుగంటి పోవటం చూసేసరికి అందరూ సైలెంటయిపోయారు.

"మీరందరూ ఏమాలోచిస్తున్నారో నాకు తెలుసు!" అంది రోజా.

అందరూ భయపడిపోయారు.

ఎందుకంటే ఎవరికి వాళ్లు వెంటనే ఈ చానెల్ వదిలి ఇంకో చానెల్‌లోకి దూకేయాలనే ఆలోచిస్తున్నారు.

"ఎలాగయినా మన చానెల్ కోసం కష్టపడి మళ్ళీ కనీసం నాలుగోస్థానాని కయినాతేవాలని అనుకుంటున్నారు-" అందామె.

"అవును మేడమ్-" అన్నాడు కేకే

"నామైండ్ వాయిస్ కరెక్ట్‌గా గెస్ చేశారు మేడమ్- కాకపోతే నేను మన ఛానెల్‌ని సెకండ్ ప్లేస్‌కి తేవాలని డిసైడ్ చేశాను-"

అందరూ అదే అభిప్రాయం వెలిబుచ్చారు.

"ఓకే లెటజ్ రీడెడికేట్ అవర్ సెల్వ్స్ టు ది అఫ్‌లిఫ్ట్‌మెంట్ ఆఫ్ ది చానెల్" అంది రోజా ఆవేశంగా.

అందరూ "యా" అరచారు.

సమావేశం ముగిసిపోయింది.

కానీ రోజా మనుసులో ఇంకా అనుమానం తొలుస్తూనే ఉంది! నిజంగా చానెల్‌ని మళ్ళీ పైకి తేవటం సాధ్యమా?

కొంచెం వర్రీడ్‌గానే ఇంటి దగ్గర కారు దిగిందామె.

* * *

రూమ్‌లోకెళ్ళగానే ముందు రాకేష్ సెల్‌కి రింగ్‌చేశాడు.

ఠక్కున మాట్లాడాడు రాకేష్

"హాయ్ భవానీ! నీ ఫోన్ కోసం సస్పెన్స్‌తో ఛస్తున్నాను- ఇంతకూ కిడ్నాప్ చేసిందెవరు?" ఆత్రుగా అడిగాడు రాకేష్.

"మీ డాడీ ఫ్రెండ్ జైరాజ్–"

రాకేష్ ఒక్కసారిగా రిలాక్స్‌యిపోయాడు.

"ఓ! జైరాజంకుల్! బెస్ట్ అంకుల్ ఇన్ ది వరల్డ్! కొంచెం తిక్కగా ప్రవర్తిస్తూంటాడు. అయినా– స్టిల్ ది బెస్ట్ ఇన్ ది లాట్–" అన్నాడు హాపీగా.

"యా! నేనూ అదే అనుకుంటున్నా–"

"ఎలా వుంది లైఫక్కడ? నువ్ రాకేష్ కాదన్న అనుమానం రాలేదా వాళ్ళకి?'

"హాఫ్ ఇంచ్‌కూడా రాలేదు– మిత్రమా! ఇక్కడ లైఫ్ ఎంత లగ్జరియస్‌గా ఉందో తెల్సా! సెకండ్ హాండ్ సెవెన్‌స్టార్ హొటల్లో ఉన్నట్లుంది!"

"గదే మళ్ళా తలాబ్ కట్టాదైలాగంటే! నా ఇల్లుగింత మంచిగుంటే సెకండ్ హాండ్ సెవెన్ స్టారంటావ్?"

ఆ డైలాగ్‌విని ఉలిక్కిపడి పక్కకు తిరిగి చూశాడు భవానీ. జైరాజ్ గడపలో నిలబడి ఉన్నాడు.

భవానీ కంగారుపడ్డాడు.

ఓపక్క రాకేష్ ఇంకా మాట్లాడుతూనే ఉన్నాడు.

"సూపర్ ఎరేంజ్‌మెంట్ రా తంబీ! నువ్ నా పేరుతో అక్కడే సెటిలయావనుకో! డబుల్ ధమాకా! నేను హాపీగా బాంబే– హైదరాబాద్ ట్రిప్పులు కొడుతూ నా గాళ్‌ఫ్రెండ్‌కి కంపెనీ ఇస్తూంటా! నువ్వేమో సూపర్ లగ్జరీస్ ఎంజాయ్ చేస్కో–"

"ఎవళ్తో మాట్లాడుతున్నావ్?" అడిగాడు జైరాజ్.

"నా గాళ్‌ఫ్రెండ్‌తో అంకుల్– ఎనీ ప్రాబ్లెమ్?"

"ఫస్టా, సెకండా?"

"ఫోర్త్–"

"సూపర్– ఎంజాయ్ లైఫ్ మై బాయ్– నా పాలసీ కూడా అందే!" వెళ్ళిపోయాడతను.

"ఎవర్తో మాట్లాడుతున్నావ్ అక్కడ?" అడిగాడు రాకేష్.

"జైరాజంకుల్– సూపర్ పర్సనాలిటీ– వెళ్ళిపోయాడ్లే–"

"హెన్‌పెక్డ్ కేటగిరీలే! ఆంటీని మస్కా కొట్టావంటే అంకుల్‌ని నీ బానిసగా చేసుకుని ఆడుకోవచ్చు–"

"మంచి క్లూ బ్రదర్! అవసరమొచ్చినప్పుడు దున్నుకుంటాలే–"

"నీ ఇష్టమొచ్చినంత కాలం అక్కడే ఉండిపో! దాంతో మా డాడీ నేను చాలా



బుద్ధిమంతుడయిపోయాననుకుని హాపీగా ఫీలవుతాడు. నేనిక్కడ నా డార్లింగ్ మోనికాను మారేజ్జేసుకుని– పిల్లల్నికంటూ జగమే వెన్నెలా సాంగ్ వేసుకుంటూంటా!

"అది సరేగాని బ్రదరూ– జైరాజంకుల్ డాటర్ రోజా సంగతేంటి? మీ ఇద్దరూ చిన్నప్పుడు ఊటీ పబ్లిక్ స్కూల్లో చదివారంట కదా" రాకేష్ పగలబడినవ్వాడు.

"యా– యా! అదొకమెంటల్ కేస్! నా మీద బాసిజం చేయడానికి ప్రయత్నించేది. ఇద్దరికీ క్షణం పడేది కాదు. దాన్ని నేను "ఉల్లిపాయ" అనే నిక్‌నేమ్‌తో పిలచేవాడిని–"

"ఉల్లిపాయేంటి?"

"అంటే ఎప్పుడూ ఏడుపని అర్థం– ఎప్పుడూ ఎదుటివాడి మీద ఏడ్చేది కదా?"

'ఒండర్‌ఫుల్ బ్రదర్– సూపర్ నిక్‌నేమ్–"

"ఓకే– ఉంటా– అక్కడేమయినా ప్రాబ్లెమ్ వస్తే కంటాక్ట్ చెయ్–"

"అంతవరకూ ఎవరిదారి వాళ్ళదేనా?"

"ఎనీ డౌట్?"

"ఓకే– సీయూ–"

"దోస్త్ హు తో ఐసా–"

సెల్‌కట్ అయింది.

అదే సమయానికి జైరాజ్ దినేష్‌తో మాట్లాడుతున్నాడు.

"ఇంక నువ్వేం ఫికర్ జెయ్యకురా భయ్– రాకేష్ చాలామంచి పోరగాడురా! నాయింట్లోనే కొన్ని దినాలుంచుకుని వాడికి బ్రెయిన్ వాష్ చేసి– అమెరికా పంపుతా! ఏమంటున్నా?"

"ఇంకోపని గూడా జేయాల్రా నువ్వు!"

"ఏందది?"

"ఎలాగయినాగానీ ఆడా మోనికా అనే పోరిని మర్చిపోవాలె! వానికి నీ కూతురు రోజాతో మంచిగ దోస్తానా జేయించానావనుకో! రోజాతోనే లవ్‌లో పడతాడు. ఈ పోరగాళ్ళ సంగతి నీ కెరుక లేందేమున్నదిరా! కొత్త పోరిదొరికితే పాతదాన్నొదిలేస్తారు– అవునా కాదా?"

జైరాజ్ పగలబడి నవ్వాడు.

"అవ్! పెండ్లికి ముందు మనదందా గట్లనే ఉండె గదా–"

"థాంక్యూ రా భయ్– దినాం ఫోన్ జేస్తూంటా– ఏడవకు–"

జైరాజ్ సెల్ బంద్ జేసి విస్కీ బాటిల్ ఓపెన్ చేశాడు.

అప్పుడే రోజా ఇంట్లోకొచ్చింది.

"హాయ్ డాడ్..."

"హాయ్ బేబీ– ఏందియాళ లేటయింది?"

రోజా మాట్లాడకుండా సోఫాలో కూర్చోవటం చూసేసరికి జైరాజ్‌కి మొదటి పెగ్ నిషా దిగిపోయింది.

"అరె– సప్పుడు జేయవ్? ఏమాయె– గట్ల సైలెంట్‌గున్నావ్?'

"చాలా పెద్ద ప్రాబ్లెమ్ వచ్చింది డాడ్–"

అప్పుడే లోపల్నుంచి వచ్చిన సబిత ఆ డైలాగ్ విని భయపడిపోయింది.

"ఏంది బిడ్డా! ఏంది ప్రాబ్లెమ్?" ఆత్రుతగా అడిగింది.

"మన చానెల్ ప్లేస్ ఇంకా కిందకు జారింది–"

"అంటే మొల్తాడు తెగితే చెడ్డీ – లెక్క– మొత్తం కిందకా?" గాబరాగా అడిగాడు జైరాజ్.

"అవును డాడ్!" ఇప్పుడు మనదే నెంబర్ 'సిక్స్' చానెల్–"

"ఓ గాడ్ – అంత ఫాస్ట్‌గా ఎట్లా పడింది? లాస్ట్ మంత్‌ల నెంబర్ త్రీ పొజిషన్ అంటివి గదా?"

"అవును! ఇంత ఫాస్ట్‌గా ఎలా స్లిప్ అయామో– నాకే అర్థం కావటం లేదు–" విచారంగా అందామె.

"దాన్దేమున్నది– కోషిష్ జేస్తే మల్లీ పైకి రావచ్చు కదా?" అడిగింది సబిత.

జైరాజ్ తల అడ్డంగా ఊపాడు.

"నీకు సమజ్ గావటంలేదే! నెంబర్ త్రీ పొజిషన్‌లో ఉన్నప్పుడే మన చానెల్ నష్టాల్లో నడుస్తుండె! గిప్పుడిక లాస్ట్ అంటే ఒక్క యాడ్ కూడా మన చానెల్ కియ్యరు. మనం ఇన్‌వెస్ట్ జేసిన పైసలన్నీ పోయినట్లే–"

ఆ మాటతో పొజిషన్ సబితకు అర్థమయి, గుండె పట్టుకుని గాబరాగా కూర్చుండిపోయింది.

పెట్టిన పెట్టుబడి పోవటమంటే మాటలు కాదు. ఇంచుమించుగా ప్రాపర్టీ మొత్త పోయినట్లే– ఫామిలీ రోడ్‌న పడాల్సిందే–

సబితకు కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్–



కాస్తా, కూస్తా కాదు! ఎనభయ్ కోట్లు–

ముగ్గురూ సైలెంట్‌గా కూర్చుని ఉండగా భవానీ డైలాగ్ వినిపించింది.

"హాయ్ రోజా! నేనెవరో చెప్పుకో చూద్దాం–"

రోజా తలెత్తి భవానీని చూసి ఆశ్చర్యంగా లేచి నిలబడింది. గుర్తు తెచ్చుకోడానికి ఎంత ప్రయత్నించినా అతనెవరో ఏమాత్రం గుర్తురావటం లేదు.

"సారీ! అయ్ కాన్ట్‌రిమెంబర్–" అంటూ తండ్రి వేపు చూసింది.

"ఆదేంది? నీ బచ్‌పన్ కాదోస్తనే గుర్తుపట్టవా?" అడిగా జైరాజ్ హాపీ మూడ్‌లో కొస్తూ.

రోజా కన్‌ఫ్యూజయింది.

"బచ్‌పన్ కా దోస్తంటే..."

సబిత చెప్పేస్తూంటే భవానీ వారించాడు.

"నువ్ చెప్పద్దాంటీ– నేనే ఒక క్లూ ఇస్తా–" అంటూ రోజా దగ్గరకొచ్చి ఆమె చెవిలో "ఏయ్ ఉల్లిపాయ! ఇంత త్వరగా నన్నెట్లా మర్చిపోయావే?" అన్నాడు సీక్రెట్‌గా.

ఉలిక్కిపడింది రోజా–

అతనిని ఎగ్జయిట్‌మెంట్‌తో చూసింది.

"ఓగాడ్! నువ్ రాకేష్ వా?"

"ఏం డౌటా?"

"నువ్ రాకేష్ లాగా లేవు–"

"రాకేష్ నయితే కదా – అలా ఉంటానికి–"

"అంటే?"

"పదేళ్ళకిందటి రాకేష్ వేరు నేను వేరు – చాలా మారిపోయాను కదా! అసలు నా రూపమే మారిపోయింది–"

"యా– యా అదే నేనూ ఫీలవుతున్నా–"

"నువ్ మాత్రమేం తక్కువేంటి? నేను కాబట్టి గుర్తుపట్టాను గానీ– అదే ఇంకెవరయినా అయితే ఇంకోదాన్ని వెతుక్కునే, వాడు!" రోజా అతని డైలాగులకు కొంచెం అనీజీగా ఫీలయింది.

"నువ్ కొంచెం డిగ్నిఫైడ్‌గా మాట్లాడితే బావుంటుంది–" అంది కోపం అణచుకుంటూ.

జైరాజ్ వెంటనే వివరణ ఇచ్చాడు.

"రోజా జరంత ఇంటలెక్చువల్ టైప్ అనుకోరాదు? లాంగ్వేజ్, బిహేవియర్– అన్నీ అమెరికా టైపన్నట్లు!"

వెంటనే సబిత అందుకుంది.

"రోజా లెవలే వేరు రాకేష్– గివ్ రెస్‌పెక్ట్ అండ్ టేక్ రెస్‌పెక్ట్ టైప్–"

"ఓ! నౌ అయ్ అండర్‌స్టుడ్! చిల్లర్ టైప్‌ని లైక్ చేయదన్న మాట! అయితే ఇండియాలో ప్రాబ్లెమే– పాపం! అవునా రోజా–"

"యా! యా! బిగినింగ్‌లో కొంచెం ప్రాబ్లెమ్ అయింది. కానీ స్లోగా మా చానెల్ వాళ్ళందరినీ ఎడ్యుకేట్ చేసి ఒక లెవల్‌కి తీసుకురావడానికి చాలా శ్రమపడాల్సి వచ్చింది–" గర్వంగా చెప్పింది రోజా.

"వావ్! యూ ఆర్ రియల్లీ గ్రేట్! ఒబామాకి నీ లెవల్ తెలుస్తే పరేషానవుతాడు! ముల్కీ రూల్స్ కాన్సిల్ జేసి ఇండియన్ ఆమెరికన్ పోరిలు జిందాబాద్ అంటాడు–"

రోజాకి ఆ డైలాగ్ కూడా నచ్చలేదు.

"ఆ లూజ్ టాకే నాకిష్టం ఉండదు" అంది చికాకుగా.

"ఓ సారీ! ఏం చేస్తాం! ఆదత్ సే మజ్ బూర్ హై!"

"ఈ ఇండియన్ బిహేవియర్ అంతేనమ్మా! ఇక్కడి వాళ్ళ పూర్వీకులు ట్రైబల్స్ కదా!" సర్ది జెప్పటానికి ప్రయత్నించాడు జైరాజ్.

"పదమ్మా! అందరం కలసి భోజనం చేద్దాం! రాకేష్ కూడా నీకోసం వెయిట్ చేస్తూ భోజనం చేయలేదు–" అంది సబిత.

"అవును రోజా! భోజనం చేస్తూ మనం మన ఎగ్జయిటింగ్ ఓల్డెన్ డేస్ గురించి గుర్తు తెచ్చుకోవాలి–" అన్నాడు భవానీ ఉత్సాహంగా.

రోజాకి ఆ ప్రపోజల్ నచ్చినట్లు లేదు.

"అయామ్ టూ టైర్డ్ మమ్మీ! మీల్స్ నా రూమ్‌కి పంపించు–" అంటూ లేచి తన రూమ్ వేపు వెళ్ళిపోయింది.

"ఈ అమెరికా పిచ్చోళ్ళతో ఇదే ప్రాబ్లెమ్! ఇక్కడి జనం బిహేవియర్‌ని అస్సలు భరించలేరు–" అన్నాడు భవానీ స్వగతంగా. లోపల్నుంచీ ఆ డైలాగ్ విన్న రోజాకి కోపం ముంచుకొచ్చింది–

"వ్వాట్? అమెరికా పిచ్చోళ్ళా?" కోపంగా అడిగాడు జైరాజ్–



"అహహ– అంటే నా ఉద్దేశ్యం–"

"ఇంటలెక్చువల్స్ అనాలి! కరెక్ట్ వర్డ్ యూజ్ చేయటం నేర్చుకో!" చిరాకుపడ్డాడు జైరాజ్.

"రెండింటికీ తేడా ఏముంది లే అంకుల్! ఇద్దరూ ఒకటే– అయ్ మీన్ ఆల్ మో స్టాల్–"

జైరాజ్ కోపం ఇంకొంచెం ఎక్కువయింది గానీ భవానీ అప్పటికే డైనింగ్ టేబుల్ దగ్గరున్నాడు.

* * *

ఆ రాత్రంతా రోజాకి నిద్రపట్టలేదు. తండ్రితో చాలా డబ్బు ఇన్‌వెస్ట్ చేయించి ఆ చానెల్ పెట్టించింది. జస్ట్ యాభై కోట్లు పెట్టుబడి పెడితే– ఇంకో యాభై బాంక్ లోన్ వస్తుందనీ– ఆ తర్వాత చానెల్ మీద నెలకు పాతిక కోట్లు లాభం వస్తుందనీ ప్రాజెక్ట్ రిపోర్ట్‌లో ఉంది.

జైరాజ్ కూడా ప్రాజెక్ట్ రిపోర్ట్‌ని నమ్మి డబ్బుపెట్టేశాడు. అదీగాక ఉన్నది ఒక్కగానొక్క కూతురు.

చిన్నప్పటినుంచీ రోజా ఏ ఆటవస్తువడిగినా కొనివ్వటం అతనికలవాటే ఇదీ అలాంటిదే! కూతురు ఇష్టపడిన ఆటవస్తువు– కాపోతే ధరకొంచెం ఎక్కువ–

రోజా అదే ఫీలవుతోంది.

ఇప్పుడు ఆ వందకోట్లల్లో ఒక్క పైసా కూడా తిరిగి రాదంటే తన తల్లిదండ్రులు ఎంత అప్సెట్ అవుతారో అన్న ఆలోచనతో ఆమె అప్సెట్ అయిపోయింది.

దాంతో తెల్లారేసరికి జ్వరం వచ్చేసింది.

కూతురు కండిషన్ చూసి జైరాజ్ దంపతులు కంగారుపడిపోయారు.

"డబ్బుపోతే పోనీబిడ్డా! నేను సంపాదించిన పైసలన్నీ ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్‌ల ఫ్రాడ్ జేసి సంపాదించిందే! మేనత్ జేసి సంపాయించిందా, ఏంది– పరేషానవనికి!" అంటూ రోజాని ఓదార్చాడు జైరాజ్. కానీ అతను చాలా కష్టపడి– ఒక లిక్కర్ ఇండస్ట్రీ పెట్టి అబద్ధాలు చెప్పి– దాన్ని సక్సెస్ చేసి డబ్బు సంపాదించాడని రోజాకి తెలుసు. అయినా రోజా దిగులు పడటం మానలేదు.

"చానెల్‌ని చాలా హైస్టాండర్డ్‌లో మెయింటెయిన్ చేశాను డాడీ! సెన్సేషనలిజం లేకుండా, అశ్లీలం, అబద్ధాలు లేకుండా ప్రోగ్రామ్స్ డిజైన్ చేయించాను– మన కల్చరల్

వాల్యూస్, మన సంప్రదాయాలు అన్నీ రిఫ్లెక్ట్ అయే సీరియల్స్ రన్ చేయిస్తున్నాను. అయినా అవి ఆడియెన్స్‌ని ఎందుకు ఎట్రాక్ట్ చేయటం లేదో నాకు అర్థం కావటం లేదు–"

"ఇంకా ఆ విషయాల గురించి ఆలోచించెడిది బంద్ జేయ్ బిడ్డా! నువ్ కంప్లీట్‌గా రెస్ట్ తీసుకో– కొద్ది దినాలు– ఈ చానెల్ దిక్కుకెళ్ళి రాత్రింబగళ్ళు టెన్షన్ ఎక్కువయిపోయింది" అంది సబిత.

రోజా నవ్వింది.

"బెడ్‌రెస్ట్ తీసుకోవాలా? మంచిగున్నావ్ మమ్మీ! నేను ఒక్కరోజు ఆఫీస్ కెళ్ళకపోతే చానెల్ ప్రోగ్రామ్స్ అల్లకల్లోలమయిపోతయ్–"

జైరాజ్ షాకయ్యాడు.

"ఏంటి? ఇంత జ్వరం పెట్టుకుని చానెల్ కెళ్తావా? నోవే! కావాలంటే నేను వెళ్ళి అక్కడ కూర్చుంటాను– ఫోన్‌లో నీతో మాట్లాడి అన్నీ సెట్ చేస్తాను– డోంట్ వర్రీ!"

"సడెన్‌గా ఎంటరయి మానేజ్ చేసే జాబ్ కాదు డాడీ అది–"

"నాకు తోడుగా రాకేష్‌ని కూడా తీసుకెళ్తాన్లే– డోంట్‌వర్రీ–"

"రాకేషా? చానెల్ వర్కింగ్ రాకేష్‌కి మాత్రం ఏం తెలుస్తుంది– వీళ్ళంతా న్యూస్ పేపర్లో రాసుకునే టైప్–"

"అది నీ ఫీలింగ్! ఎక్కడికెళ్ళి నా దున్నేయగలం అనేది నా ఫీలింగ్! చూశావా ఎంత తేడా ఉందో–"

రూమ్‌లో ఎంటరవుతూ అన్నాడు భవానీ–

రోజా తడబడింది–

"ఓ! నువ్విక్కడే ఉన్నావా?" అంది కొంచెం ఇబ్బందిగా ఫీలవుతూ–

"అంకుల్– నేను రడీ" అన్నాడు భవానీ!

"దేనికి?"

"దుమ్ము దులపడానికి–"

"వ్వాట్?"

"అర్థం కాలేదా? మన చానెల్ దుమ్ముదులపడానికి! వెళ్దామా మరి?"

"వెళ్ళిరాబిడ్డా! నీక్కూడా మంచిగ టైమ్‌పాసుంటది! అంది సబిత.

ఇద్దరూ బృందావనం చానెల్ చేరుకున్నారు.



ఎమ్‌డి రూమ్‌లో కూర్చోగానే హనుమంత్, రాధా ఛమేలీ, డాషింగ్ రంగా ఎంటరయారు.

"గుడ్ మాణింగ్‌సర్!" అన్నారందరూ వినయంగా.

"నమస్తే– నమస్తే– కూసోండ్రి! మీ డిటెయిల్స్ నాగ్గుర్తులేదుగానీ– మీలో ఎవళ్ళేం కొలువు జేస్తున్రో– ఈ రాకేష్‌కి జెప్పండ్రి! మా రోజాకి జరంత తబీయత్ మంచిగ లేదన్నట్లు! దాన్దిక్కు కెళ్ళి పద్దినాలు రాకేషే చానెల్ మానేజ్‌జేస్తాడు. సమజయిందా?"

వెంటనే హనుమంతు లేచి నిలబడ్డాడు.

"నేను వ్యూయర్స్ పార్టిసిపేషన్ ప్రోగ్రామ్స్ ఎగ్జిక్యూటివ్‌ని సర్–"

"ఓ! మీరేనా! ఒండర్‌ఫుల్! మీరేమేం ప్రోగ్రామ్స్ చేస్తూంటారు?"

"ఎన్నెన్నో జన్మల బంధం–" అంటే మన యాంకర్ ఒకో రోజుకో కాలనీ కెళ్ళి అక్కడి దంపతులందరినీ వాళ్ళ మారేజ్ గురించి ప్రశ్నలడిగి– వాళ్ళల్లో సినిమా పాటలకు బాగా డాన్స్ చేసిన దంపతులకు బహుమతులిస్తాం సార్–"

"చెత్త–" అన్నాడు భవానీ.

అతను షాకయ్యాడు.

"కానీ మన చానెల్ ప్రేక్షకులు ఆ ప్రోగ్రామ్ అద్భుతం అని తెగపొగుడుతున్నారు సార్–"

"వాళ్ళంతా మెంటల్ హాస్పిటల్ పేషెంట్స్ అయుంటారు–"

హనుమంతు మొఖం వాడిపోయింది. జైరాజ్ హాపీగా ఫీలయ్యాడు. ఆ ప్రోగ్రామ్ గురించి తన అభిప్రాయం కూడా అదే! రోజా ఫీలవుతుందని ఎప్పుడూ క్రిటిసైజ్ చేయలేదు.

"రెండో ప్రోగ్రాం–" దాగుడు మూ చీ" సార్– యాంకర్ రోజుకో రోడ్ సెలక్ట్ చేసుకుని దారిన పోయేవాళ్ళకు తను చానెల్ తాలూకూ అని చెప్పకుండా వాళ్ళను రకరకాలుగా ఇబ్బందిపెట్టి– వాళ్ళను ఫూల్స్‌గా చేసి– చివరకు అదంతా చానెల్ ప్రోగ్రామ్ అని చెప్పటం–"

"హరప్పా, మొహెంజోదారో–" అన్నాడు భవానీ–

హనుమంతుకి అర్థం కాలేదు–

"అంటే సార్?"

"అంతపురాతనం ఆ ప్రోగ్రాం– అదో శిథిలం!" ఆ తర్వాత ఇంక అతను మాట్లాడలేదు.

వెంటనే రాధా ఛమేలీ మాట్లాడింది.

"నేను మన చానెల్లో సీరియల్స్ అన్నీ డిజైన్ చేస్తూంటాను– అయామ్ క్రియేటివ్ హెడ్–ఫర్ సీరియల్స్"

"బెస్ట్ ప్రైమ్‌టైమ్ సీరియల్ ఏది?"

"గుప్పెడు మనసు జానెడు హృదయం–" టోటల్‌గా లేడీ ఓరియెంటెడ్ స్టోరీసర్! పెద్ద కోడలికీ– చిన్న కోడలికీ మధ్య రివెంజ్ డ్రామా! సూపర్ డూపర్ సక్సెస్ సర్–"

"రేటింగ్ ఎంత?"

"టూ పాయింట్ త్రీ సార్–"

"చిల్లర్–"

రాధముఖంలో కోపం కనిపించింది.

జైరాజ్ భవానీ కొట్టే ప్రతి డైలాగ్‌నీ ఎంజాయ్ చేస్తున్నాడు.

తర్వాత డాషింగ్ రంగా మాట్లాడాడు.

"రియాల్టీ షో చేస్తూంటాను సర్! ప్లస్ న్యూస్–"

"ఏంటా? రియాల్టీ షో–"

"ప్రతి తెలుగు సిటీలో ఒక సిటీ అయొడిల్‌ని సెలక్ట్ చేయటం సార్– చానెల్ మొత్తం మీద బెస్ట్ ప్రొగ్రాం సర్–"

"ఆముదపు చెట్టు–" అన్నాడు భవానీ–

తరువాత భవానీ మాట్లాడాడు.

"హాయ్! నాపేరు రాకేష్– డూ ఆర్ డై కేటగిరీ నాది! పది రోజుల్లో ఏదొకటి తేలిపోవాలి! తేల్చుకోడానికి రడీగా ఉన్నారా?"

వాళ్ళకేం అర్థం కాలేదు.

జైరాజ్ మాట్లాడాడు.

"మన చానెల్ లాస్ రోజు రోజుకీ పెరిగిపోతున్నది. మూడు నెలల్లో చానెల్ బంద్ జేయాల్సొస్తది! ఏమంటున్న! మూయనికి మదద్ జేస్తరో, నిలబెట్టనికి కోషిష్ జేస్తరో మీ ఇష్టం మళ్ళా!"

వాళ్ళు వెళ్ళి పోయాక భవానీతో మాట్లాడాడు జైరాజ్.

"రాకేష్! నేను క్లబ్‌కి పోతన్నా! సబిత, రోజా గిట్ల ఫోన్ జేస్తే ఈడనే ఉన్నానన్జెప్పి! ఈ చానెల్‌నేం జేస్తావో జేసుకో! ఎట్లయినా క్లోజ్ జేసేదే! ఎంత జల్దీ చేస్తే



అంతమంచిది నాకు– మస్తు పైసలు బచాయించొచ్చు! నువ్వేమయినా నీ అయిడియా ల్తోటి సుధరాయించనికి కోషిష్ జేస్తే చెయ్– ఏమంటున్న?"

"ఓకే అంకుల్– ఇంక నా కొదిలెయ్–"

"విష్ యూ బెస్టాఫ్ లక్–"

జైరాజ్ వెళ్ళిపోయాడు.

భవానీ శంకర్ రూమ్‌లో నుంచి బయటికొచ్చి న్యూస్ సెక్షన్‌లో కొచ్చాడు.

న్యూస్‌డెస్క్ సాయంత్రం ఆరుగంటల కొచ్చే న్యూస్ తాలూకూ విజువల్స్‌ని ఎడిట్ చేస్తున్నాడు. అప్పటికే రాకేష్ కొత్త బాస్ అని తెలిసి పోవడంతో అందరూ అలర్ట్‌గా ఉ న్నారు.

"ఆ హోమ్‌మినిష్టర్ క్లిప్పింగ్స్ ఏంటి?" అడిగాడు భవానీ ఆ విజువల్స్ చూస్తూ.

"హోమ్‌మినిష్టర్‌గారు తెలుగు ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు సార్–"

మొత్తం క్లిప్పింగ్ అంతా చూశాడు భవానీ–

"ఇది ఓకే– కానీ ఆడియో మార్చాలి–"

న్యూస్ డెస్క్ బాలాజీ ఫజిలయిపోయాడు.

"ఆడియో మార్చాలా?"

"అవును! డౌటా?"

"అదెలా సార్– అది ఆయన స్వంత గొంతు కదా– ఎలా మారుస్తాం?"

"మన చానెల్ మట్టి కొట్టుకుపోడానికి నీలాంటి బఫూన్లు కారణం మిత్రమా! మైండ్‌సెట్ మార్చుకో! మైక్‌సెట్ ముందు హోమ్‌మినిష్టర్ వాయిస్‌ని మిమిక్రీ చేసే మిమిక్రీ ఆర్టిస్ట్‌ని తీసుకురా!"

బాలాజీ గాబరా పడిపోయాడు.

"కానీ అసలు ఆయన ఆడియో మార్చాల్సిన అవసరం ఏమిటి సార్?"

"నీ ఉద్యోగం పోకుండా ఉండాలంటే ఇంకో జాబ్ కోసం నువ్ రోడ్ల వెంబడి పడకుండా ఉండాలంటే మార్చాల్సిన అవసరం ఉంది కామ్రేడ్!

"తెలుగు ప్రజలకునా విజయదశమి శుభాకాంక్షలు అని మామూలుగా తన స్వంత గొంతుకతో చెప్పాక వెంటనే" త్వరలోనే మీ అందరి ఆశీస్సులతో నేను మీకిచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించబోతున్నందుకు నాకెంతో ఆనందంగా ఉ

ంది అంటాడాయన–"

బాలాజీ షాకయ్యాడు.

"అదేంటి సార్– ఆ మాట ఆయన చెప్పలేదు కదా!"

"కానీ ఆయన చెప్పినట్లు మన మిమిక్రీ ఆర్టిస్ట్ చెప్తాడు బ్రదర్! అందుకే మనం మన మిమిక్రీ ఆర్టిస్ట్‌ని పిలిపించేది–"

"సార్! కొంపలు మునిగిపోతయ్–"

"నువ్ ఇప్పుడు మునిగిన కొంపలోనే ఉన్నావ్ కామ్రేడ్– ఈ కొంప ఇంతకన్నా ఇంకా మునగలేదు–"

"సారీ సార్– ఆ రిస్క్ నేను తీసుకోలేను–"

"నేను తీసుకుంటాను బాలాజీ– నీ వల్ల కాపోతే ఆ సీటు ఖాళీ చెయ్–" బాలాజీ వెంటనే లేచి ఆ పక్కనే ఉన్న ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ డాషింగ్ రంగా రూమ్‌లోకి పరుగెత్తి రంగాతోపాటు తిరిగి వచ్చాడు.

"వాటీజ్ ది మేటర్ సర్?" చాలా పొలయిట్‌గా అడిగాడు డాషింగ్ రంగా.

"మేటర్ తెలీనట్లు ఫోజొద్దు! నీ వల్ల అవుతుందా! బయటకు పోతావా? అయిదు లెక్కెట్టే లోపల తేల్చు– ఒకటి– మూడు–"

"ఆ యామ్ సారీ సార్– మీరు చెప్పింది – నేనే కాదు. ఈ చానెల్లో ఎవరూ చేయరు!"

"నాలుగు... అయిదు! యూ ఆర్ అవుట్ డాషింగ్ రంగా! ఎకౌంట్స్ ఆఫీస్‌కెళ్ళి– నీకు ఇవాళ్టి వరకూ రాసిన జీతం తీసుకునిఫో–"

"సారీ – నన్ను ఈ జాబ్‌లో నుంచి తీసేసే అధికారం ఎవరికీ లేదు– మిస్ రోజాగారికి తప్ప–"

"అయితే ఆవిడతోనే చెప్పుకో– ఇప్పుడు బయటకు వెళ్తావా! సెక్యూరిటీని పిలవమంటావా కామ్రేడ్–"

రంగా అతని లాంగ్వేజ్‌కి కన్ఫ్యూజయిపోతున్నాడు.

రోజాకి సెల్ జేయడానికి ప్రయత్నించాడు డాషింగ్ రంగా! కానీ సెల్ కవరేజ్ ఏరియాలో లేదు.

ఏం చేయాలో అర్థం కాక భవానీవేపు చూసేసరికి అతను కనిపించలేదు గానీ అతని ప్లేస్‌లోనే సెక్యూరిటీ వాళ్ళు కనిపించారు.



"సార్! మీరు రెసిస్ట్ చేయకుండా బయటికెళ్తే మంచిది సార్– లేకపోతే మెడమీద చేయివేసి మెయిన్‌రోడ్‌లోకి గెంటాల్సివస్తుంది–"

"వ్వాట్– ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌ని నన్నే మెడమీద చెయ్యేసి గెంటుతారా? అయ్ విల్ కాల్ పోలీస్–" మాట పూర్తికాకుండానే అతనిని ఈడ్చుకుంటూ మెయిన్‌రోడ్ మీదకు తీసుకెళ్ళి రోడ్‌మధ్య డివైడర్ మీద పడేశారు.

కిందనుంచి బట్టలు దులుపుకుంటూ లేచినిలబడే సరికి భవానీ శంకర్ అతని చేతికో కవర్ అందించాడు.

"బృందావనం చానెల్ నీ రుణం పైసల్తో సహా తీర్చేందుకు కంకణం కట్టుకుంది బ్రదర్! ఇదిగో ఈ కవర్లో నీ జీతం తాలూకూ చెక్ ఉంది– విజిలేసుకుంటూ ఇంటికెళ్ళిపో–"

కవర్ అతని చేతిలోపెట్టి భవానీశంకర్ వెళ్ళిపోతూంటే కసిగా పళ్ళుకొరికాడు డాషింగ్ రంగా–

"నీకు పిచ్చెక్కింది! డాషింగ్ రంగాకి ఆ డాషింగ్ అన్న పేరెందుకొచ్చిందో నీకింకా దెలీదు– నిన్ను సర్వనాశనం చేస్తా–" అని అరుస్తూంటుంటే ఒక వాన్ స్పీడ్‌గా వెళ్ళడంతో రోడ్‌మీదు చెరువులా ఉన్న డ్రైనేజ్ వాటరంతా అతనికి స్నానం చేయించేసింది.

తిరిగి తన రూమ్ కొచ్చేసరికి బాలాజీ భవానీ కాళ్ళ మీదపడ్డాడు.

"సార్! నన్ను కూడా గెంటించకండి సార్–"

"అయితే మరి మిమిక్రీ ఆర్టిస్ట్‌ని పిలిపించావా."

"అవున్సార్– వచ్చేశాడు–"

భవానీ జేబులోనుంచి ఒక కాగితం తీసి అతనికిచ్చాడు.

"ఈ మేటర్‌ని హోమ్‌మినిస్టర్ చెప్పినట్లు చెప్పాలతను. మాట్లాడేప్పుడు లిప్స్ కరెక్ట్‌గా సింక్రనైజ్ అవాలి– ఓకే?"

"ఓకే సార్–"

"ఈ పని సక్సెస్‌ఫుల్‌గా చేశావనుకో! ఆ డాషింగ్ రంగా గాడి సీటు నీది– ఓకే?"

"థాంక్యూసర్–"

హడావుడిగా వెళ్ళిపోయాడతను.

భవానీ తిన్నగా కెమెరా యూనిట్ ఇన్ ఛార్జ్ దగ్గర కొచ్చాడు.

అతను ఠక్కున లేచి సెల్యూట్ కొట్టాడు. అప్పటికే డాషింగ్ రంగా మేటర్ తెలిసి స్టాఫ్ అంతా టెర్రరైజ్ అయిపోయారు.

"నీ పేరేంటి?"

"భాస్కర్ సర్–"

"భాస్కర్– వెంటనే ఒక కెమెరాని జూబిలీహిల్స్‌కి పంపించు!"

"అలాగేసర్– రమణా! కెమెరా తీసుకుని జూబిలీహిల్స్ వెళ్ళిపో–"

"ఓకే సార్–" అంటూ కెమెరా సర్దుకుంటున్నాడు రమణ. కాసేపమయిన తర్వాత రమణ సెల్‌కి రింగ్ చేశాడు భవానీ!

"జూబిలీహిల్స్ వెళ్ళి ఏం కవర్ చేస్తావ్?" రమణ నడిగాడు భవానీ–

"పొరబాటయింది– తెలుసుకోకుండా వచ్చేశాను–"

"గుడ్! మంచి బాలుడికి మొదటి లక్షణం అది! నీ బాస్‌ల మీద అంత గురి ఉంటే చాలు! ఎక్కడికో వెళ్ళిపోతావ్!"

"రోడ్ మీద కెళ్ళకుండా ఉంటే చాల్సార్–"

"ఓకే!– సరిగ్గా రాత్రి ఏడింటికి– అంటే ఇంకో అరగంటకి హోమ్‌మినిష్టర్ ఇంటి బయట రోడ్‌కి అవతల వేపు చెట్ల చాటున కూర్చుని హోమ్‌మినిష్టర్ ఇంటిని ఏడుగంటల నుంచి, ఏడున్నర వరకూ కవర్ చెయ్!"

"ఎందుకు సార్?"

"ఇలాంటి కొశ్చెన్సే– నిన్ను రోడ్‌న పడేసేది–"

"ఇంక మాట్లాడితే వట్టు సార్–"

* * *

బాలాజీ బృందావనం చానెల్ తాలూకూ లేటెస్ట్ న్యూస్ ప్రోగ్రాంలో వార్తలు టెలికాస్ట్ అవుతూంటే భయం భయంగా చూస్తున్నాడు.

హోమ్‌మినిష్టర్ అయిటమ్ రానే వచ్చింది.

తెలుగు ప్రజలందరికీ మన పెద్ద పండుగ దసరా సందర్భంగా నా శుభకాంక్షలు తెలుపుతున్నా! ఈ సందర్భంగా తెలుగు ప్రజల ఆశీస్సులు, కోర్కెల మేరకు త్వరలో నేను ముఖ్యమంత్రి పదవి నలంకరించడానికి హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం మీకు తెలియజేయడానికి సంతోషిస్తున్నా!"

బాలాజీకి కాళ్ళూ చేతులూ వణుకుతున్నయ్.

ముఖ్యమంత్రి పదవికోసం– ప్రస్తుత ముఖ్యమంత్రీ, హోమ్‌మినిష్టర్ సిద్ధారెడ్డీ



పోటీపడటం – హైకమాండ్ సిద్ధారెడ్డిని కొంతకాలం ఆగమని బుజ్జగించటం– బాలాజీకి తెలుసు–

వాళ్ళిద్దరికీ మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనటం కూడా అతనికి తెలుసు. ఆ పరిస్థితుల్లో ఇలాంటి స్టేట్‌మెంట్‌ని కావాలని మిమిక్రీ ఆర్టిస్ట్‌తో చెప్పించటం చాలా సీరియస్ మేటరవుతుంది. అలాంటి బోగస్ న్యూస్– కావాలని వక్రీకరించి– టెలికాస్ట్ చేయటం ఒక క్రైమ్. తనమీద ముఖ్యమంత్రి చెంచాలు క్రిమినల్ కేస్‌లు పెట్టినా పెట్టవచ్చు.

అతనూహించినట్లే స్టేట్ అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. సిఎమ్ కార్యాలయంలో ఫోన్లన్నీ ఇన్‌కమింగ్ కాల్స్‌తో జామ్ అయిపోయాయ్. సెల్‌ఫోన్స్ నెట్‌వర్క్ లన్నీ జామ్ అయాయ్. వాటితోపాటు బృందావనం చానెల్ ఫోన్లన్నీ కూడా మోతెక్కి పోతున్నయ్.

ఎవరికి వాళ్ళే ఫోన్ తీయడానికి భయపడుతున్నారు. ఆపరేటర్ ఒక్కర్తే ఫోన్ అందుకుంటోంది.

"హలో! బృందావనం చానెల్"

"ఏయ్! నేను హోమ్‌మినిష్టర్ని మాట్లాడతన్నా– ఏడీ– నీ ఏమ్‌డిని ఫోన్‌లోకి రమ్మను–"

"ఎండీకి జ్వరం సార్– చానెల్‌కి రాలేదు–"

"అక్కడ ఇన్‌ఛార్జ్ ఎవరుంటే ఆళ్ళని మాట్లాడమను–"

ఆమె భయంగా భవానీ రూమ్‌కి కనెక్ట్ చేసింది.

"గుడ్ మాణింగ్! నేను ఛానెల్ ఇన్‌ఛార్జ్ రాకేష్‌ని మాట్లాడుతున్నా!"

"రాకేష్– న్యూస్‌లో నేను మాట్లాడని మాటలన్నీ మాట్లాడినట్లు చూపించారేంటి? ఎలా జరిగిందది?"

"సారీ సార్– నేనే ఇప్పుడు జరిగిన పొరబాటు గురించి మీకు ఫోన్ చేసి క్షమార్పణలు చెప్దామనుకుంటున్నా సార్–"

"ఇదిగో– నీకేమయినా తెలివుందా? ఏందయ్యా నువ్ మాట్లాడేది? అలాంటి పొరబాట్లెలా జరుగుతాయ్?"

"సార్ జరిగిందేంటంటే రెండేళ్ళ క్రితం ఎలక్షన్స్ అవగానే మీరే ముఖ్యమంత్రి అవుతారని మీరు అనుకున్నారు గద్సార్– ఆ టైమ్‌లో మీరు మాట్లాడిన క్లిప్పింగ్‌ని పొరబాటున మా వాళ్ళు ఇవాళ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్స్‌కి జత చేశారు సార్– ఇది టోటల్‌గా మా స్టాఫ్ ఫాల్ట్ సార్! ఇంత పెద్ద పొరబాటు చేసిన మా ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్

డాషింగ్ రంగాని వెంటనే ఉద్యోగంలో నుంచి డిస్మిస్ చేశాం సార్–"

"అదంతా నాకెందుగానీ జరిగినదంతా పొరబాటున జరిగిందనీ– నిజానికి ఆ స్టేట్‌మెంట్ రెండేళ్ళ కిందటి దనీ– మళ్ళీ చానెల్లో ఎనౌన్స్ చేయించు–"

"వీలయినంత త్వరగా ఆపని చేయిస్తాను సార్– మా పొరబాటుకి ఇంకొక్క సారి క్షమించమని అడుగుతున్నా సార్–"

"ఓకే ఓకే– త్వరగా కానీ–"

ఫోన్ పెట్టేసేప్పటికి ఎదురుగ్గా మొత్తం స్టాఫ్ అందరూ భయంగా చూస్తూ కనిపించారు.

"రోడ్ ఇంజన్ కిందపడ్డట్లు ఏంటా ఫేస్‌లు?" అడిగాడు భవానీ.

"హోమ్‌మినిస్టర్ క్లిప్పింగ్ ఎత్తేయమంటారా సార్?"

"ఎవడా కొశ్చెనేసింది?"

"నేనే సార్–" బాలాజీ ముందుకొచ్చాడు.

"ఇదిగో– ఒరే బాలాజీ నీకిందాకేం చెప్పాన్రా?"

"చెప్పింది చెయ్యమన్నారు సార్–"

"మరి చెప్పందే ఆ లూజ్‌టాక్ ఏంట్రా?"

"మరి హోమ్‌మినిస్టర్‌గారు మీతో...."

"ఆళ్ళేం చెప్తే అదే చూపించడానికి దూరదర్శనుంది కదరా! మళ్ళీ మన ప్రైవేట్ ఛానెల్స్ ఎందుకురా?"

"నా కర్థం కాలేదు సార్–"

"మొత్తం మన ఇతర ప్రోగ్రామ్స్ అన్నీ ఆపి ఇందాక టెలికాస్ట్ చేసిన హోమ్‌మినిస్టర్ క్లిప్పింగ్సే– ఒక గంటపాటు – రిపీట్ చేసెయ్– అంతేగాకుండా పెద్ద అక్షరాలతో అదే డైలాగ్ స్క్రోలింగ్ చేయించు మేటరర్థమయిందా?"

వాళ్ళంతా మతిపోయినట్లు ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు.

"సార్– మన కొంపల మీదకొస్తుంది సార్–" భయంగా అన్నాడు భాస్కర్.

"అక్కడే నీకూ నాకూ తేడా వస్తుంది! మేటర్ మన కొంపల మీదకు ఎప్పుడో వచ్చింది. వందకోట్ల లాస్ అంటే అదే– మీలో ఎవడికే ప్రాబ్లెమ్ వచ్చినా నాపేరు చెప్పండి– అవతలో దెవడయినా సరే– నేను చూసుకుంటా– ఇంకేవయినా డౌట్లున్నయా?"

"లేనట్లే సార్"



"మరింకా ఎందుకు నిలబడ్డారిక్కడ– ఫోండి– మీ మొఖాలు చూడడం తప్ప నాకింకా వేరే పనేం లేదనుకున్నారా?"

అందరూ బయటికెళ్ళిపోయారు కంగారుగా–

అప్పుడే భవానీ సెల్‌మోగింది.

"హలో–"

"అన్నా నేను విజయ్ యాదవ్‌ని–"

"యస్ కామ్రేడ్– అంతా ఓకేనా?"

"అంతా ఓకే బాస్–"

"ఎంతమంది?"

"నాలుగు మోటర్ సైకిళ్ళు– ఎనిమిదిమంది–"

"ఇంకా లేటెందుకు మరి?– టాప్ లేపేయండి–"

ఫోన్‌కట్ చేసి మళ్ళీ రమణకి రింగ్ చేశాడు.

"సార్– రమణ–"

"ఎక్కడున్నావ్?"

"హోమ్‌మినిస్టర్ ఇంటిముందుండమన్నా–"

"ఇప్పుడు టీమ్ మొత్తం ఇంట్లో కెళ్ళండి– ఇందాక మన చానెల్లో టెలికాస్ట్ అయిన స్టేట్‌మెంట్– తనివ్వలేదనీ– బృందావనం చానెల్ వాళ్ళు చేసిన పొరబాటనీ హోమ్‌మినిస్టర్ గారి రిజాయిండర్ షూట్ చేయడానికి వచ్చామనీ చెప్పండి– వాళ్ళు వప్పుకుంటే ఓకే– లేకపోతే నాకు ఫోన్ చేసి చెప్పండి–"

"ఓకే సార్–"

వెంటనే రమణ, అతని ఇద్దరు అసిస్టెంట్లూ, ఒక జర్నలిస్టూ హడావుడిగా హోమ్‌మినిస్టర్ ఇంటివేపునడిచారు.

* * *

రోజా టెలిఫోన్ ముందు మండిపడుతూ కూర్చుని ఉంది. ఎదురుగ్గా డాషింగ్ రంగా నిలబడి ఉన్నాడు– బురద కొట్టుకుపోయిన ఆకారంతో– ఆమె కెదురుగ్గా ఉన్న టీవీలలో బృందావనం చానెల్లో హోమ్‌మినిస్టర్ క్లిప్పింగ్ పదేపదే చూపిస్తున్నారు. "నేను అక్కడికీ చెప్తూనే ఉన్నా మేడమ్! మన చానెల్‌ని రోజా మేడమ్ చాలా డిజిప్లిన్డ్

చానెల్‌గా డిజైన్ చేశారు. కాంట్రవర్సీస్‌గానీ, వివిధ వర్గాలకు ఇబ్బంది కలిగించే వార్తలుగానీ, ప్రజల మనోభావాలు దెబ్బతినేందుకు ఆస్కారం ఉన్న మేటర్‌గానీ టెలికాస్ట్ చేయగూడదు సార్- అని! కానీ వింటేనే? ఆ హోమ్‌మినిష్టర్ ఆడియో మార్చడానికి వప్పుకోలేదని నన్ను బయటకు గెంటించాడు మేడమ్-"

సబిత అతని మాటలు ఆశ్చర్యంగా వింటోంది.

"రాకేష్ గసంటి పోరగాడు కాదే-" అంటోందామె.

రోజాకి తిక్కరేగింది ఆ మాటలకు-

"మమ్మీ! నువ్వారికే మొఖాల్ని బట్టి మనుషుల్ని జడ్జ్ చేయకు! నాకెందుకో మొదటి నుంచీ ఆ రాకేష్ వాలకం నచ్చలేదు. పైగా అన్నీ తిక్కతిక్కగా మాట్లాడుతున్నాడు- నువ్వూ, డాడీ- చెప్పాక అబ్జెక్ట్ చేయటం బాగుండదని ఊరుకుండిపోయా!" అంది ఆవేశంగా.

అప్పుడే రోజా సెల్ మోగింది.

"హలో-" అందామె.

"హలో- నేను రేఖాని మాట్లాడుతున్నా రోజా-"

"హాయ్ రేఖా! ఎక్కడి నుంచి? హైదరాబాద్ వచ్చావా?"

"లేదే- వైజాగ్ నుంచి మాట్లాడుతున్నా! ఏంటి? ఇవాళ మీ చానెల్ ఇంకే చానెల్‌కీ దొరకని సెన్సేషనల్ న్యూస్ బ్రేక్ చేస్తున్నారు? వైజాగ్ రోడ్లమీద షాప్స్‌లో, హోటళ్ళల్లో జనం గుమికూడి మరీ మీ చానెల్లో ఆ హోమ్‌మినిష్టర్ స్టేట్‌మెంట్ చూస్తున్నారు- తెలుసా?"

రోజా షాకయింది.

అది తప్పుడు న్యూస్ అని చెప్పాలనుకుంది గానీ- అందువల్ల తమ చానెల్ పరువు ప్రతిష్టలు దెబ్బతింటాయని భయపడింది.

"ఓకే- ఓకే- ఇంకేంటి విశేషాలు?" అంటూ టాపిక్ డైవర్ట్ చేయడానికి ప్రయత్నించింది. త్వరగా ఆమెతో మాట్లాడటం ముగించి తండ్రికి మరోసారి ఫోన్ చేసిందామె.

అరగంట నుంచీ తండ్రి ఫోన్ అవుటాఫ్ కవరేజ్ ఏరియా అనటం వినబడుతోంది.

"డాడీ- ఏమైపోయారు మమ్మీ! ఫోన్ ఆఫ్ ఎందుకు చేశారు?" చిరాకుగా అంది.

సబిత కూతురిమీద జాలిపడింది.

"నువ్వారికే వర్రీ అవకు బిడ్డా! అసలే నీ తబీయత్ మంచిగ లేదు-"

"వర్రీ అవకుండా ఎట్లా ఉంటా మమ్మీ! అవతల మన చానెల్ తప్పుడు న్యూస్



టెలికాస్ట్ చేస్తోందని పబ్లిక్కి తెలిసిందంటే చానెల్ పరువుపోతుంది-"

సరిగ్గా అప్పుడే ఆమె సెల్‌ఫోన్లోకి జైరాజ్ వచ్చాడు.

"రోజా! నాకు ఫోన్‌గిట్ల జేసినావా ఏంది? పధ్నాలుగు మిస్డ్ కాల్స్ ఉన్నయ్-"

"అవును డాడీ! అరగంట నుంచీ ట్రై జేస్తున్నా-"

"ఏందిమ్మా? ఎనీ ప్రాబ్లెమ్?"

"ఆ రాకేష్ చేసింది చాలా పెద్ద క్రైమ్ డాడీ! అతను చేసిన పనికి నేను జైలు కెళ్ళాల్సివస్తుంది. తెలుసా?"

జైరాజ్ గాబరాపడ్డాడు-

"వ్వాట్? జైలా? ఏం చేశాడు రాకేష్?"

"కావాలని వేరే గొంతుతో మాట్లాడించి- హోమ్‌మినిష్టర్ స్టేట్‌మెంట్‌ని మార్చేసి టెలికాస్ట్ చేశాడు డాడీ- స్టేటంతా దానిమీద పెద్ద రియాక్షన్ వస్తోంది-"

జైరాజ్ గాబరాపడ్డాడు.

"అదేంది? గట్లెందుకు జేసిండు రాకేష్?"

"అంటే చానెల్లో ఏం జరుగుతోందీ కూడా మీకు తెలీదా? అసలు మీరు చానెల్ ఆఫీస్‌లో ఉన్నారా డాడీ?"

జైరాజ్ కంగారుగా తన చేతిలోని పేకముక్కలు పడేసి డ్రాప్ అన్నాడు.

"నేను చానెల్లోనే ఉన్నా- ఒకసారి రాకేష్‌ని కల్సుకుని మాట్లాడతాన్లే!" అన్నాడు భయంగా.

"యస్- వెంటనే ఆ హోమ్‌మినిష్టర్ క్లిప్పింగ్ టెలికాస్ట్ అవకుండా ఆపండి డాడీ!"

"ఓకే- ఓకే" అంటూ ఫోన్ కట్ చేసి బయటకు పరుగెత్తి కార్లో చానెల్ వేపు దూసుకుపోయాడు.

* * *

ఇప్పుడు మిగతా న్యూస్ చానెల్స్ అన్నీ బృందావనం చానెల్ టెలికాస్ట్ చేస్తున్న హోమ్‌మినిష్టర్ వీడియో క్లిప్పింగ్‌ని కాపీ చేసి వాళ్ళ చానెల్లో టెలికాస్ట్ చేయటం మొదలుపెట్టారు.

భవానీశంకర్ అది చూసి హాపీగా ఫీలయ్యాడు.

అప్పుడే జైరాజ్ హడావుడిగా లోపలికొచ్చాడు.

"ఏంది రా భయ్– ఏదో గడబిడ జేసినావంట–"

"అంకుల్! ఈ దినాల్లో ఏదొక గడబిడ చేయకుంటే– నెంబర్‌వన్ చానెల్ అవటం కష్టం! ఒక్కసారి చూడండి– రాష్ట్రమంతా పబ్లిక్ మన బృందావనం చానెల్ గుంపులు, గుంపులుగా గుమికూడి చూస్తున్నారు– మొత్తం ఎమ్మెల్యేలు, ఎంపీలూ– అందరూ మన చానెల్లో మనం చూపించిన వార్తల గురించే డిస్కస్ జేస్తున్నారు–"

"కానీ ఆ హోమ్‌మినిష్టర్ తల్చుకుంటే మనమీద క్రిమినల్ కేస్ గిట్ట పెట్టొచ్చు గదా!"

భవానీశంకర్ పగలబడి నవ్వాడు.

"క్రిమినల్ కేసులా? మంచిగున్నావంకుల్! మనదేశంలో కోర్ట్‌లెలా పనిచేస్తయ్యో మీకు తెలీదా? సల్మాన్‌ఖాన్ తాగి తనకారుతో నలుగురైదుగురిని లేపేసిన కేసేమయింది? అతని మీదున్న వైల్డ్ లైఫ్ కేస్ లేమయినయ్? దావూద్ ఇబ్రహీమ్ మీద కేసులేమాయె? రాజ్‌థాకరే మీద కేస్‌లేమాయె– టెర్రరిస్ట్ కసబ్ కేసేమయింది?"

జైరాజ్‌కి ధైర్యం వచ్చింది.

"అవ్! కేసుల గురించి నాకు బుగుల్లేదు గానీ– ఇంతకూ నువ్ జేసిన గడబిడేంది?"

భవానీ అతనికి జరిగిందంతా క్లుప్తంగా వివరించాడు.

"ఇప్పుడు చూడండి! మన బృందావనం చానెల్ పేరు మోగిపోతోంది. పబ్లిక్‌లో! మిగతా చానెల్స్ అన్నీ మన చానెల్ న్యూస్‌ని రికార్డ్ చేసుకుని వాళ్ళూ టెలికాస్ట్ చేస్తున్నారు– ఇలాంటి ట్రిక్స్‌తోనే మన చానెల్ వ్యూయర్‌షిప్ పెరుగుతుంది"

"చానెల్సన్నీ గొర్రెలెక్కున్నయ్యే–"

"ప్రస్తుతానికి గొర్రెలే అంకుల్– ఫ్యూచర్‌లో ఏమౌతాయో తెలీదు–"

జైరాజ్ ధైర్యంగా రోజాకి ఫోన్ కొట్టాడు.

"రోజా! రాకేష్ జరంత గడబడి జేసిన మాట నిజమేగానీ– నువ్వేం వర్రీ అవకు బిడ్డా! నేను సముజాయించుకుంటా గదా–"

రమణ కెమెరాతోపాటు హోమ్‌మినిష్టర్ ఇంటిముందున్న సెక్యూరిటీతో మాట్లాడుతూండగా సడెన్‌గా నాలుగు మోటర్ సైకిళ్ళు శరవేగంతో వచ్చి సడెన్ బ్రేక్స్‌తో ఆగినయ్. ఆగిందే తడవుగా నలుగురు యువకులు కిందకు దిగి తాము తెచ్చుకున్న కంకర్రాళ్ళు తీసి హోమ్‌మినిష్టర్ ఇంటి అద్దాలను పగుటగొట్టసాగారు.

రమణ ముందు షాకయినా వెంటనే కెమెరా ఆన్ చేసి ఆ రాళ్ళ దాడిని రికార్డ్



చేయటం మొదలు పెట్టాడు.

కొద్దిక్షణాల్లో మళ్ళీ మాయమయిపోయారు వాళ్ళు. పోలీసులు వెంటనే జీప్‌లో వాళ్ళను ఛేజ్ చేయడానికి ప్రయత్నించారుగానీ వాళ్ళ వల్ల కాలేదు.

మరుక్షణంలో రమణ ఫోన్ మోగింది.

భవానీ గొంతు విని ఎగ్జయిటయిపోయాడు రమణ.

"సార్! ఇక్కడో ఇన్సిడెంట్ జరిగింది–" అంటూ జరిగిందంతా చెప్పాడు.

"అయితే– ఇంక అక్కడేం చేస్తున్నావ్– వెంటనే చానెల్‌కొచ్చెయ్– నువ్ షూట్ చేసిన క్లిప్పింగ్ బ్రేకింగ్ న్యూస్‌లో చూపించాలి– కమాన్– అర్జంట్–"

మరో గంటలో బృందావనం చానెల్లో హోమ్‌మినిష్టర్ ఇంటి మీద కొంతమంది దుండగులు దాడి చేసి అద్దాలు పగలగొట్టిన దృశ్యం బ్రేకింగ్ న్యూస్‌లో టెలికాస్ట్ అయింది.

"హోమ్ మినిష్టర్ తనే ముఖ్యమంత్రి అవుతానన్న స్టేట్‌మెంట్ చూసి ఆవేశానికి గురయిన ముఖ్యమంత్రి వర్గీయులు కొంతమంది హోమ్‌మినిష్టర్ ఇంటి మీద దాడికి పాల్పడి ఉండవచ్చని ప్రజలు భావిస్తున్నారు" అంటూ కామెంటరీతోపాటు స్క్రోలింగ్ కూడా రన్ చేయించాడు భవానీ!

దాంతో మళ్ళీ బృందావనం చానెల్ చూట్టానికి రాష్ట్రమంతా జనం మూగిపోయారు.

ఆ విజువల్ చూస్తూనే రోజా ఉలిక్కిపడింది. మిగతా ఏ చానెల్స్‌కూ దొరకని ఆ క్లిప్పింగ్ బృందావనం చానెల్ కెలా దొరికిందో ఆమె కర్థం కావటం లేదు. అసలు ఆ టైమ్‌లో చానెల్ కెమెరా హోమ్‌మినిష్టర్ ఇంటి దగ్గరెందుకుందో ఆమెకి తెలీలేదు.

జైరాజ్ కూడా ఆశ్చర్యపోయాడు. ఎప్పుడూ లేంది తమ చానెల్లో ఇన్ని విచిత్రాలు ఎలా జరుగుతున్నాయో అర్థం కావటం లేదతని!

అదే భవానీ శంకర్ నడిగాడతను.

"ఇలాంటి గిమ్మిక్స్ చేయకపోతే మన చానెల్ ఎవరూ చూడరంకుల్– ఇప్పుడు చూడండి. పబ్లిక్ అంతా మిగతా చానెల్స్ వదలి మన చానెలే చూస్తున్నారు"

వాళ్ళు మాట్లాడుతూండగానే రాధా చమేలీ హడావుడిగా లోపలికొచ్చింది.

"సీరియల్ రావాల్సిన చంక్‌లో న్యూస్ చూబిస్తున్నారేంటి? సీరియల్ చూసే ప్రేక్షకులు గొడవ చేస్తారు కదా!" అంది చిరాగ్గా.

"సీరియల్ ఒక అరగంట లేటవుతే కొంప మునగదు మేడమ్. ఎవరూ ఆత్మహత్యలు చేసుకోరు– ఇంకో అరగంట లేటుగా సీరియల్ స్టార్టవుతుందని స్క్రోలింగ్ వేయించండి–"

"అయ్ డోన్ట్ లైకిట్– రోజా మేడమ్ కూడా ఇలా టైమింగ్స్ మార్చటం లైక్ చేయరు–" అంది కోపంగా.

"ఇది రైల్వే స్టేషన్ కాదు– ఏ టైమ్ కారైలు వచ్చిందా, లేదా అని చూట్టానికి! చానెల్– వ్యూయర్షిప్ ముఖ్యం! ప్రోగ్రాం కాదు– అర్థమైందా? ఇంగ్లీష్లో చెప్పనా?"

రాధా ఛమేలీ కోపంగా అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

జైరాజ్ హాపీగా అతని భుజం తట్టాడు.

"మంచిగ జెప్పినావ్ రా భయ్– నాకైతే ఆ సీరియల్స్ జరంత కూడా నచ్చలే!"

"కానీ రోజా అఫెండవుతుందేమో అంకుల్–"

"డోంట్వర్రీ– నేను జెప్తా కదా–"

సడెన్గా బృందావనం చానెల్లో హోమ్మినిష్టర్ ఇంటర్వ్యూ స్టార్టయింది.

"నా ఇంటిమీద ఎవళ్ళు రాళ్ళేసిన్రో నాకెరుక! అయితే ఆళ్ళని పట్టుకుని ఆళ్ళనోటితోనే చెప్పిస్తా! ఆ పని ఎవరు చేయించిన్రో–"

భవానీ హాపీగా ఫీలయ్యాడు.

"ఒండర్ఫుల్! అగ్గి రగులుకుందంకుల్! రేపట్నుంచీ మన చానెల్లో ప్రోగ్రామ్స్ అన్నీ ఇంత హాట్గా ఉండేట్లు చూద్దాం! అప్పుడుగానీ ప్రతి వారికీ మన చానెలంటే ఏంటో తెలీదు–"

అప్పుడే ఫోన్ మోగింది.

"అన్నా విజయ్ని–"

"కంగ్రాచ్యులేషన్స్! దుమ్ములేపేశారు–"

"థాంక్సన్నా–"

"పోలీసులు మిమ్మల్ని చూళ్ళేదు కదా!"

"వాళ్ళా? పగలు చూసినా దిక్కులేదు. ఇంక రాత్రిళ్ళు మొఖాలేం కనబడతయ్ వాళ్ళకి–"

"అందరూ డబ్బు పంచుకున్నారా?"

"నైట్కి అందరం మజా చేస్తున్నాం–"

"జాగ్రత్త– ఈ న్యూస్ గురించి మీలో మీరు కూడా డిస్కస్ చేసుకోవద్దు–"

"ఇంకేమన్నా గిసంటి డేరింగ్ ఫీట్స్ చేయాల్నంటే చెప్పన్నా! మొత్తం నిరుద్యోగుల బాచ్ కదా! పైసలు అవసరం!"



"డోంటవర్రీ! చేతి నిండా పనే ఇంక– రేపు ఇంకో పని చెప్తాలే! బై–"

ఆ రాత్రి భవానీ, జైరాజ్ ఇంటికి చేరుకునేసరికి రోజా నిద్రపోకుండా వాళ్ళకోసం ఎందురుచూస్తోంది.

"డాడీ– అక్కడ మీరూ, రాకేష్ చేస్తుందేమీ నాకు నచ్చలేదు–" అంది కోపంగా.

"చూడు రోజా! మనది నాలుగు దినాల్లో బంద్ చేసే చానెల్– అవునా, కాదా?"

"అలాగని లేనిపోని ప్రాబ్లెమ్స్లో ఇరుక్కో కూడదు కదా!"

"ఏ ప్రాబ్లెమ్ రాకుండా రాకేష్ మానేజ్ చేస్తాడ్లే బిడ్డా! నువ్ బేఫికరుండు– నాకు నీ హెల్త్ బాగుండటం గావాలె– ఈ చానెల్ గురించి జరంత గూడా సోంచాయించకు–"

రోజా ఇంక మాట్లాడలేకపోయింది.

నిజమే! అది మూతబడటమేమంచింది. లేకపోతే ఇంకా చాలా డబ్బు పోగొట్టుకోవాల్సి వస్తుంది– ఏదేమయినా రాకేష్ అతి తెలివితేటల్తో ఏదొక సమస్య తప్పదనిపిస్తోంది.

ఆమె అనుకున్నంతా అయింది.

మర్నాడు న్యూస్ పేపర్లో హెడ్లైన్ చదివి షాకయింది.

"తప్పుడు న్యూస్ టెలికాస్ట్ చేసినందుకు బృందావనం చానెల్మీద కేస్ రిజిష్టర్ చేసిన పోలీస్ డిపార్ట్మెంట్–"

కంగారుగా ఆ పేపర్ హాల్లో కూర్చుని భవానీశంకర్తో మాట్లాడుతున్న తండ్రి దగ్గరకు తీసుకెళ్ళింది రోజా–

"చూశారా డాడీ! మన చానెల్ మీద పోలీస్ కేస్ పెట్టారు–"

ఆమె చేతిలోని పేపర్ ఎగ్జయిట్మెంట్తో లాక్కున్నాడు భవానీ–

"ఒండర్ఫుల్ రోజా! నాక్కావలసిందిదే! మన చానెల్ పేరు రాష్ట్రమంతా మార్మోగిపోవాలి– అప్పుడుగానీ జనం మన చానెల్ని వెతికి మరీ చూడరు. అన్ని న్యూస్ పేపర్స్లో మన చానెల్ గురించే రాసి ఉంటారివాళ! ఆ పబ్లిసిటీయే మన చానెల్కి కావాలి! ఇంక వ్యూర్ షిప్ రేటింగ్ ఎలా పెరుగుతుందో చూసుకో–"

పేపర్ హెడ్లైన్ చూసి భయపడ్డ జైరాజ్– భవానీమాటలు వినేసరికి ఆనందంతో పొంగిపోయాడు.

"అవును రోజా! ఈకేస్ల గురించి వర్రీ అవకు! ఇవి తేలటానికే ఇరవై ఏళ్ళు పడుతుంది–"

రోజాకి మండిపోయింది.

"డాడీ! చానెల్‌ని ఎలా నడపాలో ఏబిసిడి తెలీని వాళ్ళని మన చానెల్‌కి పంపటం రాంగ్! రాకేష్ ఈజ్ ఓన్లీ ఎ జర్నలిస్ట్– న్యూస్‌పేపర్లో పని చేసుకునే వాళ్ళకేం తెలుస్తుంది చానెల్ రన్ చేయటం?"

భవానీ ఆమె కెదురుగ్గా కూర్చున్నాడు.

"రోజా! నువ్ అమెరికాలో ఈ మీడియం గురించి చదువుకొచ్చి అన్నీ తెలుసనుకుంటున్నావ్! ఆమెరికాలో టీవీ చానెల్ రన్ చేయటం వేరు. ఇండియాలో టీవీ చానెల్ రన్ చేయటం వేరు. అమెరికాలో ఎథిక్స్ ఉన్నయ్. చాలా కఠినమయిన రూల్స్ ఉన్నయ్. అక్కడ వాళ్ళకి సోషల్ రెస్పాన్సిబులిటీ ఉంది. మన దగ్గర అవేమీ లేవు. ఏ ఛానెల్ ఉద్దేశమయినా– ఎంత అడ్డదారిలోనయినా సరే– డబ్బు సంపాదించటం! ఎంత నీచానికయినా దిగజారి వ్యూయర్ షిప్ పెంచుకోవటం – అంత తేడాఉంది!"

"అవన్నీ ఏమీ నాలెడ్జ్ లేని వాళ్ళమాటలు– ఎంత తన్నుకున్నా చానెల్‌ని నెంబర్ వన్ చేయటం అంత తేలిక్కాదు– దానికి చాలా డబ్బు కావాలి! చాలా టైమ్ కావాలి! ఇంకో రెండేళ్ళు బృందావనం చానెల్‌ని నడపగలిగేంత స్తోమతు ఉంటే దీన్ని నేనే నెంబర్‌వన్ చేయగలను–"

"అది నీ వ్యూ! కానీ నా వ్యూ ఏంటో తెలుసా? నేను ఒక పైసా ఖర్చులేకుండా మన చానెల్‌ని మూడు నెలల్లో నెంబర్‌వన్ చానెల్ చేయగలను!"

"ఛాలెంజ్?" కోపంగా అందిరోజా.

"చాలెంజ్!"

"అయితే ఒక విషయం గుర్తుంచుకో మూడు నెలల్లో దీన్ని నెంబర్‌వన్ చానెల్‌గా చేయలేకపోతే దీనిమీద తీసుకున్న ఇరవై కోట్ల లోన్ నువ్వే తీర్చాలి–"

"ఇరవై కోట్ల లోనుందా దీని మీద?" షాకవుతూ అడిగాడు భవానీ!

"అవును రాకేష్! నా ఇన్‌వెస్ట్‌మెంట్ కాక ఇరవై కోట్లు లోన్ తీసుకుని దీనిమీద ఖర్చుపెట్టాను. వప్పుకున్నాడు జైరాజ్.

"ఏం? భయం పట్టుకుందా?" కసిగా అడిగింది రోజా.

"నా దగ్గర దమ్ము లేకపోతే కదా భయపట్టానికి–"

"డాడీ– రేపే మన చానెల్‌ని రాకేష్ పేరుమీదకు మార్చండి! రేపట్నుంచీ మూడు నెలల గడువు! బృందావనం చానెల్‌ని నెంబర్‌వన్ చానెల్‌గా మార్చడానికి!"



జైరాజ్ ఫజిలయాడు.

"ఈ మాత్రానికి అతని పేరున మార్చటం దేనికమ్మా?"

"ఎందుకంటే బాంక్‌వాళ్ళు మూడు నెలలయాక అతనిని పట్టుకుంటారు లోన్ తీర్చమని– మన జోలికి రారిక–"

"ఓహో! అట్నుంచినరుక్కొచ్చావా? ఛాలెంజ్‌లో ఫెయిలయితే నన్ను జైలుకి పంపాలని రోజా ప్లాన్! ఓకే– రోజా! ఎగ్రీడ్– రేపట్నుంచీ మూడునెలలు!" అన్నాడు భవానీ.

"యా! ఓన్లీ త్రీ మంత్స్–" అంది రోజా–

ఆ రాత్రి భవానీశంకర్‌కి నిద్రపట్టలేదు. నిజంగా తన మూడునెలల్లో బృందవనాన్ని నెంబర్‌వన్ చానెల్ చేయగలడా? తనకా కెపాసిటీ ఉందిగానీ మూడు నెలల టైమ్ సరిపోతుందా? డౌటే! అయినా ఇప్పుడింక వెనక్కు తిరిగే ప్రసక్తే లేదు. లైఫ్‌లో ఇంతవరకూ ఎలాంటి భయంకరమయిన పరిస్థితిలో ఉన్నా మడమ తిప్పలేదు.

అప్పుడే ఫోన్ మోగింది.

"హలో బ్రదర్" రాకేష్ గొంతు.

"హాయ్– థింక్ ఆఫ్ ది డెవిల్. ఇప్పుడే నీకు ఫోన్ చేద్దామనుకుంటున్నా–"

"ఎందుకు? ఆ శాడిస్ట్– హింసపెడుతోందా?"

"శాడిస్టా? శాడిస్టెవరు ఫ్రెండ్?"

"ఇంకెవరు అదే! ఆనియన్– అంటే రోజా–"

"రోజా శాడిష్టా?"

"అవును! మా ఇద్దరికీ ఒక్క క్షణం కూడా పడేది కాదు. ఒకళ్ళనొకళ్ళు తెగ ద్వేషించుకునేవాళ్ళం–"

"హింసేమీ పెట్టటం లేదుగానీ ఇంతకుముందే ఒక విచిత్రమయిన ఛాలెంజ్ చేసింది" అంటూ విషయమంతా చెప్పాడు భవానీ!

"ఓహో! అయితే దాని శాడిజం ఏమీ తగ్గలేదన్నమాట! థాంక్ గాడ్! దానిని ఆ రోజుల్లోనే వదిలించుకోవటం మంచిదయింది! నువ్వేం భయపడకు బ్రదర్! ఛాలెంజ్ టేకప్ చెయ్– నీలాంటి తిక్క నా కొడుకు ఈజీగా ఏ చానెల్‌నయినా నెంబర్ వన్ చేసేస్తాడు. నా వల్ల ఏమయినా హెల్ప్ కావాలంటే తీసుకో– ఓకే?"

"థాంక్యూ! మరి నీ మోనికా సంగతేంటి? ఎనీ ఇంప్రూవ్‌మెంట్?"

“ఈ మోడల్స్‌తో చాలా హెడేక్ భవానీ! నీలాగానే తిక్కరకాలు! నేను నిన్ను లవ్‌చేస్తున్నానే అంటే ముందు మీడాడీ మమ్మీని ఇంటర్‌వ్యూ చేయాలంటోంది–”

“అదేంటి? వాళ్ళతో ఏం సంబంధం?”

“తనకు ఫామిలీ అంటే చాలా ఇష్టం అంట! ఇంట్లో ఎంత ఎక్కువ సంఖ్యగల కుటుంబం ఉంటే అంత హాపీగా ఉంటుందంట తనకి–”

“బాడ్‌లక్–”

“ఓకే– సీయూ–”

ఫోన్ కట్‌యింది.

భవానీకిప్పుడు కొంచెం ధైర్యం వచ్చింది. రాకేష్‌లాంటి డాషింగ్ పర్సన్ తనకు హెల్ప్ చేస్తే– ఈజీగా బృందావనం చానెల్‌ని నెంబర్‌వన్ చేసేయగలడు. వాడుగాక విజయ్‌యాదవ్‌గాంగ్ ఉండనే ఉంది–

* * *

మర్నాడు భవానీ ఛానెల్ కెళ్తూనే హనుమంతు రూమ్‌లోకి ఎంటరయాడు.

“వెల్‌కమ్ హనుమంతూ! రా! కూర్చో–”

హనుమంతు అనీజీగా కూర్చున్నాడు.

“నువ్వింతకుముందు ఏ చానెల్లో పనిచేశావ్ మిస్టర్ హనుమంతూ?”

“వసంతం చానెల్లో సార్– అందులో నేను చానెల్ క్రియేటివ్ హెడ్‌గా చేశాను–”

“చాలా క్రియేటివ్ ప్రొగ్రామ్స్ ఇంట్రడ్యూస్ చేశావనుకుంటా! కదా?”

“సూపర్ ప్రొగ్రామ్స్ డిజైన్ చేశాను సార్– ఆరు నెలలు రాత్రింబగళ్ళు తీవ్రంగా ఆలోచించి ప్రొగ్రామ్స్ అంతకుముందు ఇంకే చానెల్లోనూ రాలేదని వ్యూయర్స్ తెగ లెటర్స్, ఎస్ఎమ్ఎస్‌లు పంపించేవారు–”

“అంటే ఆ చానెల్ మూసేయడానికి సెంట్‌పర్సెంట్ నువ్వే కారణమన్న మాట! నేనుముందే అనుకున్నాలే!”

హనుమంతు గాబరాపడ్డాడు.

“సారీ సార్– చానెల్ మూతపడ్డానికి కారణం నేను కాదు– మానేజ్‌మెంట్ పాలసీలు–”

“నీ ప్లేస్‌లో ఎవడున్నా అదే అంటాడ్లే గానీ ఇవాల్టి నుంచీ నీ క్రియేటివ్ నెస్



తగ్గించి నేను చెప్పిన ప్రోగ్రామ్స్ చెయ్–”

“ఏమిటి సార్ అవి?”

“రాత్రి పదీ– పన్నెండు మధ్యలో ఏం ప్రోగ్రామ్స్ వస్తున్నాయ్?”

“డాన్స్ ప్రోగ్రామ్స్, సినిమా సాంగ్స్, సినిమాల్లో వస్తున్నాయ్?”

“వాటి రేటింగ్ ఎంతుంది?”

“ఆల్‌మోస్టాల్ జీరో సార్–”

“అంటే నీ క్రియేటివ్ ప్రోగ్రామ్స్ ఒక్కడు కూడా చూడటంలా! అవునా?”

“అంటే అది .... లేట్ నైట్– జనరల్‌గా–”

“ఎల్లుండి నుంచీ రాత్రి పదింటికి పందిరిమంచం అనే సీరియల్ రన్ చెయ్–”

“పందిరి మంచమా? అలాంటి సీరియల్ మన దగ్గరేమీలేదే?”

“లేకపోతే ఇవాళ, రేపూ షూటింగ్ చేసి ఎల్లుండి టెలికాస్ట్ చేస్తావ్–”

“నేనా?”

“చేతకాదంటే చెప్పు– నీ అసిస్టెంట్‌కి ప్రమోషనిస్తా–”

“అహహా! చేస్తాన్సార్– స్క్రిప్ట్ ఏది?”

“బూతు సీరియల్ కి స్క్రిప్ట్ అడిగే వాడిని నిన్నొక్కడినే చూస్తున్నా–”

“ఆ! బూతు సీరియలా?”

“అవును! హీరోకి, హీరోయిన్‌కి పెళ్ళయింది! ఫస్ట్‌నైట్ గదిలో కొస్తారు. అక్కడి నుంచీ ఇక నీ టాలెంట్ – కెమెరా వర్క్– అంతే–”

“నాకర్థం కాలేదు సార్–”

“గదిలోకి రాగానే కెమెరా హీరోయిన్ అందమయిన మొఖం చూబిస్తుంది. ఆ తర్వాత పెదాల క్లోజప్– హీరో పాయింటాప్ వ్యూ– ఆ తరువాత హీరోయిన్ ఛాతీ– ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు ఛాతీ ఊగటం– అది చూసి హీరో కసి– దీనికే పదినిమిషాలు పడుతుంది. బొడ్డుని ఎంత సెక్సీగా, ఎట్రాక్టివ్‌గా చూపించాలో నేను నీకు చెప్పక్కర్లా! చాలా సినిమాల్లో చూసే ఉంటావ్– లేకపోతే రాఘవేంద్రరావ్ సినిమాలన్నీ తెచ్చి చూసుకో! హీరోయిన్ బొడ్డు మున్సిపాలిటీ చెత్తకుండీ లాంటిది అనుకో! దాని మీద ముందు యాపుల్స్ విసరాలి! తర్వాత మోసంబీ– ఆ తరువాత రేగి పళ్ళు– ఆ తరువాత గులాబీ పూలు– ఆ తరువాత బంతిపూలు– ఇవన్నీ హీరో విసురుతూంటాడున్నమాట–”

ఆ తరువాత హీరోయిన్ దగ్గర కొచ్చి ఛాతీమీద చేయివేస్తాడు. ఆ స్పర్శకి హీరోయిన్

పావుగంట సెక్సీ రీయాక్షన్స్ ఇస్తుంది! ఎపిసోడ్ ఎండ్– ఈ విధంగా అయిదొందల ఎపిసోడ్‌లు తీయవచ్చు–"

హనుమంతు మొఖంలో హారర్ కనిపించింది.

"సార్– అలాంటి సీరియల్స్ చూపిస్తే రోజా మేడమ్ చెప్పు తీసుక్కోడుతుంది–"

"చూపించలేదనుకో! ఆ పని నేను చేస్తా–"

హనుమంతు నోటమాట రాలేదు–

వెంటనే భవానీ టేబుల్ మీదున్న ఓ కాగితం తీసి అతని ముందుంచాడు.

అతని భుజం తట్టి చిరునవ్వు నవ్వాడు.

"అర్థమయింది కామ్రేడ్! అలాంటి బూతు సీరియల్స్ తెలుగు ప్రేక్షకులకు చూబించడానికి నీ అంతరాత్మ వప్పుకోవటం లేదు. అందుకే దీనిమీద రాజీనామా రాసి సంతకం పెట్టు– ఎందుకంటే నువ్ జీతం కోసం రాజీపడే టైప్ కాదని నాకు తెలుసు–"

హనుమంతు పూర్తిగా కంగారు పడ్డాడు.

"సార్– నోసర్– అయ్ మీన్ ఎస్సార్– చేస్తాను సార్–"

"అలాగే రెండో సీరియల్ సినిమా బేస్డ్ అన్నమాట–"

"కామెడీ సీన్లు ఎలాగూ వేస్తున్నాం కద్సార్?"

"ఓరేయ్! నాకో మేటర్ చెప్పు! నువ్వు మాంఛి యవ్వనంలో ఉన్నప్పుడు నీ పెళ్ళాం పక్కలో పడుకునే వాడివా– పెళ్ళాన్నొదిలేసి టీవీలో కామెడీ సీరియల్స్ చూసే వాడివా?"

హనుమంతుకి నోట మాట రాలేదు–

"మన యూత్ రాత్రి రెండింటి వరకూ మేలుకుని టీవీ చూసేది కామెడీ కోసం కాదురా! సెక్స్ కోసం–"

"అయితే ఇప్పుడేం చేయమంటారు సార్?"

"సినిమాల్లో సెన్సార్ కట్ చేసినా కూడా, తర్వాత సాంగ్స్‌లో బూతు సీన్లు యాడ్ చేస్తారన్న విషయం నీకు తెలుసు కదా! అలాంటి బూతు సాంగ్స్ అన్నీ ఏరి మిడ్‌నైట్ చికెన్ బిరియానీ" అనే పేరుతో టెలికాస్ట్ చేసెయ్–"

"మన మీదెవడయినా కేస్ పెడతాడేమో సార్?"

"అవన్నీ ఆ సినిమాల్లో అందరూ చూసినవే కదురా! ఇంకా కేసేంటి?"

"ఓకే సార్–"

అయిష్టంగానే తన రూమ్‌కెళ్ళి వెంటనే రోజాకి ఫోన్‌చేశాడు.



"గుడ్‌మాణింగ్ మేడమ్! ఈ రాకేష్‌గారు మొత్తం మన చానెల్ ప్రిస్టేజ్‌ని నాశనం చేసేస్తున్నారు మేడమ్–"

"ఏమంటున్నాడు?"

"రాత్రుళ్ళు పది నుంచి పన్నెండు వరకూ పెద్దలకు మాత్రమే టైప్ ప్రోగ్రామ్స్ వేయమంటున్నారు మేడమ్–"

రోజా కోపంతో వణికిపోయింది.

వెంటనే తండ్రికి ఫోన్ కొట్టింది.

క్లబ్‌లో పేకాడుతున్న జైరాజ్ ఫోన్ తీశాడు.

"ఏం బిడ్డా?"

"డాడీ! ఆ రాకేష్ ఏం చేస్తున్నాడో చూశావా? రాత్రి పది నుంచి పన్నెండు వరకూ బూతు ప్రోగ్రామ్స్ వేస్తున్నాడంట–"

జైరాజ్ బుర్ర గోక్కున్నాడు.

"వేస్తే వేసుకోనీ అమ్మా! చానెల్ అతనికి హాండోవర్ చేశాంగా?"

"అయినా మన పరువు పోతుంది కదా!"

జైరాజ్‌కి ఠక్కున గుర్తుకొచ్చింది.

"ఎలా పోతుందమ్మా! ఆ పని అన్ని చానెల్సూ చేస్తున్నాయ్ కదా! అదీగాక మనం చానెల్‌ని రాకేష్‌కి లీజ్‌కిచ్చామని చెప్తాం కదా!"

రోజాకి ఏం జవాబు చెప్పాలో తెలీలేదు–

"కానీ మన చానెల్ వేరు..."

"నీతి, పరువూ, మర్యాద, ప్రేక్షకుల బాగోగులు అంటూ నానా తంటాలూ పడ్డావ్ నువ్వు! అవునా? మరి చానెల్ గతేమయింది. అందుకని ఆరు నెలలు కళ్లు మూసుకుందాం! తరవాతెలాగూ మూతపడేదేగా?"

రోజాకి తండ్రిమీద కూడా కోపం వచ్చి ఫోన్ డిస్కనెక్ట్ చేసింది.

హనుమంతు ఫోన్ పెట్టి పక్కకు తిరిగి చూసేసరికి భవానీశంకర్ కనబడ్డాడు.

"రోజా ఏమందిరా!"

హనుమంతు మొఖంలో భయం కనిపించింది.

"అది కాద్సార్! అది పాలసీ మేటర్ కదా! ఒకసారి మేడమ్‌కి చెప్తే మంచిదని..." గొణిగాడు.

"ఒరేయ్! మన రాష్ట్ర ప్రభుత్వమే ఇలాంటి బూతు ప్రోగ్రామ్స్ విషయంలో మొత్తం మూసుక్కూచుంది కదా! మధ్యలో నీ హడావుడేంట్రా?"

"సారీ సార్– పొరబాటయింది– కానీ బూతు ప్రోగ్రామ్స్‌కి వ్యతిరేకంగా పోలీస్ కమిషనర్ ఒక లెటర్రాశారు సార్–"

"తిక్క నాయాలా– మనం టెలికాస్ట్ చేయబోయేది బూతుకాదురా! వాటిని ఎవేర్‌నెస్ ప్రోగ్రాం అంటాం! ఇంకా గట్టిగా మాట్లాడితే ఎయిడ్స్ ఏవేర్‌నెస్ ప్రోగ్రాం అంటాం! ప్రోగ్రాం మధ్యలో నువ్ కనబడి మన దేశంలో ఎంతమంది ఎయిడ్స్ వ్యాధితో చనిపోతోందీ స్టాటిస్టిక్స్ చదువుతూంటావ్! ఈ ప్రోగ్రామ్స్ చూసి పోలీస్ కమిషనరే తప్పట్లు కొడతాడ్రా!"

హనుమంతు మొఖం కాంతితో వెలిగిపోయింది.

"ఆఫ్‌కోర్స్– మీరు ఆ రూట్లో వస్తారని తెలీక అలా మాట్లాడాను సార్!"

"కదా! ఇంక మూసుకుని నేను చెప్పిన పనిచెయ్–"

"కానీ ఇక్కడింకో ప్రాబ్లెమ్ ఉంది సార్–"

"ఏంటది?"

"అలా వళ్ళంతా చూపించడానికీ– హీరోతో కిందా మీదా పడిదొల్లడానికీ లేడీ ఆర్టిస్ట్‌లు వప్పుకోరు సార్–"

"టీవీ ఆర్టిస్ట్‌లు వప్పుకోకపోతే– ముక్కు మొఖం బాగున్న సెక్స్ వర్కర్స్‌ని తీసుకురారా! వాళ్ళు హాపీగా వప్పుకుంటారు–"

అతను అయోమయంగా చూస్తూ బయటికెళ్ళిపోయాడు.

భవానీకెమెరా ఇన్‌ఛార్జ్ భాస్కర్ దగ్గర కొచ్చేసరికి సెల్ మోగటం మొదలుపెట్టింది–

"హలో–"

"సార్! నేను మార్కెటింగ్ ఇన్‌ఛార్జ్‌ని మాట్లాడుతున్నా సార్–"

"యస్ నారాయణ! వాటీజ్ ది మేటర్?"

"మీరు రేపట్నుంచీ ఇంట్రడ్యూస్ చేయబోతున్న రెండు బూతు ప్రోగ్రామ్స్‌కీ నలుగురు స్పాన్సరర్స్ దొరికారు. ఇంకో ఇద్దరు బ్రాండింగ్ చేయడానికి వప్పుకున్నారు సార్– ఇంత లేట్ అవర్స్‌లో ప్రోగ్రామ్స్‌కి స్పాన్సరర్స్ దొరకటం ఇదే ఫస్ట్ టైమ్ సర్–"

"గుడ్! ఏం కంపెనీలవి? నిరోధ్ కంపెనీలేనా?"

"రెండు నిరోధ్ కంపెనీలు, నాలుగు వయాగ్రా టైప్ టాబ్‌లెట్ కంపెనీలు, రెండు సెక్స్ హాస్పిటల్సూ సార్! అన్నట్లు మన బూతు ప్రోగ్రామ్స్ గవర్నమెంట్ కూడా స్పాన్సర్



చేయడానికి వప్పుకుంది సార్–"

భవనీ అదిరిపడ్డాడు.

"వ్వాట్? గవర్నమెంటా?"

"అవున్సార్! డైరక్ట్‌గా ఈ బూతు ప్రోగ్రామ్‌ని మీకు సమర్పిస్తున్నవారు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అని ఉండదు గానీ– గవర్నమెంట్ రన్ చేస్తున్న ఎయిడ్స్ కంట్రోల్ బోర్డ్ అనేది సహ సమర్పణ చేస్తోంది– సార్–"

"ఒండర్‌ఫుల్ నారాయణా! గ్రేట్ ఏచీవ్‌మెంట్! త్వరలో పరుపుల కంపెనీల వాళ్ళూ, సబ్బుల కంపెనీల వాళ్ళు కూడా ఎంటరవుతారు! వాళ్ళతో కూడా టచ్‌లో ఉండండి–"

"ఓకేసార్!"

భవానీ హుషారుగా విజిల్ వేశాడు.

"ఏంటి సార్ ఇలా వచ్చారు?" అడిగాడు భాస్కర్.

"మీరు వెంటనే పెన్ కెమెరాలు, సెల్ కెమెరాలు, అన్నీ తీసుకుని రోడ్లమీద పడండి. నెక్లెస్ రోడ్‌లూ, పార్క్‌లూ, కాలేజ్ కాంపస్‌లూ, మసాజ్ పార్లర్‌లూ, గవర్నమెంట్ హాస్టల్సూ స్కూళ్ళూ, గవర్నమెంట్ ఆఫీస్‌లు అన్నీ తిరగండి! అక్కడ జరిగే సెక్స్ రాకెట్స్ అన్నీ వీడియో తీయండి! ఒకవేళ మీకేమీ దొరక్కపోతే అలాంటి సీక్రెట్ ప్రణయ కలాపాలు ఇంకెవరయినా వీడియోలు తీస్తే ఎంత డబ్బయినా ఇచ్చి కొనండి–"

"ఓకే– సార్–"

రాధా ఛమేలీ కోపంగా వచ్చింది భవానీ రూమ్‌లోకి.

"ఏంటి? నా సీరియల్స్ అన్నీ మార్చాలన్నారంట?" అడిగింది కోపంగా.

"అవును మరి! ఈ చానెల్ పెట్టింది మీ కోసం కాదు రాధాజీ– పబ్లిక్ చూడాలని!"

"సీరియల్స్ అన్నీ అద్భుతంగా ఉనానయని వాళ్ళు లెటర్స్ రాస్తున్నారు–"

"వాళ్ళు ఎక్కువమందుంటే మన సీరియల్స్ రేటింగ్– ఇంత నికృష్టంగా ఉండదు కదా–"

రాధా ఛమేలీకి నోటమాటరాలేదు.

"అయితే ఇప్పుడేం చేయాలి?"

"ప్రతి సీరియల్లో హీరోయిన్‌కి ఇద్దరుండాలి– ఒకడు మొగుడు, రెండోవాడు ప్రియుడు, అలాగే హీరో క్కూడా ఇద్దరుండాలి. ఒకతె పెళ్ళాం– ఇంకోతె గిళ్ళాం! ఇవిగాక

యూత్ లవ్ ట్రయాంగిల్స్ ఉండాలి! ఆ ట్రయాంగిల్ ప్రతి పది ఎపిసోడ్‌కీ లవర్స్ మారిపోతూండాలి–"

"అలాంటి సీరియల్స్ ఎవరూ చూడరు సార్–"

"మీకు హిందీ వచ్చా?"

"వచ్చు–"

"అయితే హిందీ చానెల్స్‌లో సీరియల్స్ చూసినేర్చుకో–"

"ఇంత అర్జంటుగా మార్పులు చేయాలంటే కష్టం సార్–"

"అయితే ఇంటికెళ్ళిపో– నీ డ్యూటీ మీ అసిస్టెంట్ శిల్ప చేస్తుంది–"

"అహహ–– కష్టం అంటే కొంచెం టైమ్ పడుతుంది సార్–"

"పట్టటానికి వీల్లేదు– ఇప్పుడే ఆ రైటర్స్‌ని పిలిచి కావలసిన మార్పులు చేయించి రేపు షూటింగ్ పెట్టండి!"

"స్టోరీలో జెర్క్‌లొస్తాయేమో సార్–"

"లేకపోతే చానెల్‌కి జెర్క్‌లొస్తాయ్– ఆ తరువాత నీకు జెర్క్ వస్తుంది–"

"ఓకేసార్–"

ఆమె వెళ్ళిపోయింది.

వెంటనే విజయ్ యాదవ్‌కి ఫోన్ చేశాడు భవానీ–

"హలో అన్నా–"

"రేపు ఎల్లుండి మా బృందావనం చానెల్లో సీరియల్స్ అన్నీ చూడు. చూశాక ఆ మర్నాడు కొంతమంది లేడీస్‌ని అద్దెకు తీసుకొచ్చి మొత్తం ఒక యాభయ్ మంది ఆసీరియల్స్‌లో భారత సంస్కృతిని అవమాన పరుస్తున్నారంటూ ప్లేకార్డ్స్ పట్టుకుని ఊరేగింపుగా వచ్చి మన చానెల్ ముందు ధర్నా చేయించు. కొంతమంది గూండాలను పట్టుకొచ్చి బస్‌ల మీద రాళ్ళు వేసి ట్రాఫిక్ నిలిపేయండి– అర్థమయిందా?"

"చాలా ఈజీ జాబన్నా! కానీ కనీసం పాతికవేలు ఖర్చవుతాయ్–"

"రేపే నీ ఎకౌంట్స్‌లో మనీ వేయిస్తాను– తీసుకో–"

"ఓకే బ్రదర్– థాంక్యూ–"

ఫోన్ ఆఫ్ చేసేసరికి ఎదురుగ్గా జైరాజ్ కనిపించాడు.

"నా ఫోన్ డైలాగ్స్ విన్నారా?" దౌటుగా అడిగాడు భవానీ.

"ఎవరిదో ఎకౌంట్‌లో డబ్బు వేయిస్తానని చెప్పటం విన్నాను–"



"గుడ్! వినాల్సిన డైలాగే విన్నారు! అర్జంటుగా నాకో లక్ష కొట్టండి! మూడు నెలల తర్వాత ఇచ్చేస్తాను–"

వెంటనే చెక్ రాసిచ్చేశాడు జైరాజ్.

"ఇగో రాకేష్! ఒక్క మాట చెప్పు! నిజంగా మూడు నెలల్లో మనది నెంబర్‌వన్ చానెల్ అవుదంటావా?"

"నాకు విజయం ముఖ్యం కాదంకుల్! విజయం కోసం ప్రయత్నించటం ముఖ్యం–"

"ఒకవేళ ఓడిపోతే 20 కోట్లు ఏడకెళ్ళి కడతావ్? మీ నాయన్నడుగుతావా?" ఏందుకంకుల్! సత్యం రామలింగరాజు ఫ్రాడ్ మనీ ఎక్కడి నుంచి కడతాడో నేనూ అక్కడినుంచే కడతా–"

"నీ యవ్వ– మంచిగున్నావ్ రా భయ్–" పగలబడి నవ్వుతూ అన్నాడు.

అదేరోజు సాయింత్రం ఒక ఇన్సిడెంట్ జరిగింది.

ఒక ఫేమస్ రాజకీయనాయకుడి కొడుకు తనను రేప్ చేశాడంటూ దివ్యాసేన్ అనే అమ్మాయి పోలీస్ కంప్లెయింట్ ఇచ్చింది. పోలీసులు కేస్ రిజిష్టర్ చేయడానికి భయపడ్డారు. ఎందుకంటే ఆ రాజకీయ నాయకుడు అధికార పార్టీ సభ్యుడు. అయితే ఆ విషయం టీవీ చానెల్‌కి చెప్తానని ఆమె బెదిరించేసరికి పోలీస్ అధికారులు కంగారుపడి కేస్ రిజిష్టర్ చేశారు.

దివ్యాసేన్‌ని మెడికల్ ఎగ్జామినేషన్ కోసం గవర్నమెంట్ హాస్పిటల్‌కి పంపించారు.

ఆ మేటర్ వెంటనే సంపూర్ణ టీవీ చానెల్‌కి ఫోన్ చేసి చెప్పాడు ఏసీపీ.

అయితే దివ్యాసేన్– రాకేష్ గాళ్‌ఫ్రెండ్ మోనికాకు స్నేహితురాలు కావడంతో– వెంటనే రాకేష్ భవానీకి ఫోన్ చేసి ఆ రేప్‌కేస్ గురించి ఇన్‌ఫర్మేషన్ ఇచ్చాడు.

మోనిక, దివ్యాసేన్‌ని రిక్వెస్ట్ చేసి భవానీ కోసం దివ్యాసేన్‌తో ఇంటర్‌వ్యూ కూడా ఏర్పాటు చేసింది.

భవానీ హడావుడిగా తయారయి కెమెరామెన్‌తోపాటు దివ్యాసేన్ ఉన్నహాస్పిటల్ చేరుకున్నాడు.

అలాంటి హాట్‌హాట్ న్యూస్ ఏ చానెల్ ముందు టెలికాస్ట్ చేస్తే ఆ చానెల్ వ్యూయర్ షిప్ ఆకాశాన్నంటుతుందని భవానీకి తెలుసు.

తీరా హాస్పిటల్ ఆవరణలో నెంబర్‌వన్ టీవీ చానెల్ సంపూర్ణ వాన్‌కనిపించేసరికి షాకయ్యాడు.

సంపూర్ణ చానెల్ లోగో ఉన్న మైక్ పట్టుకుని విజిటర్స్ లాంజ్‌లో కూర్చున్న మల్లికను చూసి ఇంకా షాకయ్యాడు.

ఈ స్కూటర్ రాణికీ, సంపూర్ణ చానెల్‌కీ ఏమిటి సంబంధం? మల్లిక దగ్గరకు నడిచాడతను.

"హాయ్ మల్లికా!"

ఆమె అతని వేపు ఆశ్చర్యంగా చూసింది.

"హాయ్– మీరా!"

"యా! నేనే గానీ మీరిక్కడేం చేస్తున్నారు?"

"నేను నెంబర్‌వన్ చానెల్ క్రియేటివ్ హెడ్‌ని–"

"అంటే సంపూర్ణ టీవీ చానలా?"

"యా! మీరు?"

"నేను నెంబర్‌వన్ టీవీ చానెల్ సీఈఓని"

"నెంబర్‌వన్నా! నెంబర్‌వన్ చానెల్ మాది! మీదే చానెల్?"

"మాదీ నెంబర్ వన్నే–"

"ఏ చానెలది?"

"బృందావనం!"

"అది నెంబర్ వన్నా?" నవ్వాపుకుంటూ అడిగింది.

"అవును– లాస్ట్ నుంచి నెంబర్ వన్–"

"ఆ చానెల్లో రోజా అనే ఆమె ఉండాలిగా?"

"ఉంది! ప్రస్తుతానికి మాత్రం నేనే ఇన్‌చార్జ్–"

"వావ్! అయితే మీరు దేనికొచ్చారిక్కడికి?"

"దివ్యాసేన్‌ని స్పెషల్ ఇంటర్‌వ్యూ చేయడానికి!"

మల్లిక షాకయింది.

"అదేంటి? ఈ రేప్‌మేటర్ అసలు నా ఒక్కదానికీ తప్ప ఇంకెవరీ తెలీదు కదా!"

"అలా అని పోలీస్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు చెప్పారా?"

"యస్! మాది నెంబర్‌వన్ చానెల్ కాబట్టి మాకా ప్రివిలేజ్ ఉంటుంది– అయినా గానీ మీ బృందావన్ చానెల్‌కి దివ్యాసేన్ ఇంటర్‌వ్యూ ఎలా ఇవ్వడానికి వప్పుకుంది?"

"అదే ట్రేడ్ సీక్రెట్ డియర్–"



"నన్ను డియర్ అనవద్దని చెప్పాను కదా?"

"అది నా వీక్‌నెస్ అని మా డాక్టర్ చెప్పాడులే–"

అప్పుడే లోపల్నుంచి ఆమె కెమెరామెన్ బయటికొచ్చాడు.

"సారీ మేడమ్– దివ్యాసేన్ మన చానెల్‌కి ఇంటర్‌వ్యూ ఇవ్వడానికి వప్పుకోవటం లేదు–"

మల్లిక ఆశ్చర్యపోయింది.

"వ్వాట్? నెంబర్‌వన్ చానెల్‌కి ఇంటర్‌వ్యూ ఇవ్వనందా?"

"అవును– ఆ చెత్త చానెల్ బృందావన్‌కి ఇంటర్‌వ్యూ ఇస్తానని కమిటయ్యిందట!"

భవానీ అతని భుజం తట్టాడు.

"ఒరేయ్ మంకీ! మొన్నమొన్నటివరకూ మీ చానెల్ కూడా 'చెత్త' అని అందరూ అనే వాళ్ళురా!"

అతను కంగారుపడ్డాడు.

మల్లిక భవానీ వేపు చిరునవ్వుతో చూసింది.

"యా! యూ ఆర్ రైట్, నేను చేరిన ఆరునెలల్లో నెంబర్‌వన్ చేశా! అంతకు ముందు అది కూడా చెత్తే–"

"అంతేకాదు– త్వరలో మళ్ళీ చెత్తో కేటగిరీలో కెళ్ళే ఛాన్సుంది–"

ఆమె పొగరుగా గర్వంగా చూసింది

"నేనుండగానా? నోవే!"

లోలోపల చాలా సీరియస్‌గా ఆలోచిస్తోంది మల్లిక! దివ్యాసేన్ ఇంటర్‌వ్యూ చాలా ముఖ్యం తన చానెల్‌కి! ఒక వేళ అది బృందావనం చానెల్‌కి దొరికిందంటే జనమంతా బృందావనం చానెల్ చూస్తారు–

లక్కీగా తనకు రాకేష్‌తో పరిచయం ఉంది కాబట్టి ఆ ఇంటర్‌వ్యూని ఇద్దరూ షేర్ చేసుకుంటే?

"రాకేష్! ఈ ఇంటర్‌వ్యూని మనిద్దరం షేర్ చేసుకుందామా?"

భవానీ నవ్వాడు.

"సారీ! మా చెత్త చానెల్ నెంబర్‌వన్ పక్కనుండటం మీకే ఇన్సల్ట్–"

"నేనలా అనుకోవటంలేదు–"

"నేననుకుంటున్నా–"

"ఓకే– మీ కిష్టం లేనప్పుడు బలవంతం చేయటం నాకూ ఇష్టం లేదు– ఎన్నింటికి ఇంటర్వ్యూ?"

"భవానీ! టైమ్ చూసుకున్నాడు.

"ఇంకో అయిదు నిమిషాలకు అపాయింట్‌మెంట్ ఉంది–"

"ఓకే– సీయూ–" అనేసి కెమెరామెన్‌తో వెళ్ళిపోయిందామె.

అయిదు నిమిషాల తర్వాత భవానీ, అతని కెమెరామెన్ దివ్యాసేన్ ఉన్న రూమ్ దగ్గర కెళ్ళేసరికి – బయట పోలీస్ అధికారి నిలబడి ఉన్నాడు.

"ఏం కావాలి?"

"దివ్యాసేన్‌తో ఇంటర్వ్యూ ఉంది–"

"ఏ చానెల్ మీది?"

"బృందావనం–"

"అదేంటి బృందావన్ చానెల్ మేడమ్ లోపల ఆల్ రెడీ ఇంటర్వ్యూ చేస్తోంది కదా!"

భవానీ శంకర్ షాకయ్యాడు.

"వ్వాట్! బృందావన్ చానెల్ మేడమా? అలాంటి మేడమ్ లెవరూ లేరే మా చానెల్లో! నేనే బృందావన్ చానెల్ తరపున వచ్చాను–"

"సారీ సార్– ఇప్పుడు నేను చేయగలిగిందేమీ లేదు– ఆమె బయటి కొచ్చేవరకూ వెయిట్ చేయండి–"

భవానీ కర్థమయింది–

"అదేమిటి సార్– మన చానెల్ పేరుతో ఎవరెళ్ళారు లోపలకు?" కెమెరామెన్ ఆశ్చర్యంగా అడిగాడు.

భవానీ మాట్లాడకుండా హాస్పిటల్ రిసెప్షన్ దగ్గరకు పరుగెత్తాడు.

"సిస్టర్! ఒక్కసారి మీ టీవీ సంపూర్ణ చానెల్‌కి మార్చండి– ప్లీజ్–"

సిస్టర్ రిమోట్‌తో సంపూర్ణ చానెల్ సెలక్ట్ చేసింది.

బ్రేకింగ్ న్యూస్ కింద పెద్ద పెద్ద అక్షరాలతో వస్తోందా వార్త– ప్రముఖ మోడల్ దివ్యాసేన్ రేప్– ఆమె బాయ్‌ఫ్రెండ్, ప్రముఖ రాజకీయ నాయకుడు శరత్‌రావ్ కొడుకు పార్టీ యూత్ లీడర్ విక్కీ కోసం పోలీసుల గాలింపు–

మరికాసేపట్లో దివ్యాసేన్‌తో 'సంపూర్ణ' చానెల్ ప్రత్యేక ఇంటర్వ్యూ!"



"దిసీజ్ టూ మచ్ సార్! ఆ మేడమ్ మీద చీటింగ్ కేస్ పెట్టాలి మనం!" అన్నాడు కెమెరామెన్.

"ఒరే! కెమెరామెన్నూ! మనక్కావలసింది చీటింగ్ కేస్‌లు కాదురా! రేటింగ్ రేస్‌లు! ఎలాగోలా ఆ మేడమ్‌తో ప్రస్తుతానికి కాంప్రమైజ్ అయి– ఆ ఇంటర్వ్యూ మన చానెల్లో కూడా అదే టైమ్‌కి చూపించాలి! అప్పుడు కొంతవరకయినా మన చానెల్‌కి వాల్యూ వస్తుంది–"

భవానీ పోలీస్ అధికారి దగ్గరకు నడిచాడు.

"మీరు అయిడెంటిటీ కార్డ్‌లు చూడకుండా ఇంకెవరినో లోపలకు పంపిచారు! ఈ విషయం మా చానెల్లో చూపించాలనుకుంటున్నా–"

అతను కొంచెం కంగారు పడ్డాడు.

"ఏదో చిన్న పొరబాటు జరిగింది–"

"చిన్నదని మీరంటున్నారు– కానీ ఆ చానెల్ వాళ్ళ దగ్గర లంచం తీసుకుని వాళ్ళను లోపలకు పంపించారు అని మా న్యూస్‌లో చెప్తాం!"

అతను టోటల్‌గా బెదిరిపోయాడు.

"అదేంటి సార్– అంత డైరక్ట్‌గా అబద్ధాలు చెప్తారా?"

"ఈ ప్రాబ్లెమ్ సాల్వ్ అవాలంటే ఒక్కటే దారి!"

"ఏమిటి సార్ అది?"

"వాళ్ళు బయటకు రాగానే వాళ్ళ కెమెరా; ఆ ఇంటర్వ్యూ సీడీ– కానిఫిస్కేట్ చేయండి– మేమిద్దరం రాజీ కొచ్చేవరకూ తిరిగి ఇవ్వవద్దు–"

"థాంక్యూ సార్– మీరెలా చెప్తే అలా–"

భవానీ వచ్చేసి రిసెప్షన్‌లో కూర్చున్నాడు.

మరో అయిదు నిమిషాల్లో మల్లిక హడావుడిగా భవానీ దగ్గరకొచ్చింది.

"హాయ్! ఇంపర్సనేటర్!"

"ఇవన్నీ ఈ ఫీల్డ్‌లో కామన్– నువ్వేం అఫెండవక్కర్లేదు–" టీజింగ్‌గా అంది.

"నీలాంటోళ్ళను కిడ్నాప్ చేసి సీడీ లాక్కోవటం కూడా కామనే–"

"ఓకే– ఆ ఇంటర్వ్యూ సీడీ ఇద్దరం షేర్ చేసుకుందాం–"

"థర్డ్ రేట్ ఆఫరది– కొంచెం మంచి ఆఫర్ ఆలోచించు–"

"అయితే నువ్వే చెప్పు–"

"మా చానెల్లో ఒకసారి టెలికాస్ట్ చేశాక అప్పుడు మీ చానెల్లో చేసుకో-"

"ఓకే- ఎగ్రీడ్-"

"అప్పుడే అవలా- ఇంకావుంది-"

"ఇంకేంటి?"

"ఆ ఇంటర్వ్యూ మా చానెల్లో ఫలానా టైమ్ కొస్తోందని మీ చానెల్లో గంటముందే స్క్రోలింగ్ ఇవ్వాలి- దానికి ఛార్జీ మేము పే చేస్తాం-"

"దిసీజ్ టూ మచ్! ఒక ప్రిస్టేజియస్ చానెల్ ఒక చెత్త చానెల్ ప్రోగ్రామ్స్ గురించి యాడ్ యాక్సెప్ట్ చేస్తుందా?"

"చానెల్కి ప్రిస్టేజ్ ఉంది గానీ- దాని క్రియేటివ్ హెడ్కి లేదుకదా!"

మల్లిక కొద్దిక్షణాలు ఆలోచించింది.

"ఒకవేళ నేను వప్పుకోలేదనుకో-"

"ఇంటర్వ్యూ ఇద్దరికీ దొరకదు-"

"ఓకే- వప్పుకుంటున్నా- కానీ ఈ ఒక్కసారికే-"

"నీ టైప్ అంతేలే! ఒక్కసారికయితే- దేనికయినా వప్పుకుంటారు-"

మల్లిక కోపంగా చూసింది

"డైలాగ్ కొంచెం ఓవరయింది!"

"అది నా వీక్నెస్ అని మా డాక్టర్ చెప్పాడు-"

ఆమె వెళ్ళిపోయింది.

మరో అరగంట తర్వాత 'సంపూర్ణ' చానెల్ చూస్తోన్న రోజా, జైరాజ్ అప్పుడే స్టార్టయిన స్క్రోలింగ్ చూసి ఉలిక్కిపడ్డారు.

"అదేంటి? మన చానెల్లో రాబోతున్న ఇంటర్వ్యూ గురించి సంపూర్ణ చానెల్లో టెలికాస్ట్ చేస్తున్నారు?" ఆశ్చర్యంగా అడిగింది రోజా.

"నాకెందుకో రాకేష్ని మనం అండర్ఎస్టిమేట్ చేశామేమో అనిపిస్తోంది-" రోజా నవ్వింది.

"అతనికంత సీన్లేదు డాడీ! స్కూల్లో కూడా చూసేదాన్ని కదా! అన్నీ పాస్ మార్కులే!"

"బుక్ నాలెడ్జ్ వేరు- జనరల్ నాలెడ్జ్ వేరు రోజా-"

"ఏదేమయినా- నేను- అమెరికాలో అంత స్టడీ చేసి వచ్చి కూడా ఫెయిలయిపోయా! అలాంటిది ఆఫ్టరాల్ ఈ రాకేష్ వల్లేమవుతుంది?"



"ఏ పుట్టలో ఏ పాముందో-" అన్నాడు జైరాజ్.

భవానీ ఊహించినట్లే దివ్యాసేన్ ఇంటర్వ్యూ చూడ్డానికి యూత్ ఎగబడ్డారు మిగతా చానెల్స్ వాళ్ళందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

సడెన్గా బృందావన్ చానెల్ పేరు అటు న్యూస్పేపర్లో- ఇటు యూత్లో మార్మోగిపోవటం వాళ్ళకి ఆశ్చర్యం కలిగిస్తోంది.

అదేరోజు యాభైమంది భారత సంస్కృతి పరిరక్షణ సమితి అనే బానర్లు పట్టుకుని ఉదయం పదిగంటలకు ఊరేగింపు ప్రారంభించారు. ముఖ్యంగా అందులో పాల్గొన్న లేడీస్ చాలామంది దృష్టి నాకర్షించారు. వాళ్ళల్లో ఒక సెక్సీ లేడీ జుట్టు విరబోసుకుని అర్ధనగ్నంగా ఒక వాన్ టాప్ మీద నిలబడింది. ఆమె పక్కనే దుర్యోధనుడి గెటప్లో విజయ్యాదవ్ ఆమె చీర ఊడదీయటానికి ప్రయత్నిస్తున్నాడు. అతని వీపుకి బృందావనం చానెల్ అన్న బోర్డ్ తగిలించి ఉంది-

"బృందావనం టీవీ చానెల్లో భారత స్త్రీలను కించపరచటం- సహించం- సహించం-"

"భారత సంస్కృతిని దిగజారుస్తోన్న బృందావనం చానెల్- డౌన్- డౌన్-"

"ప్రభుత్వం వెంటనే బృందావనం చానెల్ని- మూసేయాలి- మూసేయాలి-"

"బృందావన్ చానెల్ మేనేజ్మెంట్ వెంటనే- క్షమార్పణలు చెప్పుకోవాలి-"

అంటూ వాళ్ళు నినాదాలు చేస్తూంటే వాళ్ళకు తోడు మామూలు గానే పనీ పాటాలేని జనం మరికొంతమంది ఊరేగింపులో జాయినయారు. మొదట్లో పోలీసులు కూడా పట్టించుకోలేదుగానీ దారి పొడుగూతా ట్రాఫిక్ జామ్ అవటం మొదలు పెట్టేసరికి వాళ్ళూ ఆ ఊరే గింప్తోపాటు నడుస్తూ ట్రాఫిక్ని రెగ్యులేట్ చేయటం మొదలుపెట్టారు. తమాషా ఏంటంటే ఆ ద్రౌపది వస్త్రాపహరణం సీనూ, ఆ ఊరేగింపునీ లైవ్ కవరేజ్ చేయిస్తున్నాడు భవానీ! ఆ కవరేజ్ చూసినవాళ్ళు ఆ ఊరేగింపు ఏ రోడ్లో వస్తోందీ తెలుసుకుని ఇళ్ళళ్ళో నుంచి బయటికొచ్చి బాల్కనీల్లో, టెర్రేస్ల మీదా నిలబడి చూడసాగారు.

"సంపూర్ణ' టీవీ చానెల్ ఎండి భరద్వాజ్ రూమ్లో కూర్చుని ఉంది- క్రియేటివ్ హెడ్ మల్లిక!

భరద్వాజ్ చేతిలో రెండు వారాలకు సంబ:దించిన రేటింగ్ చార్ట్ ఉంది.

"నాకిదే అర్థం కావటం లేదు మల్లికా! రెండు వారాల క్రితం వరకూ 'జీరో' వ్యూయర్షిప్ ఉన్న నాన్ ప్రైమ్టైమ్ ప్రోగ్రామ్స్కి, బృందావన్ చానెల్లో సడెన్గా నాలుగు రేటింగ్ ఎలా వచ్చింది? ఆ టైమ్లో వాళ్ళు ఏ ప్రోగ్రామ్స్ చూపిస్తున్నారు? అవి ప్రేక్షకులను

ఎందుకు ఎట్రాక్ట్ చేస్తున్నయ్?" అడిగాడు ఎం.డి.

"నేను కూడా ఆ రేటింగ్ చూసి పజిలయి ఆ రెండు వారాలకు చానెల్‌కి సంబంధించిన నాన్ ప్రైమ్‌టైమ్ ప్రోగ్రామ్స్ అన్నీ ప్లే చేసి చూశాను సార్! వాళ్ళు కొత్తగా ఒక ఫీచర్ స్టార్ట్ చేశారు. దానిపేరు "భగవంతుడా– మా సంస్కృతిని రక్షించు–!" అందులో వారంలో జరిగిన రేప్‌కేస్‌లే కాకుండా, కాలేజ్ బాయ్స్, గాళ్స్ తాలూకూ సీక్రెట్ సెక్స్ వీడియోలు, సెల్‌ఫోన్స్‌లో ఎవరెవరో రికార్డ్ చేసిన అమ్మాయిల నగ్న రూపాలూ– బాయ్స్, గాళ్స్ కలిసి ఇంటర్నెట్ కేఫ్స్‌లో జరిపే ప్రణయ కలాపాలూ, అన్నీ చాలా జుగుప్సాకరంగా టెలికాస్ట్ చేస్తున్నారు సార్. మధ్యమధ్యలో సైకాలజిస్ట్ అలాంటి యూత్ మానసిక స్థితిగతుల మీద ఎనలైజేషన్ ఉంటుంది–" ఎం.డి. ఇబ్బందికరంగా నిట్టూర్చాడు–

"కొత్తగా ఆ చానెల్ ఇన్‌ఛార్జ్‌గా టేకోవర్ చేసిన వాడెవడో చాలా ఇంటెలిజెంట్ అయినా అయుండాలి– లేదా పెద్ద శాడిస్ట్ అయినా అయుండాలి!" అన్నాడు.

మల్లిక నవ్వింది.

"శాడిస్టే సార్! అనుమానం లేదు. మొన్న ఆ దివ్యాసేన్ ఇంటర్వ్యూ వ్యవహారంలో అబ్జర్వ్ చేశాను కదా! వాడి మాటలన్నీ శాడిస్ట్ టైప్‌లోనే ఉన్నయ్–"

"నువ్ గమనించావో లేదో– నాన్ ప్రైమ్‌టైమ్ ప్రోగ్రామ్స్‌లో ఆ బృందావనం చానెల్ రేటింగ్స్ మిగతా అన్ని చానెల్స్ కంటే ఎక్కువుంటే నేను పట్టించుకునే వాడిని కాదు. కానీ మన నెంబర్‌వన్ చానెల్ కంటే కూడా రెండు పాయింట్స్ ఎక్కువుంది!"

"కానీ ఇదంతా ఒక ఇఫోరియా సార్! పైగా ఇలాంటి సెక్స్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్స్‌ని లేడీస్ లైక్ చేయరు– ఏదొక రోజు ఏదొక ఆర్గనైజేషన్ వాటికి వ్యతిరేకంగా అలజడి చేస్తారు. దాంతో చానెల్ మూతపడుతుంది–" ధీమాగా అంది మల్లిక.

"ఆఫ్‌కోర్స్! అలా జరుగుతే బావుండునని నీకనిపిస్తోంది– కానీ రియాలిటీ వేరు మల్లికా! మన లేడీస్ ఇప్పుడు అదివరకటి లేడీస్ కాదు. మగాళ్ళతో సమానంగా సెక్స్ కాంటెంట్‌ని పాట్రనైజ్ చేస్తున్నారు. ఎనీవే– యూ ఆర్ ది బెటర్ జడ్జ్! మన సంపూర్ణ చానెల్‌ని సింగిల్ హాండెడ్‌గా నీ తెలివి తేటల్తో నెంబర్‌వన్‌గా చేశావ్– కనుక నీ ఎనాలిసిస్సే కరెక్టవవచ్చేమో–

"ఇక నుంచీ నేను కూడా ఈ బృందావనం చానెల్‌ని ఒక కంటకనిపెడుతూంటాను సార్–"

"దట్స్ గుడ్–" అన్నాడు ఎం.డి.



మల్లికి అక్కడినుంచి వచ్చి తన చాంబర్‌లో కూర్చుంది. ఆమె పైపైకి ఎంత కాన్ఫిడెంట్‌గా ఉన్నా లోలోపల కొంచెం అనీజీగానే ఉంది. కేవలం రెండు వారాల్లో అలాంటి రేటింగ్స్ సాధించాడంటే ఆ రాకేష్ సామాన్యుడు కాదు. ఎదురుగ్గా ఉన్న టీవీ రిమోట్ తీసుకుని బృందావన్ చానెల్ ఆన్ చేసింది మల్లిక. అందులో టెలికాస్ట్ అవుతోన్న లైవ్ కవరేజ్‌ని చూసి ఆమె షాకయింది. బృందావనం చానెల్‌కి వ్యతిరేకంగా నినాదాలు ప్లేకార్డ్స్‌తో స్త్రీ సంఘాల వాళ్ళ ఊరేగింపు– ఒక్కసారిగా ఆమె సంతోషంతో పొంగిపోయింది. తను ముందే ఊహించిది ఏదొకరోజు ఇలా జరుగుతుందని! ఆ రాకేష్ నిజంగా ఒక పర్‌వర్టెడ్ ఫలో! లేకపోతే బృందావనం చానెల్‌కే వ్యతిరేకంగా జరుగుతోన్న ఆందోళనని తనే లైవ్‌గా వాళ్ళ చానెల్లోనే చూపిస్తాడా? ఎంత తెలివి తక్కువ వాడయితే అలాంటి పని చేస్తాడు?

ఆ రాకేష్‌కి చావు దెబ్బ కొట్టాలంటే ఇదేమంచి అవకాశం! వెంటనే ఆ ఊరేగింపుని లైవ్‌గా తమ చానెల్లో కూడా చూపించాలి! దాన్నే రోజంతా హైలెట్ చేయాలి. స్క్రోలింగ్‌లో తాము కూడా బృందావన్ చానెల్‌లో చూపుతోన్న అశ్లీల దృశ్యాల గురించి తూర్పార బట్టాలి. ఆ ఊరేగింపు లైవ్ జరిగినంతసేపూ కొంతమంది స్త్రీ హక్కుల సంఘం వాళ్ళనూ, రాజకీయనాయకులనూ, పేరు ప్రతిష్టలున్న లాయర్లనూ, అందర్నీ వేదిక మీదకు ఆహ్వానించి బృందావనం చానెల్లో అశ్లీలం గురించి చర్చ జరిపించాలి. అంతే! దాంతో బృందావనం లాక్!

వెంటనే కవరేజ్ వాన్‌ని ఆ ఊరేగింపు లైవ్‌గా కవర్ చేయడానికి పంపించింది మల్లిక.

* * *

బృందావనం చానెల్లో సిబ్బంది అంతా గుమికూడి ఆ ఊరేగింపు గురించే మాట్లాడుకుంటున్నారు. వాళ్ళకెదురుగ్గా బృందావనం చానెల్‌ని బూతులు తిడుతూ సాగిపోతోందా ప్రొసెషన్ టీవీలో–

"రాకేష్ తిక్క వదిలిపోయింది. మనం బూతు, అశ్లీలం జోలికి పోవద్దు సార్ అంటే విన్నాడా? పైగా 'నేను చెప్పింది చెయ్– లేకపోతే నీ ఉద్యోగం గోవిందా అంటాడా?" అన్నాడు హనుమంతు కసిగా.

"పైగా మన సీరియల్స్‌లో కూడా అన్నీ అక్రమ సంబంధాలు, లవ్ ట్రాయంగిల్స్–

అంటూ సర్వనాశనం చేశాడు. నేనంటూనే ఉన్నా' ఇలాంటివి లేడీస్ చూడరు సార్ అని! ఇప్పుడు కళ్ళు తెరచుకుంటయ్ వాడికి–" అంది రాధా చమేలీ.

"దేనికయినా ఒక లిమిట్ ఉంటుంది? మూడునెలల్లో దీన్ని నెంబర్‌వన్ ఛానెల్ చేస్తాడంట ఈ మొఖం! తన ఫేస్ ఒకసారి అద్దంలో చూసుకోమను–" అంది సంగీత.

"అద్దంలో చూసుకునే వచ్చా! ఇంత కూడా తేడారాలా! నీ ఫేస్‌లో మాత్రం చాలా తేడా వచ్చింది. దౌజెండ్ వాట్స్ బల్బులా వెలిగిపోతుంది" ఓ పెద్ద స్వీట్ బాక్స్‌తో ఎంటరవుతూ అన్నాడు భవానీశంకర్.

అందరూ ఉలిక్కిపడ్డారు.

తమ కామెంట్స్ అతను విన్నాడేమో అని భయపడ్డారు గానీ భవానీ వాటిని పట్టించుకోలేదు.

"మీరిలాంటి దిక్కుమాలిన మీటింగ్ పెడతారని ముందే అనుకున్నా! అందుకే డైరక్ట్‌గా లోపలకు రాకుండా ఆపక్కన నిలబడి మీ కామెంటరీ అంతా విని అప్పుడు వచ్చా! అవును రాధా ఛమేలీ! అక్రమ సంబంధాలంటే అంత అలర్జీయా నీకు?"

రాధా ఛమేలీ కంగారు పడింది.

"నేను మాట్లాడింది మన సీరియల్స్‌లో సంగతి....." అంది సమర్థించుకుంటూ–

"నేనడిగేది రియల్ లైఫ్ సంగతి–"

ఆమె షాకయింది.

"అంటే?"

"చూడు– అక్రమ సంబంధం, సక్రమ సంబంధం అంటూ కేటగిరీ లేం లేవు. లైఫ్‌లో మనకు నచ్చిన వాళ్ళందరితోనూ ఫ్రెండ్ షిప్ చేస్తాం! ఆ ఫ్రెండ్‌షిప్స్‌లో ఒకోసారి అనేక పరిస్థితుల కాంబినేషన్‌ని బట్టి సంబంధాలేర్పతాయ్! అంతేగానీ సమాజం రూల్స్ బట్టి మనుష్యులు ప్రవర్తించరు! కాకపోతే ఆ రూల్స్‌ని ఫాలో అవుతున్నట్లు నటిస్తారు–"

రాధాఛమేలీ కేదో అనుమానం వచ్చింది.

కొంపదీసి తన కాలేజ్ డేస్ గురించి అతనికేమయినా ఇన్‌ఫర్మేషన్ దొరికిందా?

"ఓకే ఫ్రెండ్స్! ఇంత కాలానికి మన చానెల్‌కి ప్రజల్లో ఒక అద్భుతమయిన గుర్తింపు వచ్చింది. ఆ గుర్తింపు పాజిటివ్ దారిలో వచ్చిందా, లేక నెగెటివ్ వే లో వచ్చిందా అనేది మన కవసరం! అమెరికా ప్రెసిడెంట్ ఒబామాకి ప్రపంచవ్యాప్తంగా ఎంతమంచి గుర్తింపు ఉందో ఒసామా బిన్ లాడెన్‌కి అంతకంటే ఎక్కువ పాప్యులారిటీ ఉంది. అలాగే– ఒక



చానెల్ నెంబర్ వన్ పొజిషన్‌లోకి రావాలంటే ఏదొక గుర్తింపు కావాలి! ఆ గుర్తింపు పొందడానికి మొదటి మెట్టు ఆ ఊరేగింపు! మన చానెల్‌ని వాళ్ళుఎంత ఎక్కువ తిడితే అంత ఫేమస్ అవుతాం మనం! నన్ను ఇవాళ దుర్యోధనుడితో పోలుస్తేనే ఇంత సరదాగా ఉంది– రేపు రావణాసురిడితో పోలుస్తే ఇంకెంత ఫేమస్ అయిపోతానో చూసుకోండి– ఎనీవే– ఈ శుభసంధర్భంలో మీరందరూ నోరు తీపిచేసుకోవాలి–" అంటూ అందరికీ స్వీట్స్ పంచిపెట్టాడు. హనుమంతు మెల్లగా రాధా ఛమేలితో అన్నాడు.

"వీడుమెంటలా? మనం మెంటలా?"

* * *

సంపూర్ణ చానెల్ ఆ ఊరేగింపుని పెద్ద ఎత్తున– మిగతా కార్యక్రమాలన్నింటినీ ఆపి లైవ్‌గా కవరేజ్ ఇస్తూండడంతో– మిగతా చానెల్స్ అన్నీ కూడా అదే పాటపాడటం మొదలు పెట్టాయ్.

అప్పుడే టీవీ ఆన్ చేసిన రోజా, జైరాజ్ మొత్తం చానెల్స్ అన్నీ కవరేజ్ ఇస్తున్న ఆ ఊరేగింపుని చూశారు. వాన్‌మీద అతి సెక్సీగా ఉన్న ద్రౌపదీ– ఆమె చీర ఊడ బీకుతున్నట్లు నటిస్తోన్న ధుర్యోధనుడూ, అతని వీపుకి కట్టిన బృందావం టీవీ చానెల్' బోర్డూ చూసి షాకయ్యారు.

"నేను చెప్పానా డాడీ! ఇంత కాలం మన డబ్బు పోయిందనే బాధపడుతూ వచ్చాం! కానీ ఈ రాకేష్ వల్ల మన సిగ్గుకూడా పోయింది–" అంది రోజా బాధగా–

"నీ పాయింట్ కొంచెం వీక్‌గా ఉన్నది బిడ్డా?"

రోజా ఆశ్చర్యపోయింది. ఇది ఫస్ట్‌టైమ్. తనకూ తండ్రికీ అభిప్రాయాల్లో తేడా రావటం!

"ఎందుకని?"

"రాకేష్ ఒక్కడే తప్పు చేస్తున్నాడనుకోకు! మిగతా అన్ని చానెల్స్ కూడా ఎప్పటి నుంచో సెక్స్‌ని టూమచ్‌గా ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నయ్. ఎంటర్‌టైన్‌మెంట్ చానెల్స్ సీరియల్స్‌లోనే అక్రమ సంబంధాలను ప్రాపగేట్ చేస్తున్నయ్. లేదా వయొలెన్స్– స్త్రీల మీద శాడిజం, అత్యాచారాలు, మరిది వదినతో సెక్స్‌కోసం ప్రయత్నించెడివి, మామ కోడిలిని లోబరచుకోడానికి చూసెడిదీ; పెళ్లామే మొగుడిని ఇంకో లేడీనీ పడగ్గదిలో అప్పగించెదిదీ, బావమీద రివెంజ్ కోసం మరదలు వాడితో బెడ్ మీదపడు కొనెడిది–

అవన్నీ వదిలేసి పబ్లిక్ కేవలం బృందావనం చానెల్ గురించి గడబిడ ఎందుకు జేస్తున్రు? ఇందులో ఏదో మతలబ్ కానరావటంలే?"

తండ్రి వాదనలో చాలావరకూ నిజం ఉందనిపించింది రోజాకు.

"అవునూ! రాత్రి రాకేష్ ఇంటికి రాలేదెందుకని?" అడిగిందామె.

"రాకేష్ చాలా జిద్ మనిషమ్మా! ఈ మూడునెలలూ చానెల్లోనే 24 గంటలూ వర్క్ జేస్తా అంకుల్" అని చెప్పాడు.

రోజా ఆశ్చర్యపోయింది.

"ఆ కాండేట్ కింత సీనుందా?"

"ఉందేమో మళ్ళా- మనకేమెరుక?"

విజయ్ యాదవ్ అండ్ గాంగ్ లేవదీసిన ఆ ఊరేగింపు ఇప్పుడు బృందావన్ చానెల్ ఆఫీస్ స్టూడియోస్ దగ్గరకు చేరుకుంది.

ఆ ఊరేగింపులో పాల్గొన్న లేడీసంతా సెక్స్ వర్కర్స్ కావడంతో - వాళ్ళ చేష్టలకూ, డైలాగ్స్‌కీ జనం అవాల్సిన దానికంటే కొంచెం ఎక్కువగాన రియాక్ట్ అవుతున్నారు.

దాంతో బృందావనం చానెల్ చేరుకునేసరికి యాభైమందల్లా నూట యాభైమందయారు. వాళ్ళు ఏం చేస్తారో చూద్దామని గుమికూడిన జనం మరో రెండు వందలమంది జాయినయారు. దాంతో ట్రాఫిక్ జామ్ తప్పటం లేదు.

అక్కడకు రాగానే విజయ్ యాదవ్ స్లోగన్స్ మార్చేశాడు.

"బృందావనం చానెల్ ఇన్‌ఛార్జ్ రాకేష్- బయటకు రావాలి-"

"రాకేష్- బయటకు రావాలి!"

"రాకేష్- బయటకు రావాలి!"

"చేసిన తప్పుకి- క్షమార్పణ చెప్పుకోవాలి!"

"ముర్దాబాద్ రాకేష్ మాష్టర్- ముర్దాబాద్- ముర్దాబాద్"

చాలాసేపు కేకల తర్వాత బృందావనం చానెల్- ఇప్పుడు చానెల్ ఆఫీస్‌లో జరుగుతోన్న మీటింగ్‌ని కవరేజ్ ఇవ్వటం మొదలుపెట్టింది.

న్యూస్‌రీడర్ రంభ సెక్సీడ్రస్‌లో నిలబడి మీటింగ్ రూమ్‌లో ఉన్న జర్నలిస్ట్ శ్యామ్‌తో మాట్లాడుతోంది.

"శ్యామ్! బయట ప్రజలు చేస్తున్న ధర్నా విషయంలో మానేజ్‌మెంట్ ఎలా స్పందిస్తోంది! రాకేష్ గారేమంటున్నారు? ప్రజల కోరిక మేరకు బయటికొచ్చి పబ్లిగ్గా



క్షమార్పణ చెప్పే ఆలోచనలో ఉన్నారా?"

"రంభా! ప్రజలు బృందావనం చానెల్లో సెక్స్, అశ్లీలం దృశ్యాలు మితిమీరాయని శాంతియుతంగా జరుపుతున్న ధర్నా గురించి ప్రస్తుత చానెల్ సీఈఓ రాకేష్‌గారు ఎమర్జెన్సీ చానెల్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఆ మీటింగ్‌లో ఆయన ప్రసంగించటం మన ప్రేక్షకులు చూడవచ్చు-" అంటూండగానే మీటింగ్‌లో మాట్లాడుతున్న భవానీ కనిపించాడు.

"--చానెల్లో ప్రసారమవుతోన్న అశ్లీలాలకు వ్యతిరేకంగా ప్రజలు జరుపుతోన్న ధర్నా చూస్తూంటే నాకెంతో ఆనందంగా ఉంది. ఇప్పుడే వారందరితోనూ ముఖాముఖి కార్యక్రమం ప్రారంభిస్తున్నాను. ఎందుకంటే ఈ టీవీ ప్రేక్షకులే మాచానెల్ పాలిట దేవుళ్ళు!" అంటూ చానెల్ బయటకు నడుస్తోంటే కెమెరా అతనిని ఫాలో అయింది.

బయట నినాదాలు చేస్తోన్న జనమంతా భవానీని చూడగానే ఇంకా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. భవానీ మైక్ ముందు కొచ్చాడు.

"తమ తమ మనసులోని భావాలను- తమ ఫీలింగ్స్‌ని బృందావనం చానెల్‌కి తెలియజెప్పటానికి ఇంత శ్రమపడి వచ్చిన మా ప్రేక్షకులందరికీ నా గౌరవ నమస్సులు. మీలోనా అక్కలున్నారు- చెల్లెళ్ళున్నారు- తమ్ముళ్ళున్నారు- అన్నలున్నారు- మీ అందరికోరికనూ గౌరవించటం నా విధి! అందుకే మీ కెదురుగ్గా భక్తి ప్రపత్తులతో వచ్చాను- ముందుగా మా బృందావనం చానెల్ చేపట్టిన నూతన కార్యక్రమాల గురించి మీరొక్కసారి పున:పరిశీలన చేయవలసిందిగా కోరుతున్నా- మొదటిది "భగవంతుడా! మా సంస్కృతిని రక్షించు!" అనే కార్యక్రమం! ఇందులో మేము చూబిస్తోందంతా మన పిల్లలు కాలేజీల్లో చేస్తోన్న అసాంఘిక కార్యక్రలాపాలే! మన భారత దేశ సంస్కృతిని మర్చిపోయి బాయ్‌ఫ్రెండ్స్, గాళ్‌ఫ్రెండ్స్ అంటూ అక్రమ సంబంధాలే ర్పరుచుకుని, పాశ్చాత్య సంస్కృతికి బానిసలయి బార్లలో తాగి అసభ్యకరమయిన నృత్యాలు చేస్తూ, హొటల్ రూముల్లో డ్రగ్స్‌కి అలవాటుపడుతూ- ఈధోరణితో మన పిల్లల భవిష్యత్తు ఎటు వేపు ప్రయాణిస్తోంది? మన సమాజానికే ఒక ఛాలెంజ్‌గా మారిన ఈ విషవృక్షాన్ని ఎవరు చేధించాలి? ఎవరికివారే మనకెందుకులే అని ఊరుకుంటే పిల్లిమెడలో గంట కట్టే దెవరు? అందుకే మా బృందావనం ఆ ఛాలెంజ్‌ని ఎదుర్కోవాలని డిసైడ్ చేసుకుంది! అందులో భాగంగానే ఈ నూతన కార్యక్రమాన్ని ప్రారంభించాం! మన సమాజంలో స్త్రీల మీద అత్యాచారాలు ఎక్కువయి పోయాయ్. యాసిడ్ దాడులు ఎక్కువయిపోయాయ్. రావణాసురుడి టైప్‌లో తనను ఇష్టపడని గాళ్స్‌ని కిడ్నాప్ చేసే దుర్మార్గులెక్కువయిపోయారు.

ఇలాంటి అకృత్యాలను ఉతికి ఆరేయడానికే “ఈ రేప్‌ల సంస్క ృతికి ఇప్పుడో చిన్న బ్రేక్” అనే ప్రోగ్రామ్‌ని మేము ప్రారంభించాం!

అందులో రాష్ట్రంలోనూ, దేశంలోనూ జరుగుతోన్న రేప్ కేస్‌ల గురించీ, రేప్ చేయబడిన స్త్రీల గురించీ– వీడియోతోపాటు– వాళ్ళ ఇంటర్వ్యూలు చూబిస్తున్నాం–

ఎందుకంటే మరెంతోమంది అమాయక స్త్రీలు అలాంటి అవాంతరాల నుంచి తమను తాము రక్షించుకోవటం కోసం! అలాంటి దుర్మార్గానికి పాల్పడ్డ మానవ మృగాల మీద పోలీసులు ఏం చర్య తీసుకున్నారో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయటం కోసం–

అలాగే చాలామంది స్త్రీలు లైంగిక వేధింపులకు గురికావటం మనందరికీ తెలుసు. కానీ అలాంటి వేధింపులకు గురిచేస్తున్న మగాళ్ళ గురించి ప్రపంచానికి ఎట్లా తెలియజెప్పాలో తెలీక వాళ్ళల్లో వాళ్ళే కుమిలిపోవటం మాకు తెలుసు.

అలాంటి స్త్రీలు ధైర్యంగా, తమ ఆవేదనను వెలిబుచ్చుకోడానికి ఏర్పాటు చేసిన ప్రోగ్రామ్ “ఈ వేధింపులకు అంతం లేదా?”

ఇక అన్ని టీవీ చానెల్స్‌లోనూ సెక్స్ అండ్ క్రైమ్ గురించి చూబిస్తున్నారు.

కానీ మేము వాటిని మా చానెల్ వ్యూయర్‌షిప్ కోసం వాడు కోవటం లేదు.

అందుకే సినిమాల్లో చూపిస్తోన్న సెక్స్ అండ్ వయొలెన్స్ వల్ల మన సమాజానికి ఎంత నష్టం జరుగుతోందీ రోజూ రాత్రి పదకొండు గంటలకు ఈ సినిమాలు సమాజాన్ని నాశనం చేయటం లేదా?” అనే ప్రోగ్రామ్‌లో చూపిస్తున్నాం.

అలాగే ఎయిడ్స్ గురించి ఏమాత్రం అవగాహన లేని మా ప్రేక్షకులలో అవేర్‌నెస్ కలిగించటం కోసం “కొత్తకోణం’ అనే ప్రోగ్రాంలో ప్రారంభించాం. ఎంత ఖర్చయినా వెనుకాడకుండా మేమీ కార్యక్రమాలన్నీ ఎందుకు చేస్తున్నాం. కేవలం మన తెలుగు ప్రజలంతా అలాంటి అవాంఛనీయ ధోరణులకు– బలి కాకూడదని! ఇలాంటి యుద్ధం మొదలెపెట్టినందుకు నా చానెల్‌ని పేల్చివేస్తామని కొందరు ఫోన్లు చేస్తున్నారు. నా ప్రాణాలు తీస్తామని ఇంకొకరు బెదిరిస్తున్నారు– కానీ నేను భయపడను. సంతోషంగా ప్రాణాలు ధారఫోస్తాను గానీ నా తెలుగు ఆడపడచులకు అన్యాయం జరగనివ్వను!

మీరిప్పుడు చెప్పండి! ఇలాంటి ప్రోగ్రామ్స్ అవసరం మన సొసైటీకుందా లేదా? ఇంకే చానెల్ కూడా చేయలేని ఈ యజ్ఞాన్ని మేము కొనసాగించాలా వద్దా! మీరేం చెప్తే అదే మాకు వేద వాక్కు– చెప్పండి! మా ప్రోగ్రామ్స్‌కి మీ అంగీకారం ఉందా? లేదా?”



జనమంతా స్పెల్‌బౌండ్ అయిపోయారు. కొద్దిక్షణాల నిశ్శబ్దం తర్వాత విజయ్ యాదవ్ ముందుకొచ్చాడు.

“సార్! ఈ ప్రోగ్రామ్స్ వెనుక మీరింత పెద్దయుద్ధం డిక్లేర్ చేశారని మాకు తెలీలేదు సార్– ఈ క్షణం నుంచీ మేమంతా మీ చానెల్‌కి సైనికులమవుతాం! మీరు చేస్తున్న యుద్ధాన్ని మేము కంటిన్యూ చేస్తాం! మీ చానెల్ ఆధ్వర్యంలో మన రాష్ట్రంలో ఎక్కడే అశ్లీల శక్తులు కనిపించినా వాటిని రూపుమాపుతాం–” అన్నాడు ఆవేశంగా. దాంతో మిగతా అందరూ కూడా బృందావనం చానెల్ జిందాబాద్– రాకేష్ మాస్టర్ జిందాబాద్– బృందావనం చానెల్ యుద్ధం – గెలుపొందాలీ–” అంటూ నినాదాలు ప్రారంభించారు.

అప్పటికప్పుడే కొంతమంది స్త్రీలు అరుగు ఎక్కి నృత్యాలు ప్రారంభించారు. సంపూర్ణ చానల్‌ని చూస్తోన్న మల్లిక ఒక్కసారిగా పరిస్థితి అంతా రివర్స్ అయిపోయే సరికి షాకయింది.

తన బాస్ అన్నట్లు ఈ రాకేష్‌ది పర్వర్టెడ్ ఇంటెలిజెన్స్! అనుకుందామె.

* * *

ఒక్క సంఘటనతో బృందావనం చానెల్ వ్యూయర్ షిప్ విపరీతంగా పెరిగి పోయింది.

రాకేష్ అనేవాడు తన ప్రాణాలకు తెగించి మన సంస్క ృతిని నిలబెట్టేందుకు చేస్తున్న పోరాటానికి తెలుగు ప్రజలంతా మద్దతు తెలుపుతున్నాం! ఈ ధర్మ యుద్ధంలో బృందావనం చానెల్ విజయం కోసం మేమంతా మా ప్రాణాలర్పించడానికి సిద్ధంగా ఉన్నాం– ఇట్లు తెలుగు ప్రజల సంస్కృతి సంరక్షణ సమితి అంటూ రాష్ట్రంలో చాలా చోట్ల వాల్‌పోస్టర్స్ వెలిశాయ్.

ఆ తరువాత భవానీ ప్రారంభించిన కొత్త ప్రోగ్రాం ఇంకా పెద్ద హిట్టయింది. గాళ్స్, బాయ్స్ తీసిన ప్రైవేట్ వీడియోస్ అన్నీ” ఓ చూపు చూస్కో” అనే కార్యక్రమంలో టెలికాస్ట్ చేయటమే ఆ కార్యక్రమం!

ఆ వీడియోలో ఏమయినా ఉండవచ్చు. ఎలాంటి డాన్స్‌లయినా చేయవచ్చు. ఆ వీడియో రన్ అవుతున్నంతసేపూ ఆ అమ్మాయిపేరు, క్వాలిఫికేషన్, సెల్‌నెంబర్, హాబీలు, అభిమాన సినిమా హీరోల పేర్లూ– ఎలాంటి క్వాలిటీస్ ఉన్న బాయ్స్‌ని తను లైక్ చేసేదీ– అన్నీ స్క్రోల్ అవుతూంటాయ్.

ఆ ప్రోగ్రాంలో కనబడటం కోసం బాయ్స్, గాళ్స్ వెర్రెక్కి పోయినట్లు వీడియోలు తీసి పంపటం మొదలుపెట్టారు.

అలాంటి కార్యక్రమాల్లోకి క్రమేపీ సెక్స్‌వర్కర్స్ కూడా జొరబడతారని భవానీకి ముందే తెలుసు.

ఎందుకంటే మిగతా చానెల్స్‌లో చాలామంది చేస్తున్న పనదే! వేశ్యలకూ విటులకూ మధ్య బ్రోకర్స్‌లాగా ఎవరికి ఎవరు కావాలో– ఏ టైమ్‌కి ఏ లాడ్జ్ దగ్గర కలుసుకోవాలో– అన్నీ స్క్రోలింగ్‌లో వస్తూనే ఉంటాయ్. రోజాకి భవానీ మీద ఉన్న చెడ్డ అభిప్రాయం స్లోగా మారిపోసాగింది. ఎవరినోటి వెంట చూసిన బృందావన్ చానెల్ మాట వినబడుతోంటే, ఆమె కన్‌ఫ్యూజన్‌లో ఉంది.

తను చేసి ప్రోగ్రామ్స్ ప్రేక్షకుల కెందుకు వచ్చలేదు? రాకేష్ చేస్తున్న చెత్త ప్రోగ్రామ్స్ ఎందుకు నచ్చుతున్నయ్?

ఒకవేళ ఈ నాటి యూత్‌కి అవే కావాలేమో! స్త్రీలు కూడా ఎక్స్‌ట్రా మారిటల్ ఎఫైర్స్ ఉన్న కథలే కోరుకుంటున్నారేమో–

వారం వారానికీ రేటింగ్‌పెరిగిపోతోన్న బృందావనం ప్రోగ్రామ్స్ చూస్తూంటే ఆమెకు మతిపోతోంది.

ఈ లెక్కన అతను మూడునెలల్లో బృందావనాన్ని నెంబర్‌వన్ చానెల్ చేసేయగలడేమో! అదంత తేలికకాదని తనకు తెలుసు. కానీ రాకేష్ కూడా సామాన్యుడు కాదు–

* * *

ఆ తరువాత భవానీశంకర్ చేసుకున్న లోఫాయికారీ డీల్ వల్ల బృందావన్ చానెల్ డిగ్నిటీ పెరిగిపోయింది.

వచ్చే ఎలక్షన్స్‌లో అధికారంలోకి రావడానికి అవకాశాలున్న ప్రముఖ రాజకీయ పార్టీ ఈతరం పార్టీతో కుదుర్చుకున్న డీల్ ప్రకారం– వాళ్ళు ఆ చానెల్‌కి పదికోట్ల రూపాయలు విలువగల పొలిటికల్ యాడ్స్ ఇస్తారు. అందుకు ప్రతిఫలంగా అపార్టీ బృందావన్ చానెల్ని వచ్చే ఎలక్షన్స్‌లో తమ పార్టీ ప్రచారానికి వినియోగించుకుటుంది. ఆ పార్టీకి చెందిన ఇండస్ట్రీస్ అన్నీ కూడా బృందావన్ చానెల్లో యాడ్స్ రిలీజ్ చేస్తారు.

ఒక్కసారిగా బృందావన్ చానెల్లో పెరిగిపోయిన యాడ్స్ చూసి మల్లిక జెలసీ



ఫీలయింది.

భవానీశంకర్ ఇచ్చిన స్వేచ్ఛతో యాంకర్లు, జర్నలిస్ట్‌లూ అందరూ రాత్రింబ గళు ్ళ తిరుగుతూ జనాన్ని ఆకట్టుకునే స్టోరీస్ షూట్ చేసుకొస్తున్నారు.

విజయ్‌యాదవ్ బాచ్ ఇప్పుడు ఫుల్ బిజీ అయిపోయారు. పెన్ కెమెరాలు తీసుకుని వీధుల్లో, గవర్నమెంట్ ఆఫీసుల్లో లంచాల కేస్‌లన్నీ రహస్యంగా షూటింగ్ చేసి "బ్రేకింగ్ కర్రప్షన్" అనే ప్రోగ్రామ్ కింద టెలికాస్ట్ చేస్తున్నారు. దాంతో యాంటి కర్రప్షన్ బ్యూరో వాళ్ళు బృందావన్ చానెల్‌ని ఫాలో అవటం మొదలుపెట్టారు.

ఈతరం పార్టీ నేతల ఇంటర్‌వ్యూ కోసం తిరుగుతోన్న మల్లిక– తను వెళ్ళిన చోటల్లా బృందావనం చానెల్‌కి ఇస్తోన్న ప్రాముఖ్యత గమనించి చాలా ఇరిటేటింగ్‌గా ఫీలయింది.

"మాది నెంబర్‌వన్ చానెల్‌సార్– ఇంటర్‌వ్యూ మాకివ్వకుండా ఆ బృందావనం చానెల్ కిస్తున్నారేంటి?" అడిగింది పార్టీ సెక్రటరీని.

"మాక్కావలసింది ఏది నెంబర్‌వన్ అనేదికాదు. దేనికి జనంలో ఎక్కువ ఫాలోయింగ్ ఉందీ అనేది" అన్నాడతను.

అప్పుడే లోపల్నుంచి కెమెరాతో బయటికొస్తున్న భవానీ ఆమెకు విష్ చేశాడు.

"హాయ్! నెంబర్‌వన్– హౌ ఆర్ యూ"

"నేనెక్కడికెళ్తే నువ్వక్కడ కొచ్చి న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్నావ్" అందామె చిరాగ్గా.

"అదే నేనూ అంటే?"

"నువ్వెంత ట్రై చేసినా నెంబర్‌వన్‌వి కాలేవు! గుర్తుంచుకో–"

"అవకపోతే నాకొచ్చిన నష్టం ఏమీ లేదు. కానీ అయితే నీ గతేమవుతుందో ఒకసారి ఫ్లాష్ ఫార్వార్డేసి చూసుకో–"

"నేనుండగా అలాంటిది జరగదు–" ఉక్రోషంగా అంది.

సెక్రటరీ ఆమె దగ్గర కొచ్చాడు.

"సారీ మేడమ్! మా బాస్ అర్జంట్ పనిమీద వెళ్తున్నారు. మీ ఇంటర్‌వ్యూ ప్రస్తుతానికి కౌన్సిలయింది–"

మల్లిక ఇంకా మండిపడింది.

"సరే– ఆ ఇంటర్‌వ్యూ వల్ల మీకే లాభం! మాక్కాదు" అనేసి వెళ్ళిపోతూంటే భవానీ హేళనగా నవ్వాడు.

"హౌ ఎబౌట్ షేరింగ్ డియర్?"

"ఏంటి షేరింగ్?" కోపంగా అడిగింది.

"ప్రస్తుతానికి ఈ ఇంటర్వ్యూ - తర్వాత దేనికయినా నేను రడీ-"

"షటప్- ఆ బోడి ఇంటర్వ్యూ ఎవడికీ అవసరం లేదు-"

విసవిస నడిచి వెళ్ళిపోయింది.

* * *

ఆ రాత్రి ఒంటిగంటకు భవానీ స్టూడియోలో కూర్చుని మర్నాడు టెలికాస్ట్ అవబోతూన్న ప్రోగ్రామ్స్‌లో మార్పులూ చేర్పులూ చేస్తూంటే అతని ఆఫీస్ ఫోన్‌మోగింది.

"అన్నా! నేను విజయ్‌ని మాట్లాడుతున్నా!" రహస్యంగా గొంతు తగ్గించి మాట్లాడాడు విజయ్.

"మనం ఎక్స్‌పెక్ట్ చేసింది కరెక్టే అన్నా! స్వామి రూపానంద ఆశ్రమానికి నేను టీవీలో చిన్న చిన్న వేషాలేసే మహీరాని తీసుకెళ్ళి స్వామిజీకి నా భార్య అని పరిచయం చేశాను. మహీరా స్వామిజీ బోధలు వింటూ ఆయనకు శుశ్రూషలు చేస్తూ కొద్ది రోజుల ఆ ఆశ్రమంలోనే గడుప దల్చుకుందని చెప్పాను- స్వామిజీ తనకు లేడీస్ శుశ్రూషలు చేయటం నచ్చదని అన్నాడు గానీ నేను బ్రతిమాలేసరికి వప్పుకున్నాడు. ఆశ్రమానికి నేను వెంటనే పాతిక వేల రూపాయలు డొనేషన్ ఇచ్చేసేసరికి స్వామీజీ పొంగిపోయాడు. నేను మరో పదిహేను రోజుల తర్వాత వస్తానని చెప్పి వచ్చేశాను- నేను వచ్చేసిన రెండోరోజే అంటే గంటక్రితం మహీరా ఫోన్ చూసింది. స్వామీజీ తన భక్తురాళ్ళతో జరుపుతున్న శృంగారాన్ని తను వీడియో తీసిందంట. నేను ఇప్పుడే టాక్సీలో వెళ్ళి తెల్లారేసరికల్లా ఆశ్రమానికి చేరుకుని మహీరాతో సహా తిరిగివస్తాను. అంటే షుమారు మధ్యాహ్నం నుంచీ మనం ఆ వీడియోని మన చానెల్లో టెలికాస్ట్ చేయవచ్చు-"

భవానీ హాపీగా ఫీలయ్యాడు.

"ఒండర్‌ఫుల్ విజయ్- ఇలాంటి బ్రేకింగ్ న్యూస్‌లే మన చానెల్ని నెంబర్ వన్‌గా చేసేది. నేను రేపు మాణింగ్ నుంచే పేరు చెప్పకుండా ఒక ప్రసిద్ధ స్వామీజీ తన ఆశ్రమంలో జరుపుతున్న రహస్య శృంగారకేళి! మరి కొద్దిసేపట్లో- కేవలం మీ బృందావనం చానెల్లో మాత్రమే అని వేసేస్తాను- దాంతో ప్రేక్షకుల్లో మాణింగ్ నుంచే సస్పెన్స్ బిల్డప్ అవుతుంది-"

"ఓకే అన్నా- నేను బయల్దేరుతున్నా- బై" ఫోన్ పెట్టేశాడతను.



భవానీ ఫోన్ పెట్టేయబోతూండగా క్లిక్ మన్న శబ్దం వినిపించింది. ఒక్క క్షణం భవానీ శంకర్‌కి అనుమానం వచ్చింది. ఆ శబ్దం వచ్చిందంటే తమ ఫోన్ ఎవరో టాప్ చేస్తున్నారని అర్థం!

నిజంగా ఎవరయినా తమ సంభాషణలను టాప్ చేస్తున్నారా? ఎవరికా అవసరం ఉంటుంది. ఇలాంటివన్నీ పోలీసులుగానీ, సెక్యూరిటీ ఏజెన్సీస్‌గానీ చేస్తారు.

మర్నాడు ఉదయం ఆరునుంచే బృందావనం చానెల్లో "ఒక పేరు ప్రతిష్టలున్న స్వామీజీ తన ఆశ్రమంలో సాగిస్తోన్న రహస్య శృంగార కేళి- మొత్తం స్టోరీ- వీడియోతో సహా - త్వరలో- చానెల్ ఆఫ్ చేయకండి- మార్చకండి! ఇది కేవలం బృందావనం చానెల్ ప్రేక్షకులకు ప్రత్యేకం" అంటూ భయంకరమయిన మ్యూజిక్‌తో ఫ్లాష్ చేయటం మొదలుపెట్టాడు.

సరిగ్గా అరగంట గడిచేసరికి ఫోన్ మోగింది.

విజయ్ కంగారుగా మాట్లాడాడు.

"అన్నా కొంప మునిగింది-"

"కొంపలున్నది మునగడానికే- ఊరికే ఎగ్జయిటయిపోకు! ఏంటి మేటరు?"

"నేను మాణింగ్ సిక్స్ థర్టీకి స్వామీజీ ఆశ్రమం చేరుకున్నా! పది నిమిషాల క్రితమే మహీరా బంధువులెవరో వచ్చి ఆమెను తీసుకెళ్ళారని ఆశ్రమంలో వాళ్ళు చెప్పారు. మహీరా సెల్‌కి ఫోన్ కొడితే సెల్ ఆఫ్ ఉంది-"

"ఒక్క నిమిషం లైన్‌లో ఉండు" అంటూ పక్కనే ఉన్న టీవీలో చానెల్ మార్చి సంపూర్ణ టీవీ ఆన్‌చేశాడు.

అందులో కూడా బ్రేకింగ్ న్యూస్ ఫ్లాష్ అవుతోంది.

రాష్ట్రమంతా పేరు ప్రతిష్టలు గల స్వామిజీ రూపానంద రాసలీలలు! ఆశ్రమంలో తన భక్తురాళ్ళతో ఎంతో కాలంగా జరుపుతోన్న కామకేళి! కొద్దిసేపట్లోనే వీడియో దృశ్యాలు కేవలం సంపూర్ణ చానెల్ ప్రేక్షకుల కోసం ప్రత్యేక ప్రసారం"

భవానీ షాకయ్యాడు.

అయితే రాత్రి తన ఫోన్ టాప్ చేసింది మల్లికేనన్న మాట!

"హలో అన్నా" పిలిచాడు విజయ్ యాదవ్.

"మహీరాను సంపూర్ణ చానెల్ కొనేసి, కిడ్నాప్ చేసింది బ్రదర్! కనుక ఇంక ఆమె కోసం వెతకటం వృథా! వచ్చేసెయ్-"

"ఓగాడ్! అదెలా జరిగిందన్నా! మనం చాలా సీక్రెట్‌గా చేశాంకదా ఇది! పైగా మనకు యాభైవేలు ఖర్చయ్యాయ్–"

"డోంట్‌వర్రీ బ్రదర్– ఇలాంటి చీటింగ్ ఈ ఫీల్డులో కామన్! ఇంక ఆ విషయం మర్చిపో! అంతకంటె పెద్ద స్కూప్ ఒకటి టేకప్ చేద్దాం–"

ఫోన్ పెట్టేశాడు భవానీ–

ఎదురుగ్గా హనుమంతు నిలబడి ఉన్నాడు.

"సార్! ఆ స్వామీజీ స్కాండల్ మన చానెల్‌కి తప్ప ఇంకెవరికీ తెలీదు అన్నారు కదా! సంపూర్ణ చానెల్ టెలికాస్ట్ చేస్తోంది అప్పుడే–"

"వదిలేసెయ్ హనుమంతూ! సంపూర్ణ చానెల్ చూపించిన విజువల్సే మనం కూడా చూబిద్దాం!"

"ఓకేసార్–"

ఆ సాయింత్రమే జైరాజ్‌కి పరిచయమున్న ఒక పోలీస్ అధికారిని నిజాం క్లబ్‌లో కలుసుకున్నాడు భవానీ!

"మా బృందావనం చానెల్‌ని ఇగో– ఈ అబ్బాయే నడుపుతున్నాడన్నట్లు! పేరు రాకేష్! రాకేష్ మా చానెల్‌ని నంబర్‌వన్ జేయాలని జబర్దస్త్ కోషిష్ చేస్తుండు. మా వాడికి మీ పోలీస్ డిపార్ట్‌మెంట్ హెల్ప్ గూడా ఉందనుకో! ఈజీగా టార్గెట్ చేర్తాడు– ఏమంటున్న?" పోలీస్ అధికారి నవ్వాడు.

"ఏం మదద్ కావాలె?" భవానీ వేపు చూస్తూ అడిగాడతను.

"మీకు రిపోర్ట్ అయ్యే సెన్సేషనల్ క్రైమ్‌కేసులన్నీ ముందు మా చానెల్ కే ఇన్‌ఫర్మేషన్ ఇవ్వాలి సార్. మేము ఆ క్రైమ్‌కి సంబంధించిన వీడియో, ఇంటర్వ్యూలు అన్నీ తీసుకున్న తర్వాతే– ఆ విషయాలు మిగతా చానెల్ కివ్వాలి–"

"నీ యవ్వ ప్రతి చానెలోడూగిట్లనే అడుగుతుంటే మేమేం జెయ్యాలె!"

జైరాజ్ లాగి అతని వీపు మీద కొట్టాడు.

"ఏరా బిడ్డా! మిగతా చానెలోళ్ళూ నేనూ ఒక్కటే నేరా? నువ్ మహబూబ్ కాలేజ్‌లో చదివేప్పుడు జేసిన దందాలన్నీ నా చానెల్లో స్పెషల్ ప్రోగ్రాం వేయాల్నా ఏంది?"

"అరె నీయవ్వ! గిట్ల బ్లాక్‌మెయిల్ జేస్తున్నావేందిరా!"

భవానీ మళ్ళీ మాట్లాడాడు.

"చూడండి సార్ ! మీరిలా మాకు అబ్లిగేషన్ చేసినందుకు మేము ఆ క్రైమ్ ఏరియాకు



సంబంధించిన పోలీస్ స్టేషన్‌కి కేస్‌కి యాభైవేల రూపాయలు గిఫ్ట్ ఇస్తాం!"

పోలీసాఫీసర్ ఉలిక్కిపడ్డాడు.

"యాభైవేలా? అంటే లంచమా?"

"గిఫ్ట్ అంటూంటే నువ్ లంచమంటావేం రా?" చిరాకు పడ్డాడు జైరాజ్.

"అయితే ఓకే– నీ పేరేమన్నావ్? రాకేష్ కదూ?"

"అవున్సార్–"

"నువ్ యాభైవేలు గిఫ్ట్ ఇస్తానంటే మా స్టాఫ్ గూడా ఖుషీతోటి నీకు కోపరేట్ జేస్తరు! ఇయాళే నేను అన్ని స్టేషన్స్‌కీ అనఫీషియల్‌గా చెప్తా! కానీ ఈ మేటర్ మన ముగ్గురి మధ్య ఉండాలి! ఏమంటున్నా?"

"కాలేజ్ డేస్‌లో నువ్ జేసిన దందాలు గురించి నేనెవళ్తోటయినా చెప్పినాన్రా?" జైరాజ్ అనేసరికి ముగ్గురూ నవ్వుకున్నారు.

జైరాజ్, భవానీ చానెల్‌కి తిరిగి వస్తూంటే జైరాజ్ అడిగాడు.

"మరి పోలీసులు కివ్వనికి అన్ని పైసలు ఏడకెళ్ళోస్తయ్ రా భయ్! మన చానెల్ లాస్‌లో నడుస్తున్నది గదా!"

"డోంట్ వర్రీ అంకుల్! రైట్ ట్రాక్‌లో వెళ్ళే వాళ్ళకి లాస్‌గానీ– రాంగ్ ట్రాక్‌లో వెళ్ళే వాళ్ళకి డబ్బే డబ్బు! మన చానెల్ బాంక్ బాలెన్స్ ఎంతో తెలుసా ఇప్పుడు?"

"ఎంత?"

"తొంభయ్ లక్షలు–"

జైరాజ్ షాకయ్యాడు.

"తొంభయ్ లక్షలూ?"

"అవును–"

"ఎలా వచ్చిందంత డబ్బు?"

"చెప్పాను కదంకుల్! చానెల్ అనేది రెండు వేపులా పదునున్న కత్తి! సమాజానికి మేలూ చేయవచ్చు! బ్లాక్‌మెయిల్ చేసి డబ్బూ సంపాదించుకోవచ్చు–"

"మైగాడ్! బ్లాక్‌మెయిల్ చేస్తున్నావా?" గాబరాగా అడిగాడు జైరాజ్.

"అలా పరేషానవకంకుల్! చాలా టీవీ చానెల్స్, బ్లాక్‌మెయిమింగ్‌తోనే బ్రతికి బట్ట కడుతున్నయ్! నీతి నియమాలను గాలికొదిలి చానెల్‌ని రాజకీయ పార్టీల కమ్మి, పార్టీలకూ, రాజకీయ నాయకులకూ ప్రచారం సాధనాలుగా పని చేస్తున్నయ్.

గవర్నమెంట్ కూడా న్యూస్‌పేపర్స్– టీవీ చానెల్స్ నోళ్ళు మూయించడానికని వాళ్ళకు ఇళ్ళస్థలాలిచ్చీ, ఇళ్ళిచ్చీ, మెడికల్ ఫెసిలిటీస్ ఇచ్చీ– వాళ్ళను కొనుక్కుంటోంది.

ఒక విధంగా ఇది ఒక బ్లాక్‌మెయిలింగ్ గేమ్! పోలీసులూ, ఇండస్ట్రియలిస్ట్‌లూ, రాజకీయ నాయకులూ, గవర్నమెంటూ, మీడియా అందరూ ఆ గేమ్‌లో ఆటగాళ్ళే! అయితే ఆ మాచ్ ఫిక్సింగ్ సంగతి ప్రజలకు తెలీదు!"

జైరాజ్ తల తిరిగిపోయింది.

"ఎంత డీప్‌గా స్టడీ జేసినావ్ రా భయ్! ఈ జనరల్ నాలెడ్జ్ లేకపోబట్టే రోజా ఫెయిలయిపోయింది–"

ఇద్దరూ చానెల్ చేరుకునేసరికి సన్‌షైన్ సూపర్ స్పెషాలిటీస్ ఎం.డీ. భవానీ శంకర్ కోసం వెయిట్ చేస్తూ కలిపించాడు.

"గుడీవినింగ్! నేను సన్‌షైన్ హాస్పిటల్స్ ఎం.డి. మహేష్‌ని!" భవానీ అతన్తో కరచాలనం చేశాడు.

"ప్లీజ్ కూర్చోంది! నా పేరు రాకేష్–"

మహేష్ కూర్చుని కొంచం డౌటుగా జైరాజ్ వేపు చూశాడు.

"ఆయన మా అంకులే! ఈ చానెల్ ఆయన్దే– కనుక మీరెలాంటి అనుమానం లేకుండా ఓపెన్‌గా మాట్లాడవచ్చు–"

"ఇవాళ మధ్యాహ్నం మా హాస్పిటల్లో ఒక ఇన్సిడెంట్ జరిగింది. మా డాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఒక పేషెంట్ చనిపోయింది. పేషెంట్ బంధువులు గొడవకు దిగారు. డాక్టర్ మీద దాడిచేశారు. మా వార్డ్ బాయ్‌లు కూడా డాక్టర్‌తోపాటు పేషెంట్‌కి ఆపరేషన్ చేశారని వాళ్ళ ఆరోపణ!" చెప్పాడు మహేష్. విజయ్ యాదవ్ అనే మీ చానెల్ జర్నలిస్ట్ జరిగిందంతా ఇంటర్‌వ్యూలు తీసుకున్నాడు. ఆ మేటర్ మీ చానెల్లో నైట్‌కి టెలికాస్ట్ అవబోతోంది" చెప్పాడతను.

"అవును! ఇంతకూ ఇప్పుడు మీరు దేనికొచ్చినట్లు?" అడిగాడు భవానీ.

"చూడండి రాకేష్! ఆ వార్త, ఆ వీడియో, ఆ ఇంటర్‌వ్యూలు టెలికాస్ట్ అవకుండా మీరు మాకు హెల్ప్ చేయాలి! అందుకు మీరేం కండిషన్స్ పెట్టినా మీట్ అవడానికి మేము సిద్ధంగా ఉన్నాం–"

జైరాజ్ నిశ్చేష్టుడయి వింటున్నాడతని మాటలు.

"కానీ అలా వార్డ్‌బాయ్స్‌ని కూడా ఆపరేషన్ చేయడానికి వాడటం చాలా దారుణం



కదా?" భవానీ అడిగాడు.

"ఇవన్నీ మనదేశంలో చాలా కామన్ మిస్టర్ రాకేష్! ఎంత పెద్ద హాస్పిటలయినా వార్డ్‌బాయ్‌లు, నర్స్‌లు, అటెండర్లు– డాక్టర్స్‌తో పాటు ఆపరేషన్స్ చేస్తూనే ఉంటారు. ఒకోసారి ఎమర్జెన్సీస్‌లో డాక్టర్స్ అసలు లేకుండా– వాళ్ళే మొత్తం ఆపరేషన్లు చేసేస్తారు–"

భవానీ ఒప్పుకున్నాడు.

"నాకు తెలుసు! ఢిల్లీ ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లోనే వార్డ్‌బాయ్‌లు ఆపరేషన్స్ చేశారు. అన్ని పేపర్లలో టీవీ చానెల్స్‌లో ఆ న్యూస్– వీడియో క్లిప్పింగ్స్‌తో సహా వచ్చింది–"

"యా! యూ ఆర్ రైట్! కనుక ఇది మనదేశంలో చాలా నార్మల్ ప్రాక్టీస్! ఇదే విదేశాల్లో అయితే అందరినీ ఉరితీస్తారు. మనకాభయం లేదు– అయ్ లవ్ ఇండియా!"

"ఓకే– ఆ న్యూస్ టెలికాస్ట్ చేయకుండా ఆపితే మాకేమిటి లాభం?"

"కాష్! ఎంత కావాలో అడగండి!"

"సారీ! కాష్ వద్దు! దాని బదులు మీరు మా చానెల్లో కొన్ని ప్రోగ్రామ్స్‌ని స్పాన్సర్ చేయండి! అయిదేళ్ళపాటు ఆ ప్రోగ్రామ్స్‌నిని స్పానర్ చేయడానికి ఒప్పుకుంటున్నట్లు కంట్రాక్ట్ సైన్ చేయండి–"

"గుడ్! మీ పద్ధతి నాకు నచ్చింది. అందరూ డబ్బుకి ఆశపడతారు. మీరు చానెల్‌ని నిలబెట్టటానికి ప్రయత్నిస్తున్నారు– ఇటీజ్ ఓకే– కంట్రాక్ట్ హాస్పిటల్‌కి పంపండి. సంతకం చేసి పంపిస్తాను–"

"థాంక్యూ–"

అతను వెళ్ళిపోయాడు.

జైరాజ్ తల తిరిగిపోయింది.

"రాకేష్! నాకో డౌట్–"

"ఏంటంకుల్ అది?"

"మనం నిజాల్ని పబ్లిక్‌కి తెలీకుండా దాయటం– అన్యాయం, అక్రమం, కాదూ?"

"అవునంకులే! కానీ మన నికృష్టమైన డెమోక్రసీలో మీడియా కూడా తనవంతు దుర్మార్గం తనూ చేస్తోంది. బ్లాక్‌మెయిలింగ్, మీడియా అమ్ముకోవటం– ఇవన్నీ ఈ రాట్‌రేస్‌లో ఒక భాగం! ఈ సిస్టమ్ మార్చటం ఎవడివల్లాకాదు. మీలాంటి కాంషస్ ఉన్నవాళ్ళు ప్రయత్నించినా ఆ అవినీతి ప్రవాహంలో పడి కొట్టుకుపోవాల్సిందే! ప్రస్తుతం

నా ధ్యేయం ఒక్కటే! నా చానెల్ నెంబర్ వన్ అవాలి! మిగతాదేమీ నాకు సంబంధం లేదు–"

జైరాజ్ ఆలోచనలో పడిపోయాడు.

* * *

మరో నాలుగు రోజుల తర్వాత వచ్చిన వ్యూయర్‌షిప్ రేటింగ్ చార్ట్ చూసి రోజా నిశ్చేష్టురాలయింది.

ఇంచుమించుగా నెంబర్ టూ పొజిషన్ కొచ్చింది బృందావనం చానెల్! అదెలా సాధ్యమయిందో ఆమెకే మాత్రం అర్థం కావటం లేదు.

ఆ చార్ట్ తీసుకుని తండ్రి గదిలోకి వచ్చింది.

"డాడీ! మీరు చెప్పింది నిజమే! నేనేంటో అనుకున్నా గానీ ఈ రాకేష్ జీనియస్!"

జైరాజ్ నవ్వాడు.

"మన చానెల్ నెంబర్‌వన్ కాకపోయినాగానీ నేనిప్పుడు హాపీ బిడ్డా! ఎందుకో ఎరుకనా? ఇయ్యాళేపు ఎవళ్లు మాట్లాడినా గానీ బృందావనం చానెల్ గురించే మాట్లాడుతున్రు–"

"నాకెందుకో అనిపిస్తోంది డాడీ! ఈ రాకేష్ ఖచ్చితంగా టార్గెట్ రీచ్ అవుతాడు!"

"ఇలాంటి క్రూషియల్ టైమ్‌లో– నువ్వు కూడా చానెల్‌కెళ్ళి రాకేష్‌కి హెల్ప్ జేస్తే మంచి గుంటది బిడ్డా–"

రోజా మొఖంలో ఆనందం కనిపించింది.

"నిజంగా మీరలా ఫీలవుతున్నారా డాడీ?"

"అవును–"

"నాకూ అదే ఆలోచన వచ్చింది. కానీ రాకేష్ ఏమయినా ఫీలవుతాడేమోనని––"

"నువ్ రాకేష్‌ని సరిగ్గా అర్థం జేసుకోలే బిడ్డా! హీ ఈజే జెమ్! నువ్ హెల్ప్ జేస్తానంటే– హాపీగా ఫీలవుతాడు–"

రోజాకి ఆ రాత్రి నిద్రపట్టలేదు–

* * *

భవానీ శంకర్‌కి కూడా ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఆఫీస్ సోఫాలో పడుకుని ఫోన్



కాల్ కోసం వెయిట్ చేస్తున్నాడు.

టైమ్ ఒంటిగంటయింది. పన్నెండున్నర కల్లా ఫోన్ చేయాలి విజయ్– అరగంట ఎందుకు లేటయినట్లు?

అప్పుడు మోగింది ఫోన్–

"హలో– రాకేష్ దిస్‌సైడ్–"

"అన్నా! నేనే– విజయ్‌ని–"

"ఆ! చెప్పు బ్రదర్– ఆ ఇన్‌ఫర్మేషన్ కరెక్టేనా?"

"కరెక్టే అన్నా! చాలామందితో కన్‌ఫర్మేషన్ తీసుకునేసరికి లేటయింది"

"అంటే మన మాజీ ముఖ్యమంత్రి కొడుకు శివ– అతని భార్య శ్రీస్మిత విడిపోవటం ఖాయమేనా?"

"అంతేకాదు– శ్రీస్మిత తనభర్త మీదా అత్తమామల మీదా కూడా తనను వాళ్ళు హత్య చేయడానికి పథకం పన్నారనీ, ఒకటి రెండు మర్డర్ ఎటెంప్ట్ నుంచి తను తప్పించుకుందనీ పోలీస్‌కి కంప్లెయింట్ ఇచ్చిందని తెలుస్తోంది– కానీ శ్రీస్మిత ఒక సుప్రసిద్ధ సినిమా తార గనుకా– శివ ఒక మాజీ ముఖ్యమంత్రి కొడుకు కావడంతో – పోలీస్‌లు ఈ విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కనుక మనం ఇవాళే బ్రేకింగ్ న్యూస్ కింద ఇచ్చేస్తే మిగతా చానెల్ వాళ్ళందరూ షాకవుతారు. వాళ్ళకు ఈ ఇన్‌ఫర్మేషన్ దొరకాలంటే కనీసం ఇంకో రోజు పడుతుంది–"

"మరి శ్రీస్మితతో ఇంటర్‌వ్యూ దొరికే అవకాశం ఉందా?"

"శ్రీస్మిత ప్రస్తుతం వాళ్ళ తల్లిదండ్రుల దగ్గరుంది– వాళ్ళేమో ఆ ఇంటి చుట్టుపక్కల క్కూడా ఎవ్వరినీ రానీయటం లేదు. ఎల్లుండి ప్రెస్‌మీట్ పెట్టి శివ మీదా మాజీ ముఖ్యమంత్రి సమరసింహ మీదా ఆరోపణలు పబ్లిగ్గా చేయబోతోందని– తెలిసింది–"

"బ్రహ్మాండమయిన కూప్ విజయ్. సంపూర్ణ చానెల్‌కి కూడా దొరకని స్టోరీ మనకు దొరకటం నిజంగా చాలా గ్రేట్! మన తెలుగు ప్రేక్షకులందరూ ఎంతో ఆసక్తితో ఈ న్యూస్ గమనిస్తారు– ఎందుకంటే అలాంటి సెలబ్రిటీ కపుల్– ప్రేమించి పెళ్ళి చేసుకున్న నెలరోజులకే విడాకులు తీసుకోవటం అందరికీ కుతూహలం కలిగించే మేటర్–"

"అవును–"

"మరి ఈ విషయంలో శివ సైడ్‌నుంచి ఏమయినా ఇన్‌ఫర్మేషన్ దొరికిందా?"

"ఇంకో రెండు రోజుల వరకూ శివ కూడా ఈ విషయం ఎవరికీ చెప్పే ప్రసక్తిలేదని

కామన్ ఫ్రెండ్ ద్వారా తెలిసింది–"

"థాంక్యూ విజయ్! ఒండర్‌ఫుల్ స్టోరీ! ఈ స్టోరీ మన రాష్ట్రమంతా పెద్ద ఎత్తున సంచలనం కలిగిస్తుంది. ఎందుకంటే అంటూ శివ ప్రజల మనిషి. యూత్ లీడర్! పెద్ద ఫాలోయింగ్ ఉంది. అలాగే శ్రీస్మిత తెలుగు ప్రేక్షకులు అభిమాననటి ఒకప్పుడు తెలుగు ప్రేక్షకులు వెర్రెత్తిపోయిన సెక్స్‌సింబల్– కనుక ఇది మనకు చాలామంచి హాట్‌న్యూస్–"

"థాంక్యూ అన్నా! ఇంక ఉంటాను–" విజయ్ ఫోన్ పెట్టేశాడు.

భవానీ రిసీవర్ పెట్టకుండా ఇంకా చెవి దగ్గరే పెట్టుకుని వింటున్నాడు. ఓ సెకెండ్ తర్వాత క్లిక్ మన్న శబ్దం వినిపించింది.

భవానీ నవ్వుకున్నాడు.

"నాకు తెలుసు మల్లికా! ఈ ఫోన్ టాపింగ్ నీ పనే–"

* * *

ఆ మర్నాడు భవానీ నిద్రలేచేసరికి బాగా ఆలస్యం అయిపోయింది. కళ్ళు తెరిచేసరికి ఎదురుగ్గా ఓ అందమయిన మొఖం కనిపించింది. ఉలిక్కిపడి లేచాడు.

"హాయ్ రోజా! నువ్వా? ఇక్కడా?"

"యా! ఎనీ ప్రాబ్లెమ్–"

"నేనే ఎవరికయినా పెద్ద ప్రాబ్లెమ్‌ని డియర్!"

'డియర్' అన్నందుకు ఈసారి రోజా గొడవపడలేదు.

"అవునూ! ఈ సోఫాలో పడకేంటి? ఇంటికొచ్చి నీ రూమ్‌లో పడుకోవచ్చు కదా!"

"ఈ ఉద్యోగానికి అంత సీన్ అనవసరం! అవునూ! హెల్త్ టోటల్‌గా రికవర్ అయినట్లేనా?"

"సెంట్‌పర్సెంట్! అందుకే నీకు హెల్ప్‌ఫుల్‌గా ఉండవచ్చని ఆఫీస్ కొచ్చాను–"

"నువ్ పక్కనుంటే చానెల్‌ని ఇంకా ఫాస్ట్‌గా ఇరగదీస్తా! కానీ ఒక కండిషన్–"

"ఏంటది?"

"రేపిది నెంబర్ వన్నయితే క్రెడిట్ నీకేమీ ఇవ్వను–"

రోజా నవ్వింది.

"నాక్కావలసింది క్రెడిట్ కాదు. పోగొట్టుకున్న డబ్బు తిరిగి సంపాదించటం! ఆ పని ఎవరు చేసినా ఓకే–"



"కమాన్– నీ సీట్లో కూర్చో– నేను ఓ గంటలో రడీ అయివస్తా–"

బయటకు నడిచాడతను.

రోజా ఆఫీస్ కొచ్చిందన్న న్యూస్ తెలిసి మొత్తం స్టాఫంతా ఆమె చుట్టూ మూగిపోయారు.

"మేడమ్ మీర్రావటం మంచిదయింది! ఈ రాకేష్‌గారు మనది న్యూస్ చానెలో– ఎంటర్‌టెయిన్‌మెంట్ చానెలో ఎవరికీ అర్థం కాకుండా చేసేశారు–" అన్నాడు హనుమంతు.

"మీరు చూస్తున్నారు కదా మేడమ్! మన సీరియల్స్ అన్నీ చెత్తగా మార్చేశాడు రాకేష్! అన్నీ అక్రమ సంబంధాలే! లేడీస్ అసలు చూళ్ళేకపోతున్నామంటున్నారు–" చెప్పింది రాధ ఛమేలీ.

"ఎవరికెలా అనిపించానా మన చానెల్ నెంబర్ టూ పొజిషన్ కొచ్చింది కదా! అదే మనకి ముఖ్యం! అంటే ఇంతకాలం మనం చేసిందంతా రాంగ్! రాకేష్ చేసిందే కరెక్ట్ అని ప్రూవ్ అయినట్లేగా"

వాళ్ళని నోటమాట రాలేదు.

"యా! అఫ్‌కోర్స్– అఫ్‌కోర్స్– అంటూ వడివడిగా వెళ్ళిపోయింది రాధ.

"నాకు ముందే అనిపించింది మేడమ్! రాకేస్ గారు ఒక పెద్ద జీనియస్ అని––" అంటూ ప్లేట్ ఫిరాయించాడు హనుమంతు– ఎదురుగ్గా ఉన్న టీవీలో సంపూర్ణ చానెల్ ఆన్ చేసింది రోజా.

"స్క్రీన్ అంతా బ్రేకింగ్ న్యూస్' అన్న అక్షరాలతో నిండిపోయింది దాని వెనుకే అక్షరాలు ఫ్లాష్ అవుతూ న్యూస్– మాజీ ముఖ్యమంత్రి కొడుకు, యూత్ లీడర్ శివ– అతని భార్య ఫేమస్ సినీస్టార్ శ్రీస్మిత మారేజ్ ఫ్లాప్! త్వరలో విడాకులు కోసం కోర్ట్ కెక్కనున్న నూతన దంపతులు!

వరకట్న వేధింపులే శ్రీస్మిత నిర్ణయానికి కారణమా? ఆ న్యూస్‌తోపాటే మధ్యమధ్యలో శ్రీస్మిత సినిమాల క్లిప్పింగ్స్– వాటి మధ్యలో శ్రీస్మిత, శివల మారేజ్ సీన్లు– ఇంకొద్ది సేపట్లో పూర్తి వివరాలు––

రోజా షాకయింది.

ఆ మారేజ్‌కి తను కూడా హాజరయింది. ఇంత త్వరగా ఆ మారేజ్ ఫెయిలవటం చాలా దారుణం! మిగతా అన్ని చానెల్సూ చెక్ చేసిందామె. ఆ న్యూస్ ఇంకే చానెల్లోనూ కనిపించలేదు.

భవానీ విజిల్ వేసుకుంటూ రూమ్‌లో కొచ్చాడు.

"ఆ న్యూస్ చూశావా రాకేష్?" అడిగింది రోజా. భవానీ సంపూర్ణ చానెల్ చూశాడు. ఇంకా బ్రేకింగ్ న్యూసే వస్తోంది.

"వావ్! ఈ న్యూస్ మన వాళ్ళు ఎందుకు కాచ్‌చేయలేక పోయారు?" ఆశ్చర్యంగా అన్నాడతను–

"మనమే కాదు! ఇంకే చానెల్ కూడా ట్రేస్ చేయలేకపోయారు– అందుకే సంపూర్ణ నెంబర్‌వన్ చానెల్ అయింది" అంది రోజా.

"యా! మనం యాక్సెప్ట్ చేయాల్సిందే" అన్నాడు భవానీ–

సంపూర్ణ చానెల్ తాలూకు ఫోన్లన్నీ ఎడతెరిపిలేకుండా రింగవుతూంటే మల్లిక ఎగ్జయిటయిపోతూ కూర్చుని ఉంది. ఆఫీస్‌లో.

"ఈ మధ్యకాలంలో ఇంత సెన్సేషనల్ న్యూస్ దొరకటం ఇదే మొదటి సారి" అంటున్నారు సిబ్బంది.

అప్పుడే ఆ గదిలో కొచ్చిన భరద్వాజ్ మల్లికకు అభినందనలు తెలియ జేశాడు.

"చాలా అద్భుతం మల్లికా! హాట్సాఫ్ టూ యూ! ఇంకే చానెల్‌కీ దొరకని ఆ సూపర్ న్యూస్ నీకెలా దొరికిందో అర్థం కావటం లేదు–" అన్నాడతను.

"మన స్టేట్‌లో ఏం జరిగినా ఏ కార్నర్‌లో జరిగిన ముందు నాకే తెలిసేట్లు ఏర్పాట్లు చేశాను సార్!" అంది గర్వంగా.

"అయ్ నో! యూ ఆర్ కేపబుల్–"

"థాంక్యూ" అంది మల్లిక!

కానీ లోపల్లోపల ఆమెకు గిల్టీగా ఉంది.

నిజానికి ఈ న్యూస్ బృందావన్ చానెల్‌ది! ఫోన్ టాపింగ్ ద్వారా తనుకాజేసింది. అయినా ఇవన్నీ ఈ ఫీల్డ్‌లో తప్పదు. ముందు న్యూస్ బ్రేక్ చేసేవాడికే పట్టాభిషేకం! ఛప్పున టీవీ బృందావనం చానెల్‌కి మార్చిందామె.

అదే రోజు కొత్తగా రాకేష్ స్టార్ట్ చేసిన రియాలిటీషో టెలికాస్ట్ అవుతోంది.

ఆ కాన్సెప్ట్ చూసి స్టన్నయింది మల్లిక.

యూత్‌ని విపరీతంగా ఎట్రాక్ట్ చేసే షో అంది.

లాటరీలో వచ్చిన ఓ లేడీ స్టూడెంట్‌నీ, ఓ బాయ్ స్టూడెంట్‌నీ ఒకటే రూమ్‌లో 24 గంటలు ఉంచుతారు. ఆ 24 గంటలూ వారు బయటకు రావటానికి వీల్లేదు.



రూమ్‌లో కెమెరాలుంటాయ్.

ఆ 24 గంటలూ వారేం చేసినా, ఏం మాట్లాడినా అన్నీ ప్రేక్షకులు చూస్తూంటారు. ఇలా రోజుకో జంట చొప్పున నెలరోజులపాటు ముప్ఫయ్ జంటల్ని చూపిస్తారు. ఆ ముప్ఫయ్ జంటల్లో ఏజంట బిహేవియర్ ప్రేక్షకులకు అధికంగా నచ్చుతుందో వాళ్ళు తలో లక్షరూపాయాలూ గెల్చుకుంటారు–

కాసేపు ఆ ప్రోగ్రాం చూశాకగానీ మల్లికకు గుర్తురాలేదు– అవును! శివ– శ్రీస్మిత మారేజ్ బ్రేకవటం గురించి బృందావన్ చానెల్ ఏమీ చూపించటం లేదేం? నిజానికి వాళ్ళే స్టార్ట్ చేయాల్సింది కదా అసలు!

కాసేపు ఆలోచించాక తట్టిందామెకి.

వాళ్ళకంటే ముందు తను మొదలుపెట్టే సరికి వాళ్ళు షాకయి ఉంటారు–

ఆ స్టోరీ సంపూర్ణ చానెల్ కెలా దొరికిందా అని రాకేష్ అప్సెట్ అయి ఉంటాడు.

అప్పుడే పోలీస్ కమీషనర్ మరికొందరు పోలీస్ అధికారులతో డోర్ తెరచుకుని లోపలికొచ్చాడు.

అనుమతి తీసుకోకుండా వాళ్ళలా లోపలకు రావటం భరద్వాజ్‌కు కోపం తెప్పించింది.

"మిస్టర్ భరద్వాజ్! మీ చానెల్లో ఇవాళ మాణింగ్ నుంచీ బ్రేకింగ్ న్యూస్ అంటూ శివ– శ్రీస్మిత విడాకులు గురించి ఫ్లాష్ చేస్తున్నారు! ఆ న్యూస్ మీకెవరిచ్చారు?"

భరద్వాజ్ మల్లికవేపు చూశాడు.

"మా సీఈఓ మల్లిక– ఆమే ఈ సేన్సెషనల్ న్యూస్ ఇన్‌ఛార్జ్–" అన్నాడతను.

"యస్ మల్లికాజీ! మీకా న్యూస్ ఎవరిచ్చారు?" మల్లిక నడిగాడు కమిషనర్.

మల్లిక నవ్వింది.

"మాకు చాలా సీక్రెట్ రిసోర్సెస్ ఉంటాయ్ సార్! అవన్నీ బయట పెట్టలేము!"

"ఆ వార్తలు నిజమయితే మీరు బయటపెట్టకపోయినా ఫరవాలేదు మేడమ్! కానీ మీ న్యూస్ టోటల్‌గా బోగస్! అందులో వన్‌పర్సెంట్ కూడా నిజంలేదు. ఫర్ యువర్ ఇన్‌ఫర్మేషన్ ప్రస్తుతం శివ– శ్రీస్మిత స్విట్జర్లాండ్‌లో హనీమూన్‌లో ఉన్నారు– ఆ విషయం తెలుసా మీకు?"

మల్లిక ఆశ్చర్యపోయింది. కొంచెం భయం కూడా వేసింది. అంటే తను విన్నదంతా

కరెక్ట్ కాదా?

"నాకు తెలీదు?" అందామె.

"ఓకే- అలాంటి న్యూస్ టెలికాస్ట్ చేసేముందు- మీరు ఆ దంపతులిద్దరిలో ఒకరినయినా కంటాక్ట్ చేసి కన్‌ఫరమ్ చేసుకున్నారా?"

"లేదు-"

"ఇన్‌దట్‌కేస్- మీరు వెంటనే ఏ ఆధారాలతో మీరా న్యూస్ టెలికాస్ట్ చేశారో అది బయట పెట్టాలి! లేకపోతే మిమ్మల్నిద్దరినీ అరెస్ట్ చేయాల్సి వస్తుంది."

భరద్వాజ్ కంగారుపడ్డాడు.

ఏ ఆధారం లేకుండా మల్లిక అలాంటి న్యూస్ టెలికాస్ట్ చేయదని తనకు నమ్మకముంది. అయితే ఆ ఆధారాలు ఎంతవరకూ జెన్యువన్ అనేదే డౌటుగా ఉంది.

"డైరెక్ట్‌గా ఎవిడెన్స్ అంటూ మా దగ్గరేం లేదు సార్! మా స్టాఫ్ కలెక్ట్ చేసిన రూమర్స్ ఆధారంగా అది టెలికాస్ట్ చేశాం! అందుకని నేనేం ప్రొడ్యూస్ చేయలేను-" అంటూ సెల్ తీసుకుని తన అసిస్టెంట్‌కి రింగ్ చేసింది.

"వెంటనే శివ- శ్రీస్మిత గురించి ఆ న్యూస్ స్టాప్ చేసేయండి-" అంటూ చెప్పిందామె!

"ఓకే- ముందా న్యూస్ స్టాప్ చేశాను సార్- ఎవిడెన్స్ ఏముందో కనుక్కుని మీకు తెచ్చిస్తాను-"

కమిషనర్- ఇన్‌స్పెక్టర్ వేపు చూశాడు.

"ఇద్దరినీ అరెస్ట్ చేసి స్టేషన్‌కి తీసుకెళ్ళండి!" చెప్పాడతను.

భరద్వాజ్ కంగారుపడ్డాడు.

"చూడండి! ఈ చానెల్ ఎం.డి.గా నాకు మా స్టాఫ్ చేసే ప్రోగ్రామ్స్‌తో డైరక్ట్‌గా ఏం సంబంధం లేదు- మా క్రియేటివ్ హెడ్ మల్లికే ఆన్సరబుల్-" మల్లిక షాక్ అయింది.

అతను తనను ప్రొటెక్ట్ చేస్తాడేమో అని ఆశపడుతోంది.

"ఓకే జెంటిల్మన్-" అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు కమిషనర్.

"మల్లికగారూ! ప్లీజ్- స్టేషన్‌కి రావాలి మాతో-" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

మల్లిక భరద్వాజ్ వేపు చూసింది.

"ఓకే - వెళ్ళు- నేను బెయిల్ కోసం ట్రై చేస్తాను-" అన్నాడతను.

మల్లిక కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్.



ఇన్‌స్పెక్టర్‌తో పాటు బయటకు నడిచి జీప్‌లో కూర్చుంది. తప్పు తనదే! తను చాలా ఇంటెలిజెంటనీ, చాలా టాలెంటెడ్ అనీ- ఒక చానెల్‌ని సక్సెక్‌ఫుల్‌గా నడపడం తనకు తెలిసినట్లు మరొకరికి తెలీదనీ- ఎంత గర్వపడింది?

కేవలం తన వల్లే సంపూర్ణ చానెల్ నెంబర్ అయిందని ఎంత పొంగిపోయింది. అంత పేరూ, ప్రతిష్ఠా అన్నీ క్షణాల్లో రివర్సయిపోయాయేమిటి? ఆ శివ- శ్రీస్మిత విషయంలో టోటల్‌గా అంత పెద్ద బ్లండర్ ఎలా జరిగిందో అర్థం కావటం లేదు-

రాకేష్ ఫోన్ టాప్ చేసినప్పుడు ఆ విజయ్ చెప్పిన మేటరే తను టెలికాస్ట్ చేసింది. అంత అథంటిక్‌గా చెప్పాడు విజయ్- కానీ అదే నిజమయితే రాకేష్ ఆ స్టోరీని ఎందుకు టెలికాస్ట్ చేయలేదు.?

అదే తనకర్థం కాని విషయం!

జీప్ పోలీస్ స్టేషన్ చేరుకుంది. లేడీ కానిస్టేబుల్ వచ్చి ఆమెను తీసుకెళ్ళిలాకప్‌లో వేసింది.

అంతవరకూ బింకంగా ఉన్నా ఒక్కసారిగా దు:ఖం పొంగుకొచ్చిందామెకి.

తను చేసిన తెలివితక్కువతనం వల్ల చాలా పెద్ద సమస్యలో ఇరుక్కుపోయింది. ఇప్పుడీ విషయం తల్లికి చెప్పాలా? చెప్తే- జరిగేదేంటో తనకు తెలుసు. ఆమెకు బీపీ పెరిగిపోతుంది. హాస్పిటల్లో చేరాల్సి వస్తుంది. కానీ ఎంతసేపు దాస్తుంది. రాత్రి తొమ్మిదిగంటల కల్లా ఇల్లు చేరుకోకపోతే ఆమే తనకు ఫోన్ చేస్తుంది.

కానీ రాత్రి తొమ్మిది లోపల భరద్వాజ్ తనకు జామీను ఇప్పించగలడా? తప్పకుండా ఇప్పిస్తాడు. అతనికా కెపాసిటీ ఉంది. మనీ ఉంది. కనెక్షన్స్ ఉన్నయ్- అతనే తననీ ప్రాబ్లెమ్ నుంచి బయట పడేస్తాడని తనకు నమ్మకం ఉంది.

తన సెల్‌లో ఉన్న ఇతర నేరాలు చేసిన స్త్రీలతో సహా తనూ ఒకర్తె అయిపోయింది. లావుపాటి స్త్రీ- కన్నీళ్ళు పెట్టుకున్న మల్లిక దగ్గరకొచ్చింది.

"ఏం జరిగింది బిడ్డా! ఎవడ్నయినా లేపేశావా?"

మల్లిక మాట్లాడలేదు.

"ఇగో- చూడు! నువ్వేం బుగులుపడకు! బయటికెళ్ళినాక నీకేమయినా సాయంగావాల్నంటే నేను జేస్తా! అందంగున్నావ్! రోజుకి అయిదువేలు కమాయించవచ్చు! గిరాక్‌లు నేను తీసుకొస్తా- ఏమంటున్న?"

మల్లిలకు కోపం ఆగలేదు.

"ఏయ్– ఫాల్తూ మాటలు మాట్లాడకు!" అనేసి ఇంకో పక్కకెళ్ళి కూర్చుంది.

సాయింత్రం అవుతోండగా ఇన్‌స్పెక్టర్ ఆమెని పిలిపించాడు.

"మీ లాయర్ కెవళ్ళకయినా ఫోన్ జేసినావా?" అడిగాడతనున.

"లేదు– మా ఎం.డి.గారే ఎరేంజ్ చేస్తారు–"

"నేనిప్పుడే మీ ఎండీకి రింగ్ చేసి మాట్లాడాను. ఈ కేస్‌తో తనకేం సంబంధం లేదంటున్నాడు–"

మల్లిక షాకయింది.

"వ్వాట్? నిజంగా అలా అన్నాడా?"

"అవును! ఆయన జగాలో ఎవరున్నా అదే అంటారులే– ఎందుకంటే కేస్ చాలా సీరియస్ అయింది. ఋజువులు లేకుండా బురదజల్లే చానెల్స్ అన్నిటికీ ఈ కేస్ ఒక కనువిప్పుగా ఉండాలని– అందుకని సివియర్‌గా డీల్ చేయమనీ చీఫ్ మినిష్టర్ నుంచి ఇన్‌స్ట్రక్షన్స్ వచ్చాయ్–"

మల్లికకు భయం వేసింది–

తను చాలా పెద్ద నేరంలో ఇరుక్కుపోయింది. తననెవరూ రక్షించలేరు. లాయర్ని ఎంగేజ్ చేసుకుని కేస్‌కోర్ట్‌లో పోరాడాలన్నా తనకు భరద్వాజ్ సపోర్ట్ కావాలి!

సెల్‌ఫోన్ మోగుతోంది. ఎవరా అని చూసింది– మమ్మీ! ఫోన్ తీయాలా వద్దా? తీస్తే జరిగిందంతా చెప్పాల్సి వస్తుంది. ఫోన్ కట్ చేసిందామె. వెంటనే భరద్వాజ్‌కి రింగ్ చేసింది.

రెండుసార్లు డిస్కనెక్ట్ చేశాక మూడోసారి మాట్లాడాడతను.

"హలో మల్లికా–"

"సార్– నన్ను బెయిల్ మీద బయటకు తీసుకొచ్చే ఏర్పాటు చేస్తున్నారా సార్?"

"............"

"సార్........."

"సారీ మల్లికా! ఆ ఏర్పాట్లేవో నువ్వే చేసుకోవాలి! ఎందుకంటే ఏదొక ప్రూఫ్ లేకుండా అలాంటి న్యూస్ టెలికాస్ట్ చేయటం నీ తప్పు!"

మల్లిక షాకయింది.

"కానీ సార్– మనం టెలికాస్ట్ చేసే న్యూస్‌లో తొంభయ్ శాతం– ఏ ఆధారమూ ఎలాంటి ప్రూఫ్ లేకుండానే టెలికాస్ట్ చేస్తున్నాం కద్సార్–"



"మీకు మొదటినుంచీ చెప్తూనే ఉన్నా మల్లికా! గవర్నమెంట్‌నీ, పొలిటికనల్ పార్టీస్‌నీ ఎంత విమర్శించినా ఫర్లేదు. ఎన్ని అభూత కల్పనలు చేసినా ఒకే– కానీ పర్సనల్ మేటర్స్ వచ్చేప్పటికి కనీసం ఫిఫ్టీ పర్సెంట్ అయినా ఋజువులుండాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో నేను నీకు సపోర్ట్ ఇస్తే– నన్ను కూడా జైల్లోవేస్తారు. అందుకని నీ సంగతి నువ్వు చూసుకో– నాకేం సంబంధం లేదు. ఓకే–"

ఫోన్ కట్ చేశాడు.

మల్లిక పూర్తిగా అప్సెట్ అయిపోయింది. భరద్వాజ్ ఇంతకట్ త్రోట్ కాండేటని తనెప్పుడూ అనుకోలేదు. ఇప్పుడెలా తప్పించుకోవటం! ఎవరు తనకు హెల్ప్ చేస్తారు?

ఫోన్ మళ్ళీ మోగుతోంది– మమ్మీ–

ఆన్ చేసింది "మల్లికా! ఇంకా ఇంటికి రాలేదేంటి? నీ కోసం ఏడింటి నుంచీ వెయిట్ చేస్తున్నా!"

"మమ్మీ! ఆఫీస్‌లో కొంచెం లేటయింది– నువ్ నిద్రపో! నేను ఇంకో రెండు గంటల తర్వాత వస్తా–"

"అవునూ– మీ చానెల్ వాళ్ళను పోలీసులు అరెస్ట్ చేశారని వార్తలు వస్తున్నాయేంటి? ఏం జరిగింది?"

మల్లిక ఉలిక్కిపడింది.

"ఏం వార్తలొస్తున్నాయ్?"

"అదే– మీ చానెల్ వాళ్ళేదో తప్పుడు వార్త టెలికాస్ట్ చేశారనీ అందుకని మీ చానెల్ సిబ్బందిని పోలీసులు అరెస్ట్ చేశారనీ చూబిస్తున్నారు–"

ఇలాంటివి అన్ని ఛానెల్స్‌కీ కామన్ అన్న విషయం తల్లికి తెలుసు.

అందుకే ఆమె గొంతులో అంత ఆత్రుత లేదు–

"అవును మమ్మీ! అందుకే నేను రావటం ఆలస్యమవుతుంది–"

"సరే–"

తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది మల్లిక.

వెంటనే తన ఫ్రెండ్ శిరీషకు ఫోన్ చేసింది. జరిగిందంతా చెప్పి వెంటనే తనకు బెయిల్ విషయం ఎవరయినా ఒక లాయర్ తో మాట్లాడమని కోరింది.

ఒక గంట తర్వాత శిరీష ఫోన్ వచ్చింది.

"మాకు తెల్సిన లాయర్ ఇంటికొచ్చాను మల్లికా– అర్జంటుగా ఇప్పటికిప్పుడు

బెయిల్ కావాలంటే రెండు లక్షలు కట్టాలంటున్నాడు–"

మల్లిక షాకయింది.

"రెండు లక్షలా?"

"అవును! కోర్టు వాళ్లక్కూడా షేర్ ఇవ్వాలంట–"

మల్లిక ఫోన్ పెట్టేసింది.

తనీ రాత్రికి బయట పడటం కష్టం–

ఆమెకు హఠాత్తుగా దు:ఖం ముంచుకొచ్చింది. అతికష్టం మీద ఏడుపు బిగపట్టుకున్నా కన్నీరు ఆగటం లేదు.

రాత్రి పన్నెండువుతోండగా సెల్ డోర్ తెరచిన శబ్దం అయింది. లేడీ కానిస్టేబుల్ లోపలికొచ్చింది.

"పద– ఇన్‌స్పెక్టర్ సార్ పిలుస్తున్నారు–"

ఆమెతో పాటు నడిచింది మల్లిక.

ఇన్‌స్పెక్టర్ కెదురుగ్గా ఒక లాయర్ కూర్చుని ఉన్నాడు.

"నీకు బెయిల్ వచ్చింది. ఇంక వెళ్ళవచ్చు–" అంటూ ఆమె సంతకాలు కొన్ని పేపర్ల మీద తీసుకున్నాడతను.

మల్లిక ఇంకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు.

భరద్వాజ్ పంపిన లాయరే అయుంటాడు–

బయటకొచ్చింది.

"రామ్మా! కూర్చో–" అంటూ తను బాక్‌సీట్లో కూర్చున్నాడతను. అతని పక్కనే కూర్చుంటూ డ్రైవర్ సీట్లో కూర్చున్న రాకేష్‌ని చూసి ఉలిక్కిపడింది.

"నువ్వా?"

"డౌటా? నా పాదాలు వెనక్కి తిరిగి ఉన్నయ్యేమో చూస్తావా?"

"అహహ– అదికాదు – అంటే..."

"నేనే బెయిల్ ఏర్పాటు చేయించా! మీ బాస్ చెయ్యిచ్చాడని తెలిసి–" మల్లిక కేం మాట్లాడాలో తెలీలేదు.

తను చాలా విచిత్రమయిన పరిస్థితిలో ఇరుక్కుపోయింది.

తనకీ పరిస్థితి ఎలా వచ్చిందో తెలుస్తే అతను తనకిలా బెయిల్ ఇప్పించే వాడు కాదేమో!



ఆ విషయం తను బయటకు చెప్పలేదు. ఎందుకంటే దొంగకు తేలుకుట్టి నట్లయింది గనుక–

"థాంక్యూ వెరీ మచ్–" అంది మల్లిక ఆలోచనల్లో నుంచి బయటపడి.

"బెయిల్ రాగానే సంబరం కాదు. ఈ కేస్ పెట్టే తిప్పల నుంచి బయటపడే మార్గం చూడు–"

మల్లికకు భయం వేసింది.

ఈ లెక్కలో భరద్వాజ్ తనను టోటల్‌గా డిజోన్ చేస్తాడు. అంటే ఆకేస్‌ని తనొక్కర్తే ఫైట్ చేయాలి!

కానీ అది ఓడిపోయే ఫైట్ అని తన మనసుకి తెలుసు!

"ఈ విషయం తెల్సా?" అడిగాడు భవానీ–

"ఏంటది?"

"నీ మీద డామేజెస్‌కి కూడా కేస్ ఫైల్ చేయబోతున్నారు–"

"ఓగాడ్–"

"ఇంకో పదిసార్లు ఓగాడ్ అంటావ్– ఎంతకేస్తున్నారో తెలుస్తే–"

మల్లిక వళ్ళు భయంతో గగుర్పొడిచింది.

"ఎంత?" హీనస్వరంతో అడిగింది.

"యాభైలక్షలు–"

స్పృహతప్పుతున్న ఫీలింగ్– అతికష్టం మీద కుప్పకూలి పోకుండా ఉంటానికి ప్రయత్నిస్తోంది– కారు తనింటి దగ్గర ఆగింది– అతనికి తనిల్లు ఎలా తెలుసు? నెమ్మదిగా కారు దిరిగింది.

"అవన్నీ ఆలోచించి బుర్రపాడు జేసుకోకుండా– హాపీగా నిద్రపో! పొద్దున్న డిస్కస్ చేద్దాం– ఓకే?"

అతనిమాటతో మల్లికలో భయం కొంతవరకూ తగ్గిపోయింది. అంటే రాకేష్ తనకు సాయం చేస్తాడా? అతనికి తనమీద ఇంత అభిమానం ఎందుకు కలిగి ఉంటుంది? జాలా? ఏదయినా కానీ! అతనికి తను రుణపడి ఉంది.

"ఓకే గుడ్‌నైట్–"

కారు వెళ్ళిపోయింది.

తల్లి ఏదేదో మాట్లాడుతూనే ఉందికానీ మల్లిక మనసా మాటలను పట్టించుకోవటం

లేదు. పూర్తిగా కన్ఫ్యూజ్డ్ స్టేట్‌లో ఉంది.

* * *

మర్నాడు సంపూర్ణ చానెల్ ఆఫీస్‌కి చేరుకుంది మల్లిక.

భరద్వాజ్‌తో ఆటో ఇటో తేల్చుకోడానికే వచ్చిందామె.

కానీ బయట సెక్యూరిటీ వాడు ఆపేసరికి నిర్ఘాంత పోయింది

"మిమ్మల్ని లోపలకు రానీయవద్దన్నారమ్మా సారు–"

"ఏ సారు?"

"భరద్వాజ్ సార్–"

"ఎందుకని?"

"తెలీదు–"

"ఇంటర్‌కమ్ ఫోన్లో మాట్లాడించు–"

"సారీ మేడమ్–"

మల్లికకు అవమానంతో కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్.

వెనక్కు తిరిగి ఇంటికి బయల్దేరింది–

ఇల్లు చేరుకునేసరికి 'బృందావనం' చానెల్ కారు కనిపిచింది.

"రాకేష్‌గారు మిమ్మల్ని తీసుకు రమ్మన్నారు మేడమ్–"

మల్లిక హాపీగా ఫీలయింది.

తను ఒంటరిది కాదు. ఎంత రిలీఫ్ కలిగిస్తోందీ ఫీలింగ్?

భవానీ తన స్టాఫ్‌తో మీటింగ్‌లో ఉండగా లోపలి కొచ్చిందామె–

"రా! కూర్చో–" అన్నాడు భవానీ.

"బయటి వెయిట్ చేస్తాను– మీ స్టాఫ్ మీటింగయాక వస్తాను–"

"నువ్వూ ఇవాళ్టి నుంచి మీ స్టాఫే! కూర్చో–"

షాకయింది.

ఏంటితను?

తను అతనిని రెండు మూడుసార్లు ఇన్సల్ట్ చేసినా– ఇంత హెల్ప్ చేస్తున్నాడు? మీటింగ్ మధ్యలో మల్లికను స్టాఫ్‌కి ఇంటడ్యూస్ చేశాడు.

"షి ఈజ్ మల్లికా! మన చానెల్‌కి క్రియేటివ్ హెడ్‌గా ఇవాళ్టి నుంచీ జాయినయింది"



మల్లికకు అయోమయంగా ఉంది. లోలోపల ఆనందంగానూ ఉంది.

భరద్వాజ్ తనను అంత హీనంగా, దారుణంగా ట్రీట్‌చేశాక– అసలీ లైఫ్– మీదే విరక్తి కలిగింది.

అలాంటి మానసిక స్థితిలో ఉన్న సమయంలో తనకు మళ్ళీ అంత పెద్ద రెస్పాన్సిబులిటీ ఇవ్వటం – అతని గ్రేట్‌నెస్! మల్లిక లేచి నిలబడి అందరికీ విష్ చేసింది.

"రాకేష్‌గారు నాకిలాంటి ముఖ్యమయిన పదవి ఇవ్వటం– నాకెంతో ఆనందం కలిగించింది. కానీ మీ అందరికీ ఒక విషయం చెప్పాలి– నిన్నటివరకూ నేను సంపూర్ణ చానెల్‌కి క్రియేటివ్ హెడ్‌గా వర్క్ చేశాను కానీ నేను చేసిన ఒక తప్పువల్ల పోలీస్ కేస్‌లో ఇరుక్కున్నాను. దాంతో నా జాబ్‌పోయింది. సో– మానసికంగా నేను డిప్రెసెడ్ పొజిషన్‌లో ఉన్న సమయంలో రాకేష్ నాకీ జాబ్ ఇవ్వటం– నిజంగా నాకిది– మోరల్ బూస్టర్ గావర్క్ చేస్తుంది. ఇంతవరకూ చేసిన పొరబాట్లు ఇకముందు చేయకుండా బృందావనం చానెల్ నెంబర్‌వన్ చానెల్ అవడానికి నావంతు ప్రయత్నం నేను చేస్తాను–"

ఆమె మాటలు ఇంకా పూర్తవకుండానే రాధాభమేలీ కోపంగా లేచి నిలబడింది.

"ఆమె అపాయింట్‌మెంట్‌ని నేను అబ్జెక్ట్ చేస్తున్నా–" అంది ఆవేశంగా. అందరూ ఆశ్చర్యపోయారు.

"అబ్జెక్ట్ సంగతి తర్వాత – ముందు సబ్జెక్టేంటో చెప్పు–" అన్నాడు రాకేష్.

"నేను ఈ చానెల్‌కి క్రియేటివ్ హెడ్‌గా– చానెల్ స్టార్టయినప్పటినుంచీ వర్క్ చేస్తున్నాను. ఇప్పుడు సడెన్‌గా నా ప్లేస్‌లో రేపోమాపో జైలుకెళ్ళ బోయే మల్లిక నేస్తారా? నేను కోర్టు కెళ్తా–"

"హలో! చానెల్ స్టార్టయిన దగ్గర్నుంచీ ఇవాళ్టి వరకూ నువ్ ఈ చానెల్‌కి క్రియేటివ్ హెడ్‌గా పనిచేశానంటున్నావ్‌గానీ– మన చానెల్ నీవల్ల మూతపడే స్టేజ్ కొచ్చిందని చెప్పటంలా! నువ్విచ్చిన స్టేట్‌మెంట్ ఒక్కటి చాలు నిన్ను ఉద్యోగంలో నుంచి పీకేయడానికి! కానీ పీకటంలా! ఎందుకో తెలుసా? తన వల్ల నీ ఉద్యోగం పోయిందని మల్లిక ఫీలవుతుంది. నువ్ ప్రొడ్యూసర్‌గా ఏదొక ప్రోగ్రాం చేసుకో! ఇష్టం లేకపోతే రిజైన్ చేసెయ్!"

"నేను రిజైన్ చేస్తాను–"

"వెల్‌కమ్! మా చానెల్‌కి కావలసింది నీలాంటి దూరదర్శన్ టైప్ థింకింగ్

* * *

ఉన్న వాళ్ళు కాదు. ఇంటెలిజెంట్ అండ్ ఎగ్రెసివ్ క్రియేటివ్ హెడ్ కావాలి– ఆ క్వాలిటీ మల్లికకుంది– అందుకే సంపూర్ణ చానెల్ నెంబర్‌వన్ అయింది– ఇంకఫో–"

రాధా ఛమేలీ మొఖం అవమానంతో ఎర్రబడింది. ఛటుక్కున అక్కడి నుంచి వెళ్ళిపోబోయిందిగానీ మల్లిక అడ్డుపడింది.

"హలో– వన్‌మినిట్! మిస్టర్ రాకేష్! నాకు క్రియేటివ్ హెడ్ పోస్ట్ అవసరం లేదు. నేనే వర్క్ అయినా చేస్తాను– ఆ మేడమ్‌నే క్రియేటివ్ హెడ్‌గా ఉండనీండి!"

"ఏంటి? తొక్కలో క్రియేటివ్‌నెస్– ఆ మేడమ్ క్రియేట్ చేసింది? తెలుగు, హిందీ సినిమాలను కాపీకొట్టి సీరియల్స్ తీయటం– అమెరికా టీవీ చానెల్స్‌ని కాపీ కొట్టి రియాలిటీ షోస్, గేమ్ షోస్ చేయటం– ఇదా క్రియేటివ్ హెడ్‌లు చేసే పని! అసలా పోస్టే ఎబాలిష్ చేస్తున్నా! మనం చేసే చిల్లర ప్రోగ్రామ్స్‌కి మళ్ళీ క్రియేషన్ ఒకటా! హలో– ఇవాల్టి నుంచీ మన చానెల్లో ఎవడికీ డిజిగ్నేషన్‌లుండవ్– ఎవడు చేసే పని వాడు చేయటమే– ఇష్టమున్నోళ్ళు ఉండొచ్చు– లేనోళ్ళు పోవచ్చు–"

రాధా ఛమేలీ ఇంకా మండిపడింది.

"నాకీ బోడి జాబ్ అవసరం లేదు" అనేసి వెళ్ళిపోయింది.

"ఇంకెవరైనా వెళ్తే త్వరగా వెళ్ళండి" అన్నాడు భవానీ.

ఎవ్వరూ మాట్లాడలేదు.

థాంక్ యూ బ్రదర్స్! ఇప్పుడు మన చానెల్ గురించి డిస్కస్ చేద్దాం–" అన్నాడతను.

* * *

మర్నాడు ఒక మారు మూల గ్రామంలో ఒక కొండమీదున్న ఆంజనేయ స్వామి విగ్రహం పాలుతాగుతోందని బృందావనం చానెల్లో వచ్చిన వార్త ప్రజలందరిలోనూ ఆసక్తి కలిగించింది.

ఆ వింత చూడ్డానికి ఆ చుట్టుపక్కలున్న జనం విరగబడిపోతున్నారన్న విషయం కూడా దృశ్యాలతో సహా చూపించింది చానెల్–

ఆ విగ్రహం ప్రతి కార్తీక మాసంలో నెలరోజులు అలా పాలుతాగుతుందనీ, తర్వాత మానేవేస్తుందనీ ఆ పక్కనే మఠంలో నివాసముండే మఠయోగి బృందావనం చానెల్‌తో చెప్పటం మరో అట్రాక్షన్ అయింది. మిగతా చానెల్స్ అన్నీ వాళ్ళ జర్నలిస్ట్‌లను ఆ కొండకు పంపించడానికి 24 గంటల టైముపట్టింది. తీరా అన్ని చానెల్సూ ఆలస్యంగా



ఆ వార్తా దృశ్యాలు టెలికాస్ట్ చేయటం మొదలుపెట్టేసరికి బృందావనం చానెల్ ఇంకో సెన్సేషనల్ న్యూస్ టెలికాస్ట్ చేయటం మొదలుపెట్టారు–

ఓ మిడిల్ క్లాస్ కుటుంబానికి చెందిన ఆరేల్ల బాలిక తను అమ్మవారిననీ, లోకకల్యాణార్థం, అవతరించాననీ చెప్తోంది. చెప్పటమే కాకుండా గాల్లో నుంచి కుంకుమ తీసి స్త్రీలందరికీ ఇస్తోందట. నిజంగానే ఆ బాలిక గాల్లో నుంచి కుంకుమ తీసి భక్తురాలి నుదుట పెట్టటం బృందావనం చానెల్లో కనిపించేసరికి కొద్ది గంటల్లో ఆ బాలిక ఉంటున్న ఇల్లు పుణ్యతీర్థంగా మారిపోయింది. కార్లల్లో, బస్సుల్లో స్త్రీలు విరగబడిపోయారు. బృందావంన చానెల్ హెడ్ స్వయంగా ఆ పాపతో న్యూస్‌రూమ్ నుంచి సంభాషించాడు.

"పాపా! నీ పేరేంటమ్మా?" అడిగాడు భవానీ.

"నా పేరే తెలీదు రానీకు? మహంకాళిని రా!"

"క్షమించు తల్లీ! మా ప్రేక్షకుల కోసం ఆ ప్రశ్న అడగాల్సి వచ్చింది–"

"కాళీమాతా! నువ్వీ మానవావతారంలో ఎందుకు అవతరించావ్ తల్లీ!"

"ఈ భూమ్మీద స్త్రీల పట్ల దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి రా! రుచిక, జెస్సికా, అయేషా,లాంటి అభాగినులకు జరిగిన అన్యాయం నాకు దు:ఖం కలిగించింది. అలాంటి అరాచకాలకు పాల్పడుతున్న దుర్మార్గులను మట్టుపెట్టడానికే అవతరించాను. అసలు హంతకులను చిత్రవధ చేయటమే నా ధ్యేయం–"

కళ్ళు మూసుకుని ఊగిపోతూ అంది ఆ బాలిక.

"మాకు చాలా ఆనందంగా ఉంది తల్లీ! అసలు హంతకులను పోలీసులు రక్షిస్తోన్న ఈ సమయంలో నువ్వే సరైనా న్యాయం చెయ్యగలవ్ తల్లీ– నమస్కారం తల్లీ! నీ చల్లని చూపే మాకు శ్రీరామరక్ష–"

వెంటనే ఆ బాలిక తల్లిదండ్రులను ఇంటర్‌వ్యూ చేశాడు భవానీ.

"పుట్టినప్పుడు మా పాప నవ్విందండి! మాకు భయం వేసి జ్యోతిష్యులను పిలిపించాం! వాళ్ళు పాపను చూడగానే భక్తితో కాళ్ళకు మొక్కారు.

"మీరు పుణ్య దంపుతులమ్మా! సాక్షాత్తూ ఆ కాళీమాతకే జన్మనిచ్చారు" అని మా కాళ్ళు కూడా కళ్ళకద్దుకున్నారు. అయినా మేము వాళ్ళ మాటలు పట్టించుకోలేదు. కానీ పెద్దదవుతున్న కొద్దీ పాఠ చిత్రవిచిత్రమయిన పనులు చేస్తూండే సరికి మాకు ఆమె కాళీ మాతా అవతారమే అని నమ్మకం కలిగింది–" చెప్పింది ఆ బాలిక తల్లి.

"మీ పాపం పేరేంటమ్మా?"

"ఆ జ్యోతిష్యుల కోరికమేరకు 'చాముండి' అనిపెట్టాం– " చెప్పాడు తండ్రి.

"చాముండి ఎలాంటి విచిత్రాలు చేస్తోంది?"

"రెండేళ్ళవయసులో ఒకసారి బయట ఆడుకుంటున్న మా పాప దగ్గరకు ఒక నాగుపాము వచ్చింది. మా పాప ఆ పాముని పట్టుకునేసరికి ఆ పాము మా పాప మెడకు చుట్టుకుని కొద్దిసేపాగి వెళ్ళిపోయింది. అలాగే ఒకసారి మా ఇంటి దగ్గర్లో ఉన్న గుడిశెలు ఒక చిన్న పిల్లడు అనారోగ్యంతో హాస్పిటల్లో చేరాడు. అతని పరిస్థితి క్షీణించడంతో ఇంక బ్రతకడు ఇంటికి తీసుకెళ్ళిపొమ్మని డాక్టర్లు చెప్పారు. ఆ అబ్బాయి తల్లిదండ్రులు ఏడుస్తూ ఆ బాబుని తీసుకొచ్చి మా పాపముందు పడుకోబెట్టారు. మా పాప అతని నెత్తిమీద చేయిపెట్టింది. అంతే ఆ పిల్లడు క్షణాల్లో లేచి తిరగటం మొదలుపెట్టాడు–"

వెంటనే భవానీ ఆ ఊళ్ళో వాళ్ళందరినీ ఆ పాప మహిమల గురించి అడుగుతూంటే వాళ్ళు ఆ పాపను అమ్మవారిగానే భావిస్తూన్న విషయం ఆ అమ్మ దయవల్ల ఎంతమంది వ్యాధుల బారి నుండి రక్షింపబడిందీ, ఎంతమందికి కోరిన కోరికలు నెరవేరిందీ– అన్నీ చెప్పటం ప్రారంభించారు. ఆరోజంతా ఆ బాలిక వార్తలతోనే బృందావనం చానెల్ ఒక సెన్సెషన్ క్రియేట్ చేసింది.

మిగతా చానెల్స్ కెమెరాలు తీసుకుని ఆ కొండమీద కెళ్ళేసరికి ఒకరోజు ఆలస్యమయిపోయింది. దాంతో వాళ్ళంతా బృందావనం చానెల్ చూపించే దృశ్యాలనే కాపీ చేసి తమ చానెల్స్‌లో టెలికాస్ట్ చేయటం మొదలుపెట్టారు.

కానీ ఆ దృశ్యాలు ఏ చానెల్లో టెలికాస్ట్ చేసినా, వాటి మీద బృందావనం చానెల్ లోగో ఉండడంతో చానెల్ పేరు మార్మోగిపోసాగింది.

అదేరోజు సాయంత్రం కొబ్బరి చిప్పలు తీసుకుని జైరాజ్, అతని భార్యా, రోజా చానెల్ కొచ్చారు.

"వెల్‌కమ్ అంకుల్! తిరుపతి వెళ్ళొచ్చారా?' అడిగాడు భవానీ.

"లేదు రాకేష్! చాముండిగా అవతరించిన ఆ కాళీమాతా దర్శనం చేసుకొచ్చాం–"

భవానీ ఉలిక్కిపడ్డాడు.

"వ్వాట్! చాముండి దగ్గరకా? చాముండి కాళీమాతని ఎవరు చెప్పారుమీకు?"

రోజా ఆశ్చర్యపోయింది.

"అదేంటి! మన చానెలేగా ఆ కథ ప్రచారంచేస్తోంది? పైగా నువ్వే ఆ



అమ్మాయితోనూ వాళ్ళ తల్లిదండ్రులతోనూ ఇంటర్‌వ్యూ కూడా చేశావ్?"

భవానీ నవ్వేశాడు.

"సారీ రోజా! ఇదంతా మన చానెల్ క్రియేట్ చేసిన డ్రామా!"

జైరాజ్ షాకయ్యాడు.

"వ్వాట్! డ్రామానా?"

"అవునంకుల్! ఆంజనేయస్వామి విగ్రహం పాలుతాగటం, చాముండిగా కాళీమాత అవతారమెత్తటం – ఇవన్నీ అబద్ధాలు– డబ్బు ఖర్చుపెట్టి వాళ్ళతోనేనే ఈ డ్రామా ఆడించాను–"

"అలా ప్రజల్ని మోసగించటం తప్పుకదూ?" హర్ట్ అయి అడిగింది రోజా.

"యా! తప్పే! కానీ మనదేశంలో డబ్బు సంపాదించం కోసం తప్పుడు పనులు చేయని వారెవరున్నారో చెప్పు! టెలికామ్‌మంత్రే రెండులక్షల కోట్లు ఫ్రాడ్ చేశాడు కదా! సురేష్ కల్మాడీ చేసిందేమిటి? అశోక్ చవాన్ ఎందుకు కక్కుర్తిపడ్డాడు? అందరిధ్యేయం అదే! పబ్లిక్‌ని మోసం చేసి డబ్బు సంపాదించటం– మనదేశంలోని మెజారిటీ టీవీ చానెల్స్ చేస్తోంది కూడా అదే! రకరకాలుగా ఫ్రాడ్ చేస్తున్నాయ్– బ్లాక్‌మెయిల్ చేస్తున్నయ్! అతిదారుణంగా ప్రజల్ని తప్పుడు వార్తలతో మోసగిస్తున్నయ్. మనిషుల బలహీనతలను ఎక్స్‌ప్లాయిట్ చేస్తూ నీతి నియమాలను గాలికొదిలేస్తున్నయ్. వీటిని గురించి మన సుప్రీంకోర్ట్ తప్ప ఎవడూ పట్టించుకోటంలేదు. ఇలాంటి నికృష్ట వాతావరణంలో నెంబర్‌వన్ చానెల్ అవాలంటే మనం ఇంకా, పెద్ద ఎత్తున ఫ్రాడ్ చేయాలి. కొత్త రకం మోసాలు చేయాలి. నేను చేస్తుందదే!

రోజా కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉండిపోయింది.

అతని చెప్పే ప్రతి మాటా ఎంతో అర్థవంతంగా కనిపించిందామెకి. అంతవరకూ తను భారతదేశాన్ని తనలాంటి వాళ్ళు సంస్కరించాలనుకుంది. దేశానికి తనవంతు సేవ తను చేయాలనుకుంది. కేవలం నీతి నిజాయితీలను తన చానెల్లో ప్రచారం చేసింది. ఫలితం ఏమిటో తనకు తెలిసింది–

"అయ్ థింక్ యూ ఆర్ రైట్ రాకేష్" అంది నెమ్మదిగా.

జైరాజ్ ఆశ్చర్యపోయాడు.

"అదేంటి అలా అంటున్నావ్"

"అవును డాడీ! ఇక్కడ దేశాన్ని ఉద్ధరించాలనుకునే వాళ్ళకు ప్లేస్ లేదు. నీతిగా,

నిజాయితీగా, క్రమశిక్షణతో వ్యవహరించే వాళ్ళను అడుగడుగునా ప్రభుత్వం, పోలీస్ వ్యవస్థలు నిర్వీర్యం చేస్తూంటాయ్. అందుకే విదేశాలకు వెళ్ళినవాళ్ళు అక్కడే స్థిరపడుతున్నారు. ఈ దిక్కుమాలిన దేశంలో ఉండటం కంటే ఎక్కువశాతం నీతి, నిజాయితీ, సంస్కారం ఉన్న విదేశాల్లోనే ఉండటం మంచిదనుకుంటున్నారు-"

జైరాజ్ హాపీగా ఫీలయ్యాడు.

తను పన్నిన వ్యూహం ఫలించింది.

ఆల్టిమేట్‌గా రోజాకీ, రాకేష్‌కీ పెళ్ళి చేయాలని తనకూ, రాకేష్ తండ్రికీ చిరకాల కోరిక. అదిప్పుడు నెరవేరుతుంది. రాకేష్ తన ప్రియురాలిని మర్చిపోయి రోజా ప్రేమలో పడటం ఖాయం.

* * *

భవానీ, మల్లిక అతని చాంబర్‌లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

"ఇప్పుడు మన చానెల్- సంపూర్ణ చానెల్ రేటింగ్స్ సమానంగా ఉన్నాయ్" అంది మల్లిక హాపీగా రేటింగ్ చార్ట్ చూస్తూ.

"అవును మల్లికా! ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా- సంపూర్ణను ఓవర్ టేక్ చేయలేకపోతున్నాం! అదే నాకు అనీజీగా ఉంది-"

"అందులో వర్రీ అవాల్సిందేమీ లేదు రాకేష్! ఓవర్‌టేక్ చేయడానికి ఇంకొంచెం టైమ్ కావాలి-"

"అంటే ఎంతకాలం!"

"షుమారు నాలుగు నెలలు-"

"కానీ ఇంకో నెలరోజులే నాకు గడువుంది. అది దాటితే- 20 కోట్లు ఓడిపోతాను-"

"అంత డబ్బు ఎక్కడినుంచి తెస్తావ్?" జాలిగా అడిగింది మల్లిక.

"చానెల్ చేతిలో ఉండగా డబ్బుకేమీ సమస్య లేదు మల్లికా! బ్లాక్‌మెయిలింగ్ చేయటం మొదలుపెడితే పదిరోజుల్లో 20 కోట్లు సంపాదించగలను- అయితే అదికొంచెం రిస్కీకూడా- ఏదేమయినా నాక్కావలసింది విజయం! ఎలాగయినా విజయం సాధించి తీరవలసిందే-"

"అయితే ఇంకేమేం కొత్త ప్రోగ్రామ్స్ చేయాలో నేనూ ఆలోచిస్తా-"

"థాంక్యూ! నాకూ 24 గంటలు టైమివ్వు! ఏదొక బ్లాక్ బస్టర్ అయిడియా



దొరక్కపోదు-" అన్నాడు భవానీ.

* * *

ఆ రెండో రోజునే మల్లిక కేస్ హియరింగ్‌కి వచ్చింది.

ఆకేస్‌లో మల్లికకు జైలు తప్పదని మొదటి రోజే తెలిసిపోయింది

ఒక్కసారిగా నిరాశా నిస్పృహలామెని ఆవహించినయ్.

"మల్లికా! నీమీద పూచికపుల్లకూడా పడకుండా నేను చేస్తా! నువ్వేం వర్రీ అవకు" చెప్పాడు భవానీ.

మల్లిక నవ్వింది.

"నాకు ధైర్యం చెప్పడానికి మాట్లాడుతున్నావ్‌గానీ - నాకు జైలు తప్పదని నీకూ తెలుసు-"

"ప్లీజ్ డోంట్ అండర్ ఎస్టిమేట్‌మీ-"

ఆ మాట మల్లికకు ఆనందం కలిగించింది.

అవును! రాకేష్‌ని అండర్ ఎస్టిమేట్ చేయకూడదెవరూ!

* * *

అదేరోజు సాయింత్రం శ్రీస్మిత, శివ ఒక పార్టీలో డిన్నర్ చేస్తూండగా శ్రీస్మిత సెల్ మోగింది. ఫోన్ తీసి నెంబర్ చూసిందామె. ఎవరిదో కొత్త నెంబరు-

"శ్రీస్మితా హియర్-" అంది ఫోన్ ఆన్‌చేసి

"హాయ్ స్మితా! ఎలావున్నావ్?"

ఆ గొంతు వెంటనే గుర్తు పట్టింది స్మిత, అతను శ్రీరామ్! తను సినిమా ఫీల్డ్‌లో కొచ్చిన కొత్తలో పరిచయమయిన ఫిలిమ్ ఇన్‌స్టిట్యూట్ ఆర్టిస్ట్!

కానీ అతన్తో- తన భర్త శివ ఎదురుగ్గా మాట్లాడాలంటే కొంచెం ఇబ్బందిగా అనిపించింది.

"హాయ్! హౌ ఆర్ యూ? ఆఫ్టరే లాంగ్ టైమ్-" అందామె

"యా! ఈ మధ్య ఎందుకో బాగా యాద్ కొస్తున్నావ్- దాన్దిక్కు కెళ్ళి ఫోన్ జేసినా!"

"థాంక్యూ! రైట్‌నౌ నేను బిజీగా ఉన్నా! తర్వాత మాట్లాడనా?"

"నువ్వూ, నీ హజ్‌బెండ్ కలసి డిన్నర్ చేస్తున్నారని నాకు తెలుసు. మీ ఇద్దరూ

హోటల్ త్రిరంగ ఫైవ్‌స్టార్ హోటల్లో ఉన్నారని కూడా నాకు తెలుసు–"

"ఎలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగింది శ్రీస్మిత.

"ఎట్లాగంటే నేనూ అదే హోటల్లో– అదే డైనింగ్ హాల్లో– నీ టేబుల్‌కి దగ్గర్లోనే ఉన్నా గనుక–"

శ్రీస్మిత కంగారు పడుతూ పక్కకు చూసింది.

శ్రీరామ్ కనిపించాడు. అతను చిరునవ్వు నవ్వుతూంటే చప్పున తలతిప్పుకొంది– శివ చూస్తున్నాడేమో అన్న భయంతో– అయితే అప్పటికే శివ శ్రీరామ్‌ని గమనించాడు.

"అతను శ్రీరామ్ కదూ?" అడిగాడు స్మితను.

"అవును–"

"మరి పలుకరించలేదే? పరిచయం లేదా?"

నిజం చెప్పడానికి స్మిత భయపడింది.

"పెద్దగా పరిచయం లేదు– అదీగాక చాలా గాప్ వచ్చింది–" అందామె అబద్ధమాడేస్తూ.

నిజానికీ తనకూ, శ్రీరామ్‌కీ మధ్య చాలాకాలం ఎఫైర్ ఉండేది. తనకు శివతో మారేజ్ సెటిలయాక – అతనిని ఎవైడ్ చేసింది. ఎందుకంటే తను నెంబర్‌వన్ హీరోయిన్ అయే అవకాశం లేదని తనకు తెలుసు.

తెలుగు సినిమా ఫీల్డులో నెంబర్‌వన్ అవాలంటే కావలసింది మంచి నటన, సెక్సీరూపం కాదు. హిందీ సినిమా ఫీల్డ్‌లో ఏదొక సినిమాలో హీరోయిన్‌గా నటించి ఉండాలి– తెలుగు వచ్చి ఉండకూడదు.

అలాంటి పరిస్థితుల్లో బాగా ఆస్తి పాస్తులున్న వాడెవడినయినా పెళ్ళి చేసుకుంటే లైఫ్ సెటిలయిపోతుందని ఆలోచించింది. అనుకోకుండా ఒక సినిమా పార్టీలో శివ తనను చూసి ప్రేమలో పడ్డాడు. అతని గురించి పూర్తి వివరాలు సేకరించింది తను. కనీసం అయిదు వందల కోట్ల ప్రాపర్టీ ఉంటుందతని కుటుంబానికి. పైగా రాజకీయంగా మంచి పలుకుబడి ఉన్న కుటుంబం. అతనిని చేసుకుంటే జీవితమంతా హాపీగా లగ్జరియస్‌గా గడిచిపోతుంది–

అంతా అనుకున్నట్లే జరిగింది. పెళ్ళికి ముందు తనకు ఇద్దరు ముగ్గురు వ్యక్తులతో శారీరక సంబంధం ఉండేది. అవన్నీ గోప్యంగా ఉంచింది శివ దగ్గర.

అందుకే సినిమా ఫీల్డుకి దూరంగా ఉంటుంది వీలయినంత వరకూ– శ్రీరామ్



పలుకరిస్తాడేమో అన్న భయంతో త్వరత్వరగా ఆ హోటల్ నుంచి బయట పడిందామె. కానీ అప్పటికే శివ వారిద్దరినీ క్లోజ్‌గా అబ్జర్వ్ చేశాడు–

అందుక్కారణం అంతకుముంది రోజు తన కొచ్చిన ఆకాశరామన్న ఉత్తరం. అందులో ఎవరో శ్రేయోభిలాషి స్పష్టంగా రాశాడు.

శ్రీస్మితకూ శ్రీరామ్‌కీ ఆమె పెళ్ళికిముందు సంబంధం ఉందనీ ఇప్పుడు మళ్ళీ శివను చీట్ చేసి శ్రీరామ్‌ని శ్రీస్మిత రహస్యంగా కలుసుకుంటోందనీ భవిష్యత్తులో వాళ్ళిద్దరూ ఎక్కడెక్కడ కలుసుకుంటోందీ ఏమేం మాట్లాడుకుంటోందీ అన్నీ ఎప్పటి కప్పుడు తెలియజేస్తూంటాననీ రాశాడతను.

శివకి అనుమానం మొదలయింది. ముఖ్యంగా వాళ్ళిద్దరూ సెల్‌లో తనెదురుగ్గానే మాట్లాడుకోవటం – తనను చూడగానే శ్రీస్మిత కంగారు పడటం.

అంటే– ఆ శ్రేయోభిలాషి రాసింది కరెక్టేనా?

ఆమె కదలికలు కొన్ని రోజులు నిశితంగా అబ్జర్వ్ చేయాలని డిసైడ్ చేసుకున్నాడు శివ.

ఆ మర్నాడే శ్రీస్మితకు మళ్ళీ శ్రీరామ్ సెల్ ఫోన్ వచ్చింది. ఆ టైమ్‌కి తను బెడ్‌రూమ్‌లోనే ఉంది. శివ అప్పటికే స్నానానికి బాత్‌రూమ్ కెళ్ళాడు. ఫోన్ ఆన్ చేసిందామె.

"హాయ్ స్మితా–" అన్నాడు శ్రీరామ్.

"శ్రీరామ్ – దయచేసి నాకు ఫోన్లు చేయకు! శివకు మనం ఫ్రెండ్స్ అని తెలీటం కూడా నికిష్టం లేదు. ఎందుకంటే శివ అదోటైప్! ఏం చేసినా చాలా కూల్‌గా చేసే టైప్! మర్డర్స్ కూడా! అందుకే ఇంతగా చెప్తున్నా–"

"నాకు తెలుసు శ్రీస్మితా! నేనూ తప్పనిసరి పరిస్థితుల్లోనే ఫోన్ చేస్తున్నా" శ్రీస్మిత భయపడింది.

"ఏంటది?"

"మనం అర్జంటుగా ఒకసారి కలుసుకుని ఒక ముఖ్యమయిన విషయం మాట్లాడాలి–"

"కలుసుకోవటమా? ఇంపాజిబుల్– శివ వెనుక పొలిటికల్ పార్టీ ఉంది. అందరూ నన్నే అబ్జర్వ్ చేస్తూంటారు."

"తప్పదు స్మితా! ఎంతో ముఖ్యమయిన విషయం కాబట్టే నిన్ను డిస్టర్బ్ చేస్తున్నా! నీ మారేజ్ అయాక ఒక్కసారయినా నిన్ను డిస్టర్బ్ చేశానా చెప్పు!"

స్మితకు భయం ఇంకా ఎక్కువయింది.

"సారీ శ్రీరామ్– శివ నన్నెంతగా ప్రేమిస్తున్నాడో అంత అనుమానం నామీద. అందుకే నేను ఎలాంటి రిస్కూ తీసుకోలేను–"

"కానీ మనం కొద్ది నిమిషాలయినా మాట్లాడుకోకపోతే మనిద్దరం ప్రాబ్లెమ్‌లో పడతాం స్మితా! నాకంటే ఎక్కువ నీకే ప్రాబ్లెమ్ అవుతుంది. ఎందుకంటే నీకు సినిమా బాక్‌గ్రౌండే కాదు– శివవల్ల పొలిటికల్ బాక్‌గ్రౌండ్ కూడా ఉంది నీకు– ఇవన్నీ ఆలోచించే కొన్ని విషయాలు నీతో డిస్కస్ చేయాలనుకున్నాను–"

స్మిత భయం ఇంకా పెరిగిపోయింది.

"సరే! ఎక్కడ కలుసుకోవాలి?"

"హోటల్ ఖత్రియా, సోమాజిగూడ తెలుసుకదా! అందులో రూమ్ నెంబర్ త్రీ టూ సిక్స్–"

"ఓకే– ఎన్ని గంటలకి?"

"మాణింగ్ లెవనో క్లాక్?"

"ఓకే! నేను ఫైవ్ మినిట్స్ కన్నా ఎక్కువ ఉండలేను–"

"చాలు!"

"ఓకే– ఫోన్ డిస్కనెక్ట్ చేసి వెనక్కు తిరిగేసరికి శివ నిలబడి ఉన్నాడు. గుండె వేగంగా కొట్టుకుంది శ్రీస్మితకు.

"ఎవరు ఫోన్లో–" తాపీగా అడిగాడతను.

"మా ఫ్రెండ్– వినీత–"

"ఓకే– నేను వెళ్తున్నా– ఇవాళ మధ్యాహ్నం లంచ్‌కి రాలేను– బిజినెస్ లంచ్‌కి ఎటెండవాలి–"

"ఓకే– బై–"

"బై–" అతను వెళ్ళిపోయాడు.

* * *

సడెన్‌గా రోజా తన రూమ్‌లో కొచ్చేసరికి భవానీ శంకర్ ఆశ్చర్యపోయాడు. "వెల్‌కమ్! ఉరుములేకుండా మెరుపు రావటం అంటే ఇదే–" అన్నాడు హాపీగా.

"నీతో ఓ విషయం మాట్లాడాలని వచ్చాను–"



"అయామ్ రడీ–"

రోజా ఓ క్షణం తటపటాయించింది.

"అదే మా డాడీ– మీ డాడీ– మాట్లాడుకుంటూంటే విన్నాను–"

"ఏ విషయం?"

"మనిద్దరికీ మారేజ్ చేసే విషయం–"

భవానీ ఉలిక్కిపడ్డాడు.

"ఏంటి? నిజంగానా?"

"ఇలాంటి విషయాలు జోక్ చేస్తానా?" సిగ్గుపడుతూ అంది.

"మనిద్దరి అభిప్రాయాలు తెల్సుకోకుండా అంత ఫాస్ట్‌గా దూకేస్తున్నారేంటి?"

రోజా నవ్వింది.

"నేనూ అలాఫీలయ్యే– నీతో మాట్లాడాలని వచ్చాను–"

"కానీ చిన్నప్పటినుంచీ మనిద్దరికీ అస్సలు పడదు కదా! కుదరదని చెప్పేయాల్సింది నువ్వు–"

"ముందు అలాగే అనుకున్నా! కానీ ఆలోచిస్తున్న కొద్దీ నామనసేంటో నాకర్థమయింది– నీతో ప్రతిక్షణం పోట్లాడుతూండడానికి కారణం నువ్వంటే నా మనసులో ఏర్పడ్డ ఇష్టమేనని నాకు తెలిసింది.

సైకాలజీ స్టడీస్‌లో ఆపాయింట్ కూడా ఉంది. మనంమరీ ఇష్ట పడే వ్యక్తికి దగ్గరవడానికి కొంతమంది ప్రతిక్షణం అతనితో గొడవ పడుతూంటారట! నేనాటైపే– పైగా నువ్ బృందావనం చానెల్‌ని సింగల్‌హాండెడ్‌గా నెంబర్‌వన్ స్థానానికి దగ్గరగా తీసుకురావటంతో– నీ మీద హీరో ఇమేజ్ ఏర్పడింది– సారీ– ఏంటేంటో మాట్లాడుతున్నా! అసలు ఈ విషయంలో నీ అభిప్రాయం ఏమిటో తెలుసుకుందామని...."

భవానీ ఇరుకున పడిపోయాడు.

ఏం చెప్పాలో అర్థం కాలేదు.

"డాడీ ఒకసారి చెప్పారు. నువ్వెవరో మోడల్‌ని లవ్ చేశావనీ, ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకోవాలనుకున్నావనీ, ఆ విషయంలోనే మీ డాడీతో గొడవపడి అమెరికా నుంచి వచ్చేశావనీ– ఇప్పుడా అమ్మాయిని మర్చిపోయావని కూడా డాడీయే చెప్పారు–"

భవానీ శంకర్ నవ్వాడు.

"యా! చాలావరకూ నిజమే– ఎనీవే– ఆలోచించుకోవడానికి నాక్కొంచెం

టైమిస్తావా?"

"ష్యూర్!"

"థాంక్యూ-"

"ఓకే- వెళ్తాను- బై" రోజా వెళ్ళిపోయింది.

అప్పుడే విజయ్‌యాదవ్ నుంచి ఫోన్ వచ్చింది.

"అన్నా! సక్సెస్-" అన్నాడు ఉత్సాహంగా

"అంటే?"

"అదే! ఆ శ్రీరామ్, శ్రీస్మిత ఖత్రియా హెూటల్లో కలుసుకున్నారు. అది శివ మొత్తం ఫిల్మ్ తీశాడు-"

"గుడ్- నువ్ వెంటనే శ్రీరామ్‌కి లక్షరూపాయలిచ్చెయ్-"

"ఓకే అన్నా-" భవానీ హాపీగా విజిల్ వేశాడు.

* * *

అర్థరాత్రి పన్నెండింటికి భవానీ సెల్‌మోగింది.

"ఎవడహ- అర్థరాత్రి మద్దెల దరువ్-"

"రాకేష్‌నిరా- ఇడియట్-"

"హాయ్‌దోస్త్- ఇంత లేట్‌నైట్ యాద్‌కొచ్చానేంటి? మోనికాతో మాంఛి ఎంజాయ్‌మెంట్‌లో ఉన్నావా?"

"భవానీ! అయామ్ డూమ్డ్-"

"డూమ్డా? ఏమంది బ్రదర్? ఎనీ ప్రాబ్లెబ్?"

"యస్- సీరియస్ ప్రాబ్లెమ్-"

"ఏంటది?"

"మోనికాకూ నాకూ చెడిపోయింది-"

భవానీ అదిరిపడ్డాడు.

"ఏంటీ- చెడిపోయిందా?"

"అవును- బియాండ్ రిపేర్స్-"

"ఓగాడ్-"

"పది ఓగాడ్ లేసుకో-"



"ఎలా జరిగింది రాకేష్- వాటీజ్ ది ప్రాబ్లెమ్?"

"లాస్ట్ సండే ఒక ప్రపోజల్ పెట్టింది- అదేంటంటే ఒక వారం రోజులు మా ఇంట్లో కలసి ఉందాం అంది-"

"ఓ! ఒండర్‌ఫుల్ తెగ ఎంజాయ్ చేశావా?"

"వంకాయేం కదూ! ఎంజాయ్‌మెంట్ కోసం కాదు. ఆ వారంలో మేమిద్దరం భార్యాభర్తలుగా అన్ని విధాలా సరిపోతామా లేదా అని టెస్టింగంట! ఆ అయిడియా నాకు నచ్చలేదుగానీ అయినా వప్పుకున్నా!"

"నువ్ లార్జ్ హార్టెడ్- కాబట్టి-"

"యా! మొదటి రోజు హాపీగానే గడిచింది. రెండో రోజు ప్రాబ్లెమ్ స్టార్టయింది-"

"ఏం ప్రాబ్లెమ్?"

"ఏది ప్రాబ్లెమ్ కాదని అడుగు! అన్నిటికీ కిరికిరే! ప్రతి విషయానికీ ఫస్ క్రియేట్ చేయటం మొదలుపెట్టింది-"

"కానీ నీ బిహేవియర్, అలవాట్లు అన్నీ సూపర్ కదా! ఇంకా ఫస్ ఎందుకు?"

"అదే నాకు మండింది. రోజూ నైట్‌లో మీల్స్ తరువాత నేను సిగిరెట్ తాగటం అలవాటు కదా! ఆ ఒక్క సిగిరెట్ కూడా తాగడానికి వీల్లేదంట-"

"ఎందుకని?"

"నావల్ల తనకి లంగ్ కాన్సర్ వస్తుందంట-"

"ఓ ఇమెచ్యూర్-"

"చైల్డిష్ అన్రా- ఇడియట్-"

"ఓకే- చైల్డిష్"

భవిష్యత్తులో తనకి బద్ధకంగా ఉన్న రోజున నేను వంట చేయాలి కనుక- ఇప్పుడు ఒక రోజు వంట ఎలా చేస్తానో చూపించమంది- ఓకే- రీజనబులే కదాని మీల్స్ ప్రిపేర్ చేశాను- నువ్వే జెప్పురా! నేను బోర్న్ కుక్‌నని ఏం చేసినా చాలా టేస్టీగా ఉంటుందనీ నువ్వేగా అనేవాడివి-"

"అవునుమరి- అది ఫాక్టే కదా-"

"నేను ప్రిపేర్ చేసిన మీల్స్ చూసి ఏమందో తెలుసా?"

"నాకెలా తెలుస్తుంది?"

"అసలు నాకు వంటే రాదంట-"

"నేనయితే ఊరుకునే వాడినికాదు–"

"నేను మాత్రం ఊరుకున్నానేంటి? నాకు వంట నేర్పిన చెఫ్ మందిరా మేడమ్‌ని తీసుకొచ్చి మోనికా ఎదురుగ్గా నిలబెట్టా! రాకేష్ వంట చేసినంత టేస్టీగా ఇంకెవ్వరూ చేయలేరని చెప్పింది మందిరా!"

"దెబ్బకి సైలెంటయిపోయి ఉంటుంది మోనికా!"

"అలా సైలెంటయేదయితే వ్యవహారం ఇంత దూరం ఎందుకొస్తుంది?"

"రాదు–"

"ఫైనల్‌గా మొన్నో రాత్రేం జరిగిందో తెలుసా? కౌగలించుకుని కిస్ చేస్తూంటే ఒకతో తోసి యూ ఆరే లేజీ లవర్' అంది–"

"టూ మచ్–"

"నేనేం చేశానో తెలుసా? నాపాత గాళ్‌ఫ్రెండ్ సోనీ ఉందికదా! వెంటనే సోనీని పిలపించి మోనికా ఎదుట నిలబెట్టా! సోనీ ఏం చెప్పిందో తెలుసా?– నా లవర్స్ అందరిలోకీ రాకేష్ బెస్ట్ లవ్ మేకర్– అంది–"

భవానీ తప్పట్లు కొట్టాడు.

"ఒండర్‌ఫుల్! షాకయి ఉంటుంది–"

"షాకయింది గానీ– దాంతో నాకూ సోనీకీ సంబంధం ఉందని మండిపడి– నీకూ నాకూ రాం రాం' అని చెప్పేసి అప్పటికప్పుడే వెళ్ళి పోయింది–"

"రెండ్రోజుల తర్వాత అదే సర్దుకుంటుంది బ్రదర్– డోంట్‌వర్రీ–"

"నేనూ అలాగే అనుకున్నా! కానీ తను ఆల్‌రెడీ ఇంకోడిని వెంటేసుకుని తిరగటం మొదలుపెట్టింది."

"ఓ– వెరీబాడ్ సిట్యుయేషన్–"

"చెప్పు తీసుక్కొడతా ఆమాటంటే–"

"అదేంటి?"

"నా సంగతి తెలిసి కూడా అలాంటి డైలాగ్ కొడతావేంటి? నా ప్రేమను ఇన్సల్ట్ చేసిన గాళ్‌ని నేనూ కేర్ చేయను– అందుకే నాలిస్ట్‌లో నుంచి మోనికా పేరు తీసేశాను–"

"నేనేమనాలిప్పుడు?"

"చాలా అద్భుతమయిన పనిచేశావ్ అనాలి–"

"అదే అందామనుకున్నా–"



"గుడ్– ఇదంతా నీతో చెప్పాక నాకు చాలా రిలీఫ్‌గా ఉంది–"

"నాకు చాలా టెన్షన్‌గా ఉంది–"

"ఎందుకు?"

"రోజాకీ, నాకూ– అంటే నీకూ మారేజ్ చేసేయాలని మీ ఇద్దరి పేరెంట్స్ డిసైడ్ చేసేశారంట!"

"ఓ! లేటెస్ట్ డెవలప్‌మెంట్ అన్నమాట–"

"అవును! రోజా వచ్చి ఆమేటర్ గురించి నీ అభిప్రాయం ఏమిటి? అంటూ కొశ్చెన్ చేసింది–"

"ఓకే అనాల్సింది–"

"అలా అంటే రెండు కొంపలు మునుగుతయ్–"

"ఎవరి కొంపలు?"

"నేను రాకేష్ కాదనేది ఒకటి– నేను లవ్ చేసిన మల్లిక కొంప ఇంకోటి–"

"ఓ! కొంచెం కాంప్లికేటెడే–"

"యా కొంచెం కాదు– మెడల్లోతు–"

"డోంట్‌వర్రీ! నేను వచ్చి సెటిల్ చేస్తా–"

"వ్వాట్ నువ్ వస్తావా?"

"యా–"

"ఎందుకు?"

"నిన్నీ మెస్ నుంచి సేవ్ చేయాలి కదా–"

"కానీ నిన్ను చూస్తే వాళ్ళంతా గుర్తుపడతారు కదా–"

"నిన్ను రాకేష్ అని నమ్మిన వాళ్ళు ఇంకనన్నేం గుర్తుపడతారు? డోంట్‌వర్రీ–"

"కానీ ఇక్కడకు ఎలావస్తావ్– అయ్‌మీన్ నువ్వెవరివని అడిగితే–"

"నాపేరు భవానీ శంకర్– నీ ఫ్రెండ్‌ని– ఇడియట్. ఆ మాత్రం కామన్‌సెన్స్ లేకపోతే ఎలా?

భవానీ విజిల్ వేశాడు.

"అయిడియా టెంపరరీగా ఓకేగానీ– పెద్ద సునామీ తప్పేట్లు లేదు–

"బై" ఫోన్ పెట్టేశాడు దినేష్.

* * *

డివీడీలో శివ ప్లే చేస్తున్న వీడియో చూసి స్మిత షాకయింది.

తను సీక్రెట్‌గా ఆటోలో వెళ్ళి ఖత్రియా హోటల్ దగ్గర దిగటం- లాంజ్‌లోకెళ్ళి శ్రీరామ్‌ని కలుసుకోవటం- ఇద్దరూ లిఫ్ట్‌లో రూమ్‌లోకెళ్ళి తలుపు వేసుకోవటం-

అంతవరకూ చూసేసరికి ఆమెకు దు:ఖం పొంగుకొచ్చింది.

శివ నవ్వాడు.

"చాలా! రూమ్‌లో మీరిద్దరూ జరిపిన సెక్స్ క్రీడలు కూడా చూద్దామా?" అడిగాడతను.

"ప్లీజ్- చాలు-" అంది రాలిపోతున్న కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"చాలా బాడ్‌గా ఉందానీకు?"

"అయామ్‌సారీ! అతనితో ఒకప్పుడు ఎఫైర్ ఉండేది. ఇప్పుడు లేదు-"

"నేను నిన్ను ఎక్స్‌ప్లనేషన్ అడగటం లేదు. నా డిసిషన్ చెప్పడానికి పిలచాను-"

ఆమె ఊపిరి బిగపట్టివింటోంది. తప్పదు- ఎలాంటి డెసిషన్ అయినా ఫేస్ చేయాల్సిందే-

"మనం ఎలా కలుసుకున్నామో- అలాగే విడిపోదాం- మీడియాకి ఏమాత్రం తెలీకూడదు- అంతా సీక్రెట్‌గా జరగాలి. అలా జరుగుతే నీకు ఇంతకాలం నా భార్యగా ఉన్నందుకు పదిలక్షలిస్తాను- అదీ మన డైవర్స్ వ్యవహారం అంతా అయిపోయాక- ఇంకో గంటలోగా నువ్ నీ బట్టలు తీసుకుని వెళ్ళిపోవాలి-"

స్మిత ఆఖరి ప్రయత్నం చేసింది.

"ఈ ఒక్కసారికీ క్షమించలేవా?"

"లేను- కమాన్- గెట్‌రడీ- ఇంకో విషయం- మా పేరెంట్స్‌కి మీ పేరెంట్స్‌కీ కూడా ఈ విషయం తెలీకూడదు. ఓకే-?"

ఆమెమౌనంగా తలూపింది.

అతను వెళ్ళిపోయాడు.

స్మిత తన బట్టలు సర్దుకోసాగింది.

తన తల్లి ఎప్పుడూ అంటూండేది" ఈ సినిమా జీవితాలు కూడా సినిమా లాగానే ఉంటాయ్- అని-"

సూట్‌కేస్ తీసుకుని బయటికొచ్చేసరికి కారు సిద్ధంగా ఉంది-



* * *

తను అలా భర్త నుంచి విడిపోయిన విషయం- తన తల్లికి కూడా చెప్పలేదు- ఆయన అమెరికాలో బిజినెస్ కోసం వెళ్తున్నారు. అందుకని కొద్దినెలలు ఇక్కడే ఉంటా" అందామెతో.

కానీ రెండోరోజే బృందావనం చానెల్లో తనూ, శివా విడిపోయినట్లూ విడాకులు తీసుకోబోతున్నట్లూ బ్రేకింగ్ న్యూస్ వచ్చేసరికి షాకయిపోయింది.

చానెల్‌కి ఆ వార్త ఎవరు లీక్ చేసి ఉంటారు. అది ఖచ్చితంగా శివా పనే అయుంటుంది.

మరుక్షణంలో శివ కాల్ చేశాడు.

"బ్లడీబిచ్! నేనే కావాలని నన్నూ మా ఫామిలీనీ డిఫేమ్ చేయడానికి మన ఇన్‌ఫర్మేషన్ చానెల్ కిస్తావా?"

"శివా! యూ ఆర్ మిస్టేకెన్- నేనీ విషయం మా అమ్మక్కూడా చెప్పలేదు-"

"నీకు నీతే లేదనుకున్నా! కానీ ఇంత నీచానికి పాల్పడుతావని నాకు తెలీదు. బృందావనం చానెల్ వాళ్ళంతా చెప్పారు. వాళ్ళ దగ్గర లక్షరూపాయలు తీసుకుని ఈ వార్తని అమ్ముకుంటావా! ఇప్పుడిది దేశమంతా తెల్సింది కదా! హాపీగా ఉండు! నీకు ఒక్క పైసా కూడా ఇవ్వను- కోర్ట్‌లో మనోవర్తి ఒక్క పైసా అడిగినా నీ శాల్తీ ఉండదు- గుర్తుంచుకో- నిన్నునరికి ఆనవాలు తెలీకుండా తగల బెట్టించటం నాకేం కష్టం కాదు-"

ఫోన్ డిస్కనెక్ట్ అయింది.

* * *

మల్లిక హాపీగా ఓ లెటర్ తీసుకుని భవానీ రూమ్‌లోకి పరుగుతో వచ్చింది.

"రాకేష్, కెన్ యూ బిలీవ్? శివ నా మీద వేసిన డిఫమేషన్ కేస్ విత్ డ్రా చేసేసుకున్నాడు-"

"నాకు తెలుసు- అలాగే చేస్తాడని-"

"రాకేష్- నాక్కొన్ని అనుమానాలున్నయ్- క్లారిఫై చేస్తావా?"

"ఏంటవి?"

"శివ, శ్రీస్మిత డైవర్స్ తీసుకుంటారని నీకెలా తెలుసు?"

"ఎలాగేంటి? వాళ్ళిద్దరికీ మధ్య ముసలకం పెట్టింది నేనే కదా!"

మల్లిక షాకయింది.

"ఓగాడ్- అదెలా?"

భవానీ అంతా చెప్పాడు.

మల్లిక మూడ్‌మారిపోయింది.

"నాకు చాలా బాధగా ఉంది రాకేష్-"

"ఎందుకు?"

"నాకోసం- వాళ్ళ పచ్చని సంసారంలో చిచ్చుపెట్టావ్-"

"లేకపోతే నేను లవ్ చేసినమ్మాయిని ఎవడో జైలుకి పంపిస్తూంటే చూస్తూ ఊరుకుంటానా?"

"వ్వాట్! నువ్ లవ్ చేసిన... అంటే... నువ్ నన్ను ప్రేమిస్తున్నావా?"

"ఏం నన్ను చూస్తే తెలీటం లేదా? ఊరంతా లౌడ్‌స్పీకర్స్ పెట్టి ఎనౌన్స్ చేయాలా?"

మల్లిక మొఖంలో ఆనందం కనిపించింది.

"నాకు తెలీదు- నన్ను నువ్ ఆ డిప్రెషన్ నుంచి బయటపడేసిన రోజు నుంచే నీమీద ప్రేమ కలిగింది. కానీ నా ప్రేమ వన్‌వే ట్రాఫిక్‌గానే మిగిలిపోతుందనుకున్నాను- అదీగాక నువ్వూ రోజా లవ్‌లో ఉన్నారనుకున్నాను-"

"రోజా రిచ్‌గాళ్- నేను పూర్ గై- అంచేత అధాటే రాదుమనకి- అది సరే- కమ్‌విత్ మీ- అర్జంటుగా ఒక మీటింగ్ ఏర్పాటు చేశా-"

"షూర్-"

ఇద్దరూ బయటకు నడుస్తూంటే వెనుకనుంచీ అతని భుజం తట్టింది మల్లిక.

"హలో- వన్ సెకండ్-"

"ఏంటి?" వెనక్కు తిరిగాడతను.

ఛటుక్కున అతనిపెదాల మీద ముద్దు పెట్టుకుందామె-

"ఇందుకే ఆపా! థాంక్యూ-"

"అంటే నువ్ లవ్ చేసిన వాళ్ళందరినీ ఇలా ముద్దులు పెట్టుకోవటం అలవాటా?"

ఆమె నవ్వేసింది- "యా ఆ అలవాటు ఇప్పుడే మొదలయింది-"

* * *



ఇద్దరూ బయటికొచ్చేసరికి విజయ్‌యాదవ్ వెయిట్ చేస్తున్నాడు.

"అన్నా! ప్లానంతా ఓకే! షూటింగ్ కూడా అయిపోయింది. ఇవాళ సాయింత్రం నుంచే బ్రేకింగ్ న్యూస్ స్టార్ట్-" హేపీగా చెప్పాడు.

"థాంక్యూ తంబీ! మన బాచ్ అంతా ఎక్కడున్నారిప్పుడు?"

"ఇంకాసేపట్లో చానెల్ కొస్తారన్నా-"

"అందరూ ఇక్కడే ఉండండి- ఇవాళ్టి నుంచీ డూ ఆర్ డై- వార్ బిగిన్స్-"

"డై అనే ప్రసక్తే లేదన్నా! గెలుపే-"

* * *

భవానీశంకర్ ఒకసారి ఆ హాల్లో కూర్చున్న తన సిబ్బంది అందరివేపూ చూశాడు. అర్జంటుగా ఆ సమావేశం ఎందుకు ఏర్పాటు చేశాడో ఎవరికీ అర్థంకాలేదు. అంతా సైలెంట్‌గా అతనేం మాట్లాడతాడా అని చూస్తున్నారు.

"డియర్ ఫ్రెండ్స్!" అన్నాడు భవానీ!

"నేను మన బృందావనం చానెల్ కొచ్చి షుమారు మూడు నెలలు పూర్తి కావోస్తోంది! ఈ మూడునెలలో మీ అందరూ చేసిన కృషి వల్ల మన చానెల్ అట్టడుగు నుంచి లేచి జూలు విదుల్చుకుని నెంబర్ టూ స్థానానికొచ్చింది. అంతేకాదు. నెంబర్‌వన్ చానెల్ అయిన సంపూర్ణతో ఇంచుమించుగా సమానం అయింది. కానీ నాక్కావలసింది అదికాదు.

సంపూర్ణ చానెల్ నెంబర్ టూ స్థానానికి పడటం!

ఇప్పుడు ఆ టార్గెట్ రీచ్ అవటానికి నాకున్న గడువు కేవలం- ఒకే ఒక్కవారం!

అది సాధించగలుగుతే మనం గెలిచే మొత్తం ఎంతో తెలుసా?

ఇరవై కోట్లు! ఆ ఇరవై కోట్లు నా జేబులో కొస్తుందని మీరనుకుంటే అంతకన్నా తెలివి తక్కువతనం ఇంకోటి లేదు.

ఎందుకంటే ఆడబ్బు మన చానెల్లో పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ సమానంగా చెందుతుంది.

ప్రస్తుం మన చానెల్లో రెండు వందల ముఫ్ఫయ్ మంది సిబ్బంది ఉన్నారు.

అంటే ప్రతి ఒక్కరికీ షుమారు 8 లక్షల రూపాయలు వస్తుంది- ఆ మాట విని ఎవ్వరూ ఎగ్జయిటవలేదు-

భవానీ నవ్వాడు-

"నాకు తెలుసు! కబుర్లేగానీ ఎవడికీ ఒక్క పైసా ఇవ్వడు అని అందరూ ఫీలవుతున్నారు. మీకిలాంటి చిల్లర అయిడియాలొస్తయ్యనే ఇదిగో ఈ స్టాంప్ పేపర్‌మీద ప్రతి ఉద్యోగి పేరు నా ఆ మొత్తానికి నోటు రాసిస్తున్నా!–" అంటూ తన దగ్గరున్న స్టాంప్ పేపర్లు వాళ్ళమీదకు విసిరాడు.

ఎవరి పేరున్న పేపర్ వాళ్ళు తీసుకోడానికి పదినిమిషాలు పట్టింది. అప్పుడు మోగినయ్ తప్పట్లు– ఏకబిగిన– అయిదు నిమిషాలపాటు–

"కానీ ఒక్క సంగతి గుర్తుంచుకోండి–" అందరూ అతని వేపు ఆసక్తిగా చూశారు.

"ఎనిమిది లక్షలు పుక్కట్‌గా రాదు–"

"నేననుకుంటూనే ఉన్నా– ఏదో లిటిగేషనుంటుందని–" ఎవరో మధ్యలో నుంచి అన్నారు.

"ఇవాళ్టి నుంచీ మనం ఒక రిస్కీ న్యూస్‌ని రిలీజ్ చేయబోతున్నాం! దాని పర్యవసానంగా మనం కొన్ని ఇబ్బందులు ఎదుర్కొవాల్సి రావచ్చు–. ఆ ఇబ్బందులు ఏ రూపంలో ఉంటాయో నాకు తెలీదు. పోలీసులు రైడ్ చేయవచ్చు. సీబీఅయ్ వాళ్ళు రైడ్ చేయవచ్చు. ఇవిగాక కొన్ని సంఘ విద్రోహక శక్తులు దాడులు చేయవచ్చు–"

చాలా మంది మొఖాల్లో రంగుమారింది–

"అయినా కూడా మీరంతా – అంటే మనమంతా ఒకటిగా నిలబడితే ఏ దాడినయినా తిప్పకొట్టవచ్చు"

"ఒకవేళ తిప్పికొట్టలేకపోతే?" ఇంకెవరో అరచారు.

"మనలో కొంతమంది పోతాం–"

అందరి మొఖాల్లో భయం కనిపించింది.

"మీ మొఖాలు చూస్తూంటే నాకర్థమయిపోతోంది– కొంతమంది చానెల్ వదిలి పారిపోడానికి సిద్ధంగా ఉన్నారని–"

ఎవరూ మాట్లాడలేదు.

"మీరెవ్వరూ లేకపోయినా నేను మానేజ్ చేసుకోగలను–"

మల్లిక లేచి నిలబడింది.

"అయామ్ విత్‌యూ–"

ఆమెను చూసి మరికొంతమంది ముందుకొచ్చారు. చివరకు అందరూ ముక్తకంఠంతో అరచారు.



"మేమంతా మీతోనే ఉంటాం–"

* * *

భవానీతోపాటు ఇంట్లో కొచ్చిన రాకేష్‌ని జైరాజ్ ఆశ్చర్యంగా చూశాడు.

"వీడు నా చైల్డ్‌హుడ్ ఫ్రెండంకుల్! భవానీ శంకర్–" అంటూ రాకేష్‌ని చూపించాడు భవానీ–

"ఆప్ సే మిల్‌కే బహుత్ ఖుషీ హు–" అన్నాడు జైరాజ్–

"ఈమె రోజా– మా బాస్!" అన్నాడు భవానీ రోజాకి పరిచయం చేస్తూ.

"హాయ్–" అంది రోజా.

"హాయ్–"

"మిమ్మెల్నెక్కడో చూసినట్లుంది–" అంది రోజా–

"యా! నాకూ అలానే అనిపిస్తోంది" అన్నాడు జైరాజ్–

"చూసే ఉంటారంకుల్– రాకేష్ నేనూ బాగా జిగిరీ"

"భవానీ ఇవాళ్టి నుంచీ మన ఛానెల్లో జాయినవుతున్నాడంకుల్–"

"యాజ్‌వాట్?"

"డిసాస్టర్ మానేజ్‌మెంట్ ఇన్‌ఛార్జ్–"

ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

"వ్వాట్ డిసాస్టర్ మానేజ్‌మెంటా?" నమ్మలేనట్లు అడిగింది రోజా–

"అవును రోజా!"

"దాని అవసరం మనకెందుకుంటుంది?"

"ఇంతకాలం రాలేదు– కానీ ఇకముందు ఉండకతప్పదు–"

"అంటే?" అడిగాడు జైరాజ్.

"మనం ఈ వారం రోజుల్లో టెలికాస్ట్ చేయబోయే ఎక్స్‌ప్లోజివ్ న్యూస్ అయిటమ్స్ వల్ల మన చానెల్ రకరకాల ప్రాబ్లెమ్స్ ఫేస్ చేయాల్సి రావచ్చు–"

"కానీ రాకేష్! మన చానెల్ అవ్ రెడీ నెంబర్ టూ పోజిషన్ కొచ్చింది కదా! ఇంకా అంత రిస్క్ తీసుకోవటం అవసరమంటావా?"

"చాలా అవసరం రోజా! ఏదయినా ఒక ఛాలెంజ్‌ని యాక్సెప్ట్ చేశాక వెనక్కి తిరిగి చూడకూడదు అనేది నా పాలసీ–"

"యా! అయ్ సపోర్ట్ రాకేష్" అన్నాడు రాకేష్-

"మేమిద్దరం ఆ రోజుల్లో కాలేజ్ గోడల మీద రాసే వాళ్ళం- జీనా హైతో మర్‌నా సీఖో- కదం, కదం పర్ లడ్‌నా సీఖో-"

జైరాజ్ హాపీగా తప్పట్లు కొట్టాడు.

"ఔ- మేము భీ ఉస్మానియా యూనివర్సిటీల ఆ స్లోగన్ గోడల మీద రాసేది-" అన్నాడతను గుర్తుతెచ్చుకుంటూ.

* * *

ఆ రోజు సాయంత్రం ఎనిమిది గంటలకు మొదటిసారిగా బృందావనం చానెల్లో బ్రేకింగ్ న్యూస్ అయిటమ్‌గా వచ్చిందావార్త!

కేవలం బృందావనం చానెల్‌కి మాత్రమే లభించిన సెన్సేషనల్ న్యూస్ అండ్ ఇంటర్‌వ్యూ!

ఒసామా బిన్ లాడెన్ తర్వాత రెండో అతిపెద్ద టెర్రరిస్ట్ దావూద్ ఇబ్రహీమ్ ఇప్పుడెక్కడున్నాడు? పాకిస్తాన్ మిలటరీ అతిథిగానా? అఫ్ఘానిస్తాన్‌లోనా? దుబాయ్‌లోనా? ఈ ప్రశ్నలకు జవాబు అమెరికా ఇంటెలిజెన్స్‌కి కూడా తెలీదు.

భారతదేశం మీద జరిపిన టెర్రరిస్ట్ దాడులన్నిటి వెనుకా దావూద్ ఇబ్రహీమే సూత్రధారి అన్న విషయం అందరికీ తెలిసిందే-

అలాంటి డ్రెడెడ్ టెర్రరిస్ట్‌ని మీ బృందావనం చానెల్ కలుసుకో గలిగింది.

అంతేకాదు. బృందావనం చానెల్ ప్రేక్షకుల కోసం ప్రత్యేకంగా ఇంటర్‌వ్యూ కూడా సంపాదించింది.

ప్రస్తుతం దావూద్ ఇబ్రహీమ్ ప్రణాళిక లేమిటి?భారత దేశంలో ఏయే ప్రదేశాలను అతను తదుపరి టెర్రరిస్ట్ ఎటాక్‌లకు ఎంచుకున్నాడు? భారత రైల్వేల మీద బాంబ్ ఎటాక్స్ చేయాలని ఎందుకు నిర్ణయించుకున్నాడు? భారతదేశంలో అతని అడ్డాలేమిటి? అతని అనుచరులెవరు?

వాళ్ళల్లో స్లీపింగ్ సెల్స్ ఎవరు? హైద్రాబాద్ ఓల్డ్ సిటీలో అతని అండర్‌గ్రౌండ్ కార్యాలయం ఎక్కడ ఉంది?

ఇలాంటి ఎక్స్‌ప్లోజివ్ ఇన్‌ఫర్మేషన్‌తో దావూద్ ఇబ్రహీమ్ స్వయంగా మాట్లాడిన ఈ ఇంటర్‌వ్యూ రేపటినుంచీ రాత్రి ఇదే సమయంలో ధారావాహికంగా అయిదు



రోజులపాటు టెలికాస్ట్ అవబోతోంది.

ఈ ఇంటర్‌వ్యూ కేవలం బృందావన్ చానెల్‌కి మాత్రమే పరిమితం!

ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, రాత్రింబగళ్ళు రహస్య స్థావరాలకు నడిచి సంపాదించిన ఈ ఇంటర్‌వ్యూ. భారతదేశానికే కాదు. ప్రపంచ దేశాలన్నిటికీ అమూల్యమయినది.

విదేశీ చానెల్స్‌కి గానీ, స్వదేశీ నేషనల్ చానెల్స్‌కి గానీ లభించని ఈ ఇంటర్‌వ్యూ బృందావనం లాంటి ఒక రీజినల్ చానెల్‌కి లభించటం ఒక థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియెన్స్!

ఈ ఇంటర్‌వ్యూని మిగతా చానెల్స్ కాపీ చేయకూడదు. ఒకవేళ ఎవరయినా కక్కుర్తిపడినా చట్టంలో ఇరుక్కు పోవలసిందే!

సో- బి రెడీ వ్యూయర్స్! వరల్డ్స్ మోస్ట్ సెన్సేషనల్ న్యూస్, మదర్ ఆఫ్ ఆల్ బ్రేకింగ్ న్యూసెస్-"

ఆ ప్రకటనే ఒక పెద్ద బాంబ్ బ్లాస్ట్‌లాగా పనిచేసింది ప్రజల్లో. ప్రతి ఒక్కరూ బృందావనం చానెల్‌కి అతుక్కుపోయారు. దాంతో బృందావనం చానెల్ వ్యూయర్‌షిప్ - తెలుగు చానెల్స్‌లోనే కాదు ఆలిండియా చానెల్స్ కన్నింటికంటే కూడా ఎక్కువగా రికార్డయే పరిస్థితి కొచ్చింది. ఎవరినోట చూసినా బృందావనం చానెల్ మాటే! అన్ని రాష్ట్రాల వాల్యూ ఫోన్లు చేసి తమ రీజినల్ చానెల్స్‌లో దావూద్ ఇబ్రహీమ్ ఇంటర్‌వ్యూ టెలికాస్ట్ చేయాలనుకుంటున్నట్లూ; అందుకు డిమాండ్ చేసినంత ఫీజు చెల్లించదల్చుకున్నట్లూ రిక్వెస్ట్ చేశారు.

ఆ హడావుడంతా చూసి రోజా షాకయింది.

"రాకేష్! నిజంగా నువ్ దావూద్‌ని ఇంటర్‌వ్యూ చేశావా?" అడిగిందామె అనుమానంగా.

"ఏం డౌటా?"

"కానీ నీకెలా సాధ్యమయిందది? దావూద్ వేర్ ఎబౌట్స్ అమెరికన్స్‌కే తెలీదు కదా!"

"అవన్నీ మన చానెల్ ట్రేడ్ సీక్రెట్స్! కొంతమందిని డబ్బుతో కొంటాం! ఇంకొంతమందిని అభిమానంతో కొంటాం-"

"అయినాగానీ అలాంటి టెర్రరిస్ట్ ఇంటర్‌వ్యూ దొరకటం- కొంచెం అబ్సర్డ్‌గా లేదా డాడీ?" జైరాజ్‌తో అందామె.

"యా– యా! నేను భీ అదే సొంచాయిస్తున్నా! దేఖో భవానీ! నువ్ గిసంటి దందాల్లో స్పెషలిస్ట్‌వని నాకెరుకేగానీ నిజంగా నువ్ దావూద్‌ని కల్సుకుని ఇంటర్‌వ్యూ జేసినావ్?" డౌటుగా అడిగాడు జైరాజ్.

"అంకుల్! మిగతా టీవీ చానెల్స్‌వాళ్ళు ప్రేక్షకుల మీదకు వదులతోన్న న్యూస్ అయిటమ్స్ అన్నీ ఫాక్ట్స్, జెన్యువన్, అని మీరు నమ్ముతున్నారా?"

"చచ్చినా నమ్మ!"

"అవ్ గదా! అయినాగానీ దినాం అన్ని చానెల్స్ అందరం జూస్తున్నాం! గట్లనే మన చానెల్ భీ పబ్లికంతా చూస్తారు. మనమేం చెప్పినా నిజమని నమ్ముతారు–"

రోజాకి చిరాకేసుకొచ్చింది

"రాకేష్! నువ్ మమ్మల్ని కన్‌ఫ్యూజ్ చేస్తున్నావ్‌గానీ ఫాక్ట్స్ చెప్పటం లేదు–"

"మీడియా అంటేనే ఎక్కువ అబద్ధాలు, కొన్ని నిజాలు– మిగతాదంతా కన్‌ఫ్యూజన్!"

వాళ్ళు డిస్కషన్‌లో ఉండగానే సడెన్‌గా రాకేష్ తండ్రి దినేష్‌లోపలి కొచ్చాడు.

అతనిని చూసి జైరాజ్ తప్ప మిగతావారంతా షాకయ్యారు–

రియల్ రాకేష్‌తో సహా!

"హాయ్ దినేష్! వెల్‌కమ్– వెల్‌కమ్– నీ కోసమే వెయిట్ జేస్తున్నా! ఫ్లైట్ మరీ గంటన్నర లేటయినట్లుంది–" అన్నాడు

జైరాజ్ అతనిని కౌగిలించుకుంటూ–

"యా! రెచెడ్ ఫ్లైట్! కాళ్ళు పట్టేసినయ్– కూర్చుని– కూర్చుని! హాయ్ సన్! హౌ ఈజ్ ఎవ్విరి థింగ్?" రాకేష్ వేపు చూస్తూ అన్నాడతను.

అందరి చూపులూ భవానీ వేపు తిరిగినయ్.

"అహ్హహ్హ" అన్నాడు రాకేష్– ఆ ప్రశ్నకు తనెలా రెస్పాండ్ అవాలో తెలీక.

విషయం గ్రహించిన భవానీ ఛప్పున పరిస్థితిని కవర్ చేయడానికి ప్రయత్నించాడు.

"వుయ్ ఆల్ ఆర్ ఫైన్– అండ్ ఎవ్విరిథింగ్ ఈజ్ ఫైన్" అన్నాడు జనరల్ డైలాగ్ కొడుతూ.

అప్పుడు భవానీని చూసి గుర్తుపట్టాడు దినేష్.

"హాయ్– భవానీ! మీ ఇద్దరూ ఇంకా ఫ్రెండ్‌షిప్ అదే లెవల్లో కంటిన్యూ చేస్తున్నారన్నమాట!" అన్నాడు దినేష్ భవానీవేపు చూస్తూ.

భవానీ, రాకేష్‌లు ఇద్దరూ పక్కపక్కనే నిలబడడంతో జైరాజ్ ఖచ్చితంగా వాళ్ళల్లో



ఎవరినుద్దేసించి మాట్లాడుతోందీ ఎవరికీ తెలీటం లేదు.

"సేమ్– మన దోస్తానా లెక్కనే ఈళ్ళిద్దరూ గూడా! అయ్‌లైక్ దెమ్" అన్నాడు జైరాజ్.

"హౌ ఆర్ యూ రోజా బేటీ?" రోజాని అప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు దినేష్.

"ఫైనంకుల్– థాంక్యూ–" అంది రోజా.

"అండ్ హు ఈజ్ దిస్ బ్యూటిఫుల్ గాళ్?" మల్లికను చూస్తూ అడిగాడు దినేష్–

"మన బృందావనం చానెల్ ప్రొడ్యూసర్! మల్లిక! సూపర్ ఇంటెలిజెంట్ గాళ్–" ఇంట్రడ్యూస్ చేశాడు జైరాజ్. మల్లిక సిగ్గుపడింది.

"హాయ్ సర్–" అంది చిరునవ్వుతో

"నేను చానెల్ కెళ్తున్నా!" భవానీతో చెప్పి వెళ్ళి పోయిందామె–

"రాకేష్ మనిద్దరం కూడా వీలయినంత త్వరగా ఇక్కడినుంచి బయట పడకపోతే– నీ పేరుతో నేను డ్రామా ఆడుతున్న విషయం బయట పడిపోతుంది–" కంగారుగా అన్నాడు భవానీ.

"యా! నేనూ అదే ఆలోచిస్తున్నా! కానీ ఎలా తప్పించుకోవటం?"

"సో అయామ్ హాపీ మై సన్! నువ్ రోజాని మారేజ్ చేసుకో డానికి వప్పుకున్నావని జైరాజ్ చెప్పాడు. చెప్పగానే నేనూ మీ మమ్మీ ఎంత హాపీగా ఫీలయ్యామంటే– ముందు మీ ఇద్దర్నీ అమెరికా తీసుకురమ్మని నన్ను పంపించింది–" అన్నాడు దినేష్ రాకేష్ వేపు చూస్తూ–

సమాధానం కోసం అందరూ భవానీ వేపు చూశారు.

"యా! గుడ్ అయిడియా!" అన్నాడు భవానీ ఎవరికీ అనుమానం రాకుండా!

"యా! దట్ వుడ్ బి ఫైన్–" అన్నాడు రాకేష్ కూడా ఎవరికీ దొరక్కుండా మానేజ్ చేస్తూ.

రోజా సిగ్గుపడింది.

అంతవరకూ రాకేష్ తనని యాక్సెప్ట్ చేస్తాడో, లేదో అన్న డౌట్‌తో ఉంది. ఆ టాపిక్ వచ్చేప్పటికీ రాకేష్ నాన్ కమిటల్‌గా మాట్లాడుతున్నాడు– ఇన్ని రోజులూ!

"నేనింకో సూపర్ డూపర్ ప్లాన్ ఆలోచించినా రా!" అన్నాడు జైరాజ్ దినేష్‌తో–

"అండ్ వాటీజ్ దట్ ప్లాన్?"

"రోజాకీ, రాకేష్‌కీ ఇక్కడ అర్జంటుగా మారేజ్‌చేసి- అప్పుడు అమెరికా తీసుకెళ్ళి- మళ్ళీ అక్కడ కూడా మారేజ్ చేస్తే సూపర్‌గా ఉండదూ?"

"ఫెంటాస్టిక్ అయిడియా! కాపోతే రేపటికల్లా ఇక్కడ మారేజ్ ఎరేంజ్‌మెంట్స్ చేయగలమంటావా?"

"ఇది హైద్రాబాద్‌రాభయ్- ఫైసాఫేకో- తమాషా దేఖో! సెకండ్స్‌లో అన్నీ అయిపోతాయ్-"

"అయితే నో ప్రాబ్లెమ్-"

ఇంక లాభం లేదని ఛప్పున భవానీ కల్పించుకున్నాడు.

"అంకుల్- మేమిద్దరం- అలా చానెల్ కెళ్ళి వస్తాం! అర్జంట్ వర్క్ ఉంది-"

"ఓకే- కారీ ఆన్" అన్నాడు దినేష్.

"ఈలోగా దినేష్ రిలాక్సవుతాడు" అన్నాడు జైరాజ్. భవానీ, రాకేష్ హాపీగా బయటకు పరుగెత్తారు.

"హమ్మయ్య- టెంపరరీగా బయటపడ్డాం-" అన్నాడు భవానీ.

"లాభంలేదు రా! రేపే మారేజ్ అంటున్నారు. మనం ముందే జరిగిందంతా చెప్పేయటం బెటర్-" అన్నాడు రాకేష్.

"అదే- ఎలా చెప్పాలీ- ఎంత డెలికేట్‌గా చెప్పాలీ అనే విషయం చానెల్ కెళ్ళి డిసైడ్ చేద్దాం-"

ఇద్దరూ కార్లో చానెల్‌కి బయల్దేరారు.

"మీ డాడీ ఇంత సడెన్‌గా అమెరికా నుంచి వస్తారని తెలీదు-" అన్నాడు భవానీ-

"తెలుస్తే- నేనేదొక వంక చెప్పి ఇంటి నుంచి జారుకునే వాడిని-"

"షటప్! నువ్వలా చేస్తే ఇరుక్కుపోయేది నేను- జైరాజ్ అంకుల్ రోజాలకు నేను రాకేష్‌ని కాదన్న విషయం తెలిసిపోయేది-"

"అవును!"

"ఇప్పుడేం చేద్దాం మరి?"

"ఇద్దం కలసి పారిపోవటం ఒక ఆప్షన్-"

"ఎక్కడికి?"

"అదే- ఆ స్లమ్‌లో నీ ఇల్లుందికదా! అక్కడ దాక్కుంటేనే సేఫ్-"

"ఇంకెక్కడుందది- మోనికాకూ నాకూ చెడిపోగానే అది వెకేట్ చేసేశా!"



కారు చానెల్ ఆవరణలో కొచ్చి ఆగింది.

* * *

కారు దిగ్గానే అక్కడి వాతావరణం చూసి రాకేష్, భవానీ షాకయ్యారు.

ఆ కాంపౌండంతా పోలీసుల్తో నిండిపోయి ఉంది.

మల్లిక ఇంచుమించుగా పరుగెడుతూ వారి దగ్గరకొచ్చింది.

"రాకేష్! పోలీస్ ఆఫీసర్స్ వచ్చారు. ఆ దావూద్ సీడీ కావాలంటున్నారు-"

"మా బాస్ బాంబేలో ఉన్నాడు. రేపు మాణింగ్ వస్తున్నాడని చెప్పు-"

"ఓకే" అనేసి లోపలకు పరుగెత్తింది.

పోలీసుల వెళ్ళిపోయాక ఎండీ చాంబర్‌లోకి నడిచా రిద్దరూ-

"భవానీ- నాకర్థం కాలేదు- ఆ సీడీ కోసం పోలీస్‌లెందుకొచ్చినట్లు?" అడిగాడు రాకేష్.

"సెంట్రల్ ఇంటెలిజెన్స్ వాళ్ళు ప్రెజరిచ్చి ఉంటారు. వాళ్ళకు అమెరికా వాళ్ళ ప్రెజర్ ఉందుంటుంది. టెలికాస్ట్‌కి ముందే వివరాలు తెలుసుకోవాలని వాళ్ళ అయిడియా-"

"కానీ ఇదంతా మొత్తం ఫ్రాడ్ అని తెలుస్తే ఏం జరుగుతుంది?"

"ఏమయినా జరగనీ! ముందు మన చానెల్ మాత్రం నెంబర్‌వన్ అవుతుంది-"

"ఆ తర్వాత?"

"నువ్ జైల్లో ఉంటావ్-"

రాకేష్ షాకయ్యాడు. "నేనా?"

"అవును! ఈ చానెల్‌కి ఎం.డి. నువ్వేకదా- అయ్‌మీన్ రాకేష్ పేరు నీదేగా-"

"ఓ! అంటే జైలు కెళ్ళేది నేనేనన్నమాట!"

భవానీ నవ్వాడు.

"డోంట్‌వర్రీ! ఆ పరిస్థితేవస్తే మనం వెంటనే అండర్‌గ్రౌండ్‌లో కెళ్ళిపోతాం! మన పాత స్లమ్‌లో ఇంకో రూమ్ తీసుకుని నెలరోజులు దాక్కుంటే చాలు. తర్వాత అందరూ మన విషయం మర్చిపోతారు-"

"యా! ఇంకో దారిలేదనుకుంటా! ఆ సంగతలా ఉంచుతే- ఇప్పుడు ఇమీడియెట్‌గా మనం టాకిల్ చేయాల్సిన ప్రాబ్లెమ్ ఇంకోటుంది-"

"ఏంటది?"

"మా డాడీ, జైరాజంకుల్ కలసి నా మారేజ్ ఆ రోజాతో జరిపించేసేట్లున్నారు-"

"అవునూ- మనలో మనమాట! రోజాను చేసుకోవచ్చుకదా! కొంచెం హెడ్‌స్ట్రాంగేగానీ- అదర్ వైజ్- మంచి వైఫ్ అవడానికి ఛాన్సుంది-"

"అఫ్‌కోర్స్- చిన్నప్పటికీ ఇప్పటికీ చాలా తేడా ఉన్నట్లు కనబడుతోంది! అయినాగానీ సమ్ హౌ అనీజీగానే ఉంది-"

"చూడు మిత్రా! ఓ పక్క మోనికాపోయింది- ఇప్పుడీ రోజా కూడా పోతే- నీ కిక జన్మలో పెళ్ళి అవదు-"

"ఎందుకని?"

"జనంలో నీ మీద లేని పోని డౌట్స్ వచ్చేస్తయ్-"

"ఓ గాడ్- అంతేనంటావా?"

ఇద్దరూ సోఫాలో పడుకుని మాట్లాడుతూండగానే నిద్రపట్టేసింది.

* * *

ఏవో పెద్ద గొంతులు వినబడి మెలకువ వచ్చేసరికి అర్థరాత్రి దాటిపోయింది. సడెన్‌గా జైరాజ్, దినేష్, రోజా, సబిత లోపలికొచ్చారు.

"రాకేష్! ఇంట్లో మమ్మల్ని నిద్రపోనిస్తే వట్టు! నేషనల్ ఛానెల్ వాళ్ళూ, రీజినల్ చానెల్ వాళ్ళూ, మొత్తం మనింటి చుట్టూ వాళ్ళ కార్లతో నిండిపోయింది. అందరూ ఆ దావూద్ సీడీ కాపీ కోసం లక్షలు గుమ్మరించడానికి సిద్ధంగా ఉన్నారు-" అంది రోజా-

"ఓ! అలాగా! అయితే ఇప్పుడే డిసైడ్ చేద్దాం-" అన్నా భవానీ! వాళ్ళు మాట్లాడుతూండగానే మల్లిక హడావుడిగా వచ్చింది.

"రాకేష్- కొంప మునిగింది- టెర్రరిస్టులమని ఒక గాంగ్‌మనాఫీస్ కొచ్చారు- గన్‌పాయింట్ మీద మన సెక్యూరిటీ గార్డ్సుని ఎత్తుకపోయారు!"

భవానీ ఉలిక్కిపడ్డాడు.

"మన గార్డ్సునా?"

"అవును-"

"ఎందుకు?"

"తెలీదు- నేను నా రూమ్‌లో వర్క్ చేస్తూంటే ఒక టెర్రరిస్ట్ గన్‌పట్టుకుని నా దగ్గర కొచ్చాడు. దావూద్ సీడీ తనకివ్వకపోతే మన చానెల్ సరిగ్గా గంటసేపట్లో బ్లాస్ట్



అయిపోతుందని చెప్పాడు- అది నా దగ్గర లేదని చెప్పి సెక్యూరిటీ గార్డ్ కోసం ప్రయత్నించాను. ఫోన్ ఎవరూ తీయలేదు. బయటకు పరుగెత్తాను- అప్పటికే మన బిల్డింగ్ డోర్స్ అన్నీ బయటి నుంచీ లాక్ చేసేశారెవరో-"

"మరి ఆ టెర్రరిస్ట్ ఏమయ్యాడు?"

"ఆఫీసంతా వెతికించాను. లోపలెక్కుడాలేదు-"

అందరికీ చెమటలు పట్టినయ్.

జైరాజ్ గాబరా పడిపోయాడు.

"అదేంది! ఈ కిరికితో టెర్రరిస్ట్‌ల కేం లింకున్నది?" అడిగాడు దినేష్ అయోమయంగా!

"ఈ టెర్రరిస్ట్ ఆర్గనైజేషన్లు ఒకటి గాదురా భయ్- చాలా ఉన్నయ్- ఇది మరో జిహాద్ గ్రూప్ కావొచ్చు-" జవాబిచ్చాడు జైరాజ్- భవానీ, రాకేష్ చానెల్ లోపలి రూమ్‌లోకి పరుగెత్తారు. స్టాఫ్ అంతా భయంగా కూర్చుని ఉన్నారు.

భవానీని చూడగానే అందరూ చుట్టుముట్టారు.

"సార్- బయటినుంచీ డోర్స్ అన్నీ లాక్ చేసేశారు సార్- గంటలో మన చానెల్ బ్లాస్ట్ చేసేస్తామని టెర్రరిస్ట్‌లు మన సెక్యూరిటీ గార్డ్సుతో చెప్పారంట-"

"మీరేం వర్రీ అవకండి! నిజంగా మన ప్రాణాల మీద కొస్తే వాళ్ళ సీడీ వాళ్ళకిచ్చేద్దాం! ఓకే?"

వాళ్ళా మొఖాల్లో కొంత ధైర్యం కనిపించింది.

భవానీ సెల్ మోగిందప్పుడే-

"రాకేష్ హియర్-"

"హాల్ రాకేష్! నేను లష్కరే తోయిబా హెడ్‌ని- ఓల్డ్ సిటీకెళ్ళి మాట్లాడుతున్నా! నువ్ టెలికాస్ట్ చేస్తానంటున్న దావూద్ ఇంటర్‌వ్యూ సీడీ పూరా బోగస్ హై- ఫ్రాడ్ హై- ఈ మేటర్ ఇబ్రహీమే ఖుద్ మాకు జెప్పించు! గిసంటి గలత్ కామ్ చేస్తున్నందుకు మీ చానెల్ బ్లాస్ట్ జేయమని మాకు ఇన్‌స్ట్రక్షన్స్! బాంబ్ పెట్టినాం! ఇంకో గంటలో ఎక్స్‌ప్లోడ్ అవుతయ్-"

ఆ టెర్రరిస్ట్ గొంతు స్పీకర్‌ఫోన్‌లో అక్కడున్నవారందరికీ వినబడుతూండడంతో అందరిలోనూ టెన్షన్-

"హలో! ఆ బ్లాస్ట్‌లో మీ చానెల్ వాళ్ళందరూ ఖతమ్ కావాలె! బయటకి పోనికి

కోషిష్ చేసినా పోలేరు– డోర్స్ అన్నీ బయటి కెళ్ళి లాక్ చేసి వాటన్నిటికీ బాంబ్‌తో లింక్ చేశాం! ఏ డోర్ టాంపర్ జేయనికి కోషిష్ చేసినా మొత్తం బిల్డింగ్ బ్లాస్ట్ అవుతుంది. సమజ్‌గయే?"

భవానీ బుర్ర అప్పటికే వేడెక్కిపోయింది.

"ఓకే! ఈ సీడీ టెలికాస్ట్ చేయకుండా ఆపేస్తాం– ఆ బాంబ్ డిఫ్యూజ్ చేసేయండి–"

"అతను నవ్వాడు.

"క్యా పాగల్ హై రే తుమ్? మేము డీల్ కోసం ఆ బాంబ్ పెట్టలేదు. ఇంకో చానెల్ వాడెవ్వడూ గిసంటి దందాలు జేయకుండా లెసన్ ఇవ్వనికి ఆ బ్లాస్ట్ జేస్తున్నాం! ఈ న్యూస్‌గిప్పుడే అన్ని చానెల్స్‌కీ చెప్తున్నాం! నీ చానెల్ బ్లాస్ట్ నువ్వే అన్ని చానెల్స్ ప్రోగ్రామ్స్‌లో చూస్కో– అప్పటివరకూ నువ్ బ్రతికుంటే–"

ఫోన్ కట్టయింది.

రాకేష్ హఠాత్తుగా పగలబడి నవ్వాడు.

"అయితే అయిందిగానీ ఒక్కసారిగా మన కాలేజ్ ఎడ్వంచెర్స్ యాద్ కొచ్చినయ్‌రా"

రోజా పరుగుతో మెట్లెక్కి ఆయాసంతో ఒగరుస్తూ వచ్చింది.

"రాకేష్! నీకు తెలుసా? మన చానెల్ ఇంకో గంటలో బ్లాస్ట్ అయిపోతుందంట– టెర్రరిస్ట్ బాంబ్స్ పెట్టారంట! అన్ని చానెల్స్‌లో ఆ న్యూస్ చూపిస్తున్నారు–"

"అసలు ప్రాబ్లెమేమిటి రా భయ్– ఈ టెర్రరిస్ట్‌లింత రెచ్చిపోయారేంటి?" అడిగాడు జైరాజ్–

"మెంటల్‌గాళ్ళు రెచ్చిపోడానికి రీజనుండదు–"

"ఆ సంగతట్లుండనీ రాకేషన్నా! గిప్పుడు పరిస్థితేంటి? మా అందరి ప్రాణాలూ బైగన్‌లో కల్సిపోవాల్సిందేనా?" స్టాఫ్‌లో నుంచి సుధీర్ అడిగాడు.

"బైగన్‌లో కలవకుండా చూసే బాధ్యతనాది!" అన్నాడు భవానీ–

"ఇంతకూ మీరేం చేశారసలు?" అడిగాడు దినేష్.

"ఓల్డ్ సిటీలో అచ్చం దావూద్ ఇబ్రహీం లాగా ఉండే వాడినొకడిని చూశాం. వాడిని చూశాక మాకో అయిడియా వచ్చింది. వాడికి డబ్బిచ్చి తీసుకొచ్చారు మా విజయ్‌గాంగ్. వాడికి దావూద్ స్టయిల్లోగెటప్ ఇచ్చి కొండల్లోకి తీసుకెళ్ళి ఇంటర్వ్యూ చేసి రికార్డ్ చేశాం. ఆ తరువాత మిమిక్రీ ఆర్టిస్ట్ ఒకడితో వాయిస్ డబ్ చేయించాం– ఆ సీడీ టెలికాస్ట్ అయిన మరుక్షణం మన బృందావనం చానెల్ నెంబర్ వన్ అవుతుందని–



మా ఎస్టిమేషన్–"

భవానీ చెప్తూంటే అందరూ షాకయి వింటున్నారు.

"రాకేష్! పబ్లిక్‌ని ఇలా ఫూల్ చేయటం క్రైమ్ కదూ?" అడిగింది మల్లిక.

"యా! క్రైమే! మనదేశంలో క్రైమ్ అనేది ఒక రెస్పెక్టబుల్ ప్రొఫెషన్! అందుకే ఎంతోమంది సెంట్రల్, స్టేట్ మినిష్టర్లు, ఎంపీలూ, ఎమ్మెల్యేలు– జైల్లో ఉన్నారు. సర్‌వైవల్ కోసం చానెల్ వాళ్ళు చాలామంది చేస్తోందీ అదే!"

దినేష్ భవానీ వేపూ, మల్లిక వేపూ ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"అవునూ– ఇందాకటి నుంచీ చూస్తున్నాను. అందరూ భవానీ శంకర్‌ని పట్టుకుని రాకేష్ అంటున్నారేంటి? మీకేమయినా మెంటలా?" అడిగాడు దినేష్. ఆ మాటకు మల్లికతోపాటు రోజా కూడా షాకయింది.

"వాట్? రాకేష్ పేరు భవానీ శంకరా?" అడిగింది మల్లిక.

దినేష్ మల్లికను పిచ్చిదాన్ని చూసినట్లు చూశాడు.

"ఏయ్ పిల్లా! నీకేమయినా మెంటలా? రాకేష్ పేరు భవానీశంకరేమిటి? రాకేష్ పేరు రాకేషే– భవానీ పేరు భవానీయే–"

జైరాజ్ కూడా కన్‌ఫ్యూజయాడు.

"తుమ్ క్యా బోల్ రహేహైరే! రాకేష్ రాకేష్ కాదా?"

భవానీశంకర్, రాకేష్ సైలెంటయిపోయారు. ఇంకడ్రామా బయటపడక తప్పదని ఇద్దరికీ అర్థమయిపోయింది.

"ఇదిగో– మీరంతా వీడిని రాకేష్ అని పిలుస్తున్నారు కదా!"

"అవును!"

"అదే రాంగ్! వీడి పేరు భవానీ శంకర్–"

"మరి మా అందరికీ రాకేష్ అని చెప్పాడు కదా– అతను భవానీ అయితే రాకేష్ ఎవరు మరి?" అడిగింది రోజా–

"నేను" అంటూ ముందుకొచ్చాడు రాకేష్.

"నువ్వా!" అంది సబిత–

"అందుకే ఆ మొఖం ఎక్కడో చూసినట్లనిపించింది నాకు" అంది రోజా– ఇక లాభం లేదని భవానీ కల్పించుకున్నాడు.

"నేరం నాది కాదంకుల్! మీరు రాకేష్‌ని ట్రేస్ చేయడానికి ఏర్పాటు చేసిన డిటెక్టివ్

గాంగ్‌ది! వాళ్ళు రాకేష్ అడ్రస్ కనుక్కుని అతనింటికి వచ్చేసరికి అక్కడ నేనూ కనిపించా! తను వాళ్ళ చేతుల్నుంచీ తప్పించుకోడానికి "నన్నే' రాకేష్ అని వాళ్ళకు అబద్ధం చెప్పాడు. దాంతో వాళ్లు నన్నూ కిడ్నాప్ చేసుకొచ్చి మీ కప్పజెప్పారు–" చెప్పాడతను.

జైరాజ్‌కి అర్థమయింది.

"అంటే– గదేదో సిన్మాలో లెక్క జేసిన్రన్నమాట–"

"అవును! నేను ఆ పేరుతోనే కంటిన్యూ అవకపోతే చాలా ప్రాబ్లెమ్స్ వస్తాయని అనిపించి సైలెంట్‌గా ఉండిపోయాను. ఈలోగా ఈ బృందావనం చానెల్ వ్యవహారం నామీద పడింది. ఆ చానెల్‌ని నెంబర్‌వన్ చేశాక నాదారిన నేను పోవచ్చనుకున్నా! కానీ ఈలోగానే––" వివరంగా చెప్పాడు భవానీ!

"అయితే – యూ ఆర్ ది భవానీ శంకర్–" ఆవేశంగా, ద్వేషంగా అంది మల్లిక భవానీతో–

"యా!"

"ఆ రోజు చానెల్లో జడ్జీగా ఉండి– ఒక చెత్త సింగర్‌ని విన్నర్ చేసిన భవానీ శంకరే కదూ?"

"యా! కానీ ఆ రోజు అలా నీకు అన్యాయం జరగడానికి వెనుక ఓ కథ ఉంది–"

భవానీ శంకర్ చెంప ఛెళ్ళుమంది.

ఆ సీన్ చూసి అందరూ షాకయ్యారు.

"హాలో– వెయిటే మినిట్–" అని భవానీ అంటున్నా అతని రెండో చెంప పేల్చేయడానికి ప్రయత్నించి అతని చేతుల్లో ఇరుక్కుపోయి, కదల్లేక 'హు' అంది అవేశంగా.

రాకేష్ చిరాగ్గా మల్లికవేపు చూశాడు.

"భవానీ– మనమంతా బాంబ్‌ల పరేషాన్‌లో ఉంటే– ఈ పోరికేమాయె? నువ్వంటే గింత దుష్మనీ ఎందుకు?" అడిగాడు రాకేష్.

"డజ్ షీ బికమ్ మెంటల్ ఆర్ వాట్?" అరచాడు దినేష్.

భవానీ నవ్వాడు.

"ఫ్లాష్ బాక్‌సీన్ ఒకటుందిలే! మనిద్దరం– అదేదో టీవీ చానెల్ కండక్ట్ చేసిన సాంగ్స్ పోటీలో– మల్లికకు అన్యాయం జరిగిందంట! అప్పటినుంచీ కొంచెం సైకిక్ టైప్ అయిపోయి భవానీ శంకర్ అనే పేరు గలవాళ్ళందర్నీ మర్డర్ చేయడానికి ట్రై చేస్తోంది–"



రాకేష్‌కి చిరాకు ఇంకా పెరిగిపోయింది.

"ఇలాంటి వాళ్ళను ఎర్రగడ్డ పంపించాలిగానీ– జనంలో వదిలేస్తే ఎలా? పబ్లిక్‌కి పెద్ద న్యూసెన్స్ కదా?"

"మల్లిక ఆవేశంగా రాకేష్ చెంప పగలగొట్టడానికి అతనిమీదకు దూకిందిగానీ భవానీ ఆమె చేయిపట్టుకుని లాగేశాడు.

"ఇదిగో– నేనంటే నిన్ను లవ్ చేశాను కాబట్టి ఒక చెంప మీద కొట్టినా రెండో చెంప ఇవ్వడానికి రడీ అయాను– కానీ రాకేష్ ఆ టైప్ కాదు. తను ఎంతగాఢంగా ప్రేమించినమ్మాయయినా సరే– తనే రెండు రెంపలూ వాయిస్తాడు–" మల్లికతో చెప్పాడు భవానీ!

"ఇయాల్రేపు పోరీలన్నీ గిట్లనే బిహేవ్ చేస్తున్రు–" అన్నాడు జైరాజ్ దినేష్‌తో–

"అవ్! మన కాలేజ్ డేస్‌లో పోరీలెట్లుండె? మనమేం జేసినా గానీ మనల్ని వదలకపోతూండె" అన్నాడు దినేష్.

"అవ్– మనీషారెడ్డి, మేరీ, మమత––" అంటూ జైరాజ్ ఫ్లాష్ బాక్ విప్పబోతూంటే "ఇంక చాలు" అందతని భార్య సబిత కోపంగా. జైరాజ్ సైలెంటయిపోయాడు.

"ఈ గాళ్స్ అంతా ఇంతే అంకుల్! కొంచెం అప్సెట్ అయినా తట్టుకోలేరు. బాంబ్స్‌లాగా బ్లాస్ట్ అయిపోతారు–" అంటూ చెప్తూండగానీ భవానీ చెంప మీద రోజా చెయ్యి బ్లాస్టయింది.

"ఇడియట్– యూ ఆర్ ప్లేయింగ్ విత్ లైవ్స్–" అందామె ఆవేశంగా.

అంతా షాకయిపోయారు.

"ఇదేంట్రా! గాళ్స్ అంతా నీ చెంపల్ని అంత లైక్ చేస్తున్నారు?" ఆశ్చర్యంగా అడిగాడు దినేష్–

"ఒకటి కొడితే రెండో ఫ్రీ స్కీమ్ పెట్టా–" చెప్పాడు భవానీ.

"ఏంటిదిది జైరాజ్? ఇదేదో టీవీ సీరియల్ లెక్కుంది–" అడిగాడు దినేష్–

"ఫ్లాష్ బాక్ చెప్పనా?"

"లేకుంటే ఎట్లా తెలుస్తది మళ్ళా"

"రోజా రాకేష్‌ని ప్రేమించింది–"

"ఒండర్‌ఫుల్ నాక్కావలసిందీ అదే–"

'జర ఆగరాభాయ్– రాకేష్ అంటే రాకేష్ కాదు–"

"మరి?"

"భవానీ శంకర్‌ని ప్రేమించింది–"

"మరి రాకేషంటావేంటి?"

"గదేరా బాబూ– భవానీ శంకర్ రాకేష్ పేరుతో డ్రామా ఆడిండు కదా!"

"అవ్– ఆడితే?"

"భవానీయే రాకేష్ అనుకుని ప్రేమించింది–"

"ఓ– గట్లజెప్పు– కానీ ఇప్పుడు వాడు రాకేష్ కాదు భవానీ అని తెలిసింది గదా– ఇప్పుడు రాకేష్‌నే ప్రేమిస్తే సరి–"

"అక్కడే మన జమానాకీ– ఈ జమానీకీ తేడా ఉన్నది–"

"ఏందది?"

"ఈ జమానాలో గాళ్స్ గాళ్స్ కాదు–"

"సెక్స్ ఛేంజ్ ఆపరేషన్ జేసుకుంటున్రా"

"ఓర్నాయనో– నువ్ మరీ అడ్వాన్సున్నావురా భయ్–"

"మా అమెరికాలో అలాంటి కేస్‌లే ఎక్కువ! అది సరేగానీ రాకేష్, రోజా కలసి చిన్నప్పుడు చదివిన్రు కదా! అట్లెట్లా ధోకా తిన్నది?"

"నువ్ మాట్లాడేది చిన్నప్పటి సంగతి రా భయ్! అప్పటి కాండేట్స్‌ని ఇప్పుడెవళు గుర్తుపడతారు?"

"నాకు మొదట్లోనే డౌట్ వచ్చింది డాడీ! కానీ అతను రాకేష్ నాకు పెట్టిన నిక్‌నేమ్‌తో పిలచేసరికి– కన్విన్స్ అయాను–"

"అంటే– ఆ నిక్ నేమ్‌తో ఎవడు పిలుస్తే ఆడిన లవ్ చేసి పెళ్ళి చేసేసుకుంటా వన్నమాట– ఒకవేళ ఆ నిక్ నేమ్‌తో పదిమంది పిలుస్తే?" భవానీ అంటూంటే కోపంగా రోజా మళ్ళీ అతని చెంప మీద వాయించబోయింది గానీ రాకేష్ అడ్డుపడ్డాడు.

"హాలో– అంత ఓవరొద్దు! భవానీ కరెక్ట్ కొశ్చనే వేశాడు–"

"షటప్– నువ్ కూడా అతన్ని సపోర్ట్ చేస్తావేంటి? హీ ఈజే డిసీవర్–"

"డిసీవర్ అంటే– ఏం మోసం చేశాడు? మాయ మాటలు చెప్పి నిన్ను ప్రెగ్నెంట్ చేశాడా?"

"తిక్క వాగుడే నాకు నచ్చదు– నేనా టైప్‌లాగా కనబడుతున్నానా?" దినేష్ ఇంటర్ ఫియర్ అయాడు.



"ఓకే– ఓకే– ఓకే బేబీ! జరిగిందేదో జరిగిపోయింది! ఇప్పుడా బాంబ్ బ్లాస్ట్ కెళ్ళి మనందరం బచాయియించెడిదెలా?" అడిగాడు దినేష్–

"అదే సోంచాయిస్తున్నా! పోలీస్ కమిషనర్ నా దోస్తే! అతనికి రింగ్ చేస్తా–"

"పోలీస్ కమిషనర్ కాదుగదా! మొత్తం ఆర్మీవచ్చినా ఏమీ చేయలేరంకుల్! ఎందుకంటే బాంబ్‌లు మన బిల్డింగ్ లోపలపెట్టారు. ఎక్కడ పెట్టారో ఎవడికీ తెలీదు. డోర్స్ అన్నీ బయట నుంచి లాక్ చేశారు. ఏ డోర్ తెరవడానికి ప్రయత్నించినా బాంబ్స్ బ్లాస్ట్ అయిపోతాయ్–" చెప్పాడు భవానీ– ఆ డైలాగ్‌తో అందరి మొఖాల్లోనూ భయం కనిపించింది.

"అంటే మనం తప్పించుకోలేమంటావా?" అడిగాడు దినేష్–

"తప్పించుకోగలమా లేదా బ్లాస్ట్‌లో వీరమరణమా అనేది ఇంకా సేపట్లో తెలుస్తుంది–"

అందరూ టెన్షన్‌తో మొఖాలు చూసుకున్నారు.

"ఎలా తెలుస్తుంది?" అడిగింది రోజా–

"మనల్ని రక్షించడానికి విజయ్ యాదవ్ ప్రయత్నం చేస్తున్నాడు. ఆ ప్లాన్ సక్సెస్ అయితే వెంటనే మనకి ఫోన్ వస్తుంది–" అందరూ సైలెంటయ్‌పోయారు.

"నువ్వలాంటి ఫూలిష్ పని చేయకుండా ఉండాల్సింది" అన్నాడు జైరాజ్–

"అవును– టెర్రరిస్ట్‌లతో ఎవడైనా గొడవ పెట్టుకుంటాడా?" అన్నాడు దినేష్–

అందరూ భవానీ శంకర్‌మీద దండెత్తటం మొదలుపెట్టారు.

"మీరెన్నన్నా అనుకోండి! నేను వేసిన ప్లాన్ గ్రేట్ అనే ఇప్పటికీ అంటా! టెర్రరిస్ట్ గ్యాంగ్ యాంగిల్ ఎవడూ ఎక్స్‌పెక్ట్ చేయడు కదా–"

టీవీలో మిగతా చానెల్స్ అన్నీ స్కాన్‌చేస్తోంది మల్లిక.

అన్ని చానెల్స్‌లోనూ బృందావన్ చానెల్ బిల్డింగే చూబిస్తున్నారు.

అన్ని చానెల్స్ లోనూ కొద్దిసేపట్లో బ్లాస్ట్ అవబోతూన్న బృందావన్ చానెల్ గురించి డిస్కషన్సే–

"ఆల్ ఖైదావాళ్ళు అమెరికాలో ట్విన్ టవర్స్‌ని బ్లాస్ట్ చేసిన తర్వాత– లైవ్ కవరేజ్‌తో– ఒక చానెల్ ఆఫీస్‌ని బ్లాస్ట్ చేయబోవటం ఇదే మొదటిసారి–

"చెప్పండి కమిషనర్‌గారూ? బృందావనం చానెల్లో ఎంతమంది సిబ్బంది చిక్కుకుపోయి ఉన్నారని మీరనుకుంటున్నారు?"

"మా దగ్గరున్న ఇన్‌ఫర్మేషన్ ప్రకారం– మూడొందలమంది ఉన్నారని అంచనా!"

"ఇప్పుడు జరుగబోయే బ్లాస్ట్‌లో వాళ్ళందరి ప్రాణాలూ పోతాయనే మీరనుకుంటున్నారా?"

"అందులో ఏమాత్రం అనుమానంలేదు – మొత్తం లేసిపోతారు–"

"మరి వారిని రక్షించడానికి మీ డిపార్ట్‌మెంట్ ఏం చేస్తోంది?"

"మామూలుగానే మా ప్రయత్నాలు మేము చేస్తున్నాం–"

"అంటే ఆ బాంబ్‌లు నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారా?"

"ఆ కెపాసిటీ మన దగ్గరెక్కడుంది? అమెరికా వాళ్ళు రావాలి!"

"మరి మీ ప్రయత్నాలేమిటి?"

"టెర్రరిస్ట్ ఆర్గనైజేషన్స్‌తో మధ్యవర్తుల ద్వారా డిస్కస్ చేస్తున్నాం–"

మల్లిక చానెల్ మార్చింది.

ఇంకో చానెల్లో కూడా అదే దృశ్యం– మల్లిక తల్లితో ఇంటర్‌వ్యూ చేస్తున్నారు.

"మల్లిక మీకూ కూతురేనా?"

"అవును–"

"బృందావనం చానెల్లో ఎంతకాలం నుంచి పని చేస్తోంది?"

"చాలా రోజుల్నుంచీ– అలాంటి దిక్కుమాలిన ఉద్యోగాలు వద్దని నేను మొత్తుకుంటూనే ఉన్నా! వింటేనా?"

"మీరు మీ అమ్మాయితో మాట్లాడారా?"

"ఇప్పుడే మాట్లాడాను–"

"ఏమంటోంది?"

"ఈ బాంబ్ బ్లాస్ట్ గురంచి తనకేం భయంలేదంటోంది–"

"మీరు ప్రభుత్వం నుంచి ఏమయినా సాయంకోరారా?"

"అవును! బ్లాస్ట్‌లో మా అమ్మాయిపోతే– నాకు కోటి రూపాయలయినా పరిహారం ఇమ్మంటున్నా–" అందరూ నవ్వేశారు–

అంత టెన్షన్‌లోనూ–

మల్లిక మొఖం కోపంతో ఉడికిపోయింది.

వెంటనే చానెల్ మార్చేసింది.

"అది మా అమ్మకాదు– నన్ను పెంచిన రాక్షసి–" చెప్పిందామె.



"రెండో చానెల్లో కూడా బృందావనం చానెల్ గురించే చర్చ జరుగుతోంది–"

"హోమ్‌మినిష్టర్‌గారూ– ఇప్పుడు ఆ బృందావనం చానెల్ బ్లాస్ట్ అవడానికి ఇంకెంత సమయం పడుతుంది?"

"టెర్రరిస్ట్‌లు మాకు ఫోన్ చేసి ఇచ్చిన ఇన్‌ఫర్మేషన్ ప్రకారం ఇంకో గంటలో బ్లాస్ట్ అవవచ్చు–"

సబిత మొఖంలో భయం కనిపించింది.

"భవానీ– మీ దోస్తులు మనల్ని సేవ్ చేయనికి– కోషిష్ జేస్తున్నన్నావ్ కదా– ఏం జరిగింది మరి?"

"భయపడకాంటీ! మా విజయ్ యాదవ్‌గాంగ్ సామాన్యమయిన గాంగ్‌కాదు– ఒసామా బిన్ లాడెన్‌కి ఈక్వల్ అనుకో!" అంటూండగానే భవానీ సెల్‌మోగింది.

అందరూ నిశ్శబ్దంగా, ఉత్కంఠతో భవానీ వేపు చూస్తున్నారు.

భవానీ స్పీకర్ ఆన్ చేశాడు.

విజయ్‌యాదవ్ గొంతు ఖంగున వినబడింది.

"అన్నా!"

"చెప్పు విజయ్! నీ ఫోన్ కోసమే మూడొందలమంది ఎదూర్చుస్తున్నాం– మమ్మల్ని రక్షించే స్కీమ్ లేమయినా వర్కవుట్ అయాయా?"

"ఇంకొంచెం టైమ్ పడుతుందన్నా!"

"ఇంకెంత టైమ్ రాభయ్– బాంబ్ పేలడానికింకో నలభై నిమిషాలే టైముంది–"

"తెల్సన్నా! ఈ కోషిష్‌లోనే ఉంది మా బాచ్ అంతా!"

"ఆపనిలోనే ఉండక మరిప్పుడెందుకు ఫోన్ జేసినట్లు?"

"అదే అన్నా! మీరున్నారో– బాంబ్స్‌కి కొంచెం ముందే పేలిపోయారో తెల్సుకుందామని–"

"ఇంతవరకూ పోలేదుగానీ– నువ్విలా ఫోన్లు చేసి టైమ్ వేస్ట్ చేస్తే ఖచ్చితంగా పోతాం–"

"అదే అన్నా! పోయేముందు ఒకసారి నీతో మాట్లాడితే మంచిగుంటదని ఫోన్ జేసినా–"

"ఎందుకయినా మంచిది. అక్కడున్నోళ్ళందరి లాస్ట్ కోరిక లేందో చెప్తే, నోట్ చేసుకుని– మీరంతా పోయాక మన బృందావనం చానెల్లోనే టెలికాస్ట్ చేస్తామన్నా! మంచి

సెంటిమెంట్ ఉంటది– వ్యూయర్‌షిప్ డబలవుతుంది–"

ఆ మాట వినబడడంతో అందరిమొఖాల్లోనూ కళ తప్పింది.

"లాస్ట్ విష్‌లన్నీ నీ సెల్‌కి ఎస్ఎమ్ఎస్ చేస్తాంగానీ ముందు– మమ్మల్ని సేవ్ చేసే మార్గం చూడరా తంబీ–"

"ఆ కోషిష్‌లోనే ఉన్నానన్నా– బై–"

"బై"

"అందరూ ఎస్ఎమ్ఎస్ లివ్వటం మరువొద్దన్నా–"

"మరువ–"

ఫోన్ కట్టయింది.

జైరాజ్ చిరాగ్గా భవానీ వేపు చూశాడు.

"భవానీ! నువ్వూ, నీగాంగూ చాలా ఎఫిషియెంట్ అండ్ ఇంటెలిజెంట్ అని జూన్‌ట్వంటీయత్‌న నేను స్టేట్‌మెంటిచ్చాను గుర్తుందా?"

"ఉందంకుల్?"

"ఇప్పుడా స్టేట్‌మెంట్ విత్‌డ్రా చేసుకుంటున్నాను–"

"తప్పదా అంకుల్?"

"లేకపోతే ఏందిరాభయ్! నీ గాంగోళ్ళంతా తీస్‌మార్ ఖాన్‌లు– మనల్ని– సెంట్‌పర్సెంట్ రక్షిస్తారంటివి గదా! బాంబ్ బ్లాస్టవడానికింకో ముప్పయ్ నిమిషాలే టైముంది– వాడేమో మీ లాస్ట్ విష్ ఏందని అడుగుతాడేందిరా భయ్? వానికేమయినా దిమాకున్నదా? అంతవరకూ ఓ మూలకెళ్ళి ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతున్న దినేష్ వెలిగిపోతున్న మొఖంతో అందరి మధ్య కొచ్చాడు.

"ఇంక మన ప్రాణాలకేం భయం లేదు. అమెరికాలో నా కంపెనీ ఎగ్జిక్యూటివ్స్‌తో మాట్లాడాను. వాళ్ళు ఇండియాలోని కంపెనీతో మాట్లాడి మనల్ని రక్షించటం కోసం ఒక హెలికాప్టర్‌ని ఎరేంజ్ చేస్తున్నారు– ఇంకో హెలికాప్టర్ మనాఫీస్ టెర్రేస్ మీద లాండవుతుంది. అందులో మనందరికీ పారాచూట్స్ వస్తయ్. అది తగిలించుకుని మనందరం కిందకు దూకేయవచ్చు–" చెప్పాడతను. అందరూ ఆనందంతో హర్షం వ్యక్తం చేశారు.

రాకేష్ భవానీ వేపు చూశాడు.

"మా డాడీకి ఈ టెన్షన్‌తో కొంచెం మైండ్ పనిచేయటం మానేసింది. ఆయన



మాటలేం పట్టించుకోకు–" అన్నాడతను.

అందరూ అనుమానంగా చూశారు వారిద్దరి వేపు.

జైరాజ్ కూడా దినేష్ వేపు డౌటుగా చూశాడు.

"నువ్వు ఇంత గొప్ప స్కీమ్ ప్లాన్ చేస్తే ఆ రాకేష్ ఏందట్లా మాట్లాడుతుండు?" అడిగాడతను.

"నాకదే సమజ్ కావటంలే–" అన్నాడు దినేష్ కోపంగా.

భవానీ నవ్వాడు.

"రాకేష్‌కి ఇండియన్ హెలికాప్టర్లంటే జరంతా డౌటున్నదంకుల్– అవి మందిని లేపేయనికి పనికొస్తయ్‌గానీ– రక్షించనికి కాదు–"

"అవ్!" అన్నాడు రాకేష్.

"అందుకే– ఇండియాలో వీఐపీలను లేపేయడానికి ఉపయోగిస్తారలాంటివి!"

"యా వాటిని ఛీప్ మినిస్టర్స్ హెల్ కాప్టర్స్ అంటారు–" అన్నాడు భవానీ.

సరిగ్గా అప్పుడే ఆ భవనం పై కప్పు మీద భయంకరమయిన పెద్ద శబ్దమయింది.

అందరికీ ప్రాణాలు పోయినంత పనయింది.

"ఒక బాంబ్ బ్లాస్టయినట్లుంది" అంది రోజా.

"నన్నడిగితే అది బ్లాస్ట్ కాదు–"

"కాదని ఎలా చెప్పగలవ్?" కోపంగా అడిగింది.

"బాంబ్ బ్లాస్టయితే మనందరం ఈ పాటికి శిథిలాల కింద మన బాడీ పార్ట్స్ ఎక్కడెక్కడున్నాయో వెతుక్కుంటుండేవాళ్ళం–"

"అయితే ఆ శబ్దం ఏమిటి మరి?" ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని అడిగింది మల్లిక.

"లాండావల్సిన హెలికాప్టర్ కూలిపోయుంటుంది– మామూలుగానే– అదీగాక మనం టెర్రేస్‌మీదకెళ్ళాలన్నా ఏదొక డోర్ ఓపెన్ చేయాలి కదా అప్పుడయిన బాంబ్ బ్లాస్ట్ తప్పదు"

"మన మీ టెన్షన్‌తో ఎంతసేపు గడపాల్సార్?" భయంగా అడిగాడు భవానీ అసిస్టెంట్.

"ఇంకెంతో సేపు అవసరం లేదు డియర్– కేవలం ఇరవై నిమిషాలు– ఆ తర్వాత నో టెన్షన్–"

"అంటే – మనం సర్‌వైవ్ అవుతామా?" ఆశగా అడిగాడు.

"ఆ తర్వాత బాంబ్ బ్లాస్టవుతుంది– కనుక ఇంక ఎవరికీ టెన్షన్స్ ఉండవ్–"

సరిగ్గా అప్పుడే టీవీ చానెల్లో బ్రేకింగ్ న్యూస్ చూపిస్తున్నారు.

"అసలే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎవరు రక్షిస్తారా అని ఎదుర్చూస్తున్న బృందావనం చానెల్ సిబ్బందిని రక్షించడానికి అమెరికా టైకూన్ దినేష్ యాభైలక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన జుబాకో అనే హెలికాప్టర్– ఆ చానెల్ భవనం టెర్రెస్ మీద లాండ్ అవబోతూ క్రాష్ అయి ఆ పక్కనే ఉన్న చెరువులోకి దూసుకుపోయింది.

"ఇప్పుడు ఆ హెలికాప్టర్ సిబ్బందిని రక్షించడానికి నావీ సైనికులు సహాయాన్ని కోరింది రాష్ట్ర ప్రభుత్వం!"

అందరూ షాకయ్యారు.

"యూ ఆర్ రియల్లీ గ్రేట్ భవానీ" వప్పుకున్నాడు జైరాజ్.

ఆ బ్రేకింగ్ న్యూస్ వెనుకే మరో బ్రేకింగ్ న్యూస్ వచ్చింది చానెల్లో–

భవానీ శంకర్‌కి ప్రభుత్వం ఇస్తానన్న పాతిక లక్షల ఆర్థికసాయం కాజేయడాని కని ఆశపడి అతనిని పెంచి పెద్దజేసిన బాబూరావ్ చానెల్లో మాట్లాడుతున్నాడు.

"ఈ గవర్నమెంటంతా దొంగత నా కొడుకులండీ! ఆ భవానీ శంకర్ గాడి తల్లిదండ్రులు హైద్రాబాద్‌లో ఒక వర్షం కురిసిన రాత్రి డ్రైనేజ్‌గోతిలో స్కూటర్‌తో సహా పడి పైకెళ్ళి పోయినప్పుడు, భవానీ శంకర్‌కి పాతిక లక్షలు ఆర్థికసాయం అందజేస్తామని అప్పటి ముఖ్యమంత్రి ప్రకటించాడు. ప్రకటించిన రెండో రోజే వాడి గవర్నమెంట్ పడిపోయింది. ఆ తర్వాత వచ్చిన గవర్నమెంట్ కూడా పాతిలక్షలూ తప్పకుండా ఇస్తామని స్టేట్‌మెంటిచ్చింది.

తర్వాత ఆనా కొడుకులూ పోయారు– ఇప్పుడు ఆ భవానీ శంకర్‌గాడే పోయే టైమొచ్చింది. ఇప్పటికయినా గవర్నమెంట్ ఆ పాతి లక్షలు రిలీజ్జేయాలని కోరుతున్నా!"

వెంటనే కెమెరా ముఖ్యమంత్రి మీద కొచ్చింది.

"భవానీ శంకర్ అనే అనాథకి గత ప్రభుత్వం పాతిక లక్షలు ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చిన విషయం ఇప్పుడే నా దృష్టికి వచ్చింది.

మా ప్రభుత్వం మాటంటే మాటే!

ఎప్పటికయినా ఆ పాతిక లక్షలూ ఇచ్చి తీర్తామని నేను మరోసారి హామీ ఇస్తున్నాను–"



"కానీ మీరు ఆ డబ్బు ఇచ్చే లోపల ఆ భవానీ శంకరే బాంబ్ బ్లాస్ట్‌లో పోయేట్లున్నాడు గద్సార్! దాని సంగతేంటి?"

"నిజంగా అలాపోతే– ప్రస్తుత ప్రభుత్వం తరపున మరో పాతిక లక్షలు అర్థికసాయం అందజేస్తామని హామీ ఇస్తున్నా–"

వెంటనే కెమెరా మళ్ళీ బాబూరావ్ మీద కొచ్చింది.

"బాబూరావ్‌గారూ– ఇప్పుడే అందిన వార్త ప్రకారం– ప్రస్తుత ముఖ్యమంత్రి– భవానీశంకర్ పోతే ఇంకో పాతిక లక్షలు అందజేస్తామని చెప్పటం జరిగింది! ఇందుకు మీ రియాక్షన్ ఏమిటి?" అడిగాడు జర్నలిస్ట్–

బాబూరావ్ మొఖంలో పెద్ద ఎగ్జయిట్‌మెంట్ కనిపించింది.

"నిజంగా ఇంకో పాతికలక్షలొస్తాయా? నిజంగానా? నిజంగానా?"" అంటూ అమాంతం తలవేలాడేసి కిందకు వరిగిపోయాడు. వెంటనే అతనిని అందరూ హాస్పిటల్‌కి మోసుకెళ్ళారు.

అప్పుడే భవానీ సెల్ మోగింది.

"హలో–"

"అన్నా– విజయ్ యాదవ్‌ని–"

"చెప్పు తంబీ– ఎంతవరకూ వచ్చింది నీ రెస్క్యూ మిషన్?"

"అంతా ఓకే అన్నా! మీ చానెల్ స్టాఫ్ అంతా సేఫ్–"

అందరి మొఖాల్లోనూ ఒక్కసారిగా ఆశ చిగిర్చింది.

"ఏంటి? నువ్ చెప్పేది నిజమేనా?""

"ఇలాంటి విషయాల్లో దిల్లిగీలుండవన్నా! వెంటనే మీ స్టాఫంతా మీరు వాడే కామన్ వాష్ రూమ్‌లోకి రండి–"

"వాష్ రూమ్‌లోకా?"

"అవును!"

"అక్కడి కెందుకు?"

"పైకి పోయే ముందు వాష్ చేసుకోడానికి– లేకపోతే ఆ కొశ్చెన్లేంది? ముందు రండన్నా–

భవానీ శంకర్ సెల్లాఫ్ చేశాడు.

"కమాన్– అందరూ రండి–" అంటూ గ్రౌండ్ ఫ్లోర్ వేపు నడిచాడు. అందరూ

కోలాహలంతో అతనిని ఫాలో అయారు.

అందరి మొఖాల్లోనూ– ఆశ! కొండంత ఆనందం–

వాష్ రూమ్ చాలా పెద్ద హాలంత ఉంటుంది.

డోర్ తెరచుకునిలోపలి కొచ్చేసరికి అక్కడి సీన్ చూసి షాకయ్యారు.

బురదతో వళ్ళాంతా నిండిపోయిన రూపాలతో విజయ్ యాదవ్ అతని గాంగ్ కనిపించారు. ఎవరికీ ఏం అర్థం కావటం లేదు–

ఆ హాలు మధ్యలో పెద్ద గొయ్యి–

"కమాన్– అందరూ మమ్మల్ని ఫాలో అవండి" అంటూ ఆ గోతిలోకి దిగాడు విజయ్–

"ఎక్కడికి ఫాలో అవాలి?"

"గోతిలోకి–"

"అంటే? అందర్నీ దింపిపైన మట్టి వేసేస్తావా?" ఎవరో అడిగారు.

"అరే పాగల్– మనందరం ఈ గోతిలోకి దిగితే తిన్నగా రోడ్ మీదున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్‌లోకెళ్ళిపోతాం! అక్కడినుంచి కొంతదూరం వెళ్తే ఈ బిల్డింగ్‌కి దూరంగా ఉన్న మాన్ హౌల్‌లో నుంచి బయటపడతాం–"

అప్పుడర్థమయింది స్కీమ్ అందరికీ–

అందరి మొఖాల్లోనూ ఆశ్చర్యం– ఆనందం–

"సూపర్ అయిడియా–" అన్నాడు జైరాజ్ హాపీగా–

దినేష్ కూడా వప్పుకున్నాడు.

"మీరంతా బేకార్ తొట్టిగాంగ్ అనుకున్నాగానీ– నౌ– అహోవ్ ఛేంజ్‌డ్ మై ఒపినియన్– మీరంతా జీనియస్‌లు–"

"ఇలా పొగుడుకుంటూ కూర్చుంటే– బాంబ్ బ్లాస్ట్ అవుతుంది. మీరంతా అమర వీరులయిపోతారు–" అన్నాడు భవానీ–

అందరూ హడావుడిగా గోతిలోకి దిగటం మొదలుపెట్టారు.

ఆ సొరంగ మార్గమంతా కటిక చీకటిగా ఉందిగానీ విజయ్‌గాంగ్ అందరి దగ్గరా టార్చ్ లైట్స్ ఉండడంతో తేలిగ్గా ముందుకి నడువసాగారు.

డ్రైనేజ్ సొరంగంలో కొంతదరం నడిచేసరికి మురికి నీళ్ళు ప్రవాహంలా వచ్చేసినయ్–

అందరూ ముక్కులు మూసుకున్నారు.



షావుగంటలో ఆఫీస్‌కి దూరంగా ఉన్న మరో రోడ్‌లో ఉన్న డ్రైనేజ్‌కవర్‌లో నుంచి అందర్నీ బయటకు లాగారు– అక్కడ సిద్ధంతా ఉన్న విజయ్ గాంగ్‌వాళ్ళు.

అందరూ రోడ్ మీదకు చేరుకున్న మరుక్షణంలో చెవులు పగిలిపోయే భయంకర శబ్దంతో బాంబ్‌లు పేలిపోయాయ్. దూరంగా కనబడుతున్న బృందావనం చానెల్ భవనం పేక మేడలాగా కూలిపోయింది.

వెంటనే పోలీస్ విజిల్స్ అంబులెన్స్‌లు సైరన్‌లతో ఆ ప్రదేశమంతా మోతెక్కి పోయింది.

అందరికీ గుండె ఆగిపోయినంత పనయింది.

"అంటే– ఇంకొక్క అయిదు నిమిషాలు ఆలస్యమయి ఉంటే అందరం ఆ శిథిలాల్లో ఉండేవాళ్ళం" అంది మల్లిక–

"యా! డెడ్ బాడీస్ రూపంలో–" అంది రోజా.

అప్పటికే జైరాజ్ సెల్‌ఫోన్లో పోలీస్ కమిషనర్‌తో మాట్లాడుతున్నాడు.

"అవ్– మాస్టాఫంతా ఆ బిల్డింగ్‌లో కెళ్ళి బయటపడినాం! ఏంది? ఎట్లా బయటపడినామా? ఇగో– కమిషనర్ సాబ్! మా చానెలోళ్ళు బేవకూఫ్ గాళ్ళు గాదు– ఎట్ల బయట పడాల్నో మా కెరుక! మాకు వెంటనే అంబులెన్స్‌లు గావాలి!– ఇండ్లకు పోవాల గదా మళ్ళా– ఇగో– మీ పెట్రోలింగ్ వాన్స్– వెనుకనే ఉన్నాం మేము. మా టార్చ్ లైట్స్ ఫోకస్ జేస్తున్నాం చూడు–"

అయిదు నిమిషాల్లో అంబులెన్స్‌లు వచ్చి వాళ్ళ దగ్గరాగినయ్.

వాళ్ళను చూసి కమిషనర్ షాకయ్యాడు.

"ఎవరికీ దెబ్బలేం తగల్లేదు కదా– అరె– అదేంది? వళ్ళంతా ఆ బురదేంది?"

"అరె– మంచి గున్నావ్ రా భయ్– డ్రైనేజ్‌లో కెళ్ళి తప్పించుకునేటోళ్ళకు బురదంటకపోతే పన్నీరంటుతాదా?" అందరినీ ఎక్కించుకుని అంబులెన్స్‌లు బయల్దేరాయ్–

* * *

మర్నాడు భవానీని నిద్ర లేచేసరికి మల్లిక ఎదురుగ్గా కూర్చుని ఉంది

"హాయ్– అప్పుడే రడీ అయిపోయావా?"

"అవును! రాత్రంతా నిద్రపట్టలేదు–"

"మీ మారుటితల్లి ఎపిసోడ్ గుర్తుకొచ్చిందా?"

"అదెప్పుడో మర్చిపోయాను– ఇప్పుడు ఆమె ఎవరో– నేనెవరో–"

"మరింకా మొఖంలో ఆ శాడ్ ఫీలింగేమిటి?"

"భవానీ! ఆ రోజు నేను జైలుకెళ్ళకుండా ఉండటం కోసం నువ్వు ఆ జంటను విడదీశావ్ కదా–"

"ఆ శివ స్మితల సంగతేనా?"

"అవును!"

"మన ప్రాబ్లెమ్ సాల్వ్ అయింది గదా– ఇంక వాళ్ళ సంగతెందుకిప్పుడు?"

"నాకదే మనసులో తొలుస్తోంది భవానీ! వాళ్ళిద్దరినీ– ఎన్నో నాటకాలాడి మనం విడదీశాం! ఆ పాపం మనకు తప్పకుండా తగుల్తుంది–"

"ఏంటి? సెంటిమెంటా?"

"అవును! పాపం– ఆ స్మితకు మనవల్ల అన్యాయం జరిగింది–"

"అయితే ఏవంటావిప్పుడు?"

"వాళ్ళను కలుసుకుని జరిగిందంతా చెప్పి క్షమార్పణ కోరదాం–"

"ఇదిగో– నువ్ ఇవాళ ఆలోచించేది నేను రెండు రోజుల క్రితమే ఆలోచిస్తా– తెలుసా?"

ఆమె ఆశ్చర్యంగా చూసింది.

"అంటే?"

"ఆల్ రెడీ మన విజయ్‌గాంగ్ శ్రీరామ్‌గాడినీ, స్మితనూ కలుసుకున్నారు–

మనం తీసిన సీడీలూ– అన్నీ వాళ్ళకు చూపించి జరిగిందంతా చెప్పేసి ఉంటారు– కనుక ఏ క్షణంలోనయినా ఆ జంట ఒకటయిపోవచ్చు–"

"ఓ గాడ్– నిజంగా అలా జరుగుతుందా?"

"టీవీ ఆన్ చేసి చూడు–"

మల్లిక టీవీ ఆన్ చేసింది.

అన్ని చానెల్స్‌లోనూ శివ– స్మితల విజువల్స్ కనబడుతున్నయ్.

"గత కొద్ది రోజులుగా అపార్థాల వల్ల విడిపోయిన శివ– స్మితలు తిరిగి ఒక్కటై పోవటం. తెలుగు ప్రజలందరికీ ఆనందకరమయిన విషయం.

ఈ సంధర్భంగా వారితోనే డైరెక్ట్‌గా మాట్లాడదాం–

"శివగారూ– మీరూ స్మితా తిరిగి ఒకటైపోవటం మీకెలా అనిపిస్తోంది?" యాంకర్ అడిగింది.

"ఏంటా వెధవ ప్రశ్న? యాక్సిడెంట్‌లో పోయాడనుకున్న నీ మొగుడు సడెన్‌గా తిరిగి వచ్చాడనుకో– నీకెలా ఉంటది? అలాగే మాకూ ఉంటుంది–"

"ఇంతకాలం విరహాంతర్వాత– ఇప్పుడు మీ భవిష్యత్ కార్యక్రమం ఏమిటి?"

"ఇంటికెళ్ళగానే మా బెడ్‌రూమ్‌లో కెళ్ళబోతున్నాం– అందికూడా లైవ్ చూబిస్తావా?"

మల్లిక మొఖంలో ఆనందం కనిపిచింది.

"భవానీ! యూ ఆర్ గ్రేట్–"

"చాలా గ్రేట్! అయినాగానీ నిన్ను లవ్ చేయక తప్పటం లేదు– మరి నామీదున్న కోపమంతా పోయినట్లేనా?"

"అదెలా పోతుంది? నువ్ చేసిన పనికి లైఫ్‌లాంగ్ నిన్ను ద్వేషిస్తూనే ఉంటా–"

"అంటే మరి లైఫ్ లాంగ్ నాపక్కనే ఉండాల్సి వస్తుంది కదా!"

"ఉంటాను–"

"లైఫ్‌లాంగ్ పక్కనుండే గాళ్‌ని ఏమంటారో తెలుసా?"

"తెలుసు– భార్య అంటారు–"

"యాహూ– అని అరుస్తూ–

భవానీ హాపీగా ఆమెను కౌగలించుకుని గాల్లోకి లేపేసరికి అప్పుడే తలుపులు దభేల్‌మని తోసుకుని జైరాజ్, రాకేష్, రోజా లోపలికొచ్చారు.

"భవానీ– అంతా ఫైనలైజ్ అయిపోయింది. మన చానెల్ రన్ చేయనికి ఇంకో కొత్త ఆఫీస్ కొనేసినాం!" ఉత్సాహంగా చెప్పాడు జైరాజ్.

"ఒండర్‌ఫుల్–"

"ఇంకా ఆ చూసుడేంది? నడు ఆఫీస్‌కి–"

"సారీ అంకుల్! నా డ్యూటీ అయిపోయింది– నిన్నటి వరకే– నేను ఎం.డీ.ని"

"మరి ఇకముందు?"

"ఇంకెవరు? రాకేషే–"

రాకేష్ చిరాగ్గా చూవాడు.

"చూడు భవానీ! అనెస్సరీగా నన్నీ ట్రాప్‌లోకి లాగకు– నేనూ– రోజా మారేజ్జేసుకుని హానీమూన్‌కి వరల్డ్ టూర్ వెళ్ళబోతున్నాం–"

"యా– నాకూ చానెల్ మీద ఇంట్రెస్ట్ లేదు–" అంది రోజా!

"అదేంటి?"

"అవును భవానీ! ఇండియాలో టీవీ చానెల్స్ సక్సెస్‌ఫుల్‌గా నడపాలంటే నాలాంటి నార్మల్ పరసన్స్ పనికిరారు. బ్లాక్‌మెయిలర్స్, ఫ్రాడ్‌స్టర్స్, క్రిమినల్స్, మాత్రమే సూటవుతారు!"

"కనిమొళిలాంటివాళ్ళు–" అన్నాడు జైరాజ్.

"అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో మన చానెల్‌ని సక్సెస్‌ఫుల్‌గా రన్ చేయడానికి ఒకే ఒక వ్యక్తి సూటవుతాడంకుల్–"

అందరూ సస్పెన్స్‌తో చూశారు

"ఎవరది?"

"విజయ్ యాదవ్–"

"ఓకే– ఎగ్రీడ్–"

"మరి నీ ప్రోగ్రాం ఏమిటి?" భవానీ నడిగాడు రాకేష్.

"మల్లిక మీద కేస్ పోయింది గానీ నా మీద కేస్ ఇప్పుడు మొదలవుతుంది గనుక పోలీస్ స్టేషన్ చుట్టూ కోర్టుల చుట్టూ తిరుగుతూండాలి."

"కేసేంటి?"

"అదే దావూద్ ఇబ్రహీమ్ సీడీలు నీకెలా వచ్చాయ్– ఎక్కడ ఇంటర్వ్యూ చేశారు– వాడు మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ అని తెల్సినప్పుడు వాడి ఆచూకీ గవర్నమెంట్ కెందుకు ఇన్‌ఫారమ్ చేయలేదు– అనే కేస్‌లు–"

"యా! ఆ విషయంలో జరంత సీరియస్‌గా ఆలోచించాలె– డోంట్‌వర్రీ– ఫేమస్ లాయర్ జెట్మలానీని– ఎంగేజ్ చేసుకుందాం–" అన్నాడు జైరాజ్–

భవానీ నవ్వాడు.

"థాంక్యూ అంకుల్– అంతసీన్ అవసరం లేదు– పాతికేళ్ళు నడిచే కేస్‌లకు లాయరక్కర్లా! నేనే చాలు–"

"మరి మల్లిక సంగతేంటి?" అడిగింది రోజా–

"చానెల్ జర్నలిస్ట్ – కమ్ –మై వైఫ్–"

సరిగ్గా అప్పుడే రాకేష్ సెల్ మోగింది.

"రాకేష్ జరిగిందానికి అయామ్‌సారీ–" అంది మోనికా–

రాకేష్ షాకయ్యాడు.



"అంటే...." అనుమానంగా అడిగాడు.

"అవును రాకేష్–... మనిద్దరం మేడ్ ఫర్ ఈచ్ అదర్ కాదని ఫీలయ్యాను గానీ తర్వాత ఆలోచిస్తే– నా ఫీలింగ్ తప్పని అనిపించింది– నిజానికి మనం మేడ్ ఫర్ ఈచ్ అదర్! ఇప్పటికి తెలిసిందా విషయం–"

"ఓగాడ్–"

"అవును! నీలాగా ఇండిపెండెంట్ థింకింగ్ ఉన్నావాడే నాక్కావాలి! నేను కాదంటే బాధపడకుండా నువ్ కాకపోతే ఇంకో దాన్ని చేసుకుంటా" అనే నీ యాటిట్యూడ్ ఉంది చూడు. అది నన్ను ఎట్రాక్ట్ చేసింది–"

రాకేష్ మొఖానికి పట్టిన చెమటలు తుడుచుకుంటున్నాడు.

"అంటే... ఇప్పుడు..."

"నేను వచ్చేస్తున్నా రాకేష్– అయ్ కాన్ట్ లివ్ వితవుట్ యూ–"

రాకేష్ గొంతు తడారిపోయింది.

భయంగా రోజా వేపు చూశాడు.

రోజా నవ్వి అతని భుజం మీద చేయివేసింది.

"రాకేష్– డోంట్ బోదర్ ఎబౌట్‌మీ! మోనికా నీ గాళ్! మధ్యలో నేను దూరటం నాకిష్టం లేదు–"

"అంటే–"

"నేను మళ్ళీ అమెరికా వెళ్ళిపోతాను– అయ్ థింక్ అయ్ విల్ బీ హాపీ దేర్–"

జైరాజ్ అప్యాయంగా రోజాని దగ్గరకు తీసుకున్నాడు.

"అవ్ బేబీ! నువ్ ఇండియాలో ఎడ్జస్టవటం కష్టం– లోగ్ పాగల్ హై యాహా!"

దినేష్ హడావుడిగా వచ్చాడు ఆ రూమ్‌లోకి–

"రాకేష్– రోజాల మారేజ్‌కి అన్ని ఏర్పాట్లూ రడీ–" అన్నాడతను.

అందరూ నవ్వేసరికి దినేష్ కనుమానం వచ్చింది.

"సమ్‌థింగ్ రాంగ్?"

"యా! ఎవ్విరిథింగ్ రాంగ్–" అన్నాడు జైరాజ్–

"వ్వాట్?"

"అంతా తర్వాత మాట్లాడదాం– ఒకే ఒక్క మార్పుకి నువ్ ఒకే అనాలె–"

"ఏంటది?"

"పెళ్ళి పీటల మీద రాకేష్ రోజాకి బదులు రాకేష్- మోనికా లుంటారు-"

దినేష్ షాకయ్యాడు.

"వాట్! ఆ మోడల్‌తో పెళ్ళా! ఓవర్ మైడెడ్ బాడీ-"

జైరాజ్ అతని భుజం తట్టాడు.

"కమాన్ దినేష్! ఏదో ఒక ఇన్సిడెంట్ నీకు జరిగిందని- ఇక దునియాల మోడల్స్ అందరూ ధోకాబాజ్‌లని అనుకోవద్దు-"

"అవును డాడ్! మోనికా ఈజ్ డిఫరెంట్-" అన్నాడు రాకేష్-

"యస్సార్- మోనికా ఈజ్ టోటల్లీ ఫామిలీటైప్" అన్నాడు భవానీ-

"నువ్వెలా చెప్పగలవామాట?" కోపంగా అడిగాడు దినేష్.

"బికాజ్- నేను ఫామిలీ టైప్‌గాళ్స్ మీద థీసిస్ చేశాను-"

మల్లిక నవ్వాపుకోలేక బిగ్గరగా నవ్వేసింది.

రోజా కల్పించుకుంది.

"అంకుల్- ఒకమాట చెప్పనా?" దినేష్ నడిగిందామె.

"ఏంటది?"

"బిజినెస్‌కీ- జీవితానికీ చాలా డిఫరెన్స్ ఉంది. ఒక సక్సెస్‌ఫుల్ బిజినెస్‌మేన్‌గా మీరు మీ స్టాఫ్ అందర్నీ మీక్కావలసిన విధంగా తీర్చిదిద్దవచ్చు. కానీ ఒక సక్సెస్ ఫుల్ పేరెంట్ అవాలంటే యంగ్‌స్టర్స్ జీవితాల్లో ఇంటర్ ఫియర్ అవకూడదు. శాసించకూడదు-" దినేష్ రాకేష్ వేపు ఓక్షణం చూశాడు.

"అయ్ థింక్ యూ ఆర్ రైట్-" అన్నాడు నెమ్మదిగా.

అందరూ తప్పట్లు కొట్టారు.

"ఆల్ ప్రాబ్లెమ్స్ సాల్వ్‌డ్-" అన్నాడు భవానీ.

అప్పుడే విజయ్ యాదవ్ ఆయసంతో ఒగరుస్తూ లోపలికొచ్చాడు- బృందావనం సిబ్బందితోపాటు-

"భవానీ! కంగ్రాచ్యులేషన్స్- యూ హేవ్ ఒన్-" అరచాడు ఎగ్జయిట్‌మెంట్‌తో-

జైరాజ్ కేమీ అర్థం కాలేదు.

"నువ్వేందిరా భయ్- మధ్యలో వచ్చి యూ హేవ్ ఒన్' అంటావ్- ఏందిదీ కత?"

"అన్న గెలిచాడు సార్-"

"అంటే?"



"మన బృందావనం చానెల్ నెంబర్‌వన్- అయింది-"

ఇదిగో వ్యూయర్‌షిప్ చార్ట్-"

రాకేష్ భవానీని గాల్లో కెత్తేశాడు.

అందరూ వెంటనే నినాదాలు మొదలుపెట్టారు.

"భవానీ శంకర్-"

"జీత్‌గయా- జీత్‌గయా-"

"బృందావన్ చానెల్-"

"జీత్‌గయా- జీత్‌గయా-"

ఆరోజంతా సెలబ్రేషన్స్‌తో సందడిగా ఉంది.

సడెన్‌గా ఓ అంబులెన్స్ వచ్చి ఆగింది ఇంటిముందు.

అందరూ ఆశ్చర్యంగా చూస్తుంటే స్ట్రెచర్ మీద ఓ రోగిని భవానీశంకర్ దగ్గరకు తీసుకొచ్చారు అంబులెన్స్ బాయ్స్-

ఆ వ్యక్తికి పెట్టిన ఆక్సిజన్ సిలిండర్ మరో వ్యక్తి మోసుకొచ్చాడు.

"ఎరితను?" అడిగాడు జైరాజ్.

"భవానీ" ఎండిపోయిన గొంతుతో పిలచాడావ్యక్తి.

"హలో బాబూరావంకుల్-" నువ్వింకా బ్రతికే ఉన్నావా?"

"ఎలా పోతాన్రా! కొత్త గవర్నమెంట్ ఇంకో పాతిక లక్షలు నీకిస్తానంది. నువ్వేమో బ్లాస్ట్‌లోపోతావనీ - ఆ పాతిక లక్షలూ కూడా నీకే వస్తుందనీ ఆశపడ్డా! కానీ నువ్‌పోలా! పోనీ మీ నాన్నా అమ్మా, పోయినప్పుడు ఇస్తానన్న పాతికయినా వస్తుందా?" నీరసంగా అడిగాడతను.

"నువ్ చచ్చే స్థితిలో ఉన్నాగానీ గవర్నమెంట్ చేసే ప్రామిస్‌లమీద ఆశ చావలా నీకు! పోనీ ఓ పని చెయ్- ఇప్పుడు ఈ చానెల్‌ని నెంబర్‌వన్ చేసినందుకు నాకొచ్చేషేర్ ఎనిమిది లక్షలు తీసుకు ఫో- అదే ఆక్సిజన్‌లాగా పనిచేసి ఇంకో నాల్రోజులు బ్రతుకుతావ్-"

ఆ మాట వినగానే ఒక్కసారిగా బాబూరావ్‌లో చైతన్యం వచ్చేసింది.

"ఆ! నిజంగా ఇస్తావా?" అంటూ ఆక్సిజన్ వైర్లు పీకేసి లేచి నిలబడ్డాడు. భవానీ వెంటనే ఒక చెక్ అతని పేర రాసిచ్చేశాడు.

"థాంక్యూ భవానీ. యూ ఆర్ గ్రేట్- పెంచినందుకు ఎంతో కంత ఫలితం దక్కింది-"।

అంటూ హాపీగా వెళ్ళిపోయాడు బయటకు.

మల్లిక భవానీ చెయ్యి పట్టుకుంది.

"భవానీ- ఇప్పుడు నీ మీదున్న ద్వేషమంతా పోయింది" అంది పశ్చాత్తాపంతో-

"ఏంటి? సడెన్‌గా ప్లేట్ మార్చావ్?"

"కష్టపడి సంపాదించుకున్న డబ్బుని- అలా కేర్‌లెస్‌గా నిన్ను పెంచినతనికిచ్చావంటే- నువ్ నిజంగా గ్రేట్-"

"థాంక్యూ ఇకపద-"

"ఎక్కడిది?"

"ఇంకెక్కడికి పెళ్ళి పీటలమీదకి- మన రాకేష్ మోనికాలతో- పాటు మనం కూడా అదే పీటల మీద అడ్జస్టయిపోదాం- మారేజ్ ఫ్రీగా దినేషంకుల్ ఖర్చు మీదయిపోతుంది-"

సరిగ్గా అప్పుడే మోనికా కారు దిగింది.

అందరూ వెల్‌కమ్- అంటూ అరచారు.

* * *